ఆదివారం
3•2•2019
కరీంనగర్
• వెల. రూ.8
• సంపుటి 8 • సంచిక 219
• పేజీలు : 16 + 16 + 32 పేజీల ఆదివారం అనుబంధం

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE



PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



అరెస్టయిన విద్యార్థుల కోసం
హాట్‌లైన్

- ప్రారంభించిన అమెరికాలోని భారత దౌత్య కార్యాలయం
- 24 గంటలూ అందించనున్న సేవలు
- ఈమెయిల్ ద్వారా కూడా సంప్రదించొచ్చని సూచన
- సమస్యలపై సమన్వయం కోసం నోడల్ అధికారి నియామకం

వాషింగ్టన్, ఫిబ్రవరి 2:

'పే టు స్టే' యూనివర్సిటీ వీసా కుంభకోణంలో అరెస్టయిన భారతీయ విద్యార్థులకు సహకారం అందించడం కోసం అమెరికాలోని భారత దౌత్య కార్యాలయం 24 గంటలూ పనిచేసే హాట్‌లైన్‌ను తెరిచింది. అమెరికాలోనే ఉండాలనే ఉద్దేశంతో నకిలీ విశ్వవిద్యాలయంలో చేరిన విద్యార్థుల్లో ఇప్పటివరకు 130 మందిని అరెస్టు చేయగా, వారిలో 129 మంది భారత్‌కు చెందినవారేనని ఇమ్మిగ్రేషన్ అధికారులు వెల్లడించారు. అమెరికా హోం ల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ అధికారులు డెట్రాయిట్‌లో ఫార్మింగ్‌టన్ యూనివర్సిటీ పేరిట ఓ నకిలీ యూనివర్సిటీని స్థాపించి అండర్‌కవర్ ఆపరేషన్ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ వలలో చిక్కుకుని అరెస్టయిన భారతీయ విద్యార్థుల కోసం భారత ఎంబసీ తాజాగా హాట్‌లైన్‌ను ఏర్పాటుచేసింది. 24 గంటలూ అందుబాటులో ఉండేలా 202-322-1190, 202-340-2590 రెండు హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు

మిగతా 5వ పేజీలో

అద్భుత దివ్యక్షేత్రమే లక్ష్యంగా..

- నేడు యాదాద్రికి ముఖ్యమంత్రి కేసీఆర్
- రెండోసారి సీఎం అయ్యాక తొలి పర్యటన
- ప్రధానాలయం పనులు 90 శాతం పూర్తి
- గదుల నిర్మాణంపై స్పష్టతనివ్వనున్న కేసీఆర్

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

అద్భుత దివ్యక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు జరుగుతున్న శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించేందుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదివారం యాదాద్రికి వస్తున్నారు. రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక కేసీఆర్.. తొలిసారిగా యాదాద్రిని సందర్శించనున్నారు. 2017 నవంబర్ 24న చివరిసారిగా వచ్చిన ఆయన 14 నెలల తరువాత యాదాద్రి వస్తున్నారు. ఉదయం 11 గంటలకు కొండ పైకి చేరుకొంటారు. యాదాద్రిలో

మిగతా 2వ పేజీలో


యాదాద్రిపై కనువిందు చేస్తున్న మహారాజ గోపురాలు

తెలుగులోకి చట్టాలు

పాలనా నిబంధనలు, సచివాలయ మాన్యువల్స్ తెనుగీకరణ
ముఖ్యమంత్రి కేసీఆర్ పరిశీలన కోసం ముసాయిదా
అనుమతి తెలుపగానే అమల్లోకి.. ఆన్‌లైన్‌లోనూ అందుబాటులోకి
తరువాత తర్జుమా నూతన పంచాయతీరాజ్ చట్టం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలుగు.. తెలుగు అని ఊదరగొట్టడమేకానీ.. ఆంగ్లంలో ఉన్న చట్టాలు, పాలనా నిబంధనలు, ఇతరత్రా వాటిని తెలుగులోకి తర్జుమా చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలనే ఆలోచన కూడా సమైక్య పాలకులకు రాలేదు. స్వరాష్ట్రంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు వాటన్నింటినీ తెలుగులోకి అనువాదం చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో అమలులోఉన్న చట్టాలు, మాన్యువల్స్, నిబంధనావళి వంటివి ప్రజలకు అర్థమయ్యే భాషలో.. తెలుగులో అందుబాటులోకి తీసుకురావాలన్న ఆయన ఆదేశంతో కవి, గాయకుడు దేశపతి శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్ ఆధ్వర్యంలోని బృందం కార్యాచరణకు పూనుకున్నది. తెనుగీకరించిన మొదటి నిబంధనావళిని సిద్ధం చేసింది. నిజానికి చట్టాలు, ఆర్డినెన్స్, నిబంధనావళి, మాన్యువల్స్ వంటివన్నీ ప్రజలందరికీ అర్థమయ్యేలా తెలుగు భాషలోకి అనువాదం చేయాలనే ఆలోచన ఏడాది క్రితం హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో పురుడుపోసుకుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ బాధ్యతలను దేశపతి శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్‌కు అప్పగించారు. దీంతో వారి నేతృత్వంలోని బృందం మొదటగా ప్రభుత్వ పరిపాలనా నిబంధనావళి, సచివాలయ నిబంధనలను తెలుగులోకి అనువదించింది. ప్రతిని సిద్ధంచేసి

మిగతా 2వ పేజీలో

హామీల అమలు దిశగా
రాష్ట్ర బడ్జెట్

సమీక్షలో అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ అమలుచేసే దిశగా రాష్ట్ర బడ్జెట్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలని చెప్పారు. మధ్యంతర బడ్జెట్ రూపకల్పనపై ముఖ్యమంత్రి కేసీఆర్ శనివారం ప్రగతిభవన్‌లో సమీక్ష నిర్వహించి, పలు సూచనలు చేశారు. ఎన్నికల సందర్భంగా టీఆర్‌ఎస్ తరుపున ప్రజలకు పలు హామీలు ఇచ్చామని, వాటన్నింటినీ అమలుచేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని సీఎం చెప్పారు. ఆ దిశగా బడ్జెట్‌ను రూపొందించాలని అన్నారు. నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం

మిగతా 2వ పేజీలో



సీబీఐ కొత్త డైరెక్టర్ రిషికుమార్ శుక్లా



నియామకానికి ప్రధాని నేతృత్వంలోని అత్యున్నత కమిటీ ఆమోదముద్ర

కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే అభ్యంతరాలు బేఖాతరు

5


భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాధేగుంపులో ఓ బాలుడికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నరేందర్

గిరిజనులకు అండగా..

యువ వైద్యుడి సేవాతత్పరత • కాలినడకన పల్లెలకు పయనం
ఉచితంగా మందుల పంపిణీ • అవసరమైనవారికి ప్రొటీన్‌పౌడర్
మూడేండ్లుగా జీవితం అంకితం • వారంలో మూడ్రోజులు గిరిజనుల మధ్యే
కాసులు కురిపించే ప్రైవేటు ప్రాక్టీసు వదిలి అడవిబాట పట్టిన డాక్టర్ రమావత్ నరేందర్
భుజంకలిపి సహకరిస్తున్న మిత్రబృందం

4


నల్లగొండ జిల్లా వాడపల్లిలో సర్పంచ్ ప్రమాణ స్వీకారోత్సవం అనంతరం టీఆర్‌ఎస్ శ్రేణుల ఊరేగింపు


పల్లెల్లో పండుగ

కొలువుదీరిన కొత్త పాలకవర్గాలు

12,680 పంచాయతీల్లో అట్టహాసంగా సర్పంచ్‌ల ప్రమాణస్వీకారం

రేపటినుంచి మాస్టర్ ట్రైనర్లకు హైదరాబాద్‌లో శిక్షణ

4



జయరాం హత్య కేసులో
వీడుతున్న చిక్కుముడి

మేనకోడలు శిఖాచౌదరి పాత్రపై ఆరా!

జయరాం సోదరి, శిఖాచౌదరి, రాకేశ్‌ను విచారిస్తున్న పోలీసులు

2



శనివారం హైదరాబాద్‌లో రైస్‌మిల్లర్లతో సమావేశమైన పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఆ శాఖ కమిషనర్ అకున్‌సబర్వాల్

బియ్యం నాణ్యతలో రాజీపడొద్దు

- పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి
- బియ్యం కొనుగోళ్లపై రైస్‌మిల్లర్లతో సంప్రదింపులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పేదలకు సరఫరాచేసే బియ్యం నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీపడొద్దని పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి రైస్‌మిల్లర్లకు సూచించారు. శనివారం పౌరసరఫరాలభవన్‌లో కమిషనర్ అకున్‌సబర్వాల్‌తో కలిసి బియ్యం కొనుగోళ్లపై రైస్‌మిల్లర్లతో సంప్రదింపులు జరిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఒకరికి ఐదు కిలోల చొప్పున బియ్యం ఇస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం కుటుంబంలో ప్రతిఒక్కరికీ రూపాయికి కిలోచొప్పున నెలకు ఆరు కిలోలు సరఫరాచేస్తున్నదని చెప్పారు. రాష్ట్రంలో రేషన్‌షాపుల ద్వారా ప్రతినెల 1.75 లక్షల టన్నుల బియ్యం 2.75 కోట్ల మందికి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రజాపంపిణీకి 3.50 లక్షల టన్నుల దొడ్డు బియ్యం, సంక్షేమ హాస్టళ్లు, మధ్యాహ్న భోజనం పథకం ద్వారా విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం అందించేందుకు ఏడాదికి 1.20 లక్షల సన్న బియ్యం అవసరమని పేర్కొన్నారు. బియ్యం సేకరణ కోసం పౌరసరఫరాల సంస్థ టెండర్లను నిర్వహించిందని వివరించారు. మిల్లర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. అంతకుముందు కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను, ఈ-పాస్, ఐరిస్ ద్వారా రేషన్ సరుకుల పంపిణీ ప్రక్రియను శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. గోదాముల నుంచి బియ్యం రవాణాకు సంబంధించి వాహనాల ప్రత్యక్ష కదలికలను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షిస్తున్న తీరును కమిషనర్ అకున్‌సబర్వాల్ చైర్మన్‌కు వివరించారు.

లెక్కలు.. చరిత్ర కలిపి చదువొచ్చు

- బీకాం విద్యార్థులు ఫిజిక్స్ పాఠాలు వినొచ్చు
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి డిగ్రీలో కోర్సుల కాంబినేషన్లు
- కొన్ని యూనివర్సిటీల్లో ఇప్పటికే అమలు
- సీబీసీఎస్‌కు అనుగుణంగా ఏర్పాట్లు
- కళాశాలల విద్యాశాఖ కమిషనర్ వెల్లడి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఇకపై గణితం.. చరిత్ర కలిపి చదువుకోవచ్చు. బీకాం విద్యార్థులు ఫిజిక్స్ పాఠాలు కూడా వినవచ్చు. సైన్స్ విద్యార్థులు అర్థశాస్త్రాన్ని అభ్యసించవచ్చు. డిగ్రీలో తాము ఎంపిక చేసుకున్న గ్రూపు సబ్జెక్టులతోపాటు అదనంగా తమకు నచ్చిన సబ్జెక్టులను నేర్చుకోవడానికి సీబీసీఎస్ ద్వారా విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నది కళాశాల విద్యాశాఖ. ఇందుకు అనుగుణంగా కొన్ని కాంబినేషన్లతో కోర్సులను అందుబాటులోకి తీసుకొస్తున్నామని కళాశాలల విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్ చెప్పారు. శనివారం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం (సీబీసీఎస్) అమలు రెండేండ్లుగా ఆలస్యమవుతూ వస్తున్నదని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో 2019-20 విద్యాసంవత్సరం నుంచి తప్పనిసరిగా సీబీసీఎస్ విధానం అమలుచేయడంపై దృష్టిసారించి, అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని పేర్కొన్నారు. డిగ్రీ విద్యార్థులు తాము చదువుతున్న రెగ్యులర్ గ్రూపులోని సబ్జెక్టులతోపాటు భావ సారూప్యత ఉన్న రెండు లేదా మూడు కోర్సులను నేర్చుకోవడం కోసం సీబీసీఎస్ విధానం అమలుచేస్తున్నట్టు చెప్పారు. బీఎస్సీ మ్యాథ్స్ కోర్సులో చేరిన విద్యార్థులు చరిత్రను ఆప్షన్‌గా ఎంపికచేసుకోవచ్చని, కామర్స్ విద్యార్థులు ఫిజిక్స్ సజెక్టు గురించి తెలుసుకోవచ్చని అన్నారు. తాము చేరిన కోర్సులోని సబ్జెక్టుతోపాటు తమకు నచ్చిన ఇతర సబ్జెక్టును ఎంపిక చేసుకొనే అవకాశం సీబీసీఎస్ కల్పిస్తున్నదని చెప్పారు. కొన్ని కాలేజీల్లో విద్యార్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్టులు బోధించడానికి సిబ్బంది లేనిపక్షంలో బూట్ మోడల్, లేదా ఆన్‌లైన్ ద్వారా పాఠాలు నేర్చుకొనే అవకాశం ఉందని, ఆ మేరకు డిగ్రీ విద్యార్థులను ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. అందుకోసం కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ పాఠాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

అద్భుత దివ్యక్షేత్రమే లక్ష్యంగా..

మొదటిపేజీ తరువాయి...

ప్రధానాలయ నిర్మాణపనులు ఆశించిన విధంగా జరుగుతున్నాయి. ముఖమండపం ఇప్పటికే సిద్ధమయింది. ఇంకా మిగిలిన ప్రధానాలయం నిర్మాణపనులపై సీఎం కేసీఆర్ దిశానిర్దేశం చేస్తారు. గుట్టపై మౌలిక వసతుల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షిస్తారు. ఆలయానికి అనుబంధంగా ఉండే క్యూకాంప్లెక్స్‌లు, వసతి గృహాల నిర్మాణాలు, మంచినీటి సరఫరా, సుందరీకరణ తదితర పనులపై అధికారులకు సూచనలు చేయనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి అనిల్‌కుమార్ యాదాద్రికి చేరుకుని ఏర్పాట్లు పర్యవేక్షించారు. సీఎం పర్యటన సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు యాదాద్రి డీసీపీ రామచంద్రారెడ్డి తెలిపారు.

పదోసారి యాదాద్రికి సీఎం కేసీఆర్

ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ ఆదివారం పదోసారి యాదాద్రికి వస్తున్నారు. మొట్టమొదటిసారి 17-10-2014న శ్రీవారిని దర్శించుకొన్నారు. 2014లో డిసెంబర్ 17న రెండోసారి వచ్చారు. 2015లో ఫిబ్రవరి 25, 27న, మార్చి 5న జరిగిన శ్రీవారి కల్యాణంలో సతీసమేతంగా పాల్గొన్నారు. మే 30న యాదాద్రి అభివృద్ధి పనులను పర్యవేక్షించడానికి వచ్చారు. జూలై 5న అప్పటి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీతోపాటు యాదాద్రిని దర్శించుకున్నారు. 2016 అక్టోబర్ 19న పనులను పర్యవేక్షించారు. నవంబర్ 23, 2017న పర్యటించి పలు సూచనలు చేశారు.

2014 అక్టోబర్ నుంచి నేటివరకు..

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి హోదాలో కే చంద్రశేఖర్‌రావు 2014 అక్టోబర్ 17న యాదగిరికొండపై అడుగుపెట్టారు. యాదగిరి శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని పునర్నిర్మించి అద్భుత పుణ్యక్షేత్రంగా మారుస్తామని అదేరోజు ప్రకటించారు. ఇందుకోసం వందల కోట్ల రూపాయలు మంజూరు చేసిన కేసీఆర్.. ముఖ్యమంత్రిగా విధుల్లో తలమునకలవుతూనే ప్రతి పదిహేనురోజులకోసారి నిర్మాణ పనులపై సమీక్షలు నిర్వహిస్తూ వచ్చారు. అటు అధికారులు, ఇటు ప్రధాన శిల్పులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందించారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక యాదాద్రి దివ్యక్షేత్రంగా మారుతుండగా.. పరిసర ప్రాంతాలు అభివృద్ధి వైపు పరుగులు తీస్తున్నాయి. అదేస్థాయిలో పర్యాటక రంగం కూడా ఊపందుకున్నది.

సీఎం చర్చించనున్న కొన్ని అంశాలు..

- కొండపైకి వచ్చే భక్తులకు మంచినీటి సరఫరా చేసే సీఎం కేసీఆర్ విషయంపై ఆరా తీస్తారు. గ్రావిటీ ద్వారా తాగునీటిని చేరవేసే విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై మిషన్ భగీరథ అధికారులతో చర్చిస్తారు. రాయగిరి నుంచి యాదాద్రి వరకు ఏర్పాటుచేసిన గ్రీనరీ పరిరక్షణ, టెంపుల్ సిటీలో బ్యూటిఫికేషన్ పనులను వేసవిలో పరిరక్షించే విషయంపై అటవీశాఖ అధికారులతో చర్చిస్తారు.
- గిరిప్రదక్షిణ రోడ్డు నిర్మాణం పనులను స్వయంగా పరిశీలిస్తారు. గిరిప్రదక్షిణకు అడ్డుగా ఉన్న వంద ఇండ్లను ప్రస్తుతం తొలగించకుండా పనులను చేపట్టాలనే విషయంపై దిశానిర్దేశం చేయనున్నారు.
- రాష్ట్రపతి, ప్రధానమంత్రి, కేంద్రమంత్రులు, ముఖ్యమంత్రులు విడిదిచేయడానికి ఉద్దేశించిన ప్రెసిడెన్షియల్ సూట్ నిర్మాణం కోసం సేకరించిన పదమూడున్నర ఎకరాలల్లో చేపట్టనున్న పనుల విషయంలో అధికారులకు తగిన సూచనలు చేయనున్నట్టు సమాచారం.
- పెద్దగుట్టపై 250 ఎకరాల్లో నిర్మించనున్న టెంపుల్‌సిటీపై ముఖ్యమంత్రి కేసీఆర్ క్లారిటీ ఇవ్వనున్నారు.
- తిరుమల, శ్రీశైలంలో మాదిరిగా భక్తులు కాటేజీలు నిర్మించి.. పర్యవేక్షణాధికారం మాత్రం దేవస్థానం వారికే అప్పగించే విధి విధానాల రూపకల్పనపై ఆదేశాలు జారీ చేస్తారు. ఇందుకోసం దాతలకు ఆహ్వానాలు పంపారు. టెంపుల్‌సిటీలో మరో 750 ఎకరాల్లో కూడా చేపట్టనున్న నిర్మాణ పనుల విషయంపై చర్చిస్తారు.

90% పూర్తయిన నిర్మాణ పనులు

యాదాద్రి ప్రధాన ఆలయ నిర్మాణం పనులు 90 శాతం పూర్తయ్యాయి. అలయం లోపల అళ్వార్ల విగ్రహాలు, ఆంజనేయస్వామి ఆలయం నిర్మాణం పూర్తిచేయగా కేవలం ఫ్లోరింగ్ పనులు మిగిలిఉన్నాయి. అష్టభుజ విగ్రహాల అమరిక పనులు కొనసాగుతున్నాయి. సప్త గోపురాలు అందంగా ముస్తాబయ్యాయి. పనులు 100శాతం పనులు పూర్తి కాగా ప్రధానాలయానికి అనుబంధంగా నిర్మిస్తున్న శివాలయం పనులు కూడా 70 శాతం పూర్తయ్యాయి. ప్రెసిడెన్షియల్ సూట్ నిర్మాణం పనులు, వీఐపీ సూట్స్ పనులు సైతం 50 శాతం జరిగాయి. టెంపుల్ సిటీలో ఇన్‌ఫ్రా లేఅవుట్ సిద్ధమయింది. విష్ణు పుష్కరిణి నిర్మాణం, కల్యాణకట్ట, సత్యనారాయణ స్వామి వ్రతమండపాల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. 20వేల మంది కూర్చొని స్వామి వారి కల్యాణాన్ని తిలకించే మండపం నిర్మాణానికి స్థలాన్ని ఓకే చేశారు. కొండపైకి వచ్చే వాహనాలు, బస్సులకు పార్కింగ్ పనులు కూడా పూర్తిచేశారు. లడ్డూ తయారీ, విక్రయ కేంద్రాల పనులు 40శాతం జరిగాయి.


యాదాద్రిలో శనివారం సాయంత్రం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి అనిల్‌కుమార్



ముహూర్తం

సూర్యోదయం: 6.51 గంటలకు

సూర్యాస్తమయం: 6.09 గంటలకు

వికంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, కృష్ణపక్షం, చతుర్దశి రాత్రి 11.54 వరకు, తదుపరి అమావాస్య, నక్షత్రం: ఉత్తరాషాఢ. అమృతఘడియలు: రాత్రి 7.43 నుంచి 9.19 వరకు, రాహుకాలం సాయంత్రం 4.44 నుంచి 6.09 వరకు, దుర్ముహూర్తం: సాయంత్రం 4.38 నుంచి 5.23 వరకు, వర్జ్యం: ఉదయం 8.55 నుంచి 10.31 వరకు.

లోకం పోకడ



పిల్లలకు ఎగ్జిబిషన్ వద్దట.. గాంధీ భవన్‌కు తీసుకుపొమ్మని ఏడుస్తున్నారు!


యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయ మహామండపం


ఆలయంలోకి భక్తులు ప్రవేశించే స్వాగతతోరణం

స్తంభ వైభవం!

- యాదాద్రిలో శిల్పకళా సౌందర్యం
- దేశ, విదేశీ శైలులను ఒడిసిపట్టిన శిల్పులు
- భిన్నశిల్పశైలికి ఆలవాలంగా యాదాద్రి

గొట్టిపర్తి భాస్కర్‌గౌడ్, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: మధుర మీనాక్షిలోని చిలుక స్తంభాలు.. కాకతీయులు ఉపయోగించిన బ్రహ్మకాంత స్తంభాలు.. రోమ్‌లో వాడిన రుద్ర స్తంభాలు.. అన్నీ ఒక్కచోటచేరి కనువిందు చేస్తున్నాయి. రెండువేల ఏండ్ల ఆయుప్రమాణంతో సరికొత్తగా నిర్మితమవుతున్న యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో స్తంభ వైభవం ఉట్టిపడుతున్నది. భిన్న సంస్కృతులు, నాగరికతలు స్తంభాలపై సాక్షాత్కారిస్తున్నాయి. రాజుల కాలంనాటి యుద్ధసన్నివేశాలు, గజ, సింహ, పులి తదితర జంతువులతోపాటు అశ్వవాహనంపై సైనికులు స్వారీచేసే దృశ్యాలను చెక్కినతీరు కట్టిపడేస్తున్నది. శిల్పకళా సొగసులు చూ డతరమా అనేరీతిలో వచ్చేతరాలకు యాదాద్రి ఆలవాలంగా నిలువనున్నది. స్థపతులు సుందరరాజన్, డాక్టర్ ఆనందాచారి వేలుల పర్యవేక్షణలో ఉప స్థపతులు, వేలమంది శిల్పులు ఆలయాన్ని తీర్చిదిద్దేందుకు రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. వైటీడీఏ వైస్‌చైర్మన్ కిషన్‌రావు, ఈవో ఎన్ గీత నిత్యం సమీక్షలు నిర్వహిస్తూ.. నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చే ఆదేశాలను వందశాతం అమలు చేయాలని సీఎంవో ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి చేస్తున్న కృషికి నిర్మాణ పనులు అద్దం పడుతున్నాయి.

స్తంభాలు మూడు రకాలు

స్తంభాలు బ్రహ్మకాంతం, విష్ణుకాంతం, రుద్రకాంతం అని మూడు రకాలు. నాలుగు పలకలుగా నిటారుగా చెక్కబడే స్తంభాన్ని బ్రహ్మకాంతం, ఎనిమిది పలకలుగా నిటారుగా చెక్కబడే స్తంభాన్ని విష్ణుకాంతం, వృత్తాకారంగా నిటారుగా చెక్కబడిన స్తంభాన్ని రుద్రకాంతం అని అంటారు. మూడింటిని కలిపి మిశ్రమ పద్ధతిలో స్తంభాలను చెక్కడం ఆధునిక పద్ధతి. మూడురకాలను ఉపయోగించుకుంటూ యాదాద్రిలో వ్యాలీ స్తంభాలు, సింహపాద స్తంభాలు, అశ్వ స్తంభాలను చెక్కారు. రాజుల కాలంలో ఒక్క శైలినే ఉపయోగించి ఆలయ నిర్మాణం పూర్తి చేసేవారు. యాదాద్రిలో మాత్రం సీఎం కేసీఆర్ సూచనల మేరకు భిన్న కాలాల్లోని శిల్పశైలిలను క్రోడీకరించి.. ప్రశంసనీయమైన మిశ్రమ పద్ధతులను వినియోగిస్తూ సరికొత్త శిల్పకళకు భాష్యం చెప్తున్నారు.


ప్రధానాలయంలో చిత్రకంఠంతో బాలపాద స్తంభం.. ప్రథమ ప్రాకారంలో విష్ణుకాంత స్తంభం

మహామండపంలో కొలువైన ఆళ్వార్ స్తంభాలు

రాజుల కాలంలో అశ్వసవారీ, సింహసవారీ, గజసవారీ శిల్పాలతో కూడిన స్తంభాలు, మూర్తులను ఆలయ నిర్మాణంలో ఉపయోగించేవారు. ప్రధాన స్తంభాన్ని అనుసరించి నాలుగువైపులా బాలపాదాన్ని అమర్చడం ఒక శైలి. ఇక్కడ రెండువైపులా బాలపాదాన్ని అమర్చి ఆళ్వార్ ప్రతిమలు భక్తులను ఆకర్షించే విధంగా సుమారు 16 అడుగుల ఎత్తులో స్తంభాలను ఏర్పాటుచేశారు. భీములు ఎటు ప్రయాణిస్తుంటే ఆ దిక్కులో బాలపాద స్తంభాలను అమర్చడం శాస్త్ర ప్రమాణం. యాదాద్రిలో శిల్ప శాస్త్ర ప్రమాణంగా స్తంభాలను చెక్కి స్థాపన చేశారు. మహామండపాన్ని ఆళ్వార్ స్తంభాలతో నిర్మించారు. ఆళ్వార్లు శ్రీమహావిష్ణువు ప్రచారకులు. శ్రీవైష్ణవాలయాల్లో ఆళ్వార్లకు ఎంతో ప్రత్యేకత ఉంటుంది. యాదాద్రికి వచ్చే ప్రతి భక్తుడు వారి గురించి తెలుసుకునేలా ఆళ్వార్లను స్తంభాలపై మలిచారు. దీంతో మహామండపం శోభాయమానంగా కన్పిస్తున్నది.

కట్టిపడేస్తున్న కాకతీయ స్తంభాలు

మహామండపంలోని మొదటి అంతస్తులో కాకతీయశైలిలోని బ్రహ్మకాంత స్తంభాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. బ్రహ్మకాంతం స్తంభం చెక్కేందుకు ప్రధాన స్తంభానికి నలు దిశలలో పిల్ల స్తంభాలు చెక్కుతారు. బ్రహ్మకాంతం శైలిలో ఇవి చూడటానికి విజయస్తంభాల మాదిరిగా కన్పిస్తాయి. పలక, పద్మం, పోతిక, పుష్పపోతిక అమర్చి నిర్మాణం పూర్తి చేశారు. కాకతీయుల దేవాలయాల్లా సింహతోరణాలు ప్రత్యేకత. అదే తరహాలో యాదాద్రిలో మహామండపాన్ని సిద్ధం చేశారు.

ప్రథమ ప్రాకారానికి విష్ణుకాంత శోభ

ప్రధానాలయాన్ని రెండు ప్రాకారాలతో నిర్మిస్తున్నారు. ప్రథమప్రాకారానికి విష్ణుకాంత స్తంభాలను ఎక్కువగా వాడారు. దీనినే కుడ్యపాదం అంటారు. కుంభలతా స్తంభాలను కూడా వాడటంతో ప్రథమ ప్రాకారంలోని స్తంభాలు ఎంతో ఆకర్షణీయంగా రూపుదిద్దుకున్నాయి.


కోష్ఠ జాలకంలో అమర్చిన బ్రహ్మకాంత స్తంభం

ద్వితీయ ప్రాకారంలో సింహస్తంభాలు

సింహస్తంభాలతో ద్వితీయ ప్రాకారం కనువిందు చేస్తున్నది. ఆలయం లోపల వచ్చే చుట్టూ ప్రాకారం అని కూడా దీన్ని పిలుస్తారు. సింహ స్తంభాలకు ఎదురుగా గోడలను ఆనుకుని స్తంభాలను మిక్కిలి శోభాయమానంగా అమర్చారు. ఔటర్ ప్రాకారాన్ని అష్టభుజి మండపాలతో నిర్మిస్తున్నారు. అష్టభుజి మండపాల్లో చిత్రకంఠ స్తంభాలు, బాలపాదస్తంభాలను అందంగా ఏర్పాటుచేశారు. పంచతల రాజగోపురం లోపల రుద్రకాంత స్తంభాలను అమర్చారు. ఏడంతస్తుల రాజగోపురం లోపల చిత్రకంఠస్తంభాలు ఆకర్షణీయంగా ఒదిగాయి.

ఆకట్టుకుంటున్న ఐరావతాలు

ఆలయ నిర్మాణంలో ఐరావతాలను మలిచిన తీరు శిల్పుల ప్రావీణ్యాన్ని చాటిచెప్తున్నది. ఐరావతంఇంద్రుని వాహనం. ప్రతి భక్తుడు గూడా ఇంద్ర పదవిలో జీవించినట్టు సున్నిత విషయాలను గ్రహించి జీవించాలనే సందేశం ఇస్తున్నది. అనేక స్తంభాలపై శుభానికి సంకేతమైన పద్మాలను చెక్కారు. పలు పక్షి జాతులను రకరకాల రీతుల్లో స్తంభాలపై చెక్కారు. విష్ణుమూర్తి దశావతారాలు స్తంభాలు నెలవుగా మారాయి.

ఆధునిక నాగరికతను ప్రతిబింబిస్తూ..

ప్రాచీన కళాఖండాలతోపాటు, ఆధునిక నాగరికతనూ స్తంభాలపై ప్రతిబింబించారు శిల్పులు. నేటి సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు, క్రీడలు, కరెన్సీ వంటివి స్తంభాలపై చెక్కారు.

జయరాం హత్య కేసులో వీడుతున్న చిక్కుముడి

- మేనకోడలు శిఖాచౌదరి పాత్రపై ఆరా
- జయరాం సోదరి, శిఖాచౌదరి, రాకేశ్‌ను విచారిస్తున్న పోలీసులు
- ప్రేమికులే జయరాంను హత్యచేసినట్టుగా అనుమానం
- హైదరాబాద్ నుంచి విజయవాడ వరకున్న సీసీటీవీల విశ్లేషణ
- నేడు అమెరికా నుంచి హైదరాబాద్ రానున్న జయరాం కుటుంబీకులు


జయరాం (ఫైల్)

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కోస్టల్ బ్యాంక్ ఎండీ, ప్రవాసభారతీయుడు చిగురుపాటి జయరాం అనుమానాస్పద మృతి కేసులో కొత్త కోణాలు వెలుగు చూస్తున్నాయి. జయరాం మేనకోడలు శిఖాచౌదరిపై అనుమానంతో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నట్టు తెలిసింది. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఆమె ఇంటి వద్ద విచారించినట్టు సమాచారం. గతనెల 29న రాత్రి శిఖాచౌదరి ఇంటికి జయరాం వచ్చి వెళ్లినట్టుగా గుర్తించిన పోలీసులు.. 31వ తేదీన రాత్రి 11 గంటలకు జయరాం ఇంటి నుంచి శిఖాచౌదరి వెళ్లినట్టు నిర్ధారించారు. ఈ మేరకు వాచ్‌మన్ పోలీసులకు తెలిపాడు. శిఖాచౌదరి, ఆమె ప్రియుడు రాకేశ్ ఈ హత్యకు పాల్పడినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. శిఖా చౌదరి, రాకేశ్ ప్రేమవివాహానికి ఇంట్లో వాళ్లు ఒప్పుకోలేదని సమాచారం. శిఖాచౌదరిని వదిలేస్తే రూ.3.5 కోట్లు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకొని ఆ తరాత ఇవ్వకపోవడంతో ప్రేమికులు ఒక్కటై జయరాంను హత్యచేసినట్లుగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చనిపోయిన రోజు జయరాం ఇంటికి శిఖా వచ్చి వాచ్‌మన్‌ను బెదిరించి ఇంటితాళాలు తీసుకొని ఇంట్లోకి వెళ్లిందని పోలీసుల విచారణలో తేలింది. దీంతో తమ అనుమానాలు మరింత బలపడుతున్నట్టు పోలీసులు భావించి.. జయరాం సోదరిసహా శిఖాచౌదరి, రాకేశ్, జయరాం గన్‌మెన్లు, కారు డ్రైవర్లను భిన్నకోణాల్లో విచారిస్తున్నారు.

విషప్రయోగం వల్లే చనిపోయాడా?

జయరాం ఒంటిపై తీవ్రమైన గాయాలు లేకపోవడం, తలపై చిన్న గాయం, ముక్కులో నుంచి రక్తం వచ్చినప్పటికీ గాయాల కారణంగా చనిపోలేదని పోస్టుమార్టం ప్రాథమిక నివేదికలో ఫోరెన్సిక్ వైద్యులు తేల్చినట్టు తెలిసింది. అలాగే జయరాం శరీరం రంగు మారడంతో విషప్రయోగం జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. పరీక్షల నిమిత్తం పలు శాంపిళ్లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. జయరాం హైదరాబాద్ దస్‌పల్లా హోటల్ నుంచి బయలుదేరినప్పటి నుంచి హత్య జరిగే వరకు రోడ్డుమార్గంలో ఉన్న సీసీ కెమెరాల పుటేజీని పోలీసులు విశ్లేషిస్తున్నారు.

నేడు అంత్యక్రియలపై నిర్ణయం

జయరాం మృతదేహాన్ని శుక్రవారం పోస్టుమార్టంకు అప్పగించిన నందిగామ పోలీసులు.. అదేరోజు రాత్రి మృతదేహాన్ని హైదరాబాద్‌కు తరలించారు. అమెరికాలో ఉన్న జయరాం భార్య పద్మశ్రీ, పిల్లలు ఆదివారం హైదరాబాద్ చేరుకొనే అవకాశం ఉన్నది. జయరాం భార్య, పిల్లలు వచ్చిన తర్వాతే అంత్యక్రియలపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. కాగా, అమెరికాలో విపరీతమైన మంచు కురుస్తున్న కారణంగా విమానసేవలు నిలిచిపోవడంతో జయరాం కుటుంబీకులు రావడం మరింత ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నాయి.

హామీల అమలు దిశగా రాష్ట్ర బడ్జెట్

మొదటిపేజీ తరువాయి...

శరవేగంగా కొనసాగుతున్నదని, వాటికి నిధుల కొరత లేనివిధంగా బడ్జెట్‌లో ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. ఇతర ప్రభుత్వ ప్రాథమ్యాలకు అనుగుణంగా బడ్జెట్ ప్రతిపాదనలు తయారుచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కే జోషి, ఆర్థిక సలహాదారు జీఆర్ రెడ్డి, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, పంచాయతీరాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్, నీటిపారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్, ఆర్ అండ్‌బీ ఈఎన్సీలు గణపతిరెడ్డి, రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగులోకి చట్టాలు

మొదటిపేజీ తరువాయి...

సీఎం కేసీఆర్ పరిశీలన కోసం సమర్పించారు. వీటికి ముఖ్యమంత్రి ఆమోదం తెలుపగానే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతోపాటు.. ఆయాశాఖల వెబ్‌సైట్లలోనూ పొందుపర్చేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లుచేశారు.

తెలుగులోకి కొత్త పంచాయతీరాజ్ చట్టం

ప్రథమ తెనుగీకరణ ప్రతిని సిద్ధంచేసిన బృందం ఆ తర్వాత తర్జుమా చేయాల్సిన చట్టంపై అప్పుడే కసరత్తు ప్రారంభించింది. తెలంగాణ ప్రభుత్వం తాజాగా అమల్లోకి తీసుకొచ్చిన నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని తెలుగీకరించే ప్రక్రియ ప్రారంభమైనట్టు తెలుస్తున్నది. ఇలా ఒక్కొక్కటిగా.. చట్టాలన్నింటినీ తెలుగీకరించే ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుంది.

నిండుకుంటున్న జలాశయాలు

- శ్రీశైలం, సాగర్‌లో భారీగా తగ్గిన నీటినిల్వలు
- ఎండీడీఎల్ ఎగువన మిగిలింది 48.51 టీఎంసీలే

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కృష్ణాబేసిన్‌లో 2018-19 నీటి సంవత్సరానికి సంబంధించి లెక్కలు చివరిదశకు చేరుకున్నాయి. బేసిన్‌లో ప్రధానమైన శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నీటినిల్వలు భారీగా తగ్గుముఖం పట్టాయి. ఎండీడీఎల్ ఎగువన వాడుకొనేందుకు 48.51 టీఎంసీలే అందుబాటులో ఉన్నాయి. బేసిన్‌లో ఇతర మధ్యతరహా ప్రాజెక్టులను పరిగణనలోకి తీసుకున్నా 61.40 టీఎంసీలే ఉన్నాయి. ఇందులో తెలంగాణకు ప్రస్తుతం 43 టీఎంసీల వరకు వాటా ఉంటే.. ఏపీకి నాలుగున్నర టీఎంసీల వాటానే మిగిలి ఉంది. ఇదికూడా రెండురోజుల్లో ముగిసే అవకాశముంది. ఎండీడీఎల్ దిగువన నీటి విడుదలకు రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదిరి.. బోర్డు అనుమతి ఇచ్చేవరకు ఆంధ్రప్రదేశ్‌కు రెండు రిజర్వాయర్ల నుంచి నీటి విడుదల దాదాపు లేనట్లేనని అధికారులు తెలిపారు. హైదరాబాద్ తాగునీటి అవసరాలతోపాటు సాగర్ ఎడమకాల్వ కింద యాసంగి పంటలకు నీటిని విడుదల చేయాలంటే కనీసంగా 520 అడుగుల నీటిమట్టం ఉండాల్సి ఉన్నందున ఎండీడీఎల్ దిగువన నీటి విడుదలకు తెలంగాణ ఇప్పట్లో అంగీకరించే అవకాశాల్లేవు. సాగర్ ఎడమకాల్వ కింద ఏపీ పరిధిలోని ఆయకట్టుకు 3.43 టీఎంసీల నీటి విడుదలకు గతంలోనే కృష్ణాబోర్డు అనుమతి ఇచ్చింది. కుడికాల్వకు అదనంగా రెండు టీఎంసీల నీటివిడుదల సోమవారంతో పూర్తవుతుంది. ఏపీ ఆయకట్టుకు 1.43 టీఎంసీల వాటానే ఉన్నది.

డైట్, కాస్మోటిక్ బిల్లులు సమర్పించండి

- జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారులకు డైరెక్టర్ ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ఎస్సీ అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలోని సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు సంబంధించిన డైట్, కాస్మోటిక్ బిల్లులను ప్రతినెలా సమర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ శాఖ డైరెక్టర్ పీ కరుణాకర్ అధికారులను ఆదేశించారు. శనివారం సచివాలయం నుంచి జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మార్చిలో టెన్త్ పరీక్షలు ఉన్నందున విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా ప్రత్యేక డైట్ ఏర్పాటుచేయాలన్నారు. సమావేశంలో ఆ శాఖ అదనపు సంచాలకుడు డీ హన్మంతునాయక్, సంయుక్త సంచాలకుడు అచ్యుతానంద గుప్త, శ్రీనివాసరెడ్డి అధికారులు పాల్గొన్నారు.

మళ్లీ సిరిసిల్లకే బతుకమ్మ చీరెలు

- 94 లక్షల చీరెలకు ఆర్డర్
- చేనేత జౌళిశాఖ సంచాలకురాలు శైలజారామయ్యర్ వెల్లడి



శనివారం సిరిసిల్లలో మీడియాతో మాట్లాడుతున్న శైలజా రామయ్యర్

రాజన్నసిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ : బతుకమ్మ చీరెల తయారీ ఆర్డర్లు మళ్లీ సిరిసిల్లకే ఇచ్చినట్లు చేనేత జౌళిశాఖ సంచాలకురాలు శైలజారామయ్యర్ వెల్లడించారు. మరమగ్గాల కార్మికులకు చేతినిండా పనికల్పించాలన్న ఉద్దేశంతో మూడోసారి 94 లక్షల చీరల ఆర్డర్లు ఇచ్చినట్లు చెప్పారు. నాణ్యతతో తయారీచేసి సిరిసిల్లకు, అటు ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని వస్త్ర ఉత్పత్తిదారులను కోరారు. సిరిసిల్లలో శనివారం వస్త్ర ఉత్పత్తిదారులు, మాక్స్ సొసైటీల యజమానులతో ఆమె సమావేశమయ్యారు. రూ. 300 కోట్ల విలువైన రూ.6 కోట్ల 30 లక్షల మీటర్ల చీరలను తయారు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ ఆర్డర్లను 121 మాక్స్ సోసైటీలకు, 84 ఎస్ఎస్ఐ యూనిట్ల యజమానులకు తయారు చేసే అవకాశం కల్పించినట్లు చెప్పారు. గత సంవత్సరం కన్నా ఈసారి మూడు నెలల ముందే ఆర్డర్లు ఇచ్చినందున నాణ్యత ప్రమాణాలతో చీరెలు తయారు చేయాలని కోరారు. ఆగస్టు నెలాఖరులోగా మొత్తం టార్గెట్ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఇస్తున్న రూ. మూడు కోట్ల ఆర్డర్లతో 22వేల మరమగ్గాలపై తయారు చేస్తున్నందున ఇక్కడి కార్మికులందరికీ ఉపాధి లభిస్తుందన్నారు. సమావేశంలో టెస్కో జీఎం యాదగిరి, డీడీ తస్లీమా, అశోక్, చేనేత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విశాఖ శారదాపీఠంలో 10 నుంచి రాజశ్యామల అష్టబంధన మహాకుంభాభిషేకం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: లోకకల్యాణార్థం ఈ నెల పదో తేదీ నుంచి 14 వరకు విశాఖపట్నం శారదాపీఠంలో శారదాస్వరూప రాజశ్యామల దేవతకు అష్టబంధన మహాకుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఈ మేరకు స్వరూపానందేంద్ర సరస్వతి నిర్ణయించినట్లు శారదాపీఠం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. దేశం సుభిక్షంగా ఉండాలని, రాజకీయ సంక్షోభంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకూడదని, దేశ సరిహద్దుల్లో ప్రశాంత వాతావరణం ఉండాలని రాజశ్యామల యాగంతోపాటు షణ్ముఖ యాగం వంటి మహత్తర కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొంది.

చలికాలం

జిల్లా	కనిష్ఠం	గరిష్ఠం
నాగర్‌కర్నూల్	12.8	34.6
మహబూబ్‌నగర్	12.9	34.6
సూర్యాపేట	13.0	29.0
మంచిర్యాల	13.0	30.2
ఆసిఫాబాద్	13.0	30.2
ఆదిలాబాద్	13.0	30.2
సంగారెడ్డి	13.0	34.6
మెదక్	13.1	32.1
వికారాబాద్	13.3	28.3
సిద్దిపేట	13.3	32.1
నిర్మల్	14.0	30.0
జగిత్యాల	14.0	32.0
కరీంనగర్	14.5	34.8
జనగామ	14.7	33.5
యాదాద్రి	14.7	34.6
కామారెడ్డి	15.0	29.0
పెద్దపల్లి	15.0	29.4
మహబూబాబాద్	15.0	34.0
వనపర్తి	15.6	34.6
హైదరాబాద్	15.8	29.6
మేడ్చల్ మల్కాజిగిరి	15.8	29.6
రాజన్న సిరిసిల్ల	16.0	30.0
రంగారెడ్డి	16.0	31.0
జోగులాంబ గద్వాల	16.3	33.0
వరంగల్ అర్బన్	16.5	29.0
నిజామాబాద్	16.8	30.5
జయశంకర్	17.0	30.0
వరంగల్ రూరల్	17.0	30.0
నల్లగొండ	18.0	30.4
ఖమ్మం	18.0	31.0
భద్రాద్రి కొత్తగూడెం	18.0	31.0

కొనసాగుతున్న చలితీవ్రత

మాల్దీవులనుంచి మహారాష్ట్రవరకు ఉపరితల ద్రోణి

మరో నాలుగురోజులు పొగమంచు చలికి తట్టుకోలేక ఒకరి వృతి

హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా చలితీవ్రత కొనసాగుతున్నది. మరోవైపు మాల్దీవులనుంచి దక్షిణ మధ్య మహారాష్ట్ర వరకు కోస్తా, ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక మీదుగా 0.9 కిలోమీటర్లనుంచి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ద్రోణి ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్ర అధికారులు తెలిపారు. ప్రధానంగా తూర్పు, ఆగ్నేయ దిశలనుంచి గాలులు వీస్తున్నాయని చెప్పారు. పలు జిల్లాల్లో మరో నాలుగు రోజులపాటు ఉదయం, సాయంత్రం పొగమంచు కురువనున్నదన్నారు. శనివారం కనిష్ఠంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో 12.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గ్రేటర్ హైదరాబాద్‌లో గాలిలో తేమశాతం స్వల్పంగా తగ్గినప్పటికీ రాత్రి ఉష్ణోగ్రతలు మరోసారి పడిపోయాయి. శనివారం 15.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదవగా, గాలిలో తేమ శుక్రవారం కంటే 8శాతం తగ్గి 79 శాతంగా నమోదైంది. చలితీవ్రతను తట్టుకోలేక వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట మండలం మహేశ్వరంలో ఎర్రబెల్లి పెద్ద కొమురయ్య (69) మృతి చెందారు.



శనివారం ఏవీ కాలేజీలో ప్రారంభమైన జిజ్ఞాస పోటీల కార్యక్రమానికి హాజరైన ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ దేశాయ్. చిత్రంలో విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, విద్యాశాఖ అకాడమిక్ డైరెక్టర్ జాన్సీ సెరెనా తదితరులు కూడా ఉన్నారు.



మూడురోజులపాటు జరిగే జిజ్ఞాస పోటీలకు హాజరైన విద్యానిపుణులు, డిగ్రీ విద్యార్థులు

విద్యార్థులు పరిశోధనలపై దృష్టిపెట్టాలి

'జిజ్ఞాస' ప్రారంభోత్సవంలో ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ దేశాయ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విద్యార్థులు జీవితంలో కుతూహలాన్ని, జిజ్ఞాసను వీడొద్దని, పరిశోధనలపై దృష్టిపెట్టాలని ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ యూబీ దేశాయ్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ దోమలగూడలోని ఏవీ కాలేజీలో కళాశాలల విద్యాశాఖ ఆధ్వర్యంలో మూడురోజులపాటు జరిగే 'జిజ్ఞాస' అనే పరిశోధన, స్టడీ ప్రాజెక్టుల పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. బోధన పద్ధతుల్లో స్టడీ ప్రాజెక్టుల విధానం చాలా ముఖ్యపాత్ర పోషిస్తుందని దేశాయ్ చెప్పారు. డిగ్రీస్థాయిలో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంలో భాగంగా జిజ్ఞాస కార్యక్రమాన్ని ప్రారంభించామని కళాశాలల విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్ తెలిపారు. డిగ్రీ కాలేజీలు, యూనివర్సిటీల అభివృద్ధికి రాష్ట్రీయ ఉచ్ఛతర్ శిక్షా అభియాన్ (రూసా) నిధులను ఖర్చు చేస్తున్నామని, కేయూలో రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ స్టార్టప్ కోసం రూ.50 కోట్లు కేటాయించామని అన్నారు. కార్యక్రమంలో కళాశాలల విద్యాశాఖ అకడమిక్ డైరెక్టర్, సమన్వయకర్త జాన్సీ సెరెనా తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి హయ్యర్ ఎడ్యుకేషన్ సదస్సు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ నెల నాలుగు, ఐదు తేదీల్లో ఉన్నత విద్యపై సదస్సు నిర్వహించనున్నట్టు కళాశాలల విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్ చెప్పారు. 'హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ హ్యూమన్ రిసోర్స్' అనే అంశంపై రెండ్రోజులపాటు నిర్వహించే సదస్సు గురించి శనివారం తన కార్యాలయంలో మీడియాకు వివరించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా హాజరవుతారని పేర్కొన్నారు.



వరంగల్ అర్బన్ జిల్లా మడికొండలో నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ ప్రారంభసభలో మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్ రమణారావు, వేదికపై వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ తదితరులు

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

- నిట్ డైరెక్టర్ రమణారావు
- మడికొండలో రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ ప్రారంభం

మడికొండ: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని వరంగల్‌లోని జాతీయ సాంకేతిక విద్యా సంస్థ(నిట్) డైరెక్టర్ ఎన్వీ రమణారావు పిలుపునిచ్చారు. వరంగల్ అర్బన్ జిల్లా మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో మూడ్రోజులపాటు జరిగే రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్–మనక్ వైజ్ఞానిక ప్రదర్శన శనివారం సాయంత్రం ప్రారంభమైంది. రమణారావు ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు తమ ఇన్నోవేటివ్ ఆలోచనలతో కొత్తకొత్త ఎగ్జిబిట్స్ రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ శేషుకుమారి, కార్పొరేటర్ జోరిక రమేశ్, ఆర్జేడీ పెగుడ రాజీవ్, డీఈవోలు, సైన్స్ అధికారులు, గైడ్ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



శనివారం ఏసీబీకి పట్టుబడిన టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ నరేశ్, సహాయకుడు శ్రీనివాస్

ఏసీబీకి చిక్కిన టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్

- ఔట్ సోర్సింగ్ అసిస్టెంట్ ఉద్యోగి
- రూ.80వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

హైదరాబాద్/మల్కాజిగిరి, నమస్తే తెలంగాణ: జీహెచ్‌ఎంసీ మల్కాజిగిరి సర్కిల్ టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ నరేశ్, టౌన్‌ప్లానింగ్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి (అసిస్టెంట్) శ్రీనివాస్ అలియాస్ యోగేశ్వర్ ఏసీబీకి చిక్కారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కు ఇచ్చేందుకు శనివారం రూ.80 వేలు లంచం తీసుకుంటుండగా వారిని రంగారెడ్డి జిల్లా రేంజ్ ఏసీబీ డీఎస్పీ సూర్యనారాయణ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నేరేడ్‌మెట్ డివిజన్ యాప్రాల్‌లోని స్వర్ణధామకాలనీలో న్యాయవాది అయిన ప్రదీప్‌కుమార్ 200 గజాల్లో జీ ప్లస్ వన్ భవనం నిర్మించుకున్నారు. భవనానికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇచ్చేందుకు నరేశ్ రూ.80 వేల లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ప్రదీప్‌కుమార్ జనవరి 29న ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. నరేశ్ సూచన మేరకు కార్యాలయంలోని అసిస్టెంట్ శ్రీనివాస్‌కు శనివారం ప్రదీప్‌కుమార్ రూ.80 ఇచ్చాడు. అనంతరం శ్రీనివాస్, నరేశ్‌లు డబ్బులు పంచుకుంటున్న సమయంలో వారిని పట్టుకున్నట్టు డీఎస్పీ సూర్యనారాయణ తెలిపారు. ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో వారిని హాజరుపర్చినట్టు పేర్కొన్నారు.

పెద్దపులిని చంపిందెవరు?

- సమాచారమిచ్చిన ఎన్జీవో సభ్యుల పాత్రపై అనుమానాలు
- కింగ్‌పిన్ కోసం పోలీసులు, అటవీ సిబ్బంది వేట
- వైల్డ్‌లైఫ్ క్రైమ్‌లో తొలిసారి పోలీసుల దర్యాప్తు



ఇటీవల హత్యకు గురైన పులి, దాని చర్మం

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: మంచిర్యాల జిల్లా శివ్వారం మొసళ్ల అభయారణ్యంలో పెద్దపులిని చంపిన కేసు కొత్త మలుపులు తిరుగుతున్నది. పెద్దపులిని పథకం ప్రకారమే చంపి దాని చర్మాన్ని సొమ్ముచేసుకొనే ప్రయత్నం చేసినట్టు పోలీసుల విచారణలో వెల్లడైనట్టు తెలిసింది. కరంట్‌వైర్లకు చిక్కి మెడ బిగుసుకొని పెద్దపులి చనిపోవడం కాకతాళీయంగా జరిగింది కాదని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలినట్టు సమాచారం. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వరుసగా పెద్దపులులు చనిపోవడం వెనుక అంతర్రాష్ట్ర ముఠా ఉండి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. పులిచర్మం సమాచారాన్ని అందించిన మహారాష్ట్ర ఎన్జీవో సభ్యుల పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మందమర్రి రామన్‌కాలనీలో దండవేణి సాయిలు వద్ద ఇటీవల అటవీ అధికారులు పెద్దపులి చర్మాన్ని స్వాధీనం చేసుకొన్నారు. ఈ కేసులో సాయిలుతోపాటు మల్లయ్య, బుచ్చిరాజం, బీచుపల్లి కొమురయ్య, ఇలవేణి అంజయ్య, మేకల నర్సయ్య, ఇలవేణి సాగర్, పూర్ణచందర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ సత్యనారాయణ స్వయంగా కేసును పర్యవేక్షిస్తున్నారు. వైల్డ్‌లైఫ్ క్రైమ్‌లో పోలీసు శాఖ దర్యాప్తు చేపట్టడం ఇదే తొలిసారి.

పులిని ఎవరు చంపారు?

పెద్దపులిని చంపాల్సిన అవసరం ఎవరికి ఉన్నది? ఎవరి ఆదేశాల మేరకు పులిని చంపారు? కింగ్‌పిన్ ఎవరు? అనే విషయాలపై మంచిర్యాల పోలీసులు లోతైన దర్యాప్తు జరుపుతున్నారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన ఒక ఎన్జీవోకు చెందిన ఇద్దరు సభ్యులు పులి చర్మం తీసుకొస్తే రూ.5 లక్షలు ఇస్తామని ఆశ చూపడం వల్ల కరంట్‌వైర్లను అమర్చి చంపామని విచారణలో నిందితులు వెల్లడించినట్టు తెలిసింది. దాంతో మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు చెందిన ఎన్జీవో సభ్యులు థామస్, నందూపై పోలీసులు నిఘాపెట్టారు. వేటగాళ్లు అడవుల్లో ఇంకా ఎక్కడెక్కడ ఉచ్చులు బిగించారు? అనేది తెలుసుకొనేందుకు అటవీ, పోలీస్ అధికారులు అడవుల్లో గాలింపు మొదలుపెట్టారు.

మత్స్యరంగానికి మంచి భవిష్యత్తు

- ఆక్వా ఎక్స్ పో ముగింపు కార్యక్రమంలో ఎంపీ బండ ప్రకాశ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో నీలి విప్లవం సాధించే దిశగా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కృషి చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు బండ ప్రకాశ్ అన్నారు. మత్స్యకారులను ప్రోత్సహించేందుకు ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేస్తున్నారని.. నీటిపారుదల ప్రాజెక్టులు భారీ ఎత్తున చేపట్టినందున ఈ రంగానికి మంచి అవకాశాలుంటాయని చెప్పారు. సొసైటీ ఫర్ ఫిషరీస్ అండ్ ఆక్వాకల్చర్ (సిఫా), తెలంగాణ మత్స్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో హైటెక్స్‌లో మూడు రోజులపాటు నిర్వహించిన ఆక్వా ఎక్స్ పో ముగింపు కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ, మత్స్యశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ, సిఫా అధ్యక్షుడు రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.



శనివారం ఆక్వా ఎక్స్‌పో ముగింపు కార్యక్రమంలో ఎంపీ బండ ప్రకాశ్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

రవాణాశాఖలో పదోన్నతులకు లైన్‌క్లియర్

- జీవో జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రవాణాశాఖలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పదోన్నతులకు మార్గం సుగమమైంది. రాష్ట్రపతి ఉత్తర్వులను ఉల్లంఘించి ఉమ్మడి రాష్ట్రంలో చేసిన తప్పులను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం జీవో నంబర్ 2 జారీచేసింది. తాజా జీవో ప్రకారం.. కొత్త మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రమోషన్లు చేపడుతారు. హైదరాబాద్‌లోని రోడ్డు రవాణాశాఖ అధికారులకు (ఆర్టీవో) డీటీసీలుగా పదోన్నతులు లభించనున్నాయి. మినిస్టీరియల్ సిబ్బందికి డీటీసీ పదోన్నతుల్లో తక్కువ అవకాశాలు దక్కనున్నాయి. క్షేత్రస్థాయి అనుభవం దృష్ట్యా ఎంవీఐలకే డీటీసీలుగా పదోన్నతులు లభించనున్నాయి. రాష్ట్రంలో మొత్తం ఆర్టీవో పోస్టులు 22 ఉన్నాయి. డీటీసీలుగా పదోన్నతి పొందడానికి వెహికల్ ఇన్‌స్పెక్టర్లు 340, మినిస్టీరియల్ సిబ్బంది 260 మొత్తం కలిపి 600 మంది ఎదురుచూస్తున్నారు. తెలంగాణ మోటర్ వెహికల్ అసోసియేషన్, తెలంగాణ గ్రూప్ 1, టీఎన్జీవో అసోసియేషన్ వేర్వేరుగా (ఉమ్మడి ఏపీ ప్రభుత్వం 2007 ఆగస్టు 30న జీవో 246 జారీచేసింది) 246 జీవోను సవరణ చేయాలని ప్రభుత్వాన్ని కోరాయి. లోతుగా విచారణ జరిపి డీటీసీలుగా పదోన్నతి పొందడానికి ఆర్టీవోలకు, అసిస్టెంట్ సెక్రటరీలకు మధ్య 24:1 నిష్పత్తిని నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీనిపట్ల రవాణాశాఖ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మద్యం లారీ హైజాకర్ల అరెస్టు

- సినీ ఫక్కీలో లారీ ఓనర్ల స్కెచ్
- 75 లక్షల విలువైన మద్యం లూటీ
- పోలీసుల దృష్టి మళ్ళించేందుకు మైండ్‌గేమ్
- ఏడుగురు అరెస్టు, రూ.73లక్షల సొత్తు రికవరీ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: మద్యం లోడ్ లారీని హైజాక్ చేసి రూ.75 లక్షల విలువైన మద్యం బాటిళ్లను లూటీ చేసిన ఏడుగురు సభ్యుల ముఠాను రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు పథకం వేసిన లారీ యజమానులు జైలుపాలయ్యారు. శనివారం రాచకొండ పోలీసు కమిషనర్ మహేశ్‌భగవత్ తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖనికి చెందిన కొమరవెల్లి రాకేశ్, మునీర్, సమయ్య, గండు సంజీవ్, డేక్‌నాథ్ రవికుమార్ స్నేహితులు. గతంలో వీరు లారీ ట్రాన్స్‌పోర్టు వ్యాపారం నిర్వహించారు. నష్టాల నుంచి గట్టెక్కేందుకు ఎన్నికల వేళ మద్యం లోడ్‌తో వెళ్లే లారీని హైజాక్ చేయాలని పథకం పన్నారు. హైదరాబాద్‌లోని అసోసియేటెడ్ రోడ్‌వేస్ ద్వారా నాచారంలోని యునైటెడ్ స్పిరిట్స్ కంపెనీ నుంచి 950 కాటన్ల మద్యం బాటిళ్లను మంచిర్యాలకు తీసుకెళ్లేందుకు మరో వ్యక్తి సాయంతో రాకేశ్ తన లారీని కుదుర్చుకొన్నాడు. డ్రైవర్ రాలేదని చెప్పి మరో డ్రైవర్ సాయంతో మద్యం లోడ్‌ను గోదాం నుంచి బయటికి తెప్పించుకొని నేరుగా పెద్దపల్లి జిల్లా వడ్కపూర్ గ్రామానికి తీసుకెళ్లి దాచిపెట్టారు. మూడురోజులైనా మద్యం డెలివరీ కాకపోవడంతో యునైటెడ్ స్పిరిట్స్ కమర్షియల్ మేనేజర్ రవికుమార్ రాచకొండ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా మద్యం లారీ హైజాక్ మిస్టరీని పోలీసులు చేదించి.. రూ.73 లక్షలు విలువచేసే మద్యంతోపాటు లారీని స్వాధీనం చేసుకొన్నారు.



శనివారం రాచకొండ కమిషనరేట్‌లో మద్యం లారీ లూటీ వివరాలను వెల్లడిస్తున్న కమిషనర్ మహేశ్‌భగవత్

24 గంటల్లో రంగు మార్చేశారు

మద్యం లారీ హైజాక్‌కు పక్కా ప్రణాళిక వేసుకొన్నారు. పోలీసుల దృష్టిని మళ్ళించేందుకు విజయవాడలో కొనుగోలు చేసిన లారీకి పాత ఆటో నంబరు ప్లేటును అమర్చారు. రెండు మొబైల్ ఫోన్లలో సిమ్‌లు మార్చుతూ పోలీసులకు చిక్కకుండా పథకం వేశారు. మద్యం లోడ్ దింపిన తర్వాత మహారాష్ట్రలోని బలార్షకు తీసుకెళ్ళి అక్కడ మొత్తం లారీ రంగునే మార్చేశారు. దానిపై ఉన్న అక్షరాలు, డిజైన్లను మార్చేసి లారీని గోదావరిఖనికి తీసుకొచ్చి నిలిపేసినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది.



సామిల్లులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

అడవుల రక్షణలో స్థానిక భాగస్వామ్యం

జంగిల్ బచావోలో ప్రజాప్రతినిధుల సహకారానికి నిర్ణయం

కట్టెకోత మిల్లుల యజమానులకు కౌన్సెలింగ్

రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న అటవీశాఖ దాడులు

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: 'జంగిల్ బచావో.. జంగిల్ బడావో' అన్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పిలుపు మేరకు అడవుల రక్షణకు, అటవీ సంపదను పెంపుదలకు అటవీశాఖ అధికారులు అన్ని రకాల ప్రయత్నాలు ప్రారంభించారు. అటవీ, పోలీసు సిబ్బంది సమన్వయం చేసుకొంటూ సంయుక్త దాడులకు పూనుకొంటున్నారు. నేరస్థుల పట్ల కఠినంగా వ్యవహరిస్తూనే.. ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యాన్ని పెంచడానికి జనచైతన్య కార్యక్రమాలను చేపడుతున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సర్పంచ్‌లతో సమావేశమై.. అడవుల సంరక్షణలో భాగస్వాములు కావాలని కోరాలని నిర్ణయించారు. గత హరితహారంలో చేపట్టిన పనుల వివరాలు, కొత్తగా పంచాయితీరాజ్ చట్టం ప్రకారం గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత కోసం చేయాల్సిన పనులపై అవగాహన కల్పించనున్నారు. పచ్చదనం కోసం పాటుపడే గ్రామాలు, వ్యక్తులకు ప్రభుత్వం హరితమిత్ర అవార్డులు, రివార్డులు ఇస్తున్న విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లనున్నారు. అటవీ సరిహద్దుల ఏర్పాటు, ఆక్రమణల నియంత్రణ, అడవుల పునరుజ్జీవనం, అర్బన్ ఫారెస్ట్ పార్కుల ఏర్పాటుపై సమాచారం ఇవ్వనున్నారు. స్మగ్లింగ్, జంతువుల వేట నియంత్రణకు సహకరిస్తూ అందుబాటులో ఉన్న సమాచారం ఇవ్వాలని కోరనున్నారు. బాధ్యతలు చేపట్టిన రోజుకు గుర్తుగా శనివారం వివిధ ప్రాంతాల్లో సర్పంచుల చేత అటవీ సిబ్బంది మొక్కలు నాటించి వాటి పెంపు బాధ్యత తీసుకోవాలని కోరారు. ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవంలో భాగంగా పలు ప్రాంతాల్లో ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా అటవీశాఖ దాడులు కొనసాగుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సామిల్లులో భారీగా కలప స్వాధీనం చేసుకొన్నారు. ఇల్లెందు సత్యనారాయణపురంలో 13 యంత్రాలు, రూ.ఆరు లక్షల విలువచేసే కలప పట్టుబడింది.

సామిల్లుల యజమానులకు కౌన్సెలింగ్

అక్రమ కలప, టేకును ప్రోత్సహించకుండా అడవుల రక్షణకు తమతో సహకరించాలని సామిల్లుల యజమానులకు అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు. స్మగ్లింగ్‌కు సహకరిస్తే చట్టపరంగా తీసుకొనే చర్యలను వివరిస్తున్నారు. అటవీశాఖ చేపట్టే కౌన్సెలింగ్‌కు రావాల్సిందిగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,400 సామిల్లుల యజమానులకు సమాచారమిచ్చినట్టు అటవీశాఖ పీసీసీఎఫ్ (ఐటీ, విజిలెన్స్) కే రఘువీర్ తెలిపారు. సామిల్లుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటుచేసే పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. సామిల్లుల్లో స్టాక్ రిజిష్టర్ ఏర్పాటుచేసి కలప వివరాలు నమోదు చేయాల్సిందిగా ఆదేశించనున్నట్టు చెప్పారు. అడవులను కాపాడటం వల్ల లభించే ప్రయోజనాలపై గ్రామాల్లో కళాజాతలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు.

భాషా పండితులు, పీఈటీల అప్‌గ్రేడ్‌కు ఆర్థికశాఖ అనుమతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లోని భాషా పండితులు, పీఈటీల పోస్టుల అప్‌గ్రేడ్‌కు సంబంధించిన ఫైల్‌కు ఆర్థికశాఖ ఆమోదముద్ర వేసినట్టు పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు చెప్పారు. ఎమ్మెల్సీలు కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, పూల రవీందర్ ఆధ్వర్యంలో విద్యాశాఖ అధికారులను కలిసి విజ్ఞప్తిచేశామని పేర్కొన్నారు. త్వరలోనే ఉత్తర్వులు వెలువడే అవకాశముందన్నారు. రూ.398 జీతంతో ఉద్యోగాలు పొందిన ప్రత్యేక టీచర్ల నోషనల్ ఇంక్రిమెంట్ల ఫైల్‌పై కూడా ఆర్థికశాఖ సంతకం చేసినట్టు తెలిపారు.

గిరిజనులకు అండగా..

ఆయనో డాక్టర్. వయసుంది.. ఎంతో భవిష్యత్తు ఉంది. ఏ హాస్పిటల్‌లో కొలువుచేసినా ప్రతినెలా లక్షల్లో సంపాదించొచ్చు. సొంతంగా హాస్పిటల్ తెరవొచ్చు. కానీ.. ఆయన భిన్నంగా ఆలోచించారు. వైద్యంకోసం వచ్చేవారికి కాకుండా.. వైద్యం చేయించుకోలేనివారికి సేవలందించాలనుకున్నారు. అదికూడా కనీసం రవాణా, విద్యుత్ సౌకర్యాలు కూడా లేని అటవీ గ్రామాలనే ఎంచుకున్నారు. కాలినడకన సెలయేళ్లు, కొండలు దాటుకుని వెళ్లి.. వారానికి మూడ్రోజులు గిరిజనుల మధ్యే గడుపుతున్నారు. వారికి ఉచితంగా వైద్యం అందించడమేకాదు.. స్నేహితుల సహాయంతో వారికి దుస్తులు, ప్రొటీన్‌ఫుడ్ తదితరాలు సమకూరుస్తున్నారు. ఎంతో మంది ఇదేంపని అంటూ నిరుత్సాహపర్చబోయారు. జీవితభాగస్వామి సహా కొందరు మాత్రం 'మేము సైతం' అంటూ తోడు నిలిచారు. గడ్చిరోలి అటవీ ప్రాంతంలో సేవలందిస్తున్న మహారాష్ట్రకు చెందిన డాక్టర్ ప్రకాశ్ ఆమ్టే, బీహార్, కర్ణాటకల్లో సేవలందిస్తున్న డాక్టర్ హనుమప్ప సుదర్శన్‌లను ఆదర్శంగా తీసుకున్న ఆ యువ వైద్యుడు.. డాక్టర్ రమావత్ నరేందర్! తన మార్గంలో ఎదురైన ఆటంకాలను, సవాళ్లను అధిగమిస్తూ గిరిజనసేవలో అంకితమైన ఆ స్ఫూర్తిదాత కృషి.. జీవితమే ఈ కథనం.

- యువ వైద్యుడి సేవాతత్పరత
- కాలినడకన పల్లెలకు పయనం
- ఉచిత వైద్యం, మందుల పంపిణీ
- చీకటి పల్లెల్లో సౌర వెలుగులు
- వారంలో మూడ్రోజులు గిరిజనుల మధ్యే
- కాసులు కురిపించే ప్రైవేటు ప్రాక్టీసు వదిలి అడవిబాట పట్టిన డాక్టర్ రమావత్ నరేందర్
- సహకరిస్తున్న మిత్రబృందం

సండే స్పెషల్



ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నరేందర్



గిరిజనులకు మందులు, సోలార్ లైట్లు పంపిణీ చేసిన డాక్టర్ నరేందర్ బృందం

శిరందాస్ ప్రవీణ్‌కుమార్, హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి:

డాక్టర్ రమావత్ నరేందర్ పుట్టింది నాగార్జునసాగర్ పక్కన రామన్నగూడెం తండాలో. తండ్రి ఆర్టీసీలో పనిచేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. గిరిజన తండాలో పుట్టిన పెరిగిన నరేందర్.. తమ ఊళ్లో వైద్యం అందక ఎందరు చనిపోయారో, ఎంతమంది ఇబ్బందులకు గురయ్యారో ప్రత్యక్షంగా చూశారు. ఆ అనుభవాలే ఆయనను వైద్యం చదివేందుకు స్ఫూర్తినిచ్చాయి. కష్టపడి చదివి.. రామంతాపూర్ హోమియో మెడికల్ కాలేజీలో పీజీ పూర్తిచేశారు. కాలేజీ నుంచి బయటకు రాగానే సంపాదన మొదలుపెట్టడం కాకుండా.. స్వస్థలంలో ఉచితంగా వైద్యం ప్రారంభించారు. ఆరోగ్యశిబిరాలు నిర్వహించారు. కొందరు ఇదంతా రాజకీయ ప్రయోజనాలకోసమన్నారు. దురుద్దేశాలు ఆపాదించారు. అదే ఆయనలో పట్టుదలను మరింత పెంచింది. అన్నీ అందుబాటులో ఉన్నవారికి కాకుండా.. ఏమీ లేనివారికి తన సేవలు అందాలని నిశ్చయించుకున్న నరేందర్.. మహారాష్ట్రలో గిరిజనులకు సేవలందిస్తున్న డాక్టర్ ప్రకాశ్‌ఆమ్టే, బీహార్, కర్ణాటకల్లో పనిచేస్తున్న డాక్టర్ హనుమప్ప సుదర్శన్‌లను ఆదర్శంగా తీసుకున్నారు. 2016, 2017 సంవత్సరాల్లో వారిని కలుసుకొని, వారి వైద్యసేవలను ప్రత్యక్షంగా చూశారు. ఆ తర్వాత మూడునెలలపాటు ఆదిలాబాద్, ఖమ్మం అటవీ ప్రాంతంలో కలియదిరిగారు. ఎలాంటి సదుపాయాలు అందుబాటులోని లేని గిరిజనులకే తన వైద్యసేవలందించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీప్రాంతాన్ని ఎంచుకున్నారు. మూడేండ్లుగా ప్రతి శుక్ర, శని, ఆదివారాల్లో తన బృందంతో వెళ్లి.. గిరిజనులకు వైద్యసేవలు అందిస్తున్నారు.

అనేక అడ్డంకులు అధిగమిస్తూ..

తొలినాళ్లలో నరేందర్ అనేక సమస్యలు ఎదుర్కొన్నారు. ఓసారి అశ్వాపురం మండలం మనుబోతులగూడెం దగ్గర పోలీసులు ఆయనను మావోయిస్టుగా అనుమానించి పట్టుకున్నారు. 'నేను సైతం' ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ రఘుకిషోర్ గల్లా సాయంతో బయటపడ్డారు. మొదట్లో గట్టుమల్ల అటవీ ప్రాంతం, బంగారుచిలుక ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఇండ్లకు రానివ్వకుండా తలుపులు మూసేసిన సందర్భాలు ఎదురయ్యాయి. కానీ.. ఇప్పుడు ఆయన గూడేనికి వెళ్లగానే వైద్యంకోసం లైనులో నిలబడుతున్నారు. ఆయన రాక కోసం జిల్లాలోని పలు గూడేలు, పల్లెలు ఆశగా ఎదురుచూస్తుంటాయి. హైదరాబాద్ నుంచి కొత్తగూడెం క్రాస్‌రోడ్డు వరకు బస్సులో ప్రయాణించే నరేందర్.. ఎడమవైపు రేగళ్ల రోడ్డులో గట్టుమళ్ల అటవీప్రాంతంలో బైక్‌పై ప్రయాణిస్తుంటారు. వాస్తవానికి అది బైక్ కాదు.. స్వయంగా రూపొందించుకున్న చిన్నపాటి అంబులెన్స్. 45 నిమిషాల ప్రయాణం అనంతరం రాళ్లచిలుక చేరుకుంటారు. అక్కడి నుంచి ఏడు కిలోమీటర్లు అడవిలో నడిస్తే బుసురాయిగూడెం వస్తుంది. ఇలా పలుగూడేలు తిరిగి, అవసరమైనవారికి మందులు, ఇతర వస్తువులు అందించి సాయంత్రం తిరుగు ప్రయాణం అవుతారు. ఈ క్రమంలో రోజుకు 30 నుంచి 50 మందికి చికిత్స చేసి, మందులు, న్యూట్రిషన్ పౌడర్ ఉచితంగా ఇస్తారు. అక్కడివారిలో ప్రధానంగా ఐరన్ లోపం, ఫంగల్ ఇన్ఫెక్షన్లు, చర్మవ్యాధులు, నులిపురుగుల సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నట్టు నరేందర్ చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏన్కూరు మండలం కొత్తమేడిపల్లి ప్రాంతంలో కొన్ని గూడేలకు కరంటు, నీళ్లు లేవు. రోడ్లు అసలే లేవు. పాల్వంచ ప్రాంతంలోని రాళ్ల చెల్క, బుసురాయి, రాళ్ల చిలుకగూడేలను డాక్టర్ నరేందర్ ఎంపికచేసుకున్నారు. ఈ గూడేలకు వెళ్లాలంటే కాలినడకే. కొన్నిచోట్ల వాగులు వంకలు దాటాలి. అయినా పట్టుదలతో తన సేవ కొనసాగిస్తున్నారు. మడక మనీషా అనే 20 నెలల చిన్నారి కేవలం 5.4 కిలోల బరువు మాత్రమే ఉన్నది. అందరూ చనిపోతుందనుకొని ఆశ వదులుకున్నారు. కానీ.. డాక్టర్ నరేందర్ ఆమెకు ప్రాణంపోశారు. తన వైద్యసేవలు, పౌష్టికాహారం అందించడం ద్వారా ఇప్పుడా పాప చక్కగా బడికి వెళ్తున్నది. రాళ్లచిలుకలో ఓ టీచర్‌ను నియమించడం ద్వారా అక్కడి చిన్నారులకు విద్యాబుద్ధులు చెప్పిస్తున్నారు. ఇక్కడి ప్రతి పది మంది మహిళల్లో ఎనిమిది మంది రక్తహీనతతో బాధపడుతుండటంతో వారికి ప్రొటీన్ పౌడర్, రేషన్ అందిస్తున్నారు.

వ్యక్తి కృషి వెనుక శక్తులు

డాక్టర్ నరేందర్ కృషికి బలమైన సహకారం కూడా ఉన్నది. మానవత్వం పరిమళించే కొన్ని హృదయాలు.. మేము సైతం అంటూ పాలుపంచుకుంటున్నాయి. నరేందర్ భార్య స్వాతి వృత్తిరీత్యా వైద్యురాలే. ఆమెకూడా ప్రజాసేవ దృక్పథంతో వైద్యవిధానపరిషత్‌లో పనిచేస్తూ ప్రస్తుతం నాగర్‌కర్నూల్లో గైనకాలజిస్ట్‌గా ఉన్నారు. లక్షలు సంపాదించే అవకాశం ఉన్న తన భర్త గిరిజనులకే జీవితాన్ని అంకితం చేసినా బాధపడలేదు. పైగా తనవంతు సహకారం అందిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన న్యూరాలజిస్టు డాక్టర్ నిషాంత్, సీటీ సర్జన్ డాక్టర్ శివ, యూరాలజిస్టు డాక్టర్ శ్రీనివాస్, కార్డియాలజిస్టు డాక్టర్ రఘుకిశోర్, గైనకాలజిస్టులు డాక్టర్ దీప, డాక్టర్ సుప్రియ, డాక్టర్ రవీందర్‌రావులతోపాటు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు మహేశ్, రాధాకృష్ణ, ప్రకాశ్ తదితరులు నరేందర్ కృషిలో భాగం పంచుకుంటున్నారు. సుమారు 40 మంది 'డాక్టర్ ఏపీజే ఇండియా ట్రైబల్' పేరిట వాట్సాప్ గ్రూపు ఏర్పాటుచేసుకుని, గ్రూపులో నిత్యం సంప్రదించుకుంటూ గిరిజనులకు అందజేయాల్సిన మందులు, వస్తువులు సమకూర్చుతున్నారు. ఎన్ఐఎన్ రూపొందించిన ప్రొటీన్ మిక్స్ (బెల్లం, పప్పులు, బియ్యం) వంటివి కూడా అందిస్తున్నారు. బెంగుళూరుకు చెందిన 'కరుణ ట్రస్టు' ప్రతి నెలా రూ.20 వేల విలువైన వస్తువులను అందిస్తుండగా.. వాటి రవాణా ఖర్చులను డాక్టర్ స్వాతి భరిస్తున్నారు.



స్నేహితుల సాయంతో ఓ ప్రయత్నం

నా గొప్పతనం ఏమీ లేదు. నా భార్య, స్నేహితుల సాయంతో మూడేండ్లుగా ఓ ప్రయత్నం చేస్తున్నా. ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాను. కానీ ఆ ప్రజలకు కాస్తా సాయం చేస్తున్న తృప్తి మిగులుతున్నది. ఇప్పుడిప్పుడే అనేకమంది నాతో నడిచేందుకు వస్తున్నారు. ప్రతివారం కొందరు ఔత్సాహికులు, డాక్టర్లుకూడా నాతోపాటు వస్తున్నారు. కొన్ని సంస్థలు కూడా సాయమందిస్తున్నాయి. ఆ అమాయక ప్రజలకు ఇంకా అనేకం చేయాల్సి ఉన్నది. ఇప్పుడు ఆ ప్రజలు నా కోసం ఎదురుచూస్తున్నారు. నేను హైదరాబాద్ నుంచి తీసుకెళ్లే మెటీరియల్‌ను మోసేందుకు పోటీ పడుతున్నారు. వారితో కలిసి కిలోమీటర్లకొద్దీ నడుస్తూ వాగులు, వంకలు దాటుతుంటే ఎంతో ఆనందంగా ఉంటుంది.

- డాక్టర్ రమావత్ నరేందర్



రాళ్ల చెలకలో ఏర్పాటు చేసిన పాఠశాలలో విద్యార్థులు

కార్మిక సంఘాల గౌరవాధ్యక్ష పదవులకు ఎంపీ కవిత రాజీనామా

సంఘాల ప్రధాన కార్యదర్శులకు రాజీనామా లేఖలు

పనిభారంతో సేవలందించలేకపోతున్నట్టు వెల్లడి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వివిధ కార్మిక సంఘాలకు గౌరవాధ్యక్షురాలిగా ఉన్న నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత ఆ పదవులకు రాజీనామా చేశారు. ఇప్పటివరకు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్), తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం (టీఆర్‌వీకేఎస్), తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ అసోసియేషన్, తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాల యాజమాన్య సంఘాలకు ఆమె గౌరవాధ్యక్షురాలిగా ఉన్నారు. పనిభారం దృష్ట్యా కార్మిక సంఘాలకు సేవలందించలేకపోతున్నట్టు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రాజీనామా లేఖలను ఆయా సంఘాల ప్రధాన కార్యదర్శులకు పంపినట్టు తెలిపారు. స్వరాష్ట్ర సాధనకు టీఆర్‌ఎస్ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ నాయకత్వంలో వివిధ కార్మిక సంఘాలతో కలిసి పనిచేశానని, తెలంగాణ ఆవిర్భావానంతరం కార్మిక వర్గ ప్రయోజనాలు, సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కృషి చేసినట్టు తెలిపారు. టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలిగా సింగరేణిలో కారుణ్యనియామకాల అమలు, 2013లో 18 శాతం ఉన్న లాభాల వాటాను 2018 నాటికి 27 శాతం వరకు చేర్చానన్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘ కార్మికులకు 30 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ, 1175 మంది కాంట్రాక్ట్ జూనియర్ లైన్‌మెన్ల సర్వీసుల రెగ్యులరైజేషన్.. 22,550 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులను ఆర్టిజన్‌లుగా విలీనం, అంగన్‌వాడీ టీచర్ల వేతనం రూ.4,500 నుంచి రూ.10,500, ఆయాలకు రూ. 2200 నుంచి రూ.6 వేలకు పెంచేందుకు కృషి చేసినట్టు చెప్పారు. కార్మికులకు సేవలు అందించడంలో సంతృప్తి ఉన్నప్పటికీ పని భారం దృష్ట్యా పూర్తి స్థాయిలో సేవలందించలేక పోతున్నట్టు తెలిపారు. దీంతో పాటు రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్టిలో ఉంచుకొని తన నియోజకవర్గానికి మరింత సమయం కేటాయించాల్సి ఉన్నదని, ఈ కారణంగానే గౌరవాధ్యక్ష బాధ్యతల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. బాధ్యతల నుంచి తప్పుకున్నా కార్మిక లోకానికి అందుబాటులో ఉంటానని ఎంపీ కవిత తెలిపారు.

మూడువేలకుపైగా పంచాయతీల్లో గిరిజన సర్పంచ్‌లు

తండాలను పంచాయతీలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌ది

జీసీసీ చైర్మన్ గాంధీనాయక్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో రాష్ట్రంలో మూడువేల తండాలు పంచాయతీలుగా రూపుదిద్దుకున్నాయని, ఆయా తండాల్లో గిరిజనులే సర్పంచులుగా ఎన్నికయ్యారని గిరిజన సహకార సంస్థ చైర్మన్ గాంధీనాయక్ అన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం టాంకాం చైర్మన్ రంగారెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వాల్యానాయక్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ గిరిజనులందరు సీఎం కేసీఆర్ కు రుణపడి ఉంటారన్నారు. ఉద్యమ కాలం నుంచి చెప్తున్నట్లుగా తండాలను పంచాయతీలు చేసి మాట నిలబెట్టుకున్న సీఎం కేసీఆర్ అన్నారు. గతంలో అధికారంలో ఉన్న రాజకీయ పక్షాలు గిరిజనులను ఓటు బ్యాంకుగానే చూశాయని పేర్కొన్నారు. గిరిజనుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. సర్పంచ్ ఎన్నికల జరుగకూడదని కాంగ్రెస్ నేతలు కోర్టుకు వెళ్లారన్నారు. ప్రజలు టీఆర్‌ఎస్ మద్దతుదారులను పెద్ద ఎత్తున గెలిపించారని చెప్పారు. గిరిజనుల జనాభాకు అనుగుణంగా 10 శాతం రిజర్వేషన్ కోసం సీఎం కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపారని, ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని గాంధీనాయక్ విమర్శించారు. త్వరలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, చట్టసభల ప్రజాప్రతినిధులు, మేధావులు సీఎం కేసీఆర్‌ను సన్మానించనున్నారని ఆయన తెలిపారు.

- కొలువుదీరిన కొత్త పాలకవర్గాలు
- 12,680 పంచాయతీల్లో అట్టహాసంగా సర్పంచ్‌ల ప్రమాణస్వీకారం
- రేపటినుంచి మాస్టర్ శిక్షకులకు హైదరాబాద్‌లో ట్రైనింగ్



శనివారం సిద్దిపేట జిల్లా కొండపాక మండలం బొబ్బాయపల్లిలో ప్రమాణం చేస్తున్న జీపీ పాలకవర్గం

పల్లెల్లో పండుగ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామ పంచాయతీల్లో కొత్త పాలకవర్గాలు కొలువుదీరాయి. ఆరునెలలుగా ఖాళీగా ఉన్న కుర్చీల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు శనివారం ఆసీనులయ్యారు. పండుగ వాతావరణంలో సర్పంచ్‌లు, పాలకవర్గాలతో ప్రతిజ్ఞ చేయించిన ప్రత్యేకాధికారులు వారికి బాధ్యతలు అప్పగించారు. పాలకవర్గాలు వెంటనే తొలి సమావేశాన్ని నిర్వహించి అత్యవసర పనులపై తీర్మానాలు సైతం చేశాయి. తొలి పాలకవర్గం కొలువుదీరిన సందర్భంగా గ్రామపంచాయతీలన్నింటా అట్టహాసంగా ఏర్పాట్లుచేశారు. పలు గ్రామాల్లో గులాబీ శ్రేణులు పార్టీ జెండాలతో ర్యాలీలు నిర్వహించాయి.

12,680 గ్రామాల్లో ప్రమాణస్వీకారం

రాష్ట్రంలో మొత్తం 12,751 గ్రామ పంచాయతీలు ఉండగా 17 పంచాయతీలకు పాలకవర్గం గడువు తీరకపోవడం, రెండు పంచాయతీలు కోర్టు కేసుల్లో ఉండటంతో వాటికి ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో 12,732 గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించగా వివిధ కారణాలతో 52 పంచాయతీలు, 692 వార్డులకు ఎన్నికలు జరుగలేదు. మొత్తం 12,680 గ్రామాలు, 1,12,460 వార్డులకు ఎన్నికలు జరుగగా, పాలకవర్గాలు శనివారం బాధ్యతలు చేపట్టాయి.

కొత్త పాలకవర్గాలకు సీఎస్ జోషి శుభాకాంక్షలు

నూతన సర్పంచ్‌లు, పాలకవర్గాలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టడంతో వారికి శుభాకాంక్షలు తెలుపుతూ లేఖలురాశారు. గ్రామీణ వ్యవస్థ బలపడాలని, స్వయం అభివృద్ధి కావాలని, చదువు, ఆరోగ్యం ప్రాధాన్యాన్ని గుర్తించాలని, పారిశుధ్యం , గ్రామ పంచాయతీల అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పంచాయతీరాజ్ చట్టంపై ప్రతి సర్పంచ్ అవగాహన పెంచుకోవాలని చెప్పారు.

రికార్డుల్లోకి తొలి పాలకవర్గాలు

రాష్ట్రంలో నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని అమలు చేయడంతోపాటు కొత్త గ్రామ పంచాయతీలను సైతం ఏర్పాటుచేశారు. ఈసారి ఎన్నికైనవారు గ్రామాల కొత్త పాలకవర్గాలుగా రికార్డు సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా ఏర్పాటైన 4,383 కొత్త పంచాయతీలు సహా అన్నింటా పాలకవర్గాలు కొలువుదీరాయి. కొత్తగా ఏర్పాటైన గ్రామాల్లో 2,634 పంచాయతీలు పూర్తిగా గిరిజనులకే కేటాయించడంతో వారే పగ్గాలు చేపట్టారు. గెలిచిన సర్పంచ్‌ల్లో కూడా విద్యావంతులే అధికంగా ఉన్నారు. పలుచోట్ల ఉన్నత విద్యావంతులు ప్రతిజ్ఞ ఇంగ్లిష్‌లో చేశారు.

జిల్లాలవారీగా సర్పంచ్‌లకు శిక్షణ

కొత్త సర్పంచ్‌లకు జిల్లాలవారీగా శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. కొత్త పంచాయతీరాజ్ చట్టం, గ్రామాల అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలను, నూతన చట్టం ప్రకారం గ్రామాల్లో తీసుకురావాల్సిన మార్పులు, హరితహారం, జరిమానాలపై వివరించనున్నారు. అంతకు ముందుగా సర్పంచ్‌లకు శిక్షణనిచ్చే మాస్టర్ శిక్షకులకు సోమ, మంగళవారాల్లో హైదరాబాద్‌లోని సీఆర్డీలో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణకు ఒక్కో జిల్లానుంచి ఒక్కో సర్పంచ్‌ను సైతం ఆహ్వానిస్తున్నారు.

నేడు ఓటరు జాబితా పరిశీలన

గ్రామాల్లో ఓటరు జాబితాపై ఆదివారం ప్రత్యేక పరిశీలన చేస్తున్నామని సీఈవో రజత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సవరణ, మార్పులు, చేర్పులు, ఫొటో ఓటరు జాబితాను పరిశీలిస్తామని, బూత్ లెవల్ సిబ్బంది ప్రత్యేకంగా ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆయన అన్నారు.

గ్రామాభివృద్ధి బాధ్యత వారిదే!

పంచాయతీల్లో పాలకవర్గానికే పూర్తి అధికారాలు

- నాలుగు స్టాండింగ్ కమిటీలు
- అభివృద్ధి పనులనుంచి హరితహారంవరకు కమిటీలదే నిర్ణయం
- పంచాయతీ కార్యాలయంలో హాజరు రిజిస్టర్

తంగళ్లపల్లి సంపత్, హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఎప్పుడో పాతికేండ్లకిందట రూపొందించిన పంచాయతీరాజ్ చట్టానికి బూజు దులిపిన సీఎం కేసీఆర్.. గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యమే లక్ష్యంగా నూతన చట్టానికి రూపకల్పనచేశారు. ఈ చట్టాన్ని అమలు చేయడంలో ఇప్పుడు అధికారులు, కొత్త పాలకవర్గాలు నిమగ్నమవుతున్నాయి. ఈ నూతన చట్టంలో పంచాయతీ పాలకవర్గానికి పూర్తిస్థాయి అధికారాలను కట్టబెట్టారు. సర్పంచ్‌కు పూర్తి కార్యనిర్వహణ అధికారాలను అప్పగించడంతోపాటు ఉప సర్పంచ్‌కు కూడా చెక్ పవర్ కల్పించారు. అధికారాలతోపాటు విధులను సైతం చట్టంలో పొందుపర్చారు. విధులు, నిధుల విషయంలో నిర్లక్ష్యం చేస్తే పాలకవర్గాన్ని రద్దు చేయడం, సర్పంచ్‌ను తొలిగించడం వంటి కఠిన అంశాలను చట్టంలో పొందుపరిచారు. సర్పంచ్, ఉప సర్పంచ్‌తో పాటు పంచాయతీ సభ్యులు ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాల్సిన బాధ్యతను కొత్త చట్టం ద్వారా కల్పించారు. పంచాయతీ పాలకవర్గానికి సహాయకుడిగా మాత్రమే గ్రామ కార్యదర్శి పనిచేస్తారు.

గ్రామ ప్రథమ పౌరుడి బాధ్యతలు

గ్రామాల అభివృద్ధికి నిధుల వినియోగం, మొక్కలు నాటడం, పారిశుధ్య లోపం లేకుండా చూడటం ప్రథమ పౌరుడి ప్రధాన బాధ్యత. ప్రతి గ్రామంలో నర్సరీ ఏర్పాటు చేయాలనే లక్ష్యాన్ని రూపొందించారు. ప్రతి కుటుంబానికి వ్యక్తిగత మరుగుదొడ్డి ఏర్పాటు చేయాల్సిన బాధ్యత కూడా ఆయనదే. చెత్తాచెదారాన్ని ఇష్టానుసారంగా పడేసేవారిపై జరిమానా విధించే అధికారం కూడా ఉన్నది. వరుసగా మూడుసార్లు గ్రామ సభ నిర్వహణలో విఫలమైతే సర్పంచ్‌ను విధులనుంచి తొలిగించనున్నారు. ఇక పంచాయతీ వివాదాల పరిష్కారానికి నూతన చట్టం ద్వారా ట్రిబ్యునల్ ఏర్పాటుచేశారు. పాలకవర్గాన్ని రద్దు చేసినా, సర్పంచ్, ఉప సర్పంచ్‌ను తొలిగించినా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించే అవకాశం ఉన్నది. ఇప్పటి వరకు స్టే ఇచ్చే అధికారం పంచాయతీరాజ్‌శాఖ మంత్రికి ఉండగా, ఇక నుంచి రాజకీయాలకతీతంగా ముగ్గురు సభ్యులతో కూడి ట్రిబ్యునల్ నిర్ణయం తీసుకుంటుంది.

పాలకవర్గాలకు బాధ్యత.. కమిటీల ఏర్పాటు

నూతన చట్టంలోని సెక్షన్ 49 ప్రకారం ప్రతి పంచాయతీలో నాలుగు స్టాండింగ్ కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉన్నది. పారిశుద్ధ్యం, డంపింగ్ యార్డు, వైకుంఠధామాల నిర్వహణకు ఒక స్టాండింగ్ కమిటీ, వీధి దీపాల నిర్వహణకు మరో కమిటీ, మొక్కలు నాటడం, రక్షించడానికి హరితహారం కమిటీ, గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై మరో స్టాండింగ్ కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉన్నది. గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లకు విశిష్ట అధికారాలను కల్పించిన ప్రభుత్వం.. వార్డు సభ్యులకు కూడా అభివృద్ధిలో కీలక బాధ్యతలను అప్పగించింది. త్వరలో స్టాండింగ్ కమిటీలను ఏర్పాటు చేసి అభివృద్ధి పనుల టార్గెట్‌ను వాటిపై ఉంచనున్నది. వార్డు సభ్యుడు చైర్మన్‌గా ఈ స్టాండింగ్ కమిటీలను ఏర్పాటుచేయనున్నది. నాలుగు కమిటీలకు నలుగురు వార్డు సభ్యులను చైర్మన్లుగా, మిగిలిన వార్డు సభ్యులతోపాటు గ్రామాభివృద్ధి కోసం ఉత్సాహంగా ఉండే యువతను, మహిళా సంఘాలను, సీనియర్ సిటిజన్లను సైతం సభ్యులుగా వీటిలో భాగస్వాములను చేయనున్నది. ఇప్పటివరకు గ్రామాల్లో పట్టించుకోకుండా ఉన్న పనుల బాధ్యతను కమిటీలకు అప్పగించే బృహత్తర నిర్ణయం తీసుకున్నది. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించేందుకు ప్రతి నెలా పాలకవర్గాల సమావేశం నిర్వహించాల్సి ఉండగా, కనీసం మూడు నెలల్లో ఒక్కసారైనా మండల విస్తరణ అధికారి (ఈవోపీఆర్డీ) పంచాయతీని తనిఖీ చేయాలి. అదేవిధంగా నెలలో ఐదు గ్రామపంచాయతీలను జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) తనిఖీ చేసి పనులను పరిశీలించి, సమీక్షించాలని కొత్త చట్టంలో రూపొందించారు.

పంచాయతీలో హాజరు రిజిస్టర్

ప్రతి గ్రామపంచాయతీలో హాజరు రిజిస్టర్‌ను కచ్చితంగా అమలు చేయాలని నిర్ణయించారు. ఈ రిజిస్టర్‌లో సర్పంచ్, ఉపసర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, కారోబార్, కార్యదర్శి, వీఆర్వో, వీఆర్ఏ, ఏఎన్ఎం, ఉపాధ్యాయులు, చౌకీదార్, విద్యుత్ హెల్పర్, వీసీవో సాక్షర భారత్, వెటర్నరీ అసిస్టెంట్, గ్రామ పోలీస్ అధికారి, ఫీల్డ్ అసిస్టెంట్, సుంకరులు, ఐకేపీ బాధ్యులు, ఆశ వర్కర్లు, ఐకేపీ యానిమేటర్స్, అంగన్‌వాడీ టీచర్, వాటర్ మెన్, రేషన్ డీలర్, మధ్యాహ్న భోజనం నిర్వాహకులు నమోదవుతారు. వీరు విధుల్లోకి వచ్చారా లేరా అనే విషయం పంచాయతీ కార్యాలయాల్లో వెల్లడించాలి.

గ్రీన్ ట్యాక్స్

కొత్త చట్టం ప్రకారం ఇక నుంచి ఇంటి ముందు చెత్త వేస్తే ఆ ఇంటి యజమానిదే బాధ్యత. చెత్త వేస్తే రూ.500 జరిమానా వసూలు చేస్తారు. పంచాయతీ పాలకవర్గం దీనిపై నిర్ణయం తీసుకుంటే కార్యదర్శి జరిమానా వసూలు చేయనున్నారు. ఇంటి ముందు చిన్న పైపు పెట్టి రోడ్డు మీదకు మురుగునీటిని వదిలేస్తే జరిమానా తప్పదు. అశుద్ధము, మురుగునీటిని రోడ్డుమీదకు ప్రవహింపచేస్తే రూ.5 వేలు ఫైన్ వేస్తారు. ఇక గ్రీన్‌ట్యాక్స్‌ను ఈసారి చట్టంలో పెట్టారు. ఒక కుటుంబానికి నిర్దేశించిన ప్రకారం ఆరు మొక్కలు నాటాల్సిందే. వాటిలో కనీసం మూడు మొక్కలు ఎదుగాలి. హరితహారంలో ఇచ్చిన మొక్కలను పెంచకుంటే ఆస్తి పన్నుకు రెండింతలు సదరు ఇంటి యజమానిపై ఫైన్‌గా వేయనున్నారు.

అక్రమం



ఈ బుజ్జి చిరుత పిల్లను బ్యాంకాక్ నుంచి ఓ వ్యక్తి అక్రమంగా తరలిస్తుండగా చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు శనివారం అరెస్టు చేశారు. కిలో బరువున్న ఈ చిట్టి చిరుతను ఓ ప్లాస్టిక్ బుట్టలో కుక్కి, దాన్ని బ్యాగులో ఉంచి అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు.

ఆధునికం



ఈ చిత్రంలో కనిపిస్తున్న రోబో పేరు 'రోయాడియో'. దేశంలోనే తొలి భద్రత రోబో ఇది. థానేలో పాదచారులు రోడ్డును దాటేటప్పుడు వారికి ఈ రోబో సహాయం చేయనుంది.

ఆక్రోశం



ఫ్రాన్స్ ప్రభుత్వం చమురు ధరలు పెంచడాన్ని నిరసిస్తూ చేపట్టిన 'యెల్లో వెస్ట్' ఉద్యమం తీవ్రతరమైంది. దేశాధ్యక్షుడి వైఖరిని నిరసిస్తూ పారిస్ వీధుల్లో కదం తొక్కిన ఆందోళనకారులు.

ఆధ్యాత్మికం

ఆధ్యాత్మిక వేడుకైన కుంభమేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. గంగా, యమున, సరస్వతి నదుల సంగమ స్థానం (త్రివేణి సంగమం)లో పుణ్యస్నానాలు ఆచరించేందుకు దేశ, విదేశీ భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు క్యూ కడుతున్నారు. ముఖ్యంగా పవిత్ర పర్వదినాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటున్నది. నదీ తీరం వెంట భక్తుల సౌకర్యార్థం వేల సంఖ్యలో ఏర్పాటు చేసిన గుడారాల విహంగ వీక్షణ దృశ్యమిది



తెల్‌తుంబ్డే అరెస్టు

- తెల్లవారుజామున ముంబై విమానాశ్రయంలో హక్కుల కార్యకర్త అదుపులోకి..
- అరెస్టు అక్రమం, సుప్రీంకోర్టు ఉత్తర్వుల్ని ఉల్లంఘించడమేనంటూ కోర్టు ఆగ్రహం

తుంబ్డేను తక్షణమే విడుదల చేయాలని ఆదేశం



ఆనంద్ తెల్‌తుంబ్డేను కోర్టుకు తీసుకొస్తున్న పోలీసులు (మధ్యలో వ్యక్తి)

ముంబై: భీమా-కోరేగావ్ విధ్వంసం కేసులో మావోయిస్టులతో సంబంధాలున్నాయని దళిత హక్కుల కార్యకర్త, ప్రొఫెసర్ ఆనంద్ తెల్‌తుంబ్డేను మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. శనివారం తెల్లవారుజామున కొచ్చి నుంచి ముంబై చేరుకున్న తెల్‌తుంబ్డేను పోలీసులు అదుపులోకి తీసుకుని, తర్వాత పుణే పోలీసులకు అప్పగించారు. తెల్‌తుంబ్డేను ప్రశ్నించేందుకు రిమాండ్‌కు అప్పగించాలని కోరుతూ స్థానిక సెషన్స్ కోర్టులో హాజరుపర్చారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం ఆనంద్ గతంలో దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం కోర్టు కొట్టేసిన వెంటనే పోలీసులు తెల్‌తుంబ్డేను అరెస్టుచేశారు. తుంబ్డే తరుపు న్యాయవాది వాదిస్తూ 'ఈనెల 11 వరకు తెల్‌తుంబ్డేను అరెస్టు చేయొద్దని సుప్రీంకోర్టు ఇప్పటికే ఆదేశించినందున గడువు ముగియకముందే అరెస్టు చేయడం కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘనే అవుతుంది' అని అన్నారు. తెల్‌తుంబ్డేకు మావోయిస్టులతో సంబంధాలున్నాయని, భీమా-కోరేగావ్ అల్లర్లలో ఆయన పాత్ర ఉందని పుణే పోలీసులు ఒక సీల్డ్ కవర్‌ను జడ్జికి అందజేశారు. వాదనల తర్వాత జడ్జి కిషోర్ వదానే మాట్లాడుతూ.. 'సుప్రీంకోర్టు విధించిన గడువుకు ముందే తెల్‌తుంబ్డేను అరెస్టు చేయడం అక్రమం. ఇది కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడమే. తెల్‌తుంబ్డేను తక్షణమే విడుదల చేయండి' అని ఆదేశించారు.

నైజీరియాలో బోకోహరామ్ నరమేధం

60 మంది పౌరుల ఊచకోత

లాగోస్: బోకోహరామ్ తీవ్రవాదులు దాదాపు 60 మంది సాధారణ పౌరులను చంపారని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ తెలిపింది. ప్రజలను మూకుమ్మడిగా నిప్పుపెట్టి చంపారన్నది. నైజీరియాలోని రాన్ పట్టణంలోపల 11 మృతదేహాలను, పట్టణం వెలుపల 49 శవాలను గుర్తించామని తెలిపింది. మృతదేహాలకు బుల్లెట్ గాయాలూ ఉన్నాయన్నది. ఇప్పటికీ 50 మంది ప్రజల ఆచూకీ తెలువడం లేదని ఆమ్నెస్టీ నైజీరియా డైరెక్టర్ ఓసాయ్ ఒజిగో పేర్కొన్నారు. నైజీరియాలో జరుగుతున్న రక్తపాతం వల్ల అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. బోకోహరామ్ నుంచి ప్రాణ రక్షణకు ప్రజలు పక్కదేశాలకు వలసవెళ్తున్నారని, కొందరు ఇండ్లు కోల్పోయి తిండి తిప్పలు లేక సహాయ శిబిరాల్లో తలదాచుకుంటున్నారని పేర్కొన్నారు.

సీబీఐ కొత్త డైరెక్టర్ రిషికుమార్

నియామకానికి ప్రధాని నేతృత్వంలోని అత్యున్నత కమిటీ ఆమోదముద్ర

- కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే అభ్యంతరాలు బేఖాతరు
- గతంలో మధ్యప్రదేశ్ డీజీపీగా బాధ్యతలు నిర్వహించిన శుక్లా
- ప్రస్తుతం ఆ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్‌గా విధులు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) నూతన డైరెక్టర్‌గా రిషికుమార్ శుక్లా నియమితులయ్యారు. సీబీఐకి కొత్త డైరెక్టర్‌ను వెంటనే నియమించాలని, ఇంతటి కీలక పోస్టులో రెగ్యులర్ డైరెక్టర్‌ను ఎందుకు నియమించలేదని కేంద్రాన్ని శుక్రవారం సుప్రీంకోర్టు నిలదీసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అదే రోజు రాత్రి ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని అత్యున్నత స్థాయి కమిటీ రెండోసారి అత్యవసరంగా సమావేశమైంది. చీఫ్ జస్టిస్ రంజన్ గొగొయ్, లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత మల్లికార్జున ఖర్గే ఈ భేటీలో పాల్గొన్నారు. సీబీఐ డైరెక్టర్ పదవికి అర్హతలు ఉన్న 30 మంది పేర్లతో రూపొందించిన తుది జాబితాపై సమావేశంలో చర్చించారు. ఇందులో శుక్లా పేరును ప్రధాని మోదీ ఖరారు చేయగా, మల్లికార్జున ఖర్గే తీవ్ర అభ్యంతరం తెలిపారు. అవినీతి నిరోధక నేర పరిశోధనలో తగినంత అనుభవం లేని కారణంగా శుక్లాను సీబీఐ డైరెక్టర్ పదవికి ఎంపిక చేయవద్దని ఖర్గే అభ్యంతరం తెలిపినట్లు సమాచారం. సీబీఐ కొత్త డైరెక్టర్‌గా శుక్లాను నియమిస్తున్నట్లు కేంద్ర వ్యక్తిగత సిబ్బంది మంత్రిత్వశాఖ శనివారం ప్రకటన విడుదల చేసింది. రెండేళ్లపాటు ఆయన పదవిలో కొనసాగుతారని పేర్కొన్నది. 1983 మధ్యప్రదేశ్ ఐపీఎస్ క్యాడర్‌కు చెందిన శుక్లా గతంలో మధ్యప్రదేశ్ డీజీపీగా పనిచేశారు. ప్రస్తుతం పోలీసు హౌసింగ్ బోర్డు చైర్మన్‌గా సేవలందిస్తున్నారు.

సీబీఐలో రచ్చరచ్చ
సీబీఐలో డైరెక్టర్ అలోక్‌వర్మ, స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ ఆస్తానా ఒకరిపై మరొకరు అవినీతి ఆరోపణలు చేసుకోవడంతో వివాదం రచ్చకెక్కింది. దీంతో వర్మను కేంద్రం బలవంతంగా సెలవుపై పంపింది. ఆ తర్వాత ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరడం, తదనంతర పరిణామాల నేపథ్యంలో గతనెల 10న కేంద్రం వర్మను పదవి నుంచి తొలిగించిన సంగతి తెలిసిందే. తర్వాత వర్మను ఫైర్స్ సర్వీసెస్, సివిల్ డిఫెన్స్, హోంగార్డుల విభాగానికి డీజీగా బదిలీచేసింది. ఈ పదవిని చేపట్టేందుకు ఆయన నిరాకరించారు. అప్పట్నుంచీ సీబీఐ డైరెక్టర్ పదవీ ఖాళీగానే ఉంది. తాత్కాలిక డైరెక్టర్‌గా మన్నెం నాగేశ్వరరావు వ్యవహరిస్తున్నారు.

కీలక కేసులు.. పెను సవాళ్లు
అత్యంత విపత్కర పరిస్థితుల్లో సీబీఐ పగ్గాలు చేపడుతున్న శుక్లాకు పలు సవాళ్లు ఎదురుకానున్నాయి. పలు కీలక కేసుల్లో దర్యాప్తు ప్రక్రియను పూర్తిచేయాల్సిన బాధ్యత ఆయనపై ఉంది. అగస్టా వెస్ట్‌ల్యాండ్ కుంభకోణం, 2జీ స్కాం, బొగ్గు కుంభకోణం, ఎయిర్ ఇండియా స్కాం, కాంగ్రెస్ సీనియర్ నేతలు పీ చిదంబరం, భూపీందర్‌సింగ్ హుడాలపై నమోదైన చార్జిషీటు, ఉత్తర్‌ప్రదేశ్ సాండ్-మైనింగ్ కుంభకోణం, శారదా చిట్‌ఫండ్ స్కాం, ఐసీఐసీఐ బ్యాంకు మాజీ సీఈవో చందాకొచ్చర్‌కు వ్యతిరేకంగా నమోదైన ఎఫ్‌ఐఆర్.. తదితర కేసుల దర్యాప్తు శుక్లాకు కత్తిమీద సామే.

మధ్యప్రదేశ్ క్యాడర్ నుంచి తొలి అధికారి

న్యూఢిల్లీ: సీబీఐ నూతన డైరెక్టర్‌గా ఎంపికైన రిషి కుమార్ శుక్లా... మధ్యప్రదేశ్ క్యాడర్ నుంచి ఈ పదవికి ఎంపికైన తొలి ఐపీఎస్ అధికారి. 58 ఏండ్ల శుక్లా 1983వ బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. ఆయన స్వస్థలం మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్. ఫిలాసఫీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. మధ్యప్రదేశ్ డీజీపీగా సుమారు రెండున్నర సంవత్సరాలు పనిచేశారు. లైంగిక దాడి ఘటనలపై వేగవంతంగా విచారణకు ఆదేశించేవారని ఆయనకు పేరుంది. దీంతో ఆ రాష్ట్రంలో అలాంటి నేరాలు గణనీయ స్థాయిలో తగ్గాయని అధికారులు తెలిపారు. అలాగే క్రిమినల్ కేసుల్లో చార్జిషీట్లు త్వరగా వేసేలా చూసేవారని, తద్వారా విచారణ సకాలంలో ప్రారంభమై న్యాయ ప్రక్రియ వేగవంతంగా జరిగేదని వెల్లడించారు. ఆయనకు సీబీఐలో పనిచేసిన అనుభవం లేకపోయినా, ఇంటెలిజెన్స్ బ్యూరోలో పలు సున్నితమైన కేసులపై దర్యాప్తు జరిపిన అనుభవం ఉన్నదని వివరించారు. నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం రాయ్‌పూర్, దమోహ్, శివపురి, మందసౌర్ జిల్లాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. అనంతరం డీజీపీగా నియమితులయ్యారు. ఇటీవలే మధ్యప్రదేశ్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా బదిలీ అయ్యారు.

అనుభవంలేని వ్యక్తికి సారథ్యమా?

- ప్రధానికి అసమ్మతి లేఖను పంపిన కాంగ్రెస్ నేత ఖర్గే

న్యూఢిల్లీ: సీబీఐ డైరెక్టర్‌గా మధ్యప్రదేశ్ మాజీ డీజీపీ రిషికుమార్ శుక్లా నియామకంపై లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున ఖర్గే అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు తన అసమ్మతి లేఖను శనివారం ప్రధాని నరేంద్రమోదీకి పంపారు. అవినీతి కేసుల దర్యాప్తులో అనుభవం లేని ఆర్కే శుక్లాను సీబీఐ డైరెక్టర్‌గా నియమించడం చట్టాన్ని, సుప్రీంకోర్టు తీర్పులను ఉల్లంఘించడమేనని తెలిపారు. సీనియారిటీతోపాటు కీలకమైన సంస్థ (సీబీఐకి) సారథ్యం వహించే వ్యక్తికి అవినీతి కేసులను విచారించిన అనుభవమూ ఉండాలని పేర్కొన్నారు.

తప్పుదోవ పట్టించేందుకే: కేంద్రమంత్రి జితేంద్ర ప్రసాద్
సీబీఐ నూతన డైరెక్టర్ ఎంపిక ప్రక్రియపై ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్ నేత మల్లిఖార్జున ఖర్గే ప్రయత్నిస్తున్నారని కేంద్ర మంత్రి జితేంద్ర ప్రసాద్ ఆరోపించారు. ఆ పదవిలో తనకు నమ్మకమైన వారిని నియమించాలని ఖర్గే కోరుకున్నారని, ఇదే ఆయన నిగూఢ రహస్యం అని పేర్కొన్నారు.



అప్నీ బాత్ రాహుల్ కే సాత్

విద్యార్థులతో రాహుల్ చర్చలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఏడుగురు విద్యార్థులతో కల్సి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ శుక్రవారం రాత్రి ఢిల్లీలో విందు సమావేశం నిర్వహించారు. వారితో కలుపుగోలుగా వ్యవహరించిన రాహుల్.. ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని, కొన్నింటిని పార్టీ మ్యానిఫెస్టోలో చేరుస్తామని హామీ ఇచ్చారు. మ్యానిఫెస్టోను బ్రెయిలీ లిపిలో కూడా ముద్రిస్తామన్నారు. త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరుగనుండటంతో రాహుల్ గాంధీ.. 'అప్నీ బాత్ రాహుల్ కే సాథ్' అనే పేరుతో తొలితరం ఓటర్లతో ఇష్టాగోష్టి చర్చలను ప్రారంభించారు. ఈ చర్చాగోష్టిలో నాలుగు రాష్ట్రాలకు చెందిన ఐఐటీ, ఇంజినీరింగ్, ఎంబీబీఎస్ విద్యార్థులు పాల్గొన్నారు. చర్చాగోష్టిలో పాల్గొన్న విద్యార్థులు రాహుల్ తమతో మమేకం అయ్యారని.. ఈ జ్ఞాపకాలను జీవిత కాలం గుర్తు పెట్టుకుంటామన్నారు.

పాక్, ఆఫ్ఘన్ సరిహద్దులో

భూకంపం

- రిక్టర్ స్కేల్‌పై 5.8గా నమోదు
- ఢిల్లీలోనూ ప్రకంపనలు

ఇస్లామాబాద్/న్యూఢిల్లీ: పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దులో శనివారం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 5.8గా నమోదైంది. ప్రాణ, ఆస్తి నష్టం వివరాలు ఇంకా వెల్లడికాలేదు. ఆఫ్ఘన్‌లోని హిందుకుష్ పర్వతశ్రేణి ప్రాంతంలో 208 కి.మీ. లోతులో భూకంప కేంద్రం కేంద్రీకృతమైంది. ఈ ప్రాంతం పాకిస్థాన్ సరిహద్దులో ఉండటంతో భూకంప ప్రభావం ఎక్కువగా పాక్‌పై పడింది. పెషావర్, ఇస్లామాబాద్, రావల్పిండి, లాహోర్, కోహట్, స్వాత్, మియాన్‌వలి, సర్గోదా ప్రాంతాలు భూకంప ప్రభావానికి గురయ్యాయి. మరోవైపు శనివారం తెల్లవారుజామున 7.38 గంటలకు కరాచీలోనూ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 2.9గా నమోదైంది. కాగా శనివారం ఢిల్లీలోనూ భూ ప్రకంపనాలు కొన్ని చోట్ల సంభవించాయి.

హవాలా కేసులో వాద్రాకు ఊరట

- 16 వరకు తాత్కాలిక బెయిల్ మంజూరు
- ఆరో తేదీన ఈడీ ముందు విచారణకు హాజరు కావాలి
- ఢిల్లీలోని ప్రత్యేక న్యాయస్థానం ఆదేశం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: హవాలా లావాదేవీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన కేసులో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బావ రాబర్ట్ వాద్రాకు ఢిల్లీలోని ప్రత్యేక కోర్టు జడ్జి అరవింద్ కుమార్ ఈ నెల 16 వరకు తాత్కాలిక బెయిల్ మంజూరు చేశారు. కేసు దర్యాప్తులో పాలుపంచుకోవాలని ఆదేశించారు. ఈ నెల ఆరో తేదీన ఈడీ అధికారుల ముందు విచారణకు హాజరు కావాలన్నారు. రాబర్ట్ వాద్రా లండన్‌లో 12, బ్ర్యాంస్టోన్ స్క్వేర్‌లో గల ఆస్తిని 19 లక్షల పౌండ్ల హవాలా నిధులతో కొనుగోలు చేశారని ఈడీ ఆరోపించింది. ఈడీ తరపున విచారణకు హాజరైన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీపీ సింగ్, అడ్వకేట్ నితేశ్ రాణా వాదిస్తూ వాద్రాకు ముందస్తు బెయిల్ జారీ చేయవద్దని కోరారు. 2009లో ఒక పెట్రోలియం ఒప్పందానికి సంబంధించి వాద్రా ముడుపులు అందుకున్నారని ఆరోపించారు. వాద్రాకు చెందిన వారు లండన్‌లో పలు కొత్త ఆస్తులు సంపాదించుకున్నారని నితేశ్ రాణా ఆరోపించారు. వాద్రా తరపున విచారణకు హాజరైన సీనియర్ అడ్వకేట్ కేటీఎస్ తులసీ వాదిస్తూ ఆయన తల్లి వైద్యం కోసం విదేశాల్లో ఉన్నారని కోర్టుకు నివేదించారు. ఆయన స్వదేశానికి వచ్చిన తర్వాత దర్యాప్తులో భాగస్వామి అవుతారని, దర్యాప్తునకు సహకరించేందుకు సిద్ధమన్నారు.

అరెస్టయిన విద్యార్థుల కోసం

హాట్‌లైన్

మొదటిపేజీ తరువాయి...
శుక్రవారం వెల్లడించారు. అలాగే అరెస్టయిన విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు cons3.washington@mea.gov.in అనే ఈమెయిల్ ద్వారా ఎంబసీ అధికారులను సంప్రదించవచ్చని సూచించారు. కుంభకోణంతో ప్రభావితమైన విద్యార్థులకు సంబంధించిన అన్ని సమస్యలపై సమన్వయం చేసేందుకు ఓ నోడల్ అధికారిని కూడా నియమించినట్లు వెల్లడించారు. వాషింగ్టన్‌లోని భారత దౌత్య కార్యాలయంతోపాటు అమెరికా వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఉన్న కాన్సులేట్ అధికారులు విద్యార్థులకు సాయం అందించేందుకు యత్నిస్తున్నట్లు భారత ఎంబసీ తెలిపింది. టెక్సాస్‌లోని డిటెన్షన్ సెంటర్‌లో ఉన్న పలువురు విద్యార్థులను కాన్సులర్ అధికారులు కలిసినట్లు వెల్లడించింది. విద్యార్థులను విడుదల చేయించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించింది. కాగా, అరెస్టయిన విద్యార్థుల కుటుంబ సభ్యులు ట్విట్టర్ ద్వారా విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్‌ను సంప్రదించి సాయం చేయాల్సిందిగా అభ్యర్థిస్తున్నారు. తన భర్తను అధికారులు అదుపులోకి తీసుకున్నారని, ఇప్పటివరకు ఆయన సమాచారం తెలియడం లేదని, దయచేసి సాయం చేయాల్సిందిగా మాధురి అనే మహిళ సుష్మా స్వరాజ్‌కు విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన భారత ఎంబసీ అధికారులు ఆమె నుంచి వివరాలు సేకరించారు. ఆమె భర్తను కలుస్తామని భరోసా ఇచ్చారు.

దౌత్య సాయానికి సహకరించండి

న్యూఢిల్లీ: భారతీయ విద్యార్థులకు సాయం అందించేందుకు కేంద్రం దౌత్య పరమైన చర్యలు చేపట్టింది. డిటెన్షన్ సెంటర్లలో ఉన్న భారత విద్యార్థులు తక్షణమే తమ కాన్సులర్ అధికారులను సంప్రదించేందుకు చర్యలు చేపట్టాలని ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయాన్ని కోరింది. వర్సిటీలో చేరి మోసపోయిన విద్యార్థులను, వారిని మోసం చేసిన వారిని వేర్వేరుగా చూడాలని కోరింది.

విద్యార్థులను కలుసుకోవడానికి తెలుగు సంఘాలు కృషి

సెలవుల తర్వాత న్యాయ సహాయం వేగవంతం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అరెస్టయిన భారతీయ విద్యార్థులను కలుసుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నామని అమెరికాలోని ప్రవాస భారతీయ సంఘాలు తెలిపాయి. విద్యార్థులు ప్రస్తుతం డిటెన్షన్ కేంద్రాల్లో ఉన్నారని, అయితే వారాంతపు సెలవు కావడంతో వారిని కలుసుకోవడం కుదరడం లేదని చెప్పాయి. అమెరికా కాలమానం ప్రకారం సోమవారం నుంచి విద్యార్థులకు న్యాయ సహాయం అందించే ప్రక్రియ వేగవంతం అవుతుందని తెలిపాయి.

డిటెన్షన్ సెంటర్ల వద్దే ఉండి పర్యవేక్షిస్తున్నాం

విద్యార్థుల కేసుల వివరాలు సేకరించాం. అటార్నీలను నియమించే ప్రక్రియను పూర్తి చేస్తున్నాం. మూడు నుంచి పది రోజుల్లో విద్యార్థులంతా బయటకు వస్తారు. బాండ్ అప్లికేషన్, వాలంటరీ డిపార్చర్ ప్రకారం వారిని స్వదేశానికి పంపేందుకు ప్రక్రియ చేపడుతున్నాం. సమాచారం కోసం info@atausa.org ను సంప్రదించవచ్చు.

– కరుణాకర్ రావు మాధవరం, సత్యనారాయణ రెడ్డి కందిమల్ల, వెంకట్ మంతెన (అమెరికన్ తెలంగాణ అసోసియేషన్ ప్రతినిధులు)

తల్లిదండ్రులు ఆందోళన చెందొద్దు

భారత రాయబార కార్యాలయంతో ఎప్పటికప్పుడు కలిసి పని చేస్తున్నాం. కొన్ని డిటెన్షన్ సెంటర్లలో ముక్కు ద్వారా ఆహారాన్ని అందిస్తున్నారనే ప్రచారంలో నిజం లేదు. తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దు.

– పరమేశ్ భీంరెడ్డి (అమెరికన్ తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు)

నాటా ఆసరాగా ఉంది

విద్యార్థులకు నాటా అండగా ఉంటున్నది. ఇమ్మిగ్రేషన్ లాయర్లతో విద్యార్థులను బయటకు తీసుకువచ్చే ప్రక్రియను పూర్తి చేస్తున్నాం. అరెస్టయిన విద్యార్థుల గురించి తెలుసుకోవాలనుకునే వాళ్లు https://.locator.ice.gov సంప్రదించొచ్చు.

–జీ రాఘవరెడ్డి, ఏ రామిరెడ్డి (నాటా ప్రతినిధులు)

పౌరసత్వ బిల్లుకు మద్దతివ్వండి

- తృణమూల్ కాంగ్రెస్‌ను కోరిన ప్రధాని మోదీ
- మతహింసకు గురైన వారికి ఈ బిల్లుతో న్యాయం జరుగుతుందని వెల్లడి
- బీజేపీకి ప్రజలు మద్దతివ్వడంతో మమత ఆందోళన చెందుతున్నారని విమర్శ





పశ్చిమ బెంగాల్‌లోని ఠాకూర్ నగర్‌లో జరిగిన సభలో అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ. పక్క చిత్రంలో సభలో తొక్కిసలాట దృశ్యం

ఠాకూర్‌నగర్, ఫిబ్రవరి 2: వివాదస్పద పౌరసత్వ (సవరణ) బిల్లుపై ఈశాన్య రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తుతున్నప్పటికీ, ప్రధాని నరేంద్రమోదీ ఆ బిల్లు తీసుకురావాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. మతహింసకు గురైన వారికి ఈ బిల్లు ద్వారా న్యాయం, గౌరవం చేకూరుతాయని తెలిపారు. శనివారం పశ్చిమ బెంగాల్‌లో పర్యటించిన ఆయన అధికార తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ)పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బీజేపీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని టీఎంసీ కార్యకర్తలు దాడికి దిగుతున్నారని ఆరోపించారు. బీజేపీ పట్ల ప్రజలు ప్రేమాభిమానాలు చూపుతుండడంతో టీఎంసీ అధినేత్రి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆందోళనకు గురవుతున్నారని విమర్శించారు. 'దేశాన్ని ముక్కలు చేసి బ్రిటిషర్లు మనకు స్వాతంత్ర్యం ప్రకటించారు. ప్రజలు తమకు నచ్చిన దేశంలో జీవించొచ్చని భావించారు. అయితే ఆయా దేశాలో మత విద్వేషం కారణంగా వారు హింసకు గురయ్యారు. వారికి మరో మార్గం కనిపించక భారత్‌కు వచ్చారు. వారికి న్యాయం, గౌరవం కల్పించలేమా? పార్లమెంటులో బిల్లు ఆమోదానికి మద్దతివ్వాలని టీఎంసీని కోరుతున్నా' అని ప్రధాని అన్నారు. ఠాకూర్ నగర్‌లో మతువా మహాసంఘ్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మతువా సామాజిక వర్గ ప్రజలు 1950 ప్రారంభంలో తూర్పు పాకిస్థాన్ నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. పశ్చిమ బెంగాల్‌లో సుమారు 30 లక్షల జనాభా ఉన్న ఐదు లోక్‌సభ స్థానాల ఫలితాలపై ప్రభావం చూపగలరు. అయితే వీరిలో చాలా మంది తమకు ఇప్పటికీ పౌరసత్వం లేదని చెబుతున్నారు. వీరిని తమవైపు తిప్పుకునేందుకు బీజేపీ ఈ కార్యక్రమం చేపట్టింది.

సభలో తొక్కిసలాట
ప్రధాని ప్రసంగిస్తున్న సమయంలో ఆయనను దగ్గరి నుంచి చూసేందుకు పలువురు కార్యకర్తలు ముందుకు తోసుకురావడంతో సభలో తొక్కిసలాట జరిగింది. దీంతో పలువురు గాయపడ్డారు. వీరికి దవాఖానకు తరలించారు. ఈ ఘటన నేపథ్యంలో ప్రధాని తన ప్రసంగాన్ని 14 నిమిషాల్లోనే ముగించారు.

సాధ్యమైనంత త్వరగా మందిరం నిర్మాణం కావాలి: అమిత్ షా

డెహ్రాడూన్: అయోధ్యలో సాధ్యమైనంత త్వరగా రామ మందిరాన్ని నిర్మించాలని బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షా అభిప్రాయ పడ్డారు. దమ్ముంటే రామ మందిర నిర్మాణంపై కాంగ్రెస్ పార్టీ తన వైఖరేమిటో బయట పెట్టాలని సవాల్ చేశారు. డెహ్రాడూన్‌లో శనివారం జరిగిన బీజేపీ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో అమిత్ షా మాట్లాడుతూ ఉత్తరాఖండ్‌లో లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. 'కుంభమేళాలో రామ మందిర నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేయడం సహజ పరిణామం' అని పేర్కొన్నారు. రామ మందిరంపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తన వైఖరేమిటో నిర్వచించాలని చెప్పారు.



ఢిల్లీలో ఆప్‌తో పొత్తు ఉండదు: కాంగ్రెస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: దేశ రాజధాని ఢిల్లీలో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కలిసి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు లేవు. వచ్చే ఎన్నికల్లో ఢిల్లీలోని మొత్తం ఏడు లోక్‌సభ స్థానాల్లో తాము పోటీ చేయనున్నామని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షీలాదీక్షిత్ తెలిపారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను ఇప్పటికే మొదలుపెట్టామని చెప్పారు. పాత వారికి, కొత్త వారికి, మాజీ ఎమ్మెల్యేలకు అవకాశం ఇవ్వనున్నామని, అయితే గెలుపు గుర్రాలనే ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

మహిళా మావోయిస్టు మృతి

కొత్తగూడెం క్రైం: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో శనివారం మావోయిస్టులకు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మహిళా మావోయిస్టు మరణించారు. మరో మహిళా నక్సల్‌కు తీవ్రగాయాలయ్యాయి. సుక్మ జిల్లా పూసవాడ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు గాలింపు చేపడుతుండగా ఈ కాల్పులు చోటుచేసుకున్నాయి.

నమస్తే తెలంగాణ
కరీంనగర్
ఆదివారం, 3 ఫిబ్రవరి 2019
WWW.NTNEWS.COM

కట్టా మీఠా

బొంక నేర్చిన మేళం


లోక్‌సభ ఎన్నికల సమయం సమీపించే కొద్దీ మళ్లీ ఒక కుటిల ప్రచారయుద్ధాన్ని నడిపించేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు బ్యాండుమేళం సిద్ధమవుతున్నది. అందుకు ఇప్పటినుంచే సన్నాహాలు మొదలుపెట్టింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సర్వేల పేరిట సకల అబద్ధాలను కుమ్మరించి బొక్కబోర్లా పడ్డ లగడపాటి రాజగోపాల్ ఇప్పుడు మళ్లీ తెరపైకి వస్తున్నారు. ఫలితాలు వచ్చినవెంటనే రాజగోపాల్ మీడియాతో మాట్లాడుతాడని, సర్వేలు తలకిందులైనందుకు క్షమాపణ లు కోరుతారని ఆశించినవారికి ఆయన అసలు స్వభావమేమిటో అర్థమైంది. రెండురోజుల క్రితం ఒక పత్రికాధిపతితో చంద్రబాబు ను కలిసి దాదాపు రెండుగంటల పాటు చర్చలు జరిపిన పిమ్మట ఢిల్లీ వెళ్లి చిన్నగా తనపై పడిన దొంగ సర్వేల మకిలిని కడిగేసుకుని, ఇంకా తనే దొ గొప్ప సర్వేయర్ను అని చెప్పుకునేందుకు, చరిత్రలో తనసర్వేలు ఎప్పుడూ తప్పు కాలేదని బొంకేందుకు, తెలంగాణ ఎన్నికల ఫలితాల పై ఏవేవో అనుమానాలను రేకెత్తించేందుకు చాలా సెకలు పడ్డారు. పోలైన ఓట్ల జాబితా సకాలంలో అందలేదని, అందులో ఏదో పెద్ద మతలబు ఉందని చెప్పడానికి ప్రయత్నించాడు. నిజానికి రాజగోపాల్ ఎంత అజ్ఞానో ఈ ఒక్క మాటతోనే తేలిపోయింది. పోలైన ఓట్ల వివరాలు ప్రాథమికంగా ఒకసారి, తుది వివరాలు మరోసారి ఇవ్వడం అన్నది ప్రతి ఎన్నికలోనూ జరుగుతూ వచ్చిందే. ప్రాథమికంగా చెప్పిన శాతాలకు, తుది శాతాలకు తేడా ఉండటం అన్నది ఇప్పటివరకు జరిగిన అన్ని ఎన్నికల్లోనూ అందరికీ తెలిసిన విషయమే. పూర్వం జరిగిన ఎన్నికలనాటి పత్రికలను తిరిగేస్తే ఈ వాస్తవం తెలుస్తుంది. అసెంబ్లీ ఎన్నికల నాటికి ఇప్పుడు స్థానిక ఎన్నికల నాటికి పరిస్థితిలో తేడా వచ్చిందని, ప్రతిపక్షాలకు బాగా సర్పంచులు వచ్చాయని, అదేదో తన సర్వేకు అనుకూలంగా ఉన్నాయన్న భావన కలిగించేందుకు మరో పచ్చి అబద్ధాన్ని నిస్సిగ్గుగా ప్రకటించాడు. పంచాయతీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ మునుపెన్నడూ లేని రీతిలో 67.7 శాతం గ్రామాలను కైవసం చేసుకున్నది. మొత్తం ఎన్నికలు జరిగిన 12,711 పంచాయతీల్లో 8,606 పంచాయతీలను గెల్చుకున్నది. అయితే రాజగోపాల్‌కు ఈ విషయాలు తెలియక కాదు. తెలిసీ బొంకడం బరితెగించినవాళ్ల లక్షణం. తాను ఉద్దేశపూర్వకంగా చేసిన పాపానికి ఇప్పుడు సాకులు వెతుకుతున్నాడు. తానేదో కరెక్టుగా సర్వే చేశానని ఎక్కడో ఏదో జరిగిందని, ఎన్నికల తర్వాత ఆ విషయాలు మాట్లాడుతానని చెప్పి, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఒక కొత్త ఎంట్రీని సంపాదించే ప్రయత్నం చేస్తున్నాడు. తెలంగాణలో ఆడిన నాటకాన్నే ఆంధ్రలో ఆడటానికి బాబుతో కలిసి రంగం సిద్ధం చేస్తున్నాడని ఆ అర్ధరాత్రి మీటింగు, ఆ మరుసటిరోజే ఢిల్లీలో మీడియాతో మాటలు తెలియజేస్తున్నాయి. చంద్రబాబుకే కాదు, ఆయన బ్యాండు మేళానికంతటికీ తెలంగాణ ఎన్నికలు ఒక ఆటస్థలం. ఆంధ్ర ఎన్నికలు జీవన్మరణ సమస్య. అందుకే తెలంగాణలో చేసిన తప్పుడు ప్రచారాలకు వంద రెట్లు ప్రచారాలు అక్కడ చేస్తారని వేరే చెప్పనవసరం లేదు. దానికి ఇప్పటినుంచే సన్నాహాలు.

'సర్వే తప్పయితే ఒప్పుకుంటా.. నాకు సిగ్గు లేదు' అని యథాలాపంగా రాజగోపాల్ అన్నారు. ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా రాజగోపాల్‌కు, చంద్రబాబు బృందానికి సిగ్గూ ఎగ్గూ లేదని రాజకీయాల్లో వారి అష్టవంకరలు, విపరీత పోడకలు చాలాసార్లు రుజువు చేశాయి. తప్పును ఒప్పుగా, ఒప్పును తప్పుగా, భ్రమను బ్రహ్మరాక్షసిగా, బ్రహ్మరాక్షసిని ఉత్త భ్రమగా, భయంకర వ్యవస్థాగత అవినీతిని, మహోద్ధారక కార్యంగా, ఉద్ధారక కార్యాలను అవినీతి చర్యలుగా, వెన్నుపోటును ప్రజాస్వామ్యంగా, ప్రజాస్వామ్యాన్ని వెన్నుపోటుగా చిత్రించగల చిత్రాంగులు వీరు. వీరిగురించి ఇలా ఎన్ని అలంకారాల్లోనైనా వర్ణించవచ్చు. చంద్రబాబునాయుడు కానీ, ఆయనను మోసిన మీడియా కానీ, ఇతర వ్యవస్థలు కానీ ఏ రోజూ తాము చేసిన తప్పులకు విచారం ప్రకటించిన సందర్భం లేదు. ఎన్టీఆర్‌ను అతి దారుణంగా వెన్నుపోటు పొడిచి చంపినవారు కనీసం తాము చేసింది తప్పని ఇంతవరకు అధికారికంగా ప్రకటించుకున్నది లేదు. బుకాయింపులతో, ప్రచారాలతో, వక్రీకరణలతో, అబద్ధాలతో బతికేయడం ఆ బృందానికి అలవాటైంది. ఎన్టీఆర్‌పై చంద్రబాబు కుట్రచేసిన రోజున తండ్రిని కాదని బావకు మద్దతుగా వెళ్లిన ఆయన తనయులు ఒక్కసారి కూడా 'నాన్నా మళ్లీ ఎప్పుడు పుడతావు' అని తప్ప 'నాన్నా మమ్మల్ని క్షమించు' అని ప్రకటన ఇవ్వలేదు. మళ్లీ ఎప్పుడు పుడతావు అన్న ప్రకటన చూసినప్పుడల్లా 1995 ఆగస్టు నుంచి 1996 జనవరి 18 దాకా జరిగిన పరిణామాలను చూసినవారు వికలమవుతుంటారు. ఎందుకూ మళ్లీ చంపడానికా అని ఆవేదనగా నిందిస్తుంటారు. చంద్రబాబు నాయుడైతే కొంతకాలం ఆయన విగ్రహాలు, ఫొటోలు లేకుండా చేసి, అంతా తానే అని నడిపించుకోవాలని చూశాడు. తన ముఖానికి విలువ లేదని, ఎన్టీఆర్ పేరు చెప్పుకుంటేనే బతుకు ఉంటుందని గ్రహించిన తర్వాత మళ్లీ విగ్రహ పూజ మొదలుపెట్టారు. చంద్రబాబు ఆయన బృందాన్ని చూసి ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుంది. అందుకే ఆయన ఇప్పుడు కేంద్రంపై యుద్ధం చేస్తున్నానంటే ఇదంతా నాటకమని జనానికి అర్థమైపోతున్నది. నాలుగేండ్లు అంటకాగి ఇప్పుడు ఏదో పోరాటయోధునిలా పోజు పెడితే జనం ఎలా నమ్ముతారు?

ఎంత కష్టపడినా చంద్రబాబుకు రావలసినంత గొప్పపేరు రావడం లేదని, ఆయనను అక్కడి మంత్రులు సరిగ్గా పొగడటం లేదని, తెలంగాణలో మంత్రులు, పార్టీ నాయకులంతా పొగడటం వల్లనే కేసీఆర్ విజయాలు సాధించారని చంద్రబాబు చేత, చంద్రబాబు యొక్క, చంద్రబాబు కొరకు శ్రమించే ఒక సీనియర్ జర్నలిస్టు ఇటీవల సూత్రీకరణ చేశారు. పొగిడించుకొని పెద్దవాళ్లయిన నాయకులు చరిత్రలో లేరు. తమ పనుల వల్ల, తమ దక్షత వల్ల, సమర్థత వల్ల నాయకులైన వారే చరిత్రలో నిలిచారు. వందలాది జాకీలు, క్రేన్లు పెట్టి ఆకాశానికి ఎత్తించుకున్నవాళ్లు ఏనాడైనా చంద్రబాబులాగే ఉంటారు. కేసీఆర్ పొగడ్తల వల్ల ఎదుగలేదు. ఆయన రాజకీయ దార్శనిక దృష్టి, ఆయన పంతంగా అమలుచేసిన పథకాలు, చేపట్టిన ప్రాజెక్టులు ఆయనకు చరిత్రలో ఒక గొప్ప స్థానాన్ని సంపాదించిపెట్టాయి. కేసీఆర్ స్వయం సాధకుడు. స్వయం ప్రకాశం కలిగిన నేత. పార్టీ, ఉద్యమం, తెలంగాణ సాధన, ప్రభుత్వ సాధన అన్నీ ఆయన స్వయం కృషి ఫలితాలు. ప్రేరక శక్తులు, కారక శక్తులు ఉండవని కాదు. కానీ ఆయనే అందరికీ లీడర్. చంద్రబాబుకు ఆయన స్వయంగా సాధించింది ఒకటి చెప్పండి. మామ పెట్టిన పార్టీని లాక్కున్నాడు. ఆ తర్వాత జరిగిన ప్రతి ఎన్నికలోనూ కొత్త పిల్లిమొగ్గ వేసి ఏదో ఒక పార్టీని కలుపుకొని ఎన్నికల్లో పోటీ చేస్తూ వచ్చాడు. 1996, 98లలో యునైటెడ్ ఫ్రంట్. 1999లో రాత్రికి రాత్రి వాజపేయి ఫ్రంట్‌లో. 2009లో కేసీఆర్‌తో ఫ్రంట్. 2014లో బీజేపీ-పవన్‌కల్యాణ్‌తో ఫ్రంట్. ఆయన పరాన్నజీవి. స్వయం ప్రకాశం లేని నేత. మ్యానిపులేటర్. గాలివాటంగా ప్రయాణం చేయడం ఆయనకు అలవాటు. అందులో ఎటువంటి విలువలు, సూత్రబద్ధత, నిజాయితీ ఏవీ ఉండవు. తన లాభం, తన మనుగడ. వాడు మనకు పనికొస్తాడా లేదా. మనం నిలవడానికి నిచ్చెనగా ఉపయోగపడుతాడా లేదా.. అంతే.. అంత రాజకీయ అవకాశవాది. అటువంటి నాయకుడిని ఇప్పుడు ఒక మహాకీర్తి కిరీటం పెట్టి శంకుచక్ర గదాయుధాలు ధరింపజేసి ఆంధ్ర ప్రజల ముందు మరోసారి మహా నాయకునిగా నిలబెట్టాలని రాజగోపాల్, బాబు మీడియా ప్రయత్నిస్తున్నది.

ఇప్పుడు చంద్రబాబు చరిత్రను చెరపలేరు. ఆయన గీతను పెద్దగా చేయలేరు కాబట్టి అవతలివారి గీతలను చిన్నగా చేయాలి. వైసీపీ నేత జగన్‌ను, జనసేన నేత పవన్‌కల్యాణ్‌ను తక్కువచేసి చూపాలి. వారి ప్రతిష్ఠను దెబ్బతీయాలి. ముగ్గురు మోదీల ప్రచారం అటువంటిదే. నరేంద్ర మోదీతో వైసీపీ-టీఆర్‌ఎస్‌లకు లేని సంబంధాలను అంటగట్టి ప్రచారం చేయాలి. ఆంధ్రలో సెంటిమెంటును రెచ్చగొట్టాలి. తెలంగాణలో చంద్రబాబుకు వ్యతిరేకంగా కేసీఆర్ మాట్లాడినట్టు అక్కడ చంద్రబాబు బ్యాండుమేళం అంతా కేసీఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడాలి. కానీ తెలంగాణకు ఆంధ్రకు తేడా ఉన్నదన్న సంగతి ఈ మేళానికి అర్థం కావడంలేదు. తెలంగాణలో చంద్రబాబు ప్రవేశించక ముందునుంచే కేసీఆర్‌కు అనుకూల పవనాలు ఉన్నాయి. ఆయన పాలనకు ప్రజలు మరోసారి ఓటేయడానికి సిద్ధంగా ఉన్నారని కనీసం నాలుగైదు జాతీయ సర్వేలు వెల్లడించాయి. చంద్రబాబును తిట్టి కేసీఆర్ గెలిచారనే ఒక అల్పపు సూత్రీకరణతో ఇప్పుడు ఆంధ్రలో కూడా అదే సూత్రాన్ని అమలు చేయాలని చూస్తున్నారు. చంద్రబాబుకు అనుకూల ఓటు లేదని, ఆయన ఓడిపోబోతున్నారని ఇప్పటివరకు వచ్చిన అన్ని సర్వేలూ సూచిస్తున్నాయి. ఆయన సెట్టింగులూ, షూటింగులూ, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు తప్ప నిర్మాణాత్మకంగా సాధించిందేమీ లేదని అక్కడి ప్రజల్లో ఒక బలమైన అభిప్రాయం ఏర్పడింది. పైగా రకరకాల విపరీత రాజకీయ కెలుకుళ్లతో కొన్ని బలమైన సామాజిక వర్గాలను దూరం చేసుకున్నారు. ఆయా సామాజిక వర్గాల్లో మరింత విస్మయం, పంతంతో కూడిన వ్యతిరేకత పెంచుకునే దిశగా విపరీతమైన రాజకీయ కొనుగోళ్లకు దిగుతున్నారు. ఎవరికి ఎంతయినా డబ్బు ఇచ్చి పార్టీలోకి తీసుకురావాలని ఆయన ప్రయత్నిస్తున్నారు. వంగవీటి రాధాకృష్ణ టీడీపీ నాయకులతో చర్చలు జరుపడమే గాక తన తండ్రి హత్య కేసుకు టీడీపీకి సంబంధం లేదని ప్రకటించడం రంగా అభిమానుల్లో ఆగ్రహావేశాలు జనింపజేసింది. పవన్‌కల్యాణ్‌పై ఒకవైపు అత్యంత నీచమైన ప్రచారం సాగిస్తూ మరోవైపు ఆయనను దారికి తీసుకొచ్చుకోవడానికి చేయని ప్రయత్నం లేదు. చంద్రబాబు ఎంతో ప్రయాసపడి ఇతర పార్టీల నాయకులను తెచ్చుకుంటున్నారు. చాలామంది టీడీపీ, ఇతర పార్టీల నేతలు ఎటువంటి ప్రయత్నం చేయకుండానే వైసీపీలో చేరుతున్నారు. బాబుకు అనుకూల పవనాలు లేవు. అనుకూల రాజకీయ ఫిరాయింపులు లేవు. ఆయనకున్నదల్లా అనుకూల మీడియా. అబద్ధాల ప్రచార యంత్రాంగం. ఇవి ఏవీ సాధించబోవు అనడానికి తెలంగాణ ఎన్నికల ఫలితాలే నిదర్శనం.

> ఎంత కష్టపడినా చంద్రబాబుకు రావలసినంత గొప్పపేరు రావడం లేదని, ఆయనను అక్కడి మంత్రులు సరిగ్గా పొగడటం లేదని, తెలంగాణలో మంత్రులు, పార్టీ నాయకులంతా పొగడటం వల్లనే కేసీఆర్ విజయాలు సాధించారని చంద్రబాబు చేత, చంద్రబాబు యొక్క, చంద్రబాబు కొరకు శ్రమించే ఒక సీనియర్ జర్నలిస్టు ఇటీవల సూత్రీకరణ చేశారు. పొగిడించుకొని పెద్దవాళ్లయిన నాయకులు చరిత్రలో లేరు. తమ పనుల వల్ల, తమ దక్షత వల్ల, సమర్థత వల్ల నాయకులైన వారే చరిత్రలో నిలిచారు. వందలాది జాకీలు, క్రేన్లు పెట్టి ఆకాశానికి ఎత్తించుకున్నవాళ్లు ఏనాడైనా చంద్రబాబులాగే ఉంటారు.



కట్టా శేఖర్‌రెడ్డి
kattashekar@gmail.com

జైన బసది బాసర

పరిశోధన



శ్రీరామోజు హరగోపాల్

బాసర ప్రస్తుతం నిర్మల్ జిల్లా (ఒకప్పుడు ఆదిలాబాద్ జిల్లా)లో ఉన్నది. బాసర నిజానికి ఒక ఊరు కాదు. ఐదు గ్రామాల సముదాయం. బాసర, రేణుకాపురం, మహదాపురం, రత్నాపురం, మయిలాపురం. ప్రస్తుతం బాసర, మయిలాపురం మాత్రమే మిగిలి ఉన్నాయి. మిగిలిన ఊర్లు రెవెన్యూ రికార్డుల్లో మాత్రమే ఉన్నాయి.

బాసరలో జ్ఞాన సరస్వతిని వ్యాసుడు ప్రతిష్ఠించినట్లు చెప్పబడుతున్నది. కానీ, ఈ ప్రాంతాన్ని ఒకప్పుడు పాలించిన కరికాళచోళ రాజైన రెండవ బిజ్జలదేవుడే ఇక్కడ ఆలయాలను నిర్మించినాడని చరిత్రకారుల అభిప్రాయం. తాను జైనుడు. అతని బావ వీరశైవప్రవక్త బసవేశ్వరుడు. వారికాలంలో వీరశైవ ప్రాబల్యం వల్ల జరిగిన జైన శైవాల సంఘర్షణలకు దర్పణంగా ఉన్నది బాసర. బాసర జ్ఞాన సరస్వతి దేవాలయానికి వెనుకగా చిన్నగుట్ట మీద పాప హరేశ్వరాలయంగా పిలువబడే పురాతన శివాలయముంది. ఈ దేవాలయావరణలోని స్తంభశిలలు, శాసన స్తంభాలు, శిల్పాలన్నీ వేటికవే ప్రత్యేకమైనవి. రాష్ట్రకూటుల కాలం నుంచి వేములవాడ చాళుక్యుల వరకు వివిధ సందర్భాల్లో ప్రతిష్ఠించిన దేవాలయాలు, కూల్చబడిన, మార్చబడిన జైనబసదులు, వీర శిలలు, సతి శిలలు, శాసనాలు, శిథిలాలు ఒకచోట అగుపిస్తున్నాయి.

శిథిలాలయం: రాష్ట్ర కూటుల నుంచి (అంతకుముందు కూడా) కాకతీయుల దాక లలాటబింబంగా చెక్కబడిన గజలక్ష్మి ఇక్కడి శిథిల దేవాలయపు ద్వారం మీద ఉన్నది. జైనులైన రాష్ట్రకూటులు తాము నిర్మించిన గుడుల మీద, శాసనాల మీద తామరపూల రేకులను చెక్కించడం ఒక ప్రత్యేకశైలి. అదే శైలి ఈ దేవాలయం ఉత్తరాశి మీద కనిపిస్తుంది. సాధారణంగా జైన బసదుల ముందర ఉండే శంఖలతాతోరణం, ఏనుగులున్న చంద్రశిల ఇక్కడ కనిపిస్తున్నది. ఏక, త్రి.. దేవతాధిష్టాన పీఠాలు ఖాళీగా కనిపిస్తున్నాయి. రెండు చేతులున్న జైన గణపతి బయట కనిపిస్తున్నాడు. జైన నిశీథులు కూడా ఇక్కడ కనిపించాయి. జైన గురు పరంపరను తెలిపే జైన స్తంభమొకటి ఉన్నది. రాష్ట్ర కూటుల కాలం నాటి రెండు గణపతి విగ్రహాలు అక్కడున్నాయి.

శైవం: రాష్ట్ర కూటుల పిదప చాళుక్యులు రాజ్యపాలనకు వచ్చే సంధికాలంలో వీరశైవం విస్తరించింది. వీరశైవులు జైనులనెందరినో పట్టి పరిమార్చినట్టు శాసనాలు, గ్రంథాలు చెబు తున్నాయి. జైనబసదులెన్నో కూల్చబడ్డాయి లేదా శైవాలయాలుగా మార్చబడ్డాయి. ఇక్కడ కూడా అట్లాంటి సాక్ష్యాలు మనకు లభిస్తున్నాయి. ఎక్కడెక్కడో బయటపడి ఉన్న విగ్రహాలను ఈ పాప హరేశ్వరుని ప్రాంగణంలోనికి చేర్చినట్టున్నారు. శైవానికి సంబంధించిన భైరవుడు, చాముండి దేవతలు, రెండు సమ లింగాలు (బ్రహ్మ, విష్ణు, రుద్ర భాగాలతో), నాగశిల్పాలు, పాత గర్భాలయానికి పెంచి కట్టిన రంగ, ముఖ మంటపాలు అగుపిస్తున్నాయి. దూరంగా దీపస్తంభం ఒకటి ఉన్నది.

వీరశిలలు: స్తంభం అడుగున ఒక కోడె దూడ, పైన చేతులు జోడించి కూర్చున్న భక్తురాలు, వీటిపైన శివలింగం, శివార్చన చేస్తున్న శైవ గురువు కనిపిస్తున్న మూడంతస్తుల శిల్పాలున్న ఒక వీర శిలాస్తంభం కనిపిస్తున్నది. మరొక స్తంభం కూడా శాసనం, మూడంతస్తుల శిల్పాలున్నదే. ఈ స్తంభం మీద అడుగున ఇద్దరు ఖడ్గధారులు కుక్కతో పాటు కనిపిస్తున్నారు. మూడవ మనిషి ఏదో ఆయుధంతో కనిపిస్తున్నాడు. వీరికి పక్కన కర్రకు తలకిందులుగా వేలాడదీయబడిన మరొక మనిషి ఉన్నాడు. శాసనంలో ఏమున్నదో తెలిస్తే ఈ శిల్పానికి అర్థం చెప్పవచ్చు. కానీ, గద్వాలకు సమీపంలోని పూడూరులో జైనులను వధిస్తున్న శిల్పాలున్నాయి. శాసనాలున్నాయి. ఇక్కడ శిల్పాలకు వాటికి పోలికలు కనిపిస్తున్నాయి. ఇందులో వధింపబడుతున్నది జైనుడే కావచ్చు. రెండో అంతస్తులో ఒక భక్తుడు ఇద్దరు పరిచారకులు (అప్సరసలు)న్నారు. పై అంతస్తులో లింగం ముందర అర్చన చేస్తున్నట్టున్న భక్తుడు, లింగం వెనుక లగుడధారి (లకులీశుడు?) కనిపిస్తున్నాడు. గుడి మంటపంలోని ఒక స్తంభంపై శివభక్తుడైన ఒకరిని చెక్కారు.

శాసనాలు: అక్కడి స్తంభాల మీద చెక్కి న శాసనాల్లో 9వ శతాబ్దపు తెలుగు లిపి లో 1.శ్రీ వైశ్య కులతిలక.... పయ సెట్టి, 2.స్వస్తిశ్రీ రేచయ్య కొట్టద్రమ్మ నూరు, 3.స్వస్తిశ్రీ బిజ్జకప్పియ్య కొట్టద్రమ్మ నూరు, (4.లిపి స్పష్టంగా కనిపించడం లేదు) అని ఉన్నది. బినోలలో బాహుబలి అని అనుకుంటున్న శిల్పం బాహుబలిది కాదు, జైన తీర్థంకరుడు శాంతినాథునిది. శిల్ప పాద పీఠం మీద ఒక వైశ్యకులతిలకుడు' చేయించిన శాంతినాథుని శిల్పమని రాసున్నది. ఇక్కడ కూడా ఒక శాసనంలో వైశ్యకులతిలక అనే మాట ఉన్నది. గోదావరి అవతల బినోల, ఇవతల బాసరలలోని ఈ శాసనలిపులు ఒకే కాలానికి చెందినవి.

సతి శిలలు: అన్నింటికన్నా ప్రత్యేకమైనవి ఇక్కడ కనిపిస్తు న్న రెండు సతి శిలలు. తెలంగాణలో అరుదుగా కనిపించేవి సతి శిలలు. భర్తలు వీర మరణం పొందినపుడు సతీసహగమనం చేసిన స్త్రీలకు, ఆత్మాహుతి చేసుకున్న స్త్రీలకు సతి శిలలను నిలుపుతుంటారు. ఈ సతి శిలలను నిలిపే ఆచారం మనకు కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాతులలో ఎక్కువగా కనిపిస్తుంది.


మహిషాసురమర్దిని: ఇక్కడ కనిపించిన అన్ని శిల్పాల కన్న మిన్న అయిన శిల్పం రాతి గుండుకు చెక్కిన మహిషాసురమర్దిని విగ్రహం. చతుర్భుజియైన ఈ దేవతకు వెనుక కుడిచేతిలో గంట, ఎడమ చేతిలో శంఖు ఉన్నాయి. ముందరి రెండు చేతుల్లో కుడిచేతిలోని శూలంతో మహిషాసురుని వధిస్తున్నట్టుంది. ఎడమచేయి దున్నపోతు రూపంలో ఉన్న మహిషాసురుని తోకపట్టి పైకిలాగినట్టుంది. ఎడమకాలితో మహిషం తలను తొక్కిపట్టినట్లున్నది. ఇటువంటి శిల్పం చాలా అరుదైనటువంటిది. తాంత్రిక పూజలు చేసేవారు ఆరాధించే రూపమిది. సాధారణమైన మహిషాసురమర్దిని శిల్పానికి ఈ విగ్రహం భిన్నంగా ఉన్నది.

బాసరకు వ్యాసపురి అని పేరుందని, వ్యాసుడిక్కడ తపస్సు చేసుకుంటూ నివసించినందువల్ల ఆ పేరు వచ్చిందని జనాభిప్రాయం. అయితే జైన బసదులిక్కడ ఎక్కువగా ఉండటం వల్ల బసది అనే పిలుపు బాసర' కావడానికి కూడా అవకాశం ఉన్నది.

ఈ శిల్పాలన్నింటిని తన క్షేత్రపర్యటనలో చూసింది, ఫొటోలు తీసింది మిత్రులు బాసరవాసి రామ్మోహన్, మాదారపు రామయ్య, భూపాలపల్లి గారలు. వారికి అభినందనలు.


(వ్యాసకర్త: ప్రముఖ చరిత్ర పరిశోధకులు)

> బాసరకు వ్యాసపురి అని పేరుందని, వ్యాసుడిక్కడ తపస్సు చేసుకుంటూ నివసించినందువల్ల ఆ పేరు వచ్చిందని జనాభిప్రాయం. అయితే జైన బసదులిక్కడ ఎక్కువగా ఉండటం వల్ల బసది అనే పిలుపు బాసర' కావడానికి కూడా అవకాశం ఉన్నది.




ఇది ఓట్లేస్తే డబ్బులిచ్చే బడ్జెట్. ఎన్నికల్లో అభ్యర్థి ఓటుకు డబ్బులు ఇవ్వడం చట్టవిరుద్ధం. కానీ అదేపని ప్రభుత్వం చక్కగా చెయ్యవచ్చు. ఇటువంటి మాయలకు ప్రజలు పడిపోరు.

యశ్వంత్ సిన్హా



చాలామంది నాయకులు కుల మద్దతుపై ఆధారపడుతున్నప్పుడు, వర్తమాన భారతంలో లౌకికవాద (ఉదార) నాయకులు ఏమి చేయాలె? వారు ఎన్నికల్లో విఫలం కావలసిందే లేదా పరోక్షంగా కులాలపై ఆధారపడే కులరహిత రాజకీయాలను ఆశ్రయించాల్సిందే.

సల్మాన్ ఖుర్షిద్



నరేంద్ర మోదీ-అమిత్ షా ఎన్ని ప్రసంగాలు చేసినా సరే, బెంగాల్ మత రాజకీయాలకు లోనుకాదు. ప్రజలు గతంలో మాదిరిగానే, బీజేపీని తిరస్కరిస్తారు.

అభిషేక్ సింఘ్వీ



మోదీ హయాంలో పెద్దనోట్లు రద్దయినప్పుడే, అత్యంత వృద్ధి (8.2 శాతం) కనబడింది. మరో దఫా నోట్ల రద్దు జరుపుదాం. ఈసారి వంద రూపాయల నోటును రద్దు చేయాలె.

పి.చిదంబరం

ఆర్థికసంఘం తీరు మారేనా?

విశ్లేషణ



గటిక విజయ్‌కుమార్

స్వతంత్ర భారతదేశం మరో ఆర్థిక సంఘం సిఫార్సుల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నది. పేద రాష్ర్టాలను ఆదుకోవాలనే సూత్రంతో, ప్రగతిపథాన దూసుకుపోతున్న రాష్ర్టాలను నిరుత్సాహపరుస్తున్నారనే విమర్శల నడుమ 15వ ఆర్థిక సంఘం తన కసరత్తును కొనసాగిస్తున్నది. పేద రాష్ర్టాలను ఆదుకుంటూనే, దేశానికి గరిష్ఠ ఆదాయం సమకూరుస్తున్న రాష్ర్టాలను ప్రోత్సహించే ఉభయతారక విధానం కోసం తెలంగాణ సహా చాలా రాష్ర్టాలు ఎదురుచూస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇంతకుముందటి ఆర్థిక సంఘాలతో పోలిస్తే 15వ ఆర్థిక సంఘం పని కాస్త క్లిష్టంగానే సాగుతున్నది. 2020 నుంచి 15వ ఆర్థిక సంఘం సిఫార్సులే అమలుకానున్నాయి. రాబోయే ఐదేండ్ల పాటు రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను, ఆర్థిక ప్రణాళికలను గణనీయంగా ప్రభావితం చేయగలిగే శక్తి ఈ సిఫార్సులకు ఉంటుంది కనుక, రాష్ర్టాలు అప్రమత్తమవుతున్నాయి. తమ డిమాండ్లను ఆర్థికసంఘం ముందు పెడుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ సారి తమకు జరుగుతున్న నష్టంపై కేంద్ర ఆర్థిక సంఘాన్ని గట్టిగానే అడుగడానికి సిద్ధపడుతున్నది.

కేంద్రానికి పన్నుల ద్వారా సమకూరే ఆదాయంలో ఏ రాష్ర్టానికి ఎంత వాటా ఇవ్వాలనే కీలక అంశాన్ని ఆర్థిక సంఘం తేలుస్తుంది. ఏ ప్రాతిపదికన ఈ వాటాలు తేల్చాలనే విషయమై ఒక్కో రాష్ట్రం ఒక్కో విధమైన ప్రతిపాదనలు చేస్తున్నది. అటు ఆర్థిక సంఘాలు కూడా ఒక్కోసారి ఒక్కో ప్రాతిపదికను ఎంచుకొని, సిఫార్సులు చేస్తున్నాయి. ప్రస్తుత 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు కేంద్రం రాష్ర్టాలకు పన్నుల్లో వాటా ఇస్తున్నది. కేంద్రం నేరుగా వసూలు చేసే పన్నుల ద్వారా సమకూరే ఆదాయంలో గతంలో 32 శాతం నిధులను రాష్ర్టాలకు ఇచ్చేవారు. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు రాష్ర్టాల వాటాను 42 శాతానికి పెంచారు. జనాభా, తలసరి ఆదాయం, అటవీప్రాంతం, భౌగోళిక విస్తీర్ణం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ఏ రాష్ర్టానికి ఎంత శాతం నిధులు ఇవ్వాలనే విషయంలో ఆర్థిక సంఘం సిఫార్సులు చేస్తున్నది. అయితే ఆర్థిక సంఘం తీసుకునే ప్రాతిపదికలు అశాస్త్రీయమనే వాదనలున్నాయి. 2011 జనాభా లెక్కలను తీసుకుంటే, జనాభా నియంత్రణ పాటిస్తున్న రాష్ర్టాలకు అన్యాయం జరుగుతున్నదనే వాదనలున్నాయి. ముఖ్యంగా దక్షిణాది రాష్ర్టాలు కుటుంబ నియంత్రణను విజయవంతంగా అమలుచేశాయి. దానివల్ల జనాభా వృద్ధిరేటు గణనీయంగా తగ్గింది. జనాభా ప్రకారం నిధులు కేటాయిస్తే, కుటుంబ నియంత్రణ పాటించిన రాష్ర్టాలకు అన్యాయం జరుగుతుంది. దీంతో 1971 జనాభా లెక్కలను కూడా పరిగణనలోకి తీసుకోవాలనే ప్రతిపాదన వచ్చింది. దీంతో 14వ ఆర్థికసంఘం 1971 జనాభా లెక్కలకు 17.5 శాతం, 2011 జనాభా లెక్కలకు 10 శాతం వెయిటేజీ నిర్ణయించింది. 1971 తర్వాత తెలంగాణలో కూడా జనాభా వృద్ధిరేటు తగ్గినా, వేరే రాష్ర్టాల నుంచి వలసల కారణంగా జనాభా పెరిగింది. కాబట్టి తెలంగాణ విషయంలో 1971 జనాభా లెక్కలకు ఎక్కువ వెయిటేజీ ఇవ్వడం నష్టదాయకంగా మారుతున్నది.

తలసరి ఆదాయం ఎక్కువున్న రాష్ర్టాలను ధనిక రాష్ర్టాలంటూ, వాటా తగ్గిస్తున్నారు. ఆదాయం తక్కువున్న రాష్ర్టాలకు ఎక్కువ నిధులు కేటాయిస్తున్నారు. యాభై శాతం వెయిటేజీ దీనికే కేటాయిస్తున్నారు. దీనివల్ల ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ, దేశానికి ఎక్కువ ఆదాయం సమకూరుస్తున్న రాష్ర్టాలకు అన్యాయం జరుగుతున్నదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఉదాహరణకు మిగులు బడ్జెట్ కలిగిన రాష్ట్రంగా గుర్తించిన తెలంగాణకు 2.4375 శాతం పన్నుల్లో వాటా ఇవ్వాలని ఆర్థికసంఘం నిర్ణయించింది. అదే సమయంలో ఏపీకి 4.305 శాతం వాటా లభిస్తున్నది. దీనిప్రకారం తెలంగాణకు 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.18,560 కోట్లు రాగా, ఏపీకి రూ.32,787 కోట్లు లభించాయి. 2019-20 ఆర్థిక సంవత్సరంలో కూడా ఈ వ్యత్యాసం కొనసాగుతుంది. తెలంగాణకు రూ.20,583 కోట్లు, ఏపీకి రూ.36,360 కోట్లు రానున్నాయి. దేశానికి అత్యధిక ఆదాయం సమకూర్చే ఐదారు రాష్ర్టాల్లో ఒకటైన తెలంగాణకు పన్నుల ద్వారా వచ్చే ఆదాయంలో తగిన వాటా దక్కడంలేదని ముఖ్యమంత్రి కేసీఆర్ బాహాటంగానే విమర్శిస్తున్నారు. తెలంగాణ ఏర్పడిన కొత్తలో రాష్ర్టానికి వచ్చిన 14వ ఆర్థిక సంఘం సభ్యులతో తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పారు. పన్నుల్లో వాటా పెంచకపోయినా, తగిన ఆర్థిక వనరులు, ఆదాయాభివృద్ధి కలిగిన రాష్ర్టాలకు ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్మెంట్ (ఎఫ్‌ఆర్‌బీఎం) ద్వారా అప్పులు తెచ్చుకునే వెసులుబాటును 3 నుంచి 3.5 శాతానికి పెంచాలని కోరారు. ఈ డిమాండ్ అనేక షరతులకు లోబడి కొంత మేరనే నెరవేరింది. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ, పన్నుల ఆదాయం పెంచుకునే రాష్ర్టాలకు 17.5 శాతం వెయిటేజీని కల్పిస్తూ 13వ ఆర్థికసంఘం సిఫార్సులు చేసింది. కానీ 14వ ఆర్థికసంఘం ఈ అం శాన్ని పట్టించుకోలేదు. 15వ ఆర్థిక సంఘం పట్టించుకుంటుందో లేదో తెలియదు.

జనాభా, తలసరి ఆదాయం, భౌగోళిక విస్తీర్ణం, అటవీ విస్తీర్ణం లాంటి అంశాలనే కాకుండా ఆయా రాష్ర్టాల్లోని సామాజిక, ఆర్థిక స్థితిగతులపై శాస్త్రీయమైన అధ్యయనం చేసి పన్నుల్లో వాటాను నిర్ణయించాలని రాష్ర్టాలు కోరుతున్నాయి. తెలంగాణ మిగులు బడ్జెట్ కలిగిన రాష్ట్రమైనప్పటికీ అనేక సవాళ్లను అధిగమించాల్సి ఉన్నది. ధనిక రాష్ట్రమనే కారణంతో పన్నుల్లో వాటా కేటాయింపులో తెలంగాణకు అన్యాయం జరుగుతున్నది.

ఆర్థిక సంఘాలు తాము ఎంచుకున్న ప్రాధాన్యాలనే తప్ప, కేంద్ర ప్రభుత్వ ప్రాధికార సంస్థలు, ప్రణాళికా సంఘం, నీతి ఆయోగ్, ఇతరత్రా సంస్థలు చేసిన అధ్యయనాలను పరిగణనలోకి తీసుకోవడం లేదు. 2005లో ప్రణాళిక సంఘం నియమించిన టాస్క్‌ఫోర్స్ దేశవ్యాప్తంగా అధ్యయనం చేసి, 170 జిల్లాలను వెనుకబడిన జిల్లాలుగా గుర్తించింది. అందులో తెలంగాణలోని 8 జిల్లాలు(ఉమ్మడి జిల్లాలు)న్నాయి. అత్యంత వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో 2007లో అప్పటి ప్రభుత్వం బి.ఆర్.జి.ఎఫ్. పథకం తెచ్చింది. 250 అత్యంత వెనుకబడిన జిల్లాలను గుర్తించింది. అందులో తెలంగాణలోని 9 జిల్లాలున్నాయి.

రాష్ట్ర విభజన జరిగేనాటికి తెలంగాణ రాష్ట్రం మానవాభివృద్ధి సూచికల్లో అట్టడుగున ఉందనీ, మౌలిక సదుపాయాల కల్పన సరిగా లేదని, వర్షాధారంతోనే ఎక్కువ వ్యవసాయం సాగుతున్నదనీ చెప్పింది. వ్యవసాయ కూలీలకు కనీసం పనికూడా లేకుండా పస్తులుంటున్న జిల్లాలు దేశవ్యాప్తంగా 187 ఉంటే, తెలంగాణ రాష్ట్రంలో 9 జిల్లాలు ఆ కేటగిరిలో ఉన్నాయని గ్రామీణ ఉపాధి పథకంలో పథకంలో చేర్చారు. కనీస వేతనం లభించడంలో, ఉపాధి అవకాశాల లభించడంలో దేశంలో 150 జిల్లాలు వెనుకంజలో ఉన్నాయని ప్లానింగ్ కమిషన్ నియమించిన టాస్క్‌ఫోర్సు నివేదిక ఇచ్చింది. ఇందులో తెలంగాణలోని 5 జిల్లాలున్నాయి. వ్యవసాయ రంగం క్షీణ దశలో ఉన్న 100 జిల్లల్లో తెలంగాణలోని 7 జిల్లాలున్నాయని కేంద్రమే తేల్చింది. రైతులు ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడుతున్న 31 జిల్లాల్లో తెలంగాణలోని 9 జిల్లాలున్నాయనీ చెప్పింది.

ఇంకా సాగునీటి వనరుల కల్పన విషయంలో, గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యాల ఏర్పాటు విషయంలో, విద్య, వైద్యం విషయంలో కూడా తెలంగాణకు తగిన తోడ్పాటు అవసరమని కేంద్రమే నియమించిన అనేక అధ్యయన సంస్థలు తేల్చిచెప్పాయి. కానీ ఈ నివేదికల్లోని అంశాలను ఆర్థికసంఘం పరిగణనలోకి తీసుకోవడంలేదు. కేవలం కొన్ని ప్రాతిపదికలనే పెట్టుకోవడం, తలసరి ఆదాయం ఎక్కువుందనే నెపంతోనూ, మిగులు బడ్జెట్ కలిగిన రాష్ట్రమనే అభిప్రాయంతోనూ తక్కువ వాటా కేటాయించడం వల్ల తెలంగాణ లాంటి రాష్ర్టాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. 15వ ఆర్థికసంఘమైనా శాస్త్రీయమైన పద్ధతి ఎంచుకొని పన్నుల్లో వాటా నిర్ణయిస్తుందనే ఆశాభావంతో తెలంగాణ సహా మరికొన్ని రాష్ర్టాలున్నాయి. పేద రాష్ర్టాలకు తగిన ఆర్థిక ప్రేరణ అందిస్తూనే, ప్రగతిశీల రాష్ర్టాలను ప్రోత్సహించే విధానం కోసం రాష్ర్టాలు ఎదురుచూస్తున్నాయి.

> రాష్ట్ర విభజన జరిగేనాటికి తెలంగాణ రాష్ట్రం మానవాభివృద్ధి సూచికల్లో అట్టడుగున ఉందనీ, మౌలిక సదుపాయాల కల్పన సరిగా లేదని, వర్షాధారంతోనే ఎక్కువ వ్యవసాయం సాగుతున్నదనీ చెప్పింది. వ్యవసాయ కూలీలకు కనీసం పనికూడా లేకుండా పస్తులుంటున్న జిల్లాలు దేశవ్యాప్తంగా 187 ఉంటే, తెలంగాణ రాష్ట్రంలో 9 జిల్లాలు ఆ కేటగిరిలో ఉన్నాయని గ్రామీణ ఉపాధి పథకంలో పథకంలో చేర్చారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

అడవిదొంగల కట్టడి

అటవీ, పోలీసు శాఖ జాయింట్ ఆపరేషన్

స్మగ్లింగ్ రూట్లు సీజ్.. కొత్తగా చెక్‌పోస్టులు

ఆకస్మిక దాడుల్లో రూ.45 లక్షల విలువైన టేకు కలప సీజ్

ఇన్‌ఫార్మర్లకు నజరానా.. రివార్డులకు ప్రతిపాదన



జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం సర్వాయిపేటలో పట్టుబడిన కలపతో అటవీ అధికారులు, సిబ్బంది, పోలీసులు

జయశంకర్ జిల్లా ప్రతినిధి-నమస్తే తెలంగాణ: అడవుల సంరక్షణపై సీఎం కేసీఆర్ ఆదేశాలతో అటవీ, పోలీసు శాఖ అధికారులు జాయింట్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. కొద్దిరోజులుగా కలప అక్రమ నిల్వలపై ఆకస్మిక దాడులు జరుపుతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కలప డంపులను సైతం గుర్తించి వెలికితీస్తున్నారు. మెరుపు దాడులతో అక్రమార్కుల గుండెల్లో దడ పుట్టిస్తున్నారు. ఇప్పటికే ఈ జిల్లాలో రూ.45 లక్షల విలువైన టేకు కలప దుంగలను స్వాధీనపర్చుకున్నారు.

జిల్లాలో 14 చెక్‌పోస్టులు..

భూపాలపల్లి జిల్లా మంగపేట మండలం బ్రాహ్మణపల్లి, ఏటూర్‌నాగారం, కాటారం మండల కేంద్రాల్లో, గోవిందరావుపేట మండలంలోని పస్రా గ్రామం వద్ద అటవీ శాఖ ఆధ్వర్యంలో చెక్‌పోస్టులు పనిచేస్తుండగా వీటికి అదనంగా మరో పది చెక్‌పోస్టులు నెలకొల్పారు. ఏటూర్‌నాగారం మండలం రోహీర్, తాడ్వాయి మండల కేంద్రంలోని కాటాపూర్ రోడ్, మంగపేట మండలం కమలాపురం, తాడ్వాయి మండలం లింగాల, ములుగు మండలం జంగాలపల్లి, ఇప్పలగడ్డ క్రాస్‌రోడ్, మల్హర్ మండలం కొయ్యూరు, మహదేవపూర్ మండలం అంబటిపల్లి, రేగొండ, భూపాలపల్లి పట్టణంలోని కమలాపూర్ క్రాస్ రోడ్ వద్ద నాలుగు రోజుల క్రితం కొత్తగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను ప్రారంభించారు.

త్వరలో చెక్‌పోస్టుల్లో సీసీ కెమెరాలు..

ప్రతి చెక్‌పోస్టులో సీసీ కెమెరాలు అమర్చనున్నారు. ఏటూర్‌నాగారం, పస్రా, బ్రాహ్మణపల్లి, కాటారం చెక్ పోస్టుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి స్థానిక రేంజ్ అధికారి, జిల్లా అటవీ అధికారి కార్యాలయాలకు అనుసంధానం చేశారు. కొత్తగా ప్రారంభించిన పది చెక్‌పోస్టుల్లోనూ సీసీ కెమెరాలు అమర్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ప్రతి చెక్‌పోస్టులోనూ షిఫ్ట్ పద్ధతిన నిరంతరం విధులు నిర్వహించేలా అటవీ, పోలీసు అధికారులు కోసం మౌలిక వసతులు కల్పించనున్నారు.

ఇన్‌ఫార్మర్ వ్యవస్థ పటిష్టం

అడవి దొంగల ఆట కట్టించేందుకు అధికారులు ఇన్‌ఫార్మర్ వ్యవస్థను పటిష్టం చేసే పనిలో పడ్డారు. ఇప్పటికే ఊరూరా పోలీసు, అటవీ అధికారులకు ఉన్న సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు పకడ్బందీ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. అడవి దొంగల సమాచారం ఇచ్చిన వారికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తామని గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. దీంతో కలప అక్రమ రవాణా, పోడు వ్యవసాయం కోసం అడవుల నరికివేత, అడవుల్లో నుంచి ఇసుక, మట్టి అక్రమ తరలింపు, అటవీ భూముల ఆక్రమణ, వన్యప్రాణులను వేటాడటం వంటి సమాచారం అటవీ, పోలీసు శాఖల అధికారులకు అందుతుంది. తమ నెట్‌వర్క్‌ను పెంచుకోవడానికి ఇన్‌ఫార్మర్లకు మొబైల్ ఫోన్లు సైతం అధికారులు సమకూర్చుతున్నారు. అంతేకాదు వారికి భారీ నజరానా ఇవ్వనున్నారు. విలువైన సమాచారం ఇచ్చిన ఇన్‌ఫార్మర్లకు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రివార్డు అందజేసేందుకు ప్రభుత్వానికి తాజాగా ప్రతిపాదనలు పంపారు. సానుకూలంగా ఉన్న ప్రభుత్వం ఈ ప్రతిపాదనల అమలుకు త్వరలోనే ఆమోదం తెలిపే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

ఆకస్మిక దాడులు

భూపాలపల్లి జిల్లా పలిమెల, మల్హర్, వెంకటాపూర్, మంగపేట, వెంకటాపురం(నూగూర్) తదితర మండలాల్లోని అటవీ గ్రామాల్లో అధికారులు కొద్దిరోజులుగా సంయుక్త దాడులు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న పలిమెల మండలం సర్వాయిపేట, పలిమెల గ్రామాల్లో భారీ ఎత్తున కలపను స్వాధీనం చేసుకున్నారు. సర్వాయిపేటలో ఊహించని విధంగా వారంరోజుల వ్యవధిలో రెండుసార్లు దాడులు జరిపారు. ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి కలప స్మగ్లర్లు టేకు దుంగలను గోదావరి దాటించి సర్వాయిపేటలో నిల్వ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ తాజా నిర్ణయంతో అటవీ, పోలీసు అధికారులు సర్వాయిపేటను లక్ష్యంగా చేసుకొని ఆకస్మికంగా దాడులకు దిగారు. ఆకస్మిక దాడుల్లో ఇప్పటివరకు రూ.45 లక్షలకుపైగా విలువ చేసే టేకు కలపను స్వాధీన పర్చుకున్నారు. జిల్లాలో అటవీ నేరస్తులను గుర్తించి అధికారులు జాబితా రూపొందిస్తున్నారు. ఇప్పటికే తొలివిడత 43 మంది నేరస్తులతో జాబితాను ప్రభుత్వానికి పంపారు. కలప నేరస్తుల్లో ఇద్దరిపై పీడీ యాక్ట్ ప్రయోగించేందుకు నిర్ణయించారు. ఇందులో ఒకరిపై పీడీ యాక్ట్ అమలు ప్రతిపాదనలకు కలెక్టర్ ఆమోదం తెలిపారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో సత్యనారాయణపురంలో స్వాధీనం చేసుకున్న కర్రకోత యంత్రాలను చూపుతున్న డీఎఫ్‌వో రాంబాబు

8లక్షల విలువైన కలప కోత యంత్రాల పట్టివేత

ఇల్లెందు, నమస్తే తెలంగాణ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం సత్యనారాయణపురంలో శనివారం అటవీ, పోలీస్‌శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి రూ.8 లక్షల విలువైన కలప, కోత సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. డీఎఫ్‌వో రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. సత్యనారాయణపురంలో అక్రమ కలప నిల్వలు ఉన్నట్టు సమాచారం అందుకొని అటవీశాఖ, పోలీస్‌శాఖ సంయుక్తంగా దాడులు నిర్వహించాయి. గ్రామంలో కోత సామగ్రి తయారీ కేంద్రాల్లో అనుమతి లేకుండా వినియోగిస్తున్న యంత్రాలను, నిల్వ ఉంచిన కలపను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

నర్సాపూర్ అడవుల్లో అర్బన్‌పార్కు

ఫారెస్ట్ స్టేట్ చీఫ్ కన్జర్వేటర్ పీకే ఝా

నర్సాపూర్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం అడవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని, ఇందులో భాగంగా నర్సాపూర్ ఫారెస్ట్ పరిధిలోని 750 ఎకరాల్లో రూ.20కోట్లతో అర్బన్ పార్కు ఏర్పాటు చేస్తున్నట్టు ఫారెస్ట్ స్టేట్ చీఫ్ కన్జర్వేటర్ పీకే ఝా తెలిపారు. శనివారం ఆయన మెదక్ జిల్లా నర్సాపూర్ అటవీ ప్రాంతంలో అర్బన్ పార్కు పనులను కలెక్టర్ ధర్మారెడ్డి, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) ఏకే సిన్హా, అదనపు సీసీఎఫ్ దొబ్రియాల్, డీఎఫ్‌వోలు పద్మజారాణి, ఆర్డీవో వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇక్కడి అడవుల రక్షణకు 7 కిలోమీటర్ల మేర ప్రహరీని నిర్మిస్తున్నట్టు చెప్పారు.

బతుకమ్మ ఘాట్‌లో మ్యూజికల్ ఫౌంటెయిన్

- కేటీఆర్ చొరవతో రూ.60 లక్షలు మంజూరు
- కలెక్టర్, కమిషనర్‌కు ట్విట్టర్‌లో కేటీఆర్ ప్రశంస



రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలో బతుకమ్మ ఘాట్ వద్ద ఇటీవల నిర్వహించిన మ్యూజికల్ ఫౌంటెయిన్ ట్రయల్ రన్ (ఫైల్)

సిరిసిల్లటౌన్: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బతుకమ్మఘాట్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహకారంతో రూ.60 లక్షల నిధులతో మ్యూజికల్ ఫౌంటెయిన్ రూపుదిద్దుకున్నది. అలహాబాద్, తిరుపతి, హైదరాబాద్ మాదిరిగా సిరిసిల్లలో అత్యంత ఆధునిక టెక్నాలజీ సహాయంతో ఫౌంటెయిన్ తీర్చిదిద్దారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు ఏర్పాటుచేసిన ఈ ఫౌంటెయిన్ త్వరలోనే టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 'మ్రిదా ప్రాజెక్ట్స్' కంపెనీ నిర్వాహకులు ఫౌంటెయిన్ పనులు చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సామల పావని, కమిషనర్ రమణాచారి ఇప్పటికే ట్రయల్ రన్ నిర్వహించారు.

కలెక్టర్, కమిషనర్‌లకు కేటీఆర్ ప్రశంస

బతుకమ్మ ఘాట్‌లోని మ్యూజికల్ ఫౌంటెయిన్ ట్రయల్‌రన్ వీడియోను వీక్షించిన కేటీఆర్ కలెక్టర్ వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమణాచారిలను ట్విట్టర్ వేదికగా అభినందించారు.

సిద్దిపేటను క్రీడలకు వేదికగా మార్చుతాం

మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు వెల్లడి



సిద్దిపేటలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట కలెక్టరేట్, నమస్తే తెలంగాణ: సిద్దిపేట జిల్లాను క్రీడలకు వేదికగా మార్చుతామని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. శనివారం సిద్దిపేటలో టీసీఏ ఆధ్వర్యంలో జయశంకర్ స్టేడియంలో జరుగుతున్న తెలంగాణ గోల్డ్ కప్ క్రికెట్ పోటీలను, ఎరువులు, విత్తనాల డీలర్ల శిక్షణ తరగతులను, పలు అభివృద్ధి పనులను హరీశ్‌రావు ప్రారంభించారు. ఆయా సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. రైతుబంధు, రైతుబీమా పథకాలతోపాటు భూరికార్డుల ప్రక్షాళనతో సీఎం కేసీఆర్ విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. నకిలీ విత్తనాలు అమ్మేవారిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ కృష్ణభాస్కర్, మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ తదితరులు ఉన్నారు.



ఖమ్మం జెడ్పీ చైర్‌పర్సన్ గడిపల్లి కవిత రాజీనామా

మామిళ్లగూడెం: ఉమ్మడి ఖమ్మం జెడ్పీ చైర్‌పర్సన్ గడిపల్లి కవిత శనివారం తన పదవికి రాజీనామా చేశారు. ఉదయం జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకొన్న ఆమె సాయంత్రం ఈ విషయాన్ని ప్రకటించారు. ఆ వెంటనే రాజీనామా లేఖను కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌కు అందించారు. ఇందుకుగల కారణాలను ఆమె వెల్లడించలేదు. వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేసినట్టు ఆమె సన్నిహితులు పేర్కొంటున్నారు.

పులి చర్మం కేసు పోలీస్ శాఖకు బదిలీ

మంచిర్యాల రూరల్: మంచిర్యాల జిల్లా మందమర్రి మార్కెట్‌లో జనవరి 24న దొరికిన పులి చర్మానికి సంబంధించిన కేసును అటవీ శాఖ నుంచి పోలీస్ శాఖకు బదిలీ చేసినట్టు రామగుండం పోలీస్ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. అడిషనల్ డీసీపీ(అడ్మిన్) అశోక్‌కుమార్ పర్యవేక్షణలో సీసీఎస్ సీఐ శ్రీనివాస్‌ను విచారణ అధికారిగా నియమించారు.

ఎస్‌బీఐలో భారీకుంభకోణం

- డొల్లసంస్థల పేరుతో రూ.2.15కోట్లు స్వాహా
- 'ముద్ర' పథకం సాయంతో మోసానికి పాల్పడ్డ నిందితులు
- బ్యాంక్ మేనేజర్ సహకారంతో నిధులు దారిమళ్లింపు

వరంగల్ రూరల్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: వరంగల్ రూరల్ జిల్లా నడికూడ మండలం కంఠాత్మకూరు ఎస్‌బీఐలో భారీ కుంభకోణం వెలుగుచూసింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ముద్ర రుణ పథకాన్ని ఆసరాగా చేసుకొని బొంతల శ్రీనివాస్, మర్రిశెట్టి రాజేశ్‌కుమార్ ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ నరేన్‌చౌదరి సహకారంతో లబ్ధిదారుల పేరుతో బోగస్ సంస్థలను, వ్యాపారాలను సృష్టించారు. తప్పుడు ధ్రువపత్రాలను సృష్టించి రూ.2.15 కోట్లను దారిమళ్లించారు. పరకాల ఎస్బీఐలో కంఠాత్మకూరు శాఖ విలీనం కంటే ముందు జరిగిన ఆడిట్లో బిల్లులు, సంస్థల పేరుతో సమర్పించిన కొటేషన్లు, రుణాలు పొందిన వారి నుంచి చెల్లింపులు జరుగకపోవడంతో అనుమానించిన అధికారులు మరింత లోతుగా ఆడిట్ నిర్వహించారు. లబ్ధిదారుల వివరాలు సరిగ్గా లేకపోవడం, యూనిట్లు గానీ, కొటేషన్లు ఇచ్చిన సంస్థలు లేకపోవడంతో వెంటనే ఈ సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేశారు. శ్రీనివాస్, మర్రిశెట్టి రాజేశ్‌కుమార్, మేనేజర్ నరేన్‌చౌదరి నిధులను దారిమళ్లించి స్వాహా చేసినట్టు సీబీఐ అధికారులు గుర్తించారు. ఈ ముగ్గురిపై సీబీఐ అధికారులు కేసు నమోదుచేసి విచారిస్తున్నట్టు సమాచారం. ఈ కేసు మరింత లోతుగా వెళితే మరింతమంది దళారులు బయటకు వచ్చే అవకాశం ఉన్నది.

నేడు జడ్చర్లలో మెగా రక్తదాన శిబిరం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బర్త్‌డే సందర్భంగా..

మహబూబ్‌నగర్ నమస్తే తెలంగాణ ప్రతినిధి: మాజీ మంత్రి, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించేందుకు టీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఏర్పాట్లు చేశారు. గత 14 ఏండ్లుగా లక్ష్మారెడ్డి జన్మదినం సందర్భంగా ఏటా నిర్వహిస్తున్న రక్తదాన శిబిరంలో భాగంగా ఆదివారం మరింత భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. బాదేపల్లి మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దాదాపు 3 వేల మందితో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఇందులో లక్ష్మారెడ్డి సైతం రక్తదానం చేయనున్నారు.

సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య

- పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు వెల్లడి



వరంగల్ రూరల్ జిల్లా రాయపర్తి మండలం కొండూరులో డిజిటల్ తరగతులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎర్రబెల్లి

రాయపర్తి: సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతున్నదని పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. వరంగల్ రూరల్ జిల్లా రాయపర్తి మండలం కొండూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు శనివారం 100 స్మైల్స్ ఫౌండేషన్, అభయ ఫౌండేషన్ - హైదరాబాద్ సంస్థలు సంయుక్తంగా విద్యార్థుల సౌకర్యార్థం సుమారు రూ.2.5 లక్షల విలువైన మినరల్ వాటర్ ప్లాంట్, డిజిటల్ తరగతుల నిర్వహణ సామగ్రిని ఉచితంగా అందజేశాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎర్రబెల్లి హాజరై మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్ ప్రభుత్వ పరిపాలనలో రాష్ట్రంలోని సర్కార్ పాఠశాలలకు మహర్దశ పడుతున్నట్టు చెప్పారు. పాఠశాలకు మినరల్‌వాటర్ ప్లాంట్, డిజిటల్ తరగతుల సామగ్రిని అందించిన సంస్థల నిర్వాహకులు మనోజ్‌కుమార్, శివకృష్ణను ఆయన అభినందించారు.

గోదావరిలో ముగ్గురు యువకులు గల్లంతు

మణుగూరు, నమస్తే తెలంగాణ(బూర్గంపాడు): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాగినేని ప్రోలు రెడ్డిపాలేనికి చెందిన ముగ్గురు యువకులు స్నేహితుడి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనేందుకు తెలంగాణ సరిహద్దు గ్రామమైన ఏపీ పరిధిలోని వేలేరుపాడుకు వెళ్లి గల్లంతయ్యారు. గ్రామస్థులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన విజయ్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శనివారం గోదావరి కిన్నెరసాని సంగమం ప్రాంతమైన వేలేరుపాడుశివారులో శ్రీనివాసరెడ్డి(21), కారంపూడి శేషు(24), తిరుమలరెడ్డి, శివారెడ్డి(23), విజయరెడ్డి, పుల్లారెడ్డి, సతీశ్‌రెడ్డి విందు ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, శేషు, తిరుమలరెడ్డి గోదావరిలోకి స్నానానికి దిగి గల్లంతయ్యారు.

అధికవడ్డీ ఇస్తామంటూ రూ.1.80 కోట్లు టోకరా

మట్టెవాడ(వరంగల్): రిలయన్స్ సెక్యూరిటీ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేసి అధికవడ్డీ ఇస్తామంటూ రూ. 1.80 కోట్లు డిపాజిట్లు సేకరించి ప్రజలను మోసగించిన ఇద్దరు ఘరానా మోసగాళ్లను శనివారం వరంగల్ పోలీసులు అరెస్ట్‌చేశారు. ఇటీవల 'నమస్తే తెలంగాణ' వరంగల్ జిల్లా ఎడిషన్‌లో ఈ ఆన్‌లైన్ మోసంపై ప్రచురించిన కథనంతో అప్రమత్తమైన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో సంస్థ నిర్వాహకులు హన్మకొండకు చెందిన నంచర్ల రాము, వరంగల్‌కు చెందిన ఐత అరుణ్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. ఆన్‌లైన్‌లో షేర్‌మార్కెట్ పేర డిపాజిట్లు సేకరించేందుకు రాము, అరుణ్‌కుమార్ రెండేడ్ల క్రితం వరంగల్‌లో ఓ సంస్థను ఏర్పాటుచేసి అధిక వడ్డీలు ఇస్తామంటూ 200 మంది నుంచి రూ.1.80 కోట్లు డిపాజిట్లు సేకరించారు. ప్రతినెల 15 శాతం వడ్డీ ఇస్తామని నమ్మబలకడంతో చాలామంది సంస్థలో పెట్టుబడులు పెట్టినా వడ్డీ సక్రమంగా చెల్లించకపోవడంతో నష్టపోయినట్టు గుర్తించారు. సంస్థ అక్రమాలపై బాధితుల ఫిర్యాదుమేరకు నిందితులను అదుపులోకి తీసుకొని వీరి నుంచి రూ.8 లక్షల నగదు, కారు, మోటర్ సైకిల్, ఇంటి కాగితాలు, ఫర్నీచర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటరెడ్డి తెలిపారు.

కొలువుదీరిన కొత్త పాలకవర్గాలు

- పండుగలా సర్పంచుల ప్రమాణ స్వీకారం
- శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేలు



నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లిలో సర్పంచ్ ప్రమాణ స్వీకారోత్సవం అనంతరం టీఆర్‌ఎస్ శ్రేణుల ఊరేగింపు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: పంచాయతీల్లో కొత్త పాలకవర్గాలు శనివారం కొలువుదీరాయి. రాష్ట్రంలోని ఆయా గ్రామాల్లో సర్పంచ్‌ల ప్రమాణ స్వీకారోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఆయాచోట్ల జరిగిన ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిదులు కొత్త పాలకవర్గాలకు శుభాకాంక్షలు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా ఉర్కొండలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, నిర్మల్ మండలం ఎల్లపెల్లి, కొండాపూర్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కామారెడ్డి జిల్లా పెద్ద కొడప్‌గల్ పంచాయతీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, జోగుళాంబ గద్వాల జిల్లాలోని గద్వాల, గట్టు, మల్దకల్, కేటిదొడ్డి మండలాల్లో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఇటిక్యాల మండలం వల్లూరులో అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం పాల్గొన్నారు. వనపర్తి జిల్లాలోని 255 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు బాధ్యతలు చేపట్టారు. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం ముకుందాపురంలో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య, సూర్యాపేట జిల్లా నడిగూడెంలో కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పాల్గొన్నారు. కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తి, నగునూర్, ముగ్ధుంపూర్, గోపాల్‌పూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, గంగాధర మండలం బూరుగుపల్లి, మధురానగర్, రామడుగు మండలం వెలిచాల గ్రామాల్లో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మానకొండూర్ మండల కేంద్రంతోపాటు తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి, రేణికుంట గ్రామాల్లో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పాల్గొన్నారు. పెద్దపల్లి జిల్లాలోని 263 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు బాధ్యతలు చేపట్టారు.

గ్రామాన్ని అభివృద్ధి చేస్తా..

మోటకొండూర్: యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ సర్పంచ్‌గా వడ్డెబోయిన శ్రీలత శనివారం ప్రమాణం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అడుగు జాడల్లో పనిచేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అద్భుతంగా అభివృద్ధి సాధిస్తున్నదన్నారు. అందరి సహకారంతో మోటకొండూర్‌ను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తానన్నారు.

ఆందోళన మధ్య కుకుడలో ప్రమాణ స్వీకారం

అడ్డుకున్న ప్రత్యర్థులు.. కార్యదర్శిపై దాడి

బెజ్జూర్: కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం కుకుడ గ్రామ పంచాయతీలో శనివారం సర్పంచ్ ఆసియాభాను(టీఆర్‌ఎస్ రెబల్) ప్రమాణ స్వీకారాన్ని ప్రత్యర్థి వర్గం వారు అడ్డుకున్నారు. కార్యదర్శిపైనా దాడికి దిగారు. కొద్దిసేపటి తరువాత అధికారులు పోలీస్ బందోబస్తు మధ్య కార్యక్రమాన్ని పూర్తిచేశారు. వివరాలు ఇలా.. కుకుడలో సర్పంచ్ పదవికి పోటీచేసిన సడ్మెక జ్యోతి (టీఆర్‌ఎస్) నామినేషన్ పత్రాన్ని రిటర్నింగ్ అధికారులు తప్పుదోవ పట్టించి తిరస్కరించారని ఆరోపిస్తూ ఆమె వర్గానికి చెందిన వారు గొడవకు దిగారు. 'అభ్యర్థి ప్రకటనదారు సంతకం' అని ఉన్న చోట జ్యోతి సంతకం అవసరం లేదని చెప్పిన రిటర్నింగ్ అధికారులే.. ఆ తర్వాత ఆమె సంతకం చేయలేదని నామినేషన్‌ను తిరస్కరించినట్టు వారు మండిపడ్డారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా తమకు న్యాయం జరగలేదని, తిరిగి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అక్కడున్న పోలీసు సిబ్బంది సముదాయించినా వినకుండా ఒకరినొకరు తోసుకున్నారు. ప్రమాణ స్వీకారం చేయించడానికి వెళ్లిన కార్యదర్శి బాబురావుపై చేయిచేసుకున్నారు. బాబురావు అస్వస్థతకు గురికాగా, అతడిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. చివరకు అధికారులు పోలీస్ బందో బస్తు మధ్య పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

'ప్రథమ' పౌరుడి ప్రథమ కర్తవ్యం..!

ప్రమాణ స్వీకారం రోజే ప్లాస్టిక్ నిషేధం

అమ్రాబాద్ రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం సార్లపల్లి సర్పంచ్‌గా శనివారం బాధ్యతలు తీసుకున్న ఆదివాసీ చెంచు గిరిజన బిడ్డ చిగుర్ల మల్లికార్జున్ వినూత్న కార్యక్రమం చేపట్టారు. ప్లాస్టిక్ తొలగింపు కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేశారు. ఐదు రోజులపాటు గ్రామంలో ప్లాస్టిక్ నిషేధానికి కార్యాచరణ రూపొందించారు.

తెలంగాణనాయక్ తండాగా పేరు మార్చండి

నారాయణఖేడ్, నమస్తే తెలంగాణ: తమ తండా పేరును తెలంగాణనాయక్‌తండాగా మార్చాలని సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండ లం పలుగుతండా నూతన పాలకవర్గం శనివారం తీర్మానించింది. స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో ఈ తండావాసులు చురుగ్గా పాల్గొన్నారు.

పన్ను చెల్లిస్తే లక్కీడిప్ ద్వారా బైక్

కమ్మర్‌పల్లి, నమస్తే తెలంగాణ: గ్రామస్థులు ఇంటి పన్ను సకాలంలో చెల్లించేలా ప్రోత్సహించేందుకు నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల కోనాసముందర్ సర్పంచ్ బంపర్ ఆఫర్ ఇచ్చారు. సర్పంచ్‌గా ఇంద్రాల రూప, వార్డు సభ్యుడైన ఆమె భర్త ఇందార్ల రాజు శనివారం ప్రమాణం స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో ఆస్తి పన్ను బకాయిల వసూలుకు లక్కీ డ్రా స్కీమ్ ప్రకటించారు. 100% పన్నులు చెల్లించిన వారిలో ఒకరిని ఎంపిక చేసి బైక్‌ను బహూకరిస్తామని తెలిపారు.



ఫణిగిరిలోని బౌద్ధ సంపదను ప్రపంచానికి తెలియజేయాలి

పురావస్తు శాఖ రాష్ట్ర సంచాలకులు


నాగారం: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఫణిగిరి బౌద్ధక్షేత్రంలోని బౌద్ధుని చరిత్రను ప్రపంచానికి తెలిపేందుకు ఫణిగిరి గుట్టపై తవ్వకాలు చేపడుతున్నామని వారసత్వశాఖ(పురావస్తు శాఖ)రాష్ట్ర సంచాలకులు ఎన్‌ఆర్ విశాలాక్షి తెలిపారు. శనివారం సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని ఫణిగిరి బౌద్ధక్షేత్రంలో పురావస్తుశాఖ ఆధ్వర్యంలో ఆమె తవ్వకాలు ప్రారంభించి మాట్లాడారు. ఫణిగిరి గుట్టపై ఇప్పటికే ఆరుసార్లు తవ్వకాలు జరిపామన్నారు. ఇక్కడ విలువైన బౌద్ధసంపద బయటపడిందని, వాటిని ఇప్పటికే ముంబయి, హైదరాబాద్‌లోని విదేశీ మ్యూజియాల్లో భద్రపర్చామని చెప్పారు.



అవార్డును అందుకుంటున్న అశోక్

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో 'సుద్దాల'

కోనరావుపేట: రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో దొబ్బల ప్రకాశ్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్య జనగణమన పారాయణం తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించింది. 2018 జనవరి 31న అప్పటి జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అప్పటినుంచి ప్రతిరోజు ఉదయం 9 గంటలకు గ్రామంలో జనగణమన ఆలపిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఏడాది నుంచి తెలుగు ఆఫ్ రికార్డు వారు పరిశీలించి ఎంపికచేశారు. శనివారం హైదరాబాద్‌లో తెలుగు బుక్ అఫ్ రికార్డు వ్యవస్థాపకుడు వెంకటచారి..ప్రకాశ్‌కు అవార్డు అందించారు.




కొత్తగూడెంలో డైరీని ఆవిష్కరిస్తున్న జేసీ వెంకటేశ్వర్లు, టీఎన్జీవోస్ నేతలు కారం రవీందర్‌రెడ్డి, రాజేందర్, రామయ్య, నాగేశ్వరరావు

దేశానికి తెలంగాణే ఆదర్శం

కొత్తగూడెం, నమస్తే తెలంగాణ: దేశంలోని రాష్ట్రాలన్నీ తెలంగాణ వైపు చూస్తున్నాయని, దీన్నిబట్టి రాష్ట్ర పనితీరు ఎంత ఆదర్శంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జేసీ కర్నాటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కొత్తగూడెంక్లబ్‌లో శనివారం నిర్వహించిన టీఎన్జీవోస్ సంఘం స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో ఆయన సంఘం క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. సమావేశానికి టీఎన్జీవోస్ కేంద్ర కమిటీ సంఘం అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ రాజేందర్, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల టీఎన్జీవోస్ అధ్యక్షుడు రామయ్య, నాగేశ్వర రావు తదితరులు హాజరయ్యారు.

భవాని రెడ్డీస్ మ్యారేజ్ బ్యూరో



ONLY REDDY'S SPECIALIST

అడ్రస్: Old Alwal, Near Indira Gandhi Statue
Cont: S. BHOOPAL REDDY
Ph: 9912387047, 9177356106
e-mail: bpl.reddy1971@gmail.com
SBH A/c. No. 62263103630 Medchal Branch

నమస్తే తెలంగాణ కళ్యాణమస్తు

...మీ జీవిత భాగస్వామి ఎంపికలో ఆత్మీయ బంధువు

ADARSHA MATRIMONY

(ESTD. 1993) Founders : Vangala Sujatha Balaraj Goud
(U.S.A, Canada, Australia, Europe, Newzealand & Indian All Castes Specialists)
All Types of Marriages, 100% Fast Settlements, Quick Service
Cell : 9989951626, 7032298989 Off : 9393032233, 040-48528877
E-mail : adarshamarriagebureau@gmail.com

స్వప్న వివాహ వేదిక (మాదిగ ప్రత్యేకత)



మాదిగ పరిచయ వేదిక
నేడు ఉదయం 10.00 గం. నుండి సాయంత్రం 6.00 గం. వరకు
ఫీజు: 1000/-, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్.
సంప్ర: స్వప్న వివాహ వేదిక, సికింద్రాబాద్ స్టేషన్
9347046175

భాగ్యలక్ష్మీ రెడ్డి మ్యాట్రిమోని

రెడ్డి వధూవరులకు ప్రత్యేకముగా చూడబడును



తార్నాక, షాప్ నెం.48, హుడాకాంప్లెక్స్,
Konala Bhagyalakshmi Reddy, M.A.
President: Telangana Marriage Links.
Cell: 9246960888
Whatsapp: 9866044439
bhagyalakshmireddymatrimoni@gmail.com

వధువు కావలెను

★రెడ్డి డాక్టర్: 28Yrs, 5'8", MBBS, PG, Doctor, USA వరునికి తగిన వధువు కావలెను. 9030315599

★రెడ్డి: 24Yrs, 5'10", MBBS, Doctor, 1LPM, వరునికి తగిన వధువు కావలెను. 9246960888

★రెడ్డి: 32Yrs, 5'7", BE, SWE, USA, 80KPA, 30 Crores Property వరునికి తగిన వధువు కావలెను. 7207930999

★రెడ్డి: 29Yrs, 5'9", MS, SWE, USA, 90KPA, 9Crores Property వరునికి తగిన వధువు కావలెను. 9248064777

★రెడ్డి: 30Yrs, 5'11", B.Tech, (VIT), MBA (GMAT), SWE, USA, 167KPA, 2Crores Property వరునికి తగిన వధువు కావలెను. 9030315599

★రెడ్డి: 32Yrs, 5'10", B.Tech, (ITI), MS (USA), Phd, (Germony), Scientist, USA, 3.5LPM, 10Crores Property వరునికి తగిన వధువు కావలెను. 9246960888

★రెడ్డి: 24Yrs, 5'5", MBA, Business, 7LPM, 250Crores Property వరునికి తగిన వధువు కావలెను. 7207930999

★రెడ్డి: 32Yrs, 5'6", B.Tech, MBA, M.S, SWE, Hyd, 8.5LPA, 6Crores Property వరునికి తగిన వధువు కావలెను. 9248064777

★రెడ్డి: 31Yrs, 5'8", B.Tech, MBA, IT, Manager, 4LPM, 45Crores Property వరునికి తగిన వధువు కావలెను. 9030315599

★రెడ్డి రెండవ పెళ్ళి : 35Yrs, 5'8", B.Tech, MS, SWE, 100KPA, USA, Well Settled వరునికి తగిన వధువు కావలెను. 9246960888

వరుడు కావలెను

★రెడ్డి డాక్టర్: 26Yrs, 5'8", MBBS, MD, Doctor, 3Crores Property వధువుకు తగిన డాక్టర్ వరుడు కావలెను. 9246960888

★రెడ్డి డాక్టర్: 22Yrs, 5'5", MBBS, Preparing for PG, Well Settled వధువుకు తగిన వరుడు కావలెను. 9030315599

★రెడ్డి డాక్టర్: 31Yrs, 5'4", MBBS, MD, Asst Professor, 1LPM, 30Crores Property వధువుకు తగిన వరుడు కావలెను. 9248064777

★రెడ్డి : 25Yrs, 5'4", B.A, LLB, 9Crores Property వధువుకు తగిన వరుడు కావలెను. 7207930999

★రెడ్డి : 28Yrs, 5'4", MS, SWE, USA, 70KPA, 3Crores Property వధువుకు తగిన వరుడు కావలెను. 9246960888

★రెడ్డి : 25Yrs, 5'6", MS, SWE, USA, 90KPA, Well Settled వధువుకు తగిన వరుడు కావలెను. 9030315599

★రెడ్డి : 27Yrs, 5'7", B.Tech(Mechanical), 6Crores Property వధువుకు వరుడు కావలెను. 9248064777

★రెడ్డి : 29Yrs, 5'4", B.Tech, SWE, 8LPA, Well Settled వధువుకు తగిన వరుడు కావలెను. 7207930999

★రెడ్డి : 26Yrs, 5'6", M.Tech, Government Employee, 50,000/- PM వధువుకు తగిన వరుడు కావలెను. 9246960888

★రెడ్డి రెండవ పెళ్ళి : 25Yrs, 5'3", B.Tech, SWE, 25,000/- PM వధువుకు తగిన వరుడు కావలెను. 9030315599

తెలంగాణ రెడ్డీలకు మాత్రమే

కేవలం తెలంగాణలో రెడ్డి వివాహ సంబంధాలు కుదర్చగల ఏకైక వివాహ వేదిక.
కీసరి మోహన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో, H.No. 3-4-340/1, Flat No. 302, IIIrd Floor, Saraswathi Apartments, Near BSNL Office, Beside RBVRR B.Pharmacy, (Sattamma College), Barktpura, Hyd ☏:040-27555006, 9246573006, 7981053739, 9348067006 E-mail:keesarimb@gmail.com, www.keesarimarriages.com
Timing: 10 am to 5.00 pm. Tuesday Holiday. Regn.No. 997/2009
మా బ్రాంచ్: B.N.రెడ్డిక్రాస్ రోడ్స్, సాగర్‌రోడ్, చైతన్యనగర్, ఫేస్-2, రోడ్ నం.4, హైదరాబాద్.
Native Place:తిరుగండ్లపల్లి (గ్రా), మర్రిగూడ (మం), నల్గొండ (జి)

వధువు కావలెను

★రెడ్డి: 30/ 5'11"/ BE/ MS/ USA/ 145K/ 5 Cr * 28/ 5'11"/ BE/ MS/ USA/ 100K/ H1/ 17 Cr. సం|| కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.

★రెడ్డి: 31/ 6'2"/ BE/ 130K/ 15 Cr/ H1/USA * 32/5'5"/ BE/ MS/ USA/ H1/ 90K/ 6 Cr. సం|| కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.

★రెడ్డి: 30/ 5'11"/ MD/ Gen.Med/ Germany/ 5 Cr * 27/ 6'0"/ BE/ IIT/ 100K/ H1/ 10 Cr. సం|| కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.

★రెడ్డి: 28/ 5'7"/ BE/ Govt Job/ 5LP/A/ 2 Cr * 31/ 5'11"/ BE/ 8LP/A/ 3 Cr. సం|| కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.

★రెడ్డి: 32/ 5'8"/ BE/ 80 LP/A/ 200 Cr. * 33/ 5'10/ BE/ M.Tech/ 12LP/A / 20 Cr సం|| కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.

★రెడ్డి: 27/ 5'9"/ BE/ MBA/ 1 Cr. P/A / 60 Cr. * 30/ 6'0"/ B.Com/ MBA/ Business/ 8 Cr. సం|| కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.

★రెడ్డి: 33/ 5'8"/ MBBS/ 12LP/A/ 30 Cr. * 30/ 5'7"/ MD/ Paediatrics/ 50Cr. సం|| కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.

★రెడ్డి: 30/ 5'7"/ MBBS/ Gen.Med/ Govt Job/ 5 Cr * 32/ 5'8"/ MBBS/ Emergency Med/ 2 Cr. సం|| కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.

★రెడ్డి: 39/ 5'11"/ M.Sc/ Ph.d/ 12LP/A/30 Cr. * 33/ 5'10"/ MBA/ 8LP/A/ 5 Cr. సం|| కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.

★రెడ్డి రెండవ పెళ్ళి: 39/ 5'11"/ B.Com/Business/ 40 Cr * 33/ 5'10"/ MBBS/ 6LP/A/ 2 Cr. సం|| కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.

వరుడు కావలెను

★రెడ్డి: 28/ 5'4"/ BE/ MS/ USA/ 70K/ 1 Cr * 27/ 5'1"/ BE/MS/ USA/ 80K/ 1 Cr సం|| కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.

★రెడ్డి: 26/ 5'3"/ BE/ MS/ USA/ H1/ 150K/ 1 Cr * 25/ 5'6"/ BE/ MS/ USA/ 90K/ 2 Cr. సం|| కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.

★రెడ్డి: 26/ 5'4"/ BE/ MS/ USA/ H1/90K/ 10 Cr * 23/ 5'5"/ BE/ MS/ USA/ 15 Cr. సం|| కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.

★రెడ్డి: 26/ 5'5"/ BE/ 5LP/A/ 3 Cr * 33/ 5'2"/ B.Pharm/ 3LP/A/ 50 Lakhs. సం|| కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.

★రెడ్డి: 23/ 5'5"/ BE/ Central Govt Job/ Only One / 1Cr. * 23/ 5'4"/ BE/ MBA/ 3 Cr. సం|| కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.


★రెడ్డి: 28/ 5'2"/ BE/ 11LP/A/ 5 Cr * 25/ 5'5"/ BE/ 7LP/A/ 6 Cr. సం|| కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.

★రెడ్డి: 23/ 5'4"/ BE/ M.Tech/ 10LP/A/ 5 Cr * 24/ 5'4"/ BE/ Civils Prepared/ 8 Cr. సం|| కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.

★రెడ్డి: 30/ 5'7"/ MD/ Paediatrics/ 2 Cr * 26/ 5'6"/ MS/ Gynaecology/ 1 Cr. సం|| కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.

★రెడ్డి: 27/ 5'6"/ Pharm-D/ 5LP/A/ 2 Cr * 27/ 5'1"/ MD/ Rediology/ 2 Cr. సం|| కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.

★రెడ్డి రెండవ పెళ్ళి: 28/ 5'4"/ B.ARCH/ 6LP/A/ 5Cr * 30/ 5'4"/ BE/MBA/5LP/A/ 1 Cr. సం|| కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.



కళ్యాణ వేదికలు

★T.Bhoom Reddy Marriage Bureau for Local, Abroad Matches. Cont: H-13/1, Near Ahobilamutt, D.D. Colony, Hyd. Ph: 040-27425273, 8790123939, 9347225273

★శ్రీశ్రీ కొమురవెల్లి మల్లన్న వివాహ వేదిక: ప్రత్యేకముగా యాదవులకు, కురుమలకు, లేట్, 2వ & ఇతర కులాలవారికి సంబంధాలు చూడబడును. Hyd. 9701552985, Whats App: 7680857955

★ లక్ష్మీనరసింహా గౌడ్స్ మ్యారేజ్ బ్యూరో: 1వ, 2వ సంబంధాలు గౌడ్స్‌కి మాత్రమే చూడబడును. B.B.R. Hospital ప్రక్కన, బాలానగర్, హైదరాబాద్. Ph: 9603676103

★ పద్మశాలి కులబాంధవులకు శుభవార్త! గత కొన్ని దశాబ్దాలుగా నామ మాత్రపు ఫీజుతో సేవలందిస్తున్న వీవర్స్ వెల్ఫేర్ ట్రస్టు వారి ఆధ్వర్యములో పద్మశాలి పరిణయ పరిచయ వేదికను తేది: 17-02-2019 ఆదివారం రోజున 1 PM నుండి 5 PM వరకు నిర్వహిస్తున్నాము. సంప్ర: పద్మశాలి భవన్, నారాయణగూడ, హైదరాబాద్. ఫోన్ నెం. 040-24765557/8/9

★SC మాదిగ మొదటి, రెండవ మరియు లేట్ మ్యారేజ్ సంబంధాలకై సంప్రదించండి. ఫ్రీ రిజిస్ట్రేషన్. ఫోన్: 9052025113

★ మేరు (దర్జీ) కులస్తులకు మాత్రమే చూడబడే ఏకైక సంస్థ మొదటి, రెండవ, లేట్ మ్యారేజెస్, Dr. Eng.Govt,Degree, మ్యాచెస్ ఉన్నాయి. సంప్ర: 9494252545

★మాలల మాంగల్యధారణ హిందూ మాల క్రిష్టియన్ మాల, 1వ, 2వ లేట్ దేశ విదేశీ వారికి సేవాభావంతో సంబంధాలు చూపబడును. Ph: 8331909659, 9491875479



వధువు కావలెను

★వైశ్య:30/5'6"/8A 12000/- Per Month అందమైన ఒంటరి వరునకు తగిన వైశ్య లేదా బ్రాహ్మణ కుల వధువు కావలెను. ప్రస్తుతం ఎలాంటి ప్రాపర్టీ లేదు. వృత్తి: ఆస్ట్రాలజర్, వాస్తుప్లానర్, బిల్డింగ్ ప్లానర్, ల్యాండ్ సర్వేయర్ డైరెక్ట్ కాంటాక్ట్ నో బ్రోకర్స్ Ph: 9502438614

★మేరు:29/5'6"/టైలర్/15,000/- PM, Hyderabad, వేములవాడలో సొంత ఇల్లు కలిగిన అబ్బాయికి అమ్మాయి కావలెను. సంప్రదించండి: 9010150541

★ఆర్య, వైశ్య, డైవర్స్ 41 Yrs, B.Com., 5'6", బిజినెస్ నెలసరి ఆదాయం 1 లక్ష, ఫిట్‌నెస్ గల వరునికి Any Forward Caste దైవ గుణాలు కలిగిన అందమైన వధువు కావలెను. డైరెక్ట్ సంప్ర:8341742398

★బహుమతి 50 గ్రాముల బంగారం (OR) KWID CAR FC/లేట్ మ్యారేజ్/36Y/5.8"/ ఫెయిర్ & స్లిమ్/ BA కంప్యూటర్ హార్డ్‌వేర్/వెల్ సెటిల్డ్/చెడు అలవాట్లు లేని వరునికి/ OC,BC,CNB వధువు కావలెను/కట్న పట్టింపు లేదు/ చాలా అందమైన / మంచి నడవడిక గల / ఇతరులకు మర్యాద ఇచ్చు సాంప్రదాయపు వధువు అర్జెంట్‌గా కావలెను/ఫోటోలు మరియు వివరాలు డైరెక్టుగా ఇ మెయిల్ drmgl01@gmail.com, & drmz@gmx.us చేయండి



వరుడు కావలెను

★రెడ్డి:33, విడో మరియు రెడ్డి 55, విడో Govt. Employee వధువులకు రెడ్డి వరులు కావలెను. ST/ 31 వధువుకు కులపట్టింపులేని వరుడు కావలెను. పెన్షనర్స్ కూడా OK. 9603309135/7981322231

★మాదిగ:26Y, 5'4", MBA, Asst Mngr in Andhra Bank 60,000/- PM వెల్ సెటిల్డ్ అయిన వధువుకి వరుడు కావలెను. Ph: 8142220475,8008050350

★SC హిందూ మాదిగ 5'5"/35 సం|| MA TPT Pvt. Job వధువుకి తగిన వరుడు కావలెను. లేట్ మ్యారేజ్. నో బ్రోకర్స్. 9885753748, 9949409479

★SC మాదిగ, Age : 30, Ht.5".4, చామనచాయ, Govt. Job నకు Hyd లో జాబ్ చేసే తెలంగాణ వరుడు కావలెను. సెల్: 8074518809, 6300364563

గమనిక: "కళ్యాణమస్తు" ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటన దారులకు సంబంధించిన హామీలకు పత్రిక బాధ్యత వహించదు. ప్రకటనల అన్ని విషయాలలో వధూ వరులు, పెండ్లి పెద్దలే నిర్ణయాలు తీసుకోవాలి. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

కళ్యాణమస్తు
8-2-603/1/7, 8, 9, Krishnapuram, Road. No.10 Banjara Hills, Hyderabad - 500034.
80966 77819

www.avinashreddy.com

రెడ్డి వధూవరుల వివాహ సంబంధాలకై సంప్రదించండి: 690, RoadNo.3, BanjaraHills, Hyd.
Tuesday Holiday, Timings: 10 AM to 5 PM, avinash11818@gmail.com
93933 11818

వధువు కావలెను

★ Reddy BE, MS, 26, 5'11", 90K, 2 Crores, SWE, USA. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★ Reddy BE(IIT), MBA, 26, 5'10", 150 K, Handsome. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★ Reddy BE, M.Tech, 29, 6'1", SWE, 3 Crores, Handsome.Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★ Reddy Business, BBA, 25, 5'10", Handsome. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★ Reddy 100 Crores, 27, 6', Handsome, BE, MS. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★ Reddy PhD, 30, 5' 9", 230 K, USA, Handsome, Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com

వరుడు కావలెను

★ Reddy BE, MS, 28, 5'5", 3 Crores, H1, USA. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com


★ Reddy Accenture, BE,MBA, 27, 5'6", Rich, Software. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

★ Reddy BE, 26, 5'3" 16 L P/A, Fair & Slim. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

★ Reddy BE, MS, 24, 5'4", SWE, 65 K, USA, Fair & Slim. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

★ Reddy MBA, 25, 5' 8", Sr Analyst, 12 L P/A, Fair. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

★ Reddy BE, MS, USA, 24, 5' 4", 15 Crores, Fair & Slim. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com



www.avinashreddy.com
అవినాష్ రెడ్డి మ్యారేజెస్
తెలంగాణ రెడ్డి

వివాహ సంబంధాలకు సంప్రదించండి
D.V. Koti Reddy
690, Road No-3, BanjaraHills HYDERABAD
98480 11818

★ Reddy UK, BE, MS, 33, 5'5", SWE, Handsome. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★ Reddy Residency Doctor, 32, 5'10" USA, Handsome. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★ Reddy BE, MS, 29, 5' 11", H1, 100K, USA. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★ Reddy BE, MS 27, 5'11", 85 K, 8 Crores, H1, USA, Handsome. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★ Reddy Rayalseema, BE, MS, 26, 5'10", USA, 120 K. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★ Reddy Construction, BE, MBA, 26, 5'11", Rich, Hyderabad. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★ Reddy BE, 29, 6', 34 L P/A, Hyd, Handsome. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★ Reddy BE, MBA 27, 5'9", Manager, Handsome. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★ Reddy MBBS, USMLE, 26, 5'4", fair & slim. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

★ Reddy BE, MS, 26, 5'1" , Manager, 17L P/A, fair & slim. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

★ Reddy Rayalseema, BE, MS, 26, 5'6", USA, Software,120K.Cont:Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

★ Reddy MBA, 27, 5' 3", Hyd, 2.5 Crores, Fair. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

★ Reddy BE, MS, 24, 5'5", 10 Crores, Software, USA. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

★ Reddy BE, MS, 27, 5'3", 9 Crores, SWE, USA. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

★ Reddy BArch, 27, 5'7", Fair & Slim, Hyderabad. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

★ Reddy MBBS, MD, 26, 5'6", Doctor, Hyderabad. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

కురుమ-యాదవ ప్రత్యేకం



కురుమ-యాదవ విదేశీ, ఇంజనీర్స్, SWE, డాక్టర్స్, Govt/PVT., బిజినెస్ మరియు 2వ సంబంధాలకై సంప్ర: కులజులు ఆదరిస్తున్న విశ్వసనీయమైన నెం.1 సంస్థ
www.kurumapellipandhiri.com
కురుమ పెళ్ళి పందిరి, DSNR, HYD.
9396649499, 9393001666
6303994641
కౌశిక శ్రీనివాసరావు కురుమ, చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్

"శుభమస్తు" మ్యారేజ్ బ్యూరో

TM EST: 1995
గౌడ, ఈడిగ, శెట్టిబలిజ 1st, 2nd, దేశ, విదేశ సంబంధాలకై సంప్రదించండి.
ఎస్. శారదా గౌడ్
లింగాల కాంప్లెక్స్, DSNR, HYD.
24150704/9490479371
Email: subhamastu_saradagoud@yahoo.co.in

కుమ్మరి కళ్యాణ వేదిక

కుమ్మరి కులస్తుల పెళ్ళి సంబంధాల కోసం సంప్రదించండి
దేవరుప్పల యాదగిరి కుమ్మరి
బడంగ్‌పేట్, హైదరాబాద్ జిల్లా
Cell: 9640972206

MUDIRAJ SANKSHEMA SAMITHI MARRIAGE BUREAU

Regd No: 109/2015



సంబంధాలకు తిరుగులేని సంస్థ
దేశ/విదేశ, ఇంజనీర్స్, డాక్టర్స్, Govt., Pvt. జాబ్స్, బిజినెస్, 1వ, 2వ సంబంధాలు స్పెషల్ Above 45 Yrs M/F. వ్యక్తిగత శ్రద్ధతో కుదుర్చబడును. ఫ్రీ రిజిస్ట్రేషన్
ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ ప్రక్కన, ముషీరాబాద్, హైదరాబాద్
Prof. టి. భూమయ్య సెల్:9441090986, 8247881382

శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్ లైన్



రెడ్డి వధూవరుల వివాహ సంబంధాలకై సంప్రదించండి
Flat No. 201, 2nd Floor, Sheshadri Heights Apartment
Opp: SLMS Hospital, Nagole "X" Road, Hyd.
Cell: 73968 91999 / 9398618816
దేశిరెడ్డి శోభారెడ్డి
రైతు బిడ్డలకు ప్రత్యేకం

వధువు కావలెను

★రెడ్డి: 29Yrs, 6:Ft; B.Tech, SWE, USA: 130KP.A 5CR Property గల వరుడికి తగిన వధువు కావలెను. 7396891999

★రెడ్డి: 30Yrs, 5,9" MS SWE, USA: 140 KP.A 20 Cr Property, H1B; గల వరుడికి తగిన వధువు కావలెను. 7396891999

★రెడ్డి: 28Yrs, 5,7" MS SWE, USA: 110K; 6Cr, H1B గల వరుడికి తగిన వధువు కావలెను. 7396891999

★రెడ్డి: 29Yrs, 5,11" MS SWE, USA: 100K; 3Cr, H1B Fair గల వరుడికి తగిన వధువు కావలెను. 7396891999

★రెడ్డి: MBBS, MS, Neurologist, 28Yrs, 5'8" 10Cr Property, Fair, గల వరుడికి తగిన వధువు కావలెను. 7396891999

★రెడ్డి: 27Yrs, 5,8" B.Tech, MBA, MANAGER, 80K, 5Cr, Fair, గల వరుడికి తగిన వధువు కావలెను. 7396891999

★రెడ్డి: 53Yrs, 5,9" MA, MANAGER, 50K, 4Cr, గల వరుడికి తగిన వధువు కావలెను. 7396891999

★రెడ్డి: 30Yrs, 6,00F, Fair, Business, PG, 8 CR, గల వరుడికి తగిన వధువు కావలెను. 7396891999

★రెడ్డి: Govt Job: LDC, 35Yrs, 5'5", Fair, 50K గల వరుడికి తగిన వధువు కావలెను. 7396891999

★రెడ్డి: MBBS, డాక్టర్: 32 Yrs Fair 5,6" 5Cr, గల వరుడికి తగిన వధువు కావలెను. 7396891999

వరుడు కావలెను

★రెడ్డి: 2nd Marriage: 31Yrs, 5'5", Fair, 100K, Chemist, USA: గల వధువుకి తగిన వరుడు కావలెను. 9398618816

★రెడ్డి: H1B, Software(SWE), USA, MS, 24, 5'2", Fair, 100K, గల వధువుకి తగిన వరుడు కావలెను. 9398618816

★రెడ్డి: SWE, USA, MS, 28Yrs, 5'4" Fair గల వధువుకి తగిన వరుడు కావలెను. 9398618816

★రెడ్డి: MCA, 30Yrs, 5'5" Fair, గల వధువుకి తగిన వరుడు కావలెను. 9398618816

★రెడ్డి: Govt Job: 2nd Marriage: 33Yrs, 5'2", Fair, 65,000 PM, గల వధువుకి తగిన వరుడు కావలెను. 9398618816

★రెడ్డి: Degree: 26Yrs, 5'3" Fair, గల వధువుకి తగిన వరుడు కావలెను. 9398618816

★రెడ్డి: Govt Job, MCR: 30Yrs 5'4" Fair, 43000 PM, గల వధువుకి తగిన వరుడు కావలెను. 9398618816

★రెడ్డి: SWE, B.Tech, 23yrs, 100 Cr Property, 5'3", fair: 30K గల వధువుకి తగిన వరుడు కావలెను. 9398618816

★రెడ్డి: SWE, M.Tech, 26yrs, 5'7", Fair గల వధువుకి తగిన వరుడు కావలెను. 9398618816

★రెడ్డి, డాక్టర్: MBBS, 28yrs, 5'5" Fair గల వధువుకి తగిన వరుడు కావలెను. 9398618816

శ్రీ సౌభాగ్య మ్యారేజ్ బ్యూరో

అన్ని కులముల పెండ్లి సంబంధములకు సంప్రదించండి.



తార్నాక, షాప్ నెం.48, హుడా కాంప్లెక్స్,
Konala Bhagyalakshmi Reddy, M.A.
President: Telangana Marriage Links.
Cell: 9246960888
Whatsapp: 9866044439

వధువు కావలెను

★బ్రాహ్మణ్స్: 28Yrs, 5'11", B.Tech, SWE, 10L PA గల వరునికి తగిన వధువు కావలెను. 9246960888

★వైశ్యా: 31Yrs, 5'7", M.Sc (Bits pilani), Chief Technical Officer, 28L PA గల వరునికి తగిన వధువు కావలెను. 9030315599

★వెల్మా: 29Yrs, 5'5", MS, SWE, USA, 120K PA గల వరునికి తగిన వధువు కావలెను. 9248064777

★ఎల్లాపు: 28Yrs, 5'7", B.Tech, M.S, SWE, USA, 100K PA, 10 Crores Property గల వరునికి తగిన వధువు కావలెను. 9246960888

★పద్మశాలి: 29Yrs, 5'6", M.Tech, RNB, Govt. Employee, 70,000 PM గల వరునికి తగిన వధువు కావలెను. 7207930999

★గౌడ్స్: 30Yrs, 5'6", MBA, Manager, 70,000 PM, Well Settled వరునికి తగిన వధువు కావలెను. 9030315599

★ముదిరాజ్: 29Yrs, 6'0", M.Tech, SWE, 10L PA గల వరునికి తగిన వధువు కావలెను. 7207930999

★నాయీబ్రాహ్మణ్స్: 27Yrs, 5'11", B.Tech, Bank Manager, 50,000 PM గల వరునికి తగిన వధువు కావలెను. 9248064777

★మాల హిందూ: 30Yrs, 6'0", MBA, Govt. Employee, 1L PM, 10 Crores Property గల వరునికి తగిన వధువు కావలెను. 9246960888

★కమ్మ రెండవ పెళ్ళి: 37Yrs, 5'9", M.Sc, Lecturer, 80,000 PM గల వరునికి తగిన వధువు కావలెను (కుల పట్టింపు లేదు). 9030315599

వరుడు కావలెను

★కమ్మ: 28Yrs, 5'5", B.Tech, SWE, USA, 85K PA, 10 Crores Property గల వధువుకు తగిన వరుడు కావలెను. 9030315599

★కాపు: 29Yrs, 5'2", B.Tech, Govt. Employee, 70,000 PM గల వధువుకు తగిన వరుడు కావలెను. 9246960888

★మున్నూరుకాపు: 25Yrs, 5'5", MBA, Private Employee, 12,000 PM గల వధువుకు తగిన వరుడు కావలెను. 9248064777

★పద్మశాలి: 25Yrs, 5'2", B.Tech, SWE, 25,000 PM గల వధువుకు Govt./SWE వరుడు కావలెను. 7207930999

★గౌడ్స్: 27Yrs, 5'5", B.Tech, MBA, SWE, 50,000 PM గల వధువుకు తగిన India/USA వరుడు కావలెను. 9030315599

★ముదిరాజ్: 26Yrs, 5'2", B.Tech, Central Govt. Employee, 30,000 PM గల వధువుకు తగిన వరుడు కావలెను. 9246960888

★యాదవ: 24Yrs, 5'2', B.Tech, SWE, 15,000 PM గల వధువుకు తగిన వరుడు కావలెను. 9248064777

★మాల హిందూ: 28Yrs, 5'5", B.Tech, M.Tech, Govt. Employee, 80,000 PM గల వధువుకు తగిన వరుడు కావలెను. 7207930999

★మాదిగ హిందూ: 27Yrs, 5'1", M.Tech, SWE, 50,000 PM గల వధువుకు తగిన వరుడు కావలెను. 9030315599

★రెండవ పెళ్ళి (కులపట్టింపు లేదు): 29Yrs, 5'4", B.Tech, SWE, 8L PAగల వధువుకు తగిన వరుడు కావలెను. 9246960888

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై|| లి||

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, abroad Matches Fast Settlement: (For Reddy's Only) (Telangana) Cont:K.C. Reddy, Address: 106, A.K. Enclave, Phase-II, 8-2-350, Road No.3, Banjara Hills (Near A.P.Furniture Mall), Hyd.
Ph: 9849321309 / 9347807015
Email: kcreddy43@gmail.com

వధువు కావలెను

★ Reddy/MBBS/ (OSM) MD/ Gen-Med/V.Smart boy/Rich/29/5'-00"/Cont. K.C.Reddy- Mar-Bureau-Banjara Hills, Road No.3, Hyd.Ph:9849321309, 9347807015

★ Reddy/B.Tech/MS/Industrilist/ Hyd/31/ 5'-8"/100cr. Cont . K.C.Reddy-Mar-Bureau-Banjara Hills, Road No.3, Hyd.Ph:9849321309, 9347807015

★ Reddy/B.Tech/MS/USA/ 30/ 5'-8"/100cr. Cont . K.C.Reddy-Mar-Bureau, Banjara Hills, Road No.3, Hyd.Ph:9849321309, 9347807015

★ Reddy/MBA/ Good Business/ 27/ 5'11"/ V. Smart/ 350 Cr * MS/ 28/ 6'/ 200 Cr/ Hyd. * 29/6' 300 Cr * 30/6'/ 200 Cr * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/B.Tech/MS/ 29/ 5'10"/ 100 Cr * MS/ 30/ 5'8"/ 100 Cr * MBA/ 31/ 5'11"/ 350 Cr/ Hyd * 25/ 5'10"/ 100 Cr * 29/ 6'/ 50 Cr * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/ B.Tech/ H1/ USA/ 230K/ Microsoft/ 29/ 5'8" *MS/ 28/5'11"/ 20Cr *30/5'11"/ 200K *28/5'10"/ 140K/ * Cont: K.C. Reddy - Hyd. Ph:9849321309.

★ Reddy/ MBA/ V. Smart Boy/ Business/ 27/5'11"/ 350 Cr/ Hyd * MS/ 27'6"/ 200 Cr * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/ B.Tech/ MBA/ 25/ 5'10"/ 100 Cr - Only Son * 28/ 6'/ 50 Cr/ Only Son * 29/ 5'11"/ Only Son/ 100 Cr * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309.

★ Reddy/ B.Tech/ MS/ H1/ USA/ V. Smart 26/6'/ 120K/ 30 Cr * B.Tech/ Business/ 28/ 6'/ 300 Cr * 29/ 5'11"/ 200 Cr * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/ Business/ B.Tech/ MS/ 27/ 5'9"/ 75 Cr * 31/ 5'9"/ 200 Cr * 26/ 5'6"/ 50 Cr * 28/ 5'9"/ 100 Cr * 29/ 6'/ 200 Cr * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/ Business/ B.Tech/ 31/ 5'10"/ 150 Cr * 30/ 5'10/ 300 Cr * 33/ 5'10/ 200 Cr/ MBA * MBA/ 40/ 6'/ 100 Cr * Cont K.C. Reddy-B.Hills-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/ BE(BITS)/ * VIT/ NIT * 28/ 5'10/ 40L/Yr * 28/ 5'11"/ USA/ 120K * 28/ 5'8"/ Bang/ 30 Cr * 29/ 5'11"/ 31L/Yr * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/ B.Tech/ VIT/ MBA/ USA/ 200K/ 30/ 5'11"/ H1/ USA * 30/ 5'9"/ 26L/ Yr * 28/ 5'8" * B.Tech/ Pilot/ 34/ 5'11"/ 3L/M * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/ MBBS/ PG * 29/ 5'7"/ 50 Cr * MS/ Sur/ 28/ 5'11" * GM/ 29/ 5'7" * Ortho/ 29/6'/ 75 Cr * Ort/ 26/ 5'10" * Rad/ 28/ 5'8" * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309.

★ Reddy/ MBBS/ PG/ Sur/ 25/ 5'8" * GM/ 30/ 5'11"/ 25 Cr * Opt/ 31/ 5'10" * Pad/ 30/ 5'9" * GM/ 29/ 5'11 * Anes/ 29/ 5'10" * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/ B.Tech/ MS/ H1/ USA/ * 28/ 5'11"/ 120K * 28/ 5'9"/ 120K * 27/ 5'11"/ 120K * 28/ 5'7"/ 50 Cr * 28/ 5'9"/ 90K/ 10 Cr * 29/ 6'/ 125K/ 30 Cr * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/ B.S/ USA/ CITIZEN * 28/ 5'11"/ 20 Cr * 30/ 5'11"/ 100K * Doctor/ 28/ 6'/ 50 Cr/ Surgeon * 44/ 6'/ Doc * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/ Divorcee/ Aus/ CITIZEN/ 37/ 5'7"/ 25 Cr (Prop) Hyd/ 92K/ B.Tech/ MS * Cont K.C. Reddy-B.Hills-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/ Divorcee/ India * M.Sc/ 35/ 5'11"/ 200 Cr * 29/ 5'10"/ 40 Cr * USA/ Doc/ 36/ 5'8" * MBBS/ MD/ 30/ 5'9"/ DM/ 15 Cr * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309.

★ Reddy/ B.Tech/ MS/ Now Business/ 29/ 5'9"/ 300 Cr * M.Sc/ Navy/ Lieutenant/ 27/ 5'11" * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

వరుడు కావలెను

★ Reddy/MBA/Very Smart/31/ 5'-2 1/2"/150cr. (Her Share) Cont . K.C.Reddy-Mar-Bureau-Banjara Hills, Road No.3, Hyd.Ph:9849321309, 9347807015

★ Reddy/B.Tech/VMS/H1/Beautifull/27/ 5'-5"/20cr. (Her Share) Cont . K.C.Reddy-Mar-Bureau-Banjara Hills, Road No.3, Hyd.Ph:9849321309, 9347807015

★ Reddy/USA/CITIZEN/MBBS/RES.DOC 31/5'6" (surgery) *28/5'5" *27/5'7"/50Cr *27/5'4"/50 Cr. Cont: K.C. Reddy-Hyd. Ph:9849321309/9347807015

★ Reddy/M.Sc (Food Technology) 26/5'5"/12Cr. Cont: K.C.Reddy-Mar-Bureau-Road No.3, B.hills-Hyd. Ph:9849321309/ 9347807015

★Reddy/MBBS/MS/(Gynec) *28/5'5"*26/5'5"*29/5'1"*Cont:K.C. Reddy-Road, No.3, Banjara Hills, Hyd. Ph:9849321309/9347807015.

★Reddy/(Divorcee)/B.Tech/31/5'2 1/2" 10Cr*26/5'3"/10Cr*32/5'6"/20Cr*35/5'3"/ 10Cr*29/5'5"/5Cr* 30/5'5"/10Cr *Cont: K.C. Reddy- Hyd. Ph:9849321309

★Reddy/ MBA/ 26/ 5'4"/ 300 Cr * 27/ 5'6"/ 100 Cr * 24/ 5'6"/ 150 Cr * 23/ 5'6" * 60 Cr * 28/ 5'3"/ 50 Cr * 28/ 5'5"/ 50 Cr * 30/ 5' 2 1/2"/ 100 Cr *Cont K.C. Reddy - Hyd. Ph: 9849321309.

★Reddy/ MBBS/ 22/ 5'3"/40 Cr * 22/ 5'5"/ 30 Cr * MS/ 31/ 5'4"/ 50 Cr * MD/ 30/ 5'8"/ 500 Cr * Cont K.C. Reddy-Road No.3- B.Hills-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/ B.Tech/ 28/ 5'3"/ 20 Cr * 28/ 5'3"/ 10 Cr * 25/ 5'6"/ 50 Cr *27/ 5'8"/ 50 Cr * 26/ 5'5"/ 50 Cr * 23/ 5'3"/ CA/ 20 Cr * 26/ 5'4"/ 10 Cr * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/ B.Tech/ MS (USA) Ph.D/ 33/ 50 Cr Needs India or USA Proposals * Cont K.C. Reddy-Road No.3- B.Hills-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/ MBBS/ USA Res-doc * 26/ 5'7"/ 50 Cr * 26/ 5'5"/ 50 Cr * 29/ 5'5"/ 200K/ 10 Cr * 28/ 5'6" * Cont K.C. Reddy-Road No.3- B.Hills-Hyd. Ph:9849321309.

★Reddy/ B.Tech/ MS/ H1/ USA * 24/ 5'3"/ 10 Cr * 26/ 5'7"/ 30 Cr * 28/ 5'4"/ 30 Cr * 25/ 5'4"/ 25 Cr * 26/ 5'5"/ 10 Cr * 26/ 5'3 1/2"/ 40 Cr * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/ B.Tech IIT/ BITS/ MS/ H1/ USA * 25/ 5'7" 240K * 26/ 5'6"/ 105K * 30/ 5'5"/200K * 29/ 5'3"/ 200K * 28/ 5'4" * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/ B.Tech/ M.Tech/ 25/ 5'6"/ 60 Cr * 25/ 5'4"/ 20 Cr * 31/ 5'4"/ 70 Cr * 28/ 5'3"/ 10 Cr * 29/ 5'3"/ 50 Cr * 26/ 5'5"/ 10 Cr * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/ B.Tech/ M.Tech/ Working/ India *24/5'5"/15Cr *26/5'6"/ 15Cr *28/5'3"/ 10Cr *28/5'5"/ 50Cr *27/5'5"/ 20Cr *Cont K.C. Reddy - Hyd. Ph: 9849321309, 9347807015

★ Reddy/ B.Tech/ MBA/27/ 5'3'/ 10Cr *28/5'3"/ 20Cr *26/5'6"/ 15Cr *26/ 5' 6"/ 7Cr *Cont K.C. Reddy -Mar-Bureau- Bhills -Hyd. -Hyd. Ph: 9849321309, 9347807015

★ Reddy/(IIT)/B.Tech/ MS/H1/ USA *BITS) 25/5'3'/ 240Cr *26/5'6"/ 110K *30/5'5"/ 200K *26/ 5' 2"/ 145K *29/5'4"/200K *Cont K.C. Reddy -Hyd. Ph: 9849321309

★Reddy/ B.Tech/ MBA/ Most beautiful/ 26/5'5"/ 50Cr (her share) (Prop) *Cont : K.C. Reddy -Mar- Bureau-Hyd. Ph: 9849321309/ 9347807015.

★Reddy/ Rich/ Beautiful/ B.Tech/ 24/ 5'3"/ 50Cr *26/ 5'3 1/2/ 40Cr *30/5'2 1/2/ 100Cr *27/ 5'3"/ 40Cr *28/5'6"/ 100Cr *Cont : K.C. Reddy -Hyd. Ph: 9849321309/ 9347807015.

★Reddy/ B.Tech/ MS/ H1/ USA/ 26/5'3"/ 50Cr *26/5'7"/ 30Cr *26/5'3"/ 40Cr *Cont : K.C. Reddy -Mar-Bureau-B.Hills-Hyd. Ph: 9849321309/ 9347807015.

జీఎస్టీ వసూళ్లు రూ.1.02 లక్షల కోట్లు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: గడిచిన నెలకుగాను రూ.1.02 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైనట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత ఇంతటి గరిష్ఠ స్థాయిలో పన్ను వసూలవడం ఇది రెండోసారి. డిసెంబర్‌లో రూ.94,725 కోట్లు వసూలవగా, క్రితం ఏడాది ఇదే నెలలో వసూలైన రూ.89,825 కోట్లతో పోలిస్తే 14 శాతం అధికం. డిసెంబర్ నుంచి జనవరి 31 వరకు 73.3 లక్షల మంది తమ విక్రయ రిటర్నులు లేదా జీఎస్టీఆర్-3బీని దాఖలు చేసినట్లు పేర్కొంది. ప్రస్తుత సంవత్సరం తొలి నెలలో రూ.1,02,503 కోట్ల జీఎస్టీ వసూలవగా, దీంట్లో సెంట్రల్ జీఎస్టీ కింద రూ.17,763 కోట్లు, స్టేట్ జీఎస్టీ(ఎస్‌జీఎస్టీ) కింద రూ.24,826 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ(ఐజీఎస్టీ) కింద రూ.51,225 కోట్లు, సెస్ రూపంలో రూ.8,690 కోట్ల వసూలైనట్లు తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ వసూళ్లు లక్ష కోట్లు దాటడం ఇది మూడోసారి. గతంలో ఏప్రిల్, అక్టోబర్‌లో వసూలయ్యాయి. సీజీఎస్టీ కింద రూ.18,344 కోట్లు, ఎస్‌జీఎస్టీ కింద రూ.14,677 కోట్ల మేర చెల్లింపులు జరిపింది కేంద్ర ప్రభుత్వం.

కొచ్చర్‌పై మనీ లాండరింగ్ కేసు



- ఐసీఐసీఐ-వీడియోకాన్ వ్యవహారంలో ఈడీ నమోదు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: ఐసీఐసీఐ బ్యాంక్-వీడియోకాన్ రుణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మనీ లాండరింగ్ క్రిమినల్ కేసును నమోదు చేసింది. బ్యాంక్ మాజీ సీఈవో చందా కొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్‌లతోపాటు వీడియోకాన్ గ్రూప్ అధినేత వేణుగోపాల్ ధూత్ మరికొందరిపై ఈ కేసును ఈడీ దాఖలు చేసింది. వీడియోకాన్‌కు బ్యాంక్ ఇచ్చిన రూ.1,875 కోట్ల రుణంలో అవినీతి, అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఈడీ ఈ కేసును నమోదు చేసింది. ఈ మేరకు శనివారం ఈడీ వర్గాలు తెలిపాయి. గత నెల కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ నమోదు చేసిన కేసు ఆధారంగా మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద ఓ ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్) దాఖలు చేసినట్లు పేర్కొన్నాయి. ఈడీ దాఖలు చేసిన ఈసీఐఆర్.. పోలీస్ ఎఫ్‌ఐఆర్‌కు సమానం. ఈసీఐఆర్‌లో పేర్లున్నవారికి త్వరలోనే సమన్లు జారీ కానున్నాయి. సీబీఐ కేసులో ఉన్నవారే ఈసీఐఆర్‌లోనూ ఉంటారని ఈడీ వర్గాలు తెలిపాయి. కాగా, ఈ కేసులో అక్రమాస్తుల సృష్టికి ఈ రుణాల ఒప్పందం కారణమైతే విచారణ చేస్తామని ఈడీ అధికారులు వెల్లడించారు.

ఐపీవోకి పది పీఎస్‌యూలు

రూ.90 వేల కోట్ల డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం: దీపం కార్యదర్శి చక్రవర్తి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: వచ్చే ఆర్థిక సంవత్సరంలో పది ప్రభుత్వరంగ సంస్థలు స్టాక్ మార్కెట్లో లిస్ట్‌కాబోతున్నాయి. తద్వారా రూ.90 వేల కోట్ల డిజినెస్ట్‌మెంట్ లక్ష్యానికి చేరుకోవడానికి అవకాశం ఉన్నదని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్(దీపం) కార్యదర్శి చక్రవర్తి తెలిపారు. ఐపీవోకి రానున్న సంస్థల్లో టీహెచ్‌డీసీఐఎల్, రైల్‌టెల్, టీసీఐఎల్‌లు కూడా ఉన్నాయి. పలు పీఎస్‌యూల్లో వ్యూహాత్మక వాటా విక్రయంతోపాటు కీలకేతర ఆస్తులను విక్రయించే ప్రతిపాదన కూడా ఉందని పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను నరేంద్ర మోదీ సర్కార్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో వాటాల విక్రయం ద్వారా రూ.90 వేల కోట్ల నిధులను సేకరించాలని సంకల్పించింది. ఈ ఏడాది లక్ష్యంగా పెట్టుకున్న రూ.80 వేల కోట్లలో రూ.36 వేల కోట్లు సమికరించుకున్నది. అలాగే ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్(ఈటీఎఫ్ఎస్), షేర్ల బైబ్యాక్ ద్వారా మరో రూ.44 వేల కోట్లు సేకరించి ఈ లక్ష్యానికి చేరుకోవాలని చూస్తున్నది. వీటిలో ఓఎన్‌జీసీ, కోల్ ఇండియా, ఐవోసీల షేర్ల బైబ్యాక్ ద్వారా రూ.12 వేల కోట్లు, ఆర్ఈసీలో ప్రభుత్వ ఈక్విటీని పీఎఫ్‌సీ కొనుగోలు చేయడం ద్వారా మరో రూ.15 వేల కోట్లు రావచ్చునని ఆయన అంచనావేస్తున్నారు. అలాగే పవన్ హన్స్ డిజిన్వెస్ట్‌మెంట్ ప్రక్రియ వచ్చే నెలలో పూర్తికానున్నదన్నారు. ఇప్పటికే ఈటీఎఫ్ఎస్‌ల ద్వారా రూ.25,325 కోట్ల నిధులను సేకరించింది.



రూ.3,64,400 కోట్లు

- ఒక్కరోజులో అమెజాన్, వాల్‌మార్ట్‌లు కోల్పోయిన మార్కెట్ విలువ
- అమెరికా స్టాక్ మార్కెట్లలో ఒక్కసారిగా కుప్పకూలిన షేర్లు
- భారతీయ కొత్త ఈ-కామర్స్ విధానం దెబ్బ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: దేశంలో కొత్త ఈ-కామర్స్ విధానం రాక నేపథ్యంలో విదేశీ ఆన్‌లైన్ రిటైల్ దిగ్గజాల మార్కెట్ విలువ ఒక్కసారిగా హరించుకుపోయింది. అమెరికాకు చెందిన ఈ మార్కెటింగ్ సంస్థలు అమెజాన్, వాల్‌మార్ట్‌లు శుక్రవారం ఒక్కరోజే ఏకంగా 50 బిలియన్ డాలర్లకుపైగా మార్కెట్ విలువను కోల్పోయాయి. నాస్‌డాక్ స్టాక్ మార్కెట్‌లో అమెజాన్ షేర్ విలువ 5.38 శాతం పతనమై 1,626.23 డాలర్ల వద్ద స్థిరపడింది. దీంతో 45.22 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ శుక్రవారం ట్రేడింగ్‌లో ఆవిరైపోయింది. అలాగే న్యూయార్క్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్‌వైఎస్ఈ)లో వాల్‌మార్ట్ షేర్ విలువ 2.06 శాతం క్షీణించి 93.86 డాలర్ల వద్ద నిలిచింది. ఫలితంగా సంస్థ మార్కెట్ విలువ 5.7 బిలియన్ డాలర్లు పడిపోయింది. రెండు సంస్థలు కలిసి 50.92 బిలియన్ డాలర్ల (డాలర్‌తో పోల్చితే ప్రస్తుతం రూపాయి మారకం విలువ ప్రకారం దాదాపు రూ.3,64,400 కోట్లు) మార్కెట్ విలువను నష్టపోయాయి. అమెరికాలో శుక్రవారం మార్కెట్లు ముగిసే సమయానికి అమెజాన్ మార్కెట్ విలువ 795.18 బిలియన్ డాలర్లు, వాల్‌మార్ట్ మార్కెట్ విలువ 272.69 బిలియన్ డాలర్లుగా ఉన్నది.

ఆందోళనలో ఈ-మార్కెటీర్లు

దేశీయ సంప్రదాయ మార్కెట్ ఆందోళనలు, పారదర్శక వ్యాపార విధానమే లక్ష్యంగా కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు కొత్త ఈ-కామర్స్ పాలసీని అమల్లోకి తెచ్చింది. ఈ నెల 1 నుంచి ఈ నూతన విధానం అమల్లోకి రాగా, అప్పటిదాకా ఉన్న ఆన్‌లైన్ మార్కెటింగ్ జోష్ ఒక్కసారిగా చల్లబడింది. భారీ ఆఫర్లతో కస్టమర్లను ఆకట్టుకుంటున్న ఈ-కామర్స్ సంస్థలు.. ఉత్పాదకదారులతో నేరుగా సంబంధాలు పెట్టుకుంటున్నాయని, ఆయా ఉత్పత్తులను తమ ఆన్‌లైన్ వేదికల్లో విక్రయిస్తున్నాయని, ఇది మార్కెట్ నిబంధనలకు, ఆరోగ్యకరమైన పోటీకి వ్యతిరేకమని సంప్రదాయ మార్కెట్‌దారుల నుంచి కేంద్రానికి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో వీటన్నిటికీ చెక్ పెడుతూ నూతన ఈ-కామర్స్ విధానాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది. దీంతో ఒక్క అమెజాన్ సంస్థనే రాత్రికిరాత్రి లక్షలాది వస్తువులను తమ వెబ్‌సైట్ నుంచి తొలగించాల్సి వచ్చింది. వాల్‌మార్ట్ పైనా కొత్త పాలసీ ప్రభావం పడింది. ప్రపంచ ఆన్‌లైన్ మార్కెట్‌లో భారత్ వాటానే ప్రధానం. దీంతో బహుళజాతి సంస్థల చూపంతా దేశీయ మార్కెట్‌పైనే. ఈ క్రమంలో కొత్త పాలసీ.. విదేశీ ఆన్‌లైన్ మార్కెటీర్ల దూకుడుకు బ్రేకులు వేయగా, ఈ సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన మదుపరులు ఆందోళనలో పడ్డారు. దీంతో స్టాక్ మార్కెట్లలో ఆయా సంస్థల షేర్లు నష్టాలపాలవుతున్నాయి.

ఆన్‌లైన్ మార్కెట్ క్రేజ్‌కు కారణం

నిత్యం ఉరుకులు, పరుగులతో కూడిన ఈ యాంత్రిక జీవనంలో షాపింగ్‌కంటూ కొంత సమయాన్ని కేటాయించడం అసాధ్యమైపోతున్నదంటే అతిశయోక్తి కాదు. ఈ క్రమంలోనే ఆన్‌లైన్ మార్కెట్ ఊపందుకున్నది. మొబైల్ ఫోన్లలో చౌక ఇంటర్నెట్ అందుబాటులోకి రావడం కూడా ఆన్‌లైన్ మార్కెట్‌ను అత్యంత వేగంగా విస్తరించేలా చేసింది. దీంతో కావాల్సిన వస్తువులన్నీ కూడా మొబైల్ ఇంటర్నెట్ ద్వారానే అంతా కొనుక్కుంటున్నారు. ప్రస్తుతం రోజంతా ఆఫీసుల్లో, ఇతరత్రా పనుల్లో క్షణం తీరిక లేకుండా పనిచేస్తున్నవారే ఎక్కువ. ఇలాంటివారందరూ ఈ-కామర్స్ షాపింగ్‌కే మొగ్గు చూపుతున్నారు. అది.. ఇది అనే తేడా లేకుండా అన్ని వస్తువులు, అన్ని వర్గాలకు అవసరమైనవి దొరుకుతుండటం, పైగా భారీ ఆఫర్లకే లభిస్తుండటం కూడా ఆన్‌లైన్ మార్కెట్‌ను బలపరుస్తున్నది. దీంతో ట్రాఫిక్ సమస్యలను అధిగమిస్తూ బజార్లోని షాపులన్నీ తిరిగి కొనడం తక్కువైపోయింది. పాత పెద్ద నోట్ల రద్దుతో ఏర్పడిన నగదు కొరతనూ కొనుగోలుదారులు ఆన్‌లైన్ షాపింగ్‌తో అధిగమిస్తున్నారు. ప్రభుత్వం కూడా తగిన ప్రోత్సాహకాలను అందించడం.. దేశంలో ఆన్‌లైన్ మార్కెట్‌ను పరుగులు పెట్టించింది. కానీ తాజా పాలసీ ఆన్‌లైన్ మార్కెట్ ఆనందాన్ని ఆవిరి చేసింది.

సర్కారుతో సంప్రదింపులు

కొత్త ఈ-కామర్స్ పాలసీ అమలును మరి కొంత కాలం వాయిదా వేయాలని అమెజాన్, వాల్‌మార్ట్‌లు కేంద్ర ప్రభుత్వంతో విశ్వ ప్రయత్నాలనే చేస్తున్నాయి. మరోవైపు సంప్రదాయ మార్కెటీర్లు, వర్తక సంఘాలు దీన్ని అంతే గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. 4 నెలలు వాయిదా వేయాలని అమెజాన్, 6 నెలలు ఆపాలని వాల్‌మార్ట్ కోరుతున్నాయి. తాజా విధానం ప్రభావం.. తమ అమ్మకాలను పెద్ద ఎత్తున ప్రభావితం చేస్తున్నాయని, దీనివల్ల అన్ని రకాలుగా నష్టపోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆన్‌లైన్ మార్కెటీర్లు వాదిస్తున్నారు. అయితే పారిశ్రామిక విధాన, ప్రగతి శాఖ (డీఐపీపీ) మాత్రం ససేమిరా అంటున్నది. గతేడాది డిసెంబర్‌లో కొత్త విధానాన్ని విడుదల చేశామని, సుమారు మూడు నెలల వరకు సమయం ఇచ్చామని గురువారం గుర్తుచేసింది. ఇక వాయిదా వేయడం కుదరదంటూ శుక్రవారం అమల్లోకి తెచ్చేసింది. అయినప్పటికీ తమ కొనుగోలుదారులు, అమ్మకందారులపై ప్రభావాన్ని తగ్గించడం కోసం అమెజాన్.. ప్రభుత్వ వర్గాలతో సంప్రదింపులను కొనసాగిస్తూనే ఉన్నది.

పెట్టుబడులపై ప్రభావం

ప్రపంచంలోనే చైనా తర్వాత అత్యంత జనాభా కలిగిన భారత్‌లో ఉన్న విస్తృత వ్యాపారావకాశాలను అందిపుచ్చుకోవడానికి విదేశీ సంస్థలు విపరీతమైన ఆసక్తినే కనబరుస్తున్నాయి. ఈ క్రమంలోనే అన్ని రంగాల్లోకి పెట్టుబడులు వెల్లువలా తరలివస్తున్నాయి. ఇందుకు ఈ-కామర్స్ మార్కెట్ మినహాయింపు కాదు. గతేడాది ఫ్లిప్‌కార్ట్‌ను వాల్‌మార్ట్ 16 బిలియన్ డాలర్లతో సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. అమెజాన్ సైతం చిన్నచిన్న రిటైల్ సంస్థలను హస్తగతం చేసుకుంటూ భారతీయ ఆన్‌లైన్ మార్కెట్‌పై ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నది. ఇప్పటిదాకా 5 బిలియన్ డాలర్ల పెట్టుబడులను పెట్టింది. ఈ నేపథ్యంలో దేశీయ ఆన్‌లైన్ రిటైల్ వ్యాపారంలో ఈ రెండు సంస్థల వాటానే 75-80 శాతానికి చేరింది. అందుకే కొత్త పాలసీ ప్రభావం మిగతా ఆన్‌లైన్ సంస్థల కంటే కూడా వీటిపైనే ఎక్కువగా కనిపిస్తున్నది. కాగా, తాజా ప్రతికూలతల మధ్య భారత్‌లో మరిన్ని పెట్టుబడులకు ఈ సంస్థలు ఆసక్తి చూపడం లేదు. దీంతో విదేశీ పెట్టుబడులు తగ్గిపోవచ్చన్న అభిప్రాయాలు నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

జీఎంలో 4 వేల ఉద్యోగాల తొలగింపు




న్యూయార్క్, ఫిబ్రవరి 2: ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ జనరల్ మోటార్స్(జీఎం) భారీ స్థాయిలో ఉద్యోగులపై వేటు వేసింది. గడిచిన సంవత్సరంలో ఏకంగా 4 వేల మంది సిబ్బందిని తొలగించినట్లు తెలుస్తున్నది. నిర్వహణ ఖర్చులను తగ్గించుకోనున్నట్లు గత నవంబర్‌లో సంస్థ ప్రకటనకు అనుగుణంగా మొత్తం ఉద్యోగుల్లో 15 శాతం మందిపై వేటు వేయనున్నట్లు గతంలోనే సంకేతాలిచ్చింది. ఇతర సంస్థల నుంచి పోటీ తీవ్రతరమవడం, కంపెనీకి చెందిన వాహనాలకు అంతగా డిమాండ్ లేకపోవడంతో ఏకంగా ఏడు ప్లాంట్లను మూసివేసింది. వీటిలో ఉత్తర అమెరికాలో ఐదు ఉన్నాయి. వీటిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను తొలగించింది. మీడియా నివేదిక ప్రకారం ఇప్పటి వరకు తొలగించిన వారి ఉద్యోగుల సంఖ్య 14 వేల వరకు ఉండగా, వీరిలో 6 వేల మంది పలు కార్మిక సంఘాలకు చెందిన వారు. అమెరికా, కెనడా దేశాలకు చెందిన రాజకీయ నాయకుల కారణంగా సంస్థ తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొవాల్సి వస్తున్నదని, ముఖ్యంగా వీరి కారణంగా 600 కోట్ల డాలర్ల మేర నష్టపోవాల్సి వచ్చిందని కంపెనీ వాపోతున్నది. ఎంతమందిని తొలగించిన దానిపై కంపెనీ వర్గాలు స్పందించడానికి నిరాకరించారు. అలాగే 2,300 మంది వేతన జీవులు స్వచ్ఛందంగా పదవీ విరమణ చేయాలని నిర్ణయం తీసుకున్నారని, మరో 1,500 మంది కాంట్రాక్టు స్టాఫ్ కూడా ఇదే బాటలో పయనిస్తున్నారు.

దివీస్ లాభం రూ.379 కోట్లు



హైదరాబాద్, ఫిబ్రవరి 2: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఔషధాల తయారీ సంస్థ దివీస్ ల్యాబోరేటరిస్ ఆశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను సంస్థ రూ.379 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది నమోదైన రూ.225 కోట్లతో పోలిస్తే భారీ వృద్ధి నమోదైంది. కంపెనీ ఆదాయం రూ.1,055 కోట్ల నుంచి రూ.1,377 కోట్లకు ఎగబాకింది. ఫారెక్స్ నష్టాలు రూ.41 కోట్లకు పెరిగినప్పటికీ లాభాల్లో భారీ వృద్ధిని నమోదు చేసుకోవడం విశేషమని కంపెనీ సీఎండీ మురళి తెలిపారు. ఏప్రిల్-డిసెంబర్ మధ్యకాలానికి రూ.3,746 కోట్ల ఆదాయంపై రూ.1,043 కోట్ల లాభాన్ని ఆర్జించింది.

స్లీప్‌వెల్ అమ్మకాల్లో రెండంకెల వృద్ధి



హైదరాబాద్, ఫిబ్రవరి 2: స్లీప్‌వెల్ పేరుతో పరుపులు, దిండ్లను విక్రయిస్తున్న షీలా ఫోమ్ అమ్మకాల్లో భారీ వృద్ధిని నమోదు చేసుకున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో కంపెనీ విక్రయాలు రెండంకెల వృద్ధి(11శాతం) నమోదైంది. నిధుల కొరత కారణంగా ఆర్థిక మార్కెట్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్న ఈ తరుణంలో కూడా భారీ వృద్ధిని నమోదు చేసుకున్నట్లు కంపెనీ ఎండీ రాహుల్ గౌతమ్ తెలిపారు. గత త్రైమాసికంలో పరుపుల ఇండస్ట్రీ కేవలం ఆరు శాతం వృద్ధిని నమోదు చేసుకోగా..ఇదే కంపెనీ విషయానికి వస్తే దీనికంటే రెండు రెట్లు అధికంగా నమోదు చేసుకున్నదన్నారు. దేశవ్యాప్తంగా అసంఘటిత రంగం నుంచి సంఘటిత రంగం వైపు కొనుగోలుదారులు ఆసక్తి కనబరుస్తుండటం ఇందుకు కారణమని చెప్పారు. డిసెంబర్ 31 నాటికి సంస్థకు 6,800 అవుట్‌లెట్లు ఉన్నాయి. వీటిలో 3,800 ఎక్స్‌క్లూజివ్ అవుట్‌లెట్లు ఉండగా, 3000 మల్టీ బ్రాండ్ అవుట్‌లెట్లు ఉన్నాయి. 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.1,500 కోట్లుగా నమోదైన టర్నోవర్..ఈ ఏడాది రూ.2 వేల కోట్లకు చేరుకునే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

కొత్తూరులో ఎంఆర్ఎఫ్ మజిల్ జోన్ సెంటర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రముఖ టైర్ల సంస్థ ఎంఆర్ఎఫ్..హైదరాబాద్ సమీపంలోని కొత్తూరు వద్ద తన మజిల్‌జోన్ సెంటర్‌ను శనివారం ప్రారంభించింది. ఈ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ కొషి వర్ఘీస్ మాట్లాడుతూ.. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న టైర్ల ఉత్పత్తి కేంద్రానికి అదనంగా ఈ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ సెంటర్ ద్వారా కమర్షియల్, ప్యాసింజర్ వాహనాలకు సంబంధించిన వీల్ అలైన్‌మెంట్, వీల్ బ్యాలెన్సింగ్, ఆటోమెటిక్ టైర్ ఫిట్‌మెంట్ సేవలు అందించవచ్చుని ఆయన వెల్లడించారు.

నమస్తే తెలంగాణ
ఆట
10
[కరీంనగర్]
ఆదివారం 3 ఫిబ్రవరి 2019
WWW.NTNEWS.COM

మందన @ 1

న్యూఢిల్లీ: భారత బ్యాట్స్‌ఉమన్ స్మృతి మంధన.. ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని కొల్లగొట్టింది. శనివారం విడుదల చేసిన తాజా జాబితాలో ఆమె మూడు స్థానాలు ఎగబాకి 751 రేటింగ్ పాయింట్లతో టాప్‌లో నిలిచింది. దీంతో టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీతో సమంగా నిలిచింది. న్యూజిలాండ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'ను సాధించడం మంధన ర్యాంకింగ్స్ మెరుగుపడటానికి దోహదపడింది. తొలి రెండు వన్డేల్లో వరుసగా 105, 90 పరుగులు చేసిన మంధన సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించింది. ఆస్ట్రేలియాకు చెందిన ఎలీస్ పెర్రీ, మెగ్‌లానింగ్, సాథర్‌వైట్ (న్యూజిలాండ్) వరుసగా రెండు, మూడు, నాలుగు ర్యాంకుల్లో ఉన్నారు. మరోవైపు కెరీర్‌లో 200వ మ్యాచ్‌తో అరుదైన ఘనతను అందుకున్న కెప్టెన్ మిథాలీ రాజ్.. ఐదో ర్యాంకుకు పడిపోయింది. బౌలింగ్‌లో వెటరన్ పేసర్ ఝులన్ గోస్వామి నాలుగో ర్యాంక్‌లో ఉండగా, స్పిన్నర్ పూనమ్ యాదవ్, దీప్తి శర్మ వరుసగా ఎనిమిది, తొమ్మిదో ర్యాంక్‌ల్లో కొనసాగుతున్నారు. ఆల్‌రౌండర్ విభాగంలో దీప్తి నాలుగో స్థానంలో నిలిచింది. 2018లో ఐసీసీ ఉమెన్స్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డును గెలుచుకుంది. ఒకే ఏడాదిలో రెండు ఐసీసీ అవార్డులను గెలుచుకున్న తొలి భారత మహిళా క్రికెటర్.





మహేశ్ భూపతి నిర్వేదం

భారత్ ఆశలు ఆవిరి

3-1 స్కోరుతో నెగ్గిన ఇటలీ • డేవిస్‌కప్ ప్రపంచ ఫైనల్స్ చేరిన యూరప్ టీమ్



కోల్‌కతా: డేవిస్‌కప్ వరల్డ్ ఫైనల్స్ చేరాలన్న భారత ఆశలు ఫలించలేదు. పదోర్యాంక్ ఇటలీని ఓడించేందుకు గ్రాస్‌కోర్టును నమ్ముకున్నా విజయం సాధించడంలో సఫలం కాలేకపోయింది. శనివారం కోల్‌కతాలో రెండో రోజు జరిగిన డబుల్స్ మ్యాచ్‌లో భారత జంట రోహన్ బోపన్న, దివిజ్ శరణ్ జోడీ గెలిచి ఆశలు రేపారు. తొలిసెట్ కోల్పోయినా వెనుకడుగు వేయకుండా మిగిలిన రెండుసెట్లు నెగ్గి ఇటలీ ఆధిక్యాన్ని 2-1కి తగ్గించారు. అనంతరం జరిగిన తొలి రివర్స్ సింగిల్స్‌లో భారత నంబర్ వన్ ఆటగాడు ప్రజ్నేశ్ గుణేశ్వరన్ తేలిపోయాడు. ఇటలీ ఆటగాడు ఆండ్రియాస్ సెప్పి ఆటతీరు ముందు నిలువలేకపోయాడు. కేవలం 62 నిమిషాల్లోనే సెప్పి తొలి రివర్స్ సింగిల్స్‌ను ముగించడంతో 3-1 తేడాతో గెలిచిన ఇటలీ డేవిస్‌కప్ ప్రపంచ ఫైనల్స్ చేరింది. తొలిరోజు రెండు సింగిల్స్ మ్యాచ్‌లు ఇటలీ నెగ్గిన సంగతి తెలిసిందే. భారత్‌తో జరిగిన అర్హత మ్యాచ్ కోసం ఇటలీ పటిష్ఠమైన జట్టును బరిలోకి దింపింది. వీరిలో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్ 20లో బొలెల్లి కొనసాగుతుండగా.. మిగిలిన ఆటగాళ్లు 50లోపు ర్యాంకుల్లో కొనసాగుతున్నారు. వీరంతా హార్డ్‌కోర్ట్, క్లే కోర్టులపైనే ఎక్కువగా ఆడుతుంటారు. గ్రాస్‌కోర్టుల్లో ఇటలీ జట్టు రాణించడంలో గత మ్యాచ్‌ల్లో తడబడింది. దీనిని దృష్టిలో పెట్టుకుని భారతజట్టు నాన్‌ప్లేయింగ్ కెప్టెన్ మహేశ్ భూపతి గ్రాస్‌కోర్టుల్లో డేవిస్‌కప్ అర్హత మ్యాచ్ ఆడాలని వ్యూహం పన్నాడు. సింగిల్స్‌లో ప్రజ్నేశ్, రామ్‌కుమార్ రామ్‌నాథన్ గ్రాస్‌కోర్టుల్లో బాగానే ఆడుతుండగా..డబుల్స్‌లో భారత ఆటగాళ్ల ప్రదర్శన ఎప్పుడూ ఆశాజనకంగానే ఉంటుంది. దీంతో కోల్‌కతాలోని సౌత్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన గ్రాస్‌కోర్టులో విజయమే ఆశతో భారత్ బరిలోకి దిగింది. తొలిరోజు రెండు సింగిల్స్‌లోనూ భారత ఆటగాళ్లు ఇటలీ ఆటగాళ్లకు పోటీనివ్వలేక పోగా.. రెండోరోజు డబుల్స్‌లో మాత్రం ఇటలీ జోడీ సిమోన్ బొలెల్లి, మాట్టో బెరెట్టినిపై 4-6, 6-3, 6-4 స్కోరుతో బోపన్న, శరణ్ జోడీ కష్టపడి నెగ్గింది. కనీసం ఒక్క సింగిల్స్ మ్యాచ్‌నైనా నెగ్గుతాడని ప్రజ్నేశ్‌పై ఆశలు పెట్టుకున్నా అతను రాణించలేకపోయాడు. శనివారం జరిగిన తొలి రివర్స్ సింగిల్స్‌లో ప్రజ్నేశ్ 1-6, 4-6 స్కోరుతో సెప్పి చేతిలో పరాజయం పాలు కావడంతో భారత్ కథ ముగిసింది. అయితే ఇటలీ 3-1 స్కోరుతో డేవిస్‌కప్ ప్రపంచ ఫైనల్స్ చేరడంతో చివరి రివర్స్ సింగిల్స్‌ను రద్దు చేశారు. ఇటలీతో పాటు మాజీ చాంపియన్స్ సెర్బియా, జర్మనీ, ఆస్ట్రేలియా డేవిస్‌కప్ ఫైనల్స్‌కు దూసుకెళ్లాయి.

ఆఖిరాట అందేనా!

ధోనీ చేరికతో భారత్‌కు జోష్ • గెలుపు జోరులో న్యూజిలాండ్ • నేడు ఐదో వన్డే

భారత్, న్యూజిలాండ్ ఆఖరి పోరుకు సిద్ధమయ్యాయి. సిరీస్ గెలిచిన ఊపులో కివీస్‌ను క్లీన్‌స్వీప్ చేద్దామనుకున్న టీమ్‌ఇండియా ఆశలు అడిఆశలయ్యాయి. బౌల్ట్ పేస్ విజృంభణతో గెలుపు గాడిలో పడిన కివీస్ మళ్లీ ఊపులోకి వచ్చింది. ఇదే జోరులో టీమ్‌ఇండియాను కట్టడిచేస్తూ సిరీస్‌ను గెలుపుతో ముగించాలని చూస్తున్నది. ధోనీ రాకతో బలం పుంజుకున్న భారత్.. హామిల్టన్‌లో తమకెదురైన పరాజయానికి ప్రతీకారం తీర్చుకునేందుకు సర్వశక్తులతో సై అంటున్నది. ఈ నేపథ్యంలో ఆదివారం వెల్లింగ్టన్‌లో జరిగే ఆఖరి మ్యాచ్ ఎవరిదన్నది ఆసక్తికరంగా మారింది.



రోహిత్

వెల్లింగ్టన్: వన్డే ప్రపంచకప్ టోర్నీకి సమయం సమీపిస్తున్నది. మెగా టోర్నీలో ఎవరిని ఆడించాలన్న దానిపై ఇప్పటికే ఓ అంచనాకు వచ్చిన భారత టీమ్ మేనేజ్‌మెంట్ మిగిలిన ఆరు వన్డేల ద్వారా జట్టుకు తుదిరూపు ఇవ్వాలన్న ఆలోచనతో కనిపిస్తున్నది. రానున్న ప్రధాన సిరీస్‌లను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే కెప్టెన్ విరాట్ కోహ్లీకి విశ్రాంతినిచ్చిన బీసీసీఐ..మార్పులు, చేర్పులతో కూర్పును పరిశీలిస్తున్నది. కోహ్లీ, ధోనీ, ధవన్ రాణింపుతో మొదటి వన్డేల్లో విజయాలతో కివీస్‌పై సిరీస్‌ను ఖాతాలో వేసుకున్న టీమ్‌ఇండియాకు హామిల్టన్‌లో ఊహించని రీతిలో చుక్కెదురైంది. ట్రెంట్ బౌల్ట్ భీకరమైన పేస్ బౌలింగ్‌తో భారత బ్యాట్స్‌మెన్ చేతులెత్తేశారు. 92 పరుగులకే కుప్పకూలి..భారీ ఓటమిని మూటగట్టుకున్నారు. ఈమధ్య కాలంలో ఇలాంటి దారుణ ఓటమిని టీమ్‌ఇండియా చవిచూసిన దాఖలాలు లేవు. కోహ్లీ, ధోనీ గైర్హాజరీలో జట్టు ఎంత బలహీనంగా ఉందో తెలిసొచ్చింది. దీనికి తోడు సిరీస్‌లో తొలిసారి పిచ్ పూర్తిగా పేస్‌కు అనుకూలించడం మన బ్యాట్స్‌మెన్ ఆటతీరును బయటపెట్టింది. పేస్ పిచ్‌లపై తప్పులు సరిదిద్దుకోకపోతే ..ఇంగ్లండ్‌లో జరిగే ప్రపంచకప్‌లో భారత్ మూల్యం చెల్లించుకునే పరిస్థితి ఏర్పడటం ఖాయంగా కనిపిస్తున్నది. పేస్ పిచ్‌లకు స్వర్గధామమైన ఇంగ్లండ్‌లో రాణించాలంటే.. అందుకు తగ్గట్లు మనోళ్లు సిద్ధం కావాల్సిన అవసరం ఏర్పడింది. ఇదిలా ఉంటే తొడ కండరాల గాయం నుంచి తేరుకుని ధోనీ ఐదో వన్డేలో ఆడనుండటం భారత్‌లో జోష్ నింపింది. మరోవైపు హామిల్టన్ విజయమిచ్చిన ఆత్మవిశ్వాసంతో ఉన్న కివీస్..అదే జోరును వెల్లింగ్టన్‌లో కొనసాగించేందుకు ఉవ్విళ్లూరుతున్నది. హార్డ్ హిట్టర్ మార్టిన్ గప్టిల్ గాయంతో దూరం కావడం ఒకింత ఆందోళన కల్గిస్తున్నా..అంతకుమించి సమస్యలేమి కనిపించడం లేదు.

ధోనీ ఆగయా

న్యూజిలాండ్‌తో మిగిలిన రెండు వన్డేల్లోనూ భారత్‌కు ఎదురులేదనుకున్నాం. కానీ హామిల్టన్‌లో మన లోపాలేంటో బయటపడ్డాయి. ఓవరాల్‌గా వన్డేల్లో వందలోపు ఏడోసారి ఆలౌటై భారత్ భారీ ఓటమిని మూటగట్టుకుంది. మేటి బ్యాట్స్‌మెన్ అనుకున్న మనోళ్లు సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితం కాగా..చాహల్(18) అత్యధిక పరుగులు సాధించాడు. ఇక్కడే అర్థమవుతుంది నిఖార్సైన పేస్ పిచ్‌లపై టీమ్‌ఇండియా బ్యాట్స్‌మెన్ సత్తాఏంటో. దీనికి తోడు కెప్టెన్ కోహ్లీ, ధోనీ గైర్హాజరీ స్పష్టంగా కనిపించింది. ముఖ్యంగా గత కొన్ని వన్డేలుగా పాత రోజులను గుర్తుకు తెస్తున్న ధోనీ లేని లోటు తెలిసొచ్చింది. వికెట్‌కీపింగ్‌తో పాటు యువ బౌలర్లకు సలహాలు, సూచనలిచ్చే ధోనీ మిడిలార్డర్‌లో కీలక బ్యాట్స్‌మన్. అలాంటి సీనియర్ ఆటగాడు తొడ కండరాల గాయం నుంచి తేరుకుని జట్టులోకి రావడం బలాన్ని కచ్చితంగా పెంచేదే అని చెప్పొచ్చు. ఐదో వన్డేకు వేదికైన వెల్లింగ్టన్‌లో బౌల్ట్ భీకరమైన బౌలింగ్‌కు తోడు బలమైన గాలులకు ఎదురొడ్డి నిలువడం మన బ్యాట్స్‌మెన్‌కు కత్తిమీద సామే.

జట్ల అంచనా

భారత్: రోహిత్(కెప్టెన్), ధవన్, గిల్, రాయుడు, ధోనీ, జాదవ్, హార్దిక్, భువనేశ్వర్, చాహల్, కుల్దీప్, ఖలీల్ అహ్మద్.

న్యూజిలాండ్: విలియమ్సన్(కెప్టెన్), నికోలస్, మున్రో, టేలర్, లాథమ్, గ్రాండ్‌హోమ్, నీశమ్, బ్రేస్‌వెల్/సాంట్నర్, టాడ్ ఆస్టిల్, మ్యాట్ హెన్రీ/టిమ్ సౌథీ, బౌల్ట్.

పిచ్, వాతావరణం

మ్యాచ్‌కు వేదికైన వెస్ట్‌ప్యాక్ స్టేడియంలో ఎండవేడిమికి తోడు బలమైన గాలులు వీయనున్నాయి. పిచ్ స్వింగ్ బౌలింగ్‌కు అనుకూలించే అవకాశముంది.

ఇలాంటి పరిస్థితుల్లో ధోనీ అనుభవం జట్టుకు బాగా కలిసొస్తుందని బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ అన్నాడు. ధవన్, రోహిత్, కోహ్లీ రాణింపుతో ఇన్నాళ్లు మిడిలార్డర్ సరైన పరీక్ష ఎదుర్కోలేదు. హామిల్టన్ మ్యాచ్‌లో రాయుడు, జాదవ్, కార్తీక్ మిడిలార్డర్‌లో విఫలమవ్వడం జట్టును ఆందోళనకు గురిచేస్తున్నది. ఒకవేళ ధోనీ గనుక జట్టులోకి వస్తే..కార్తీక్‌ను తప్పిస్తారా లేక యువ బ్యాట్స్‌మన్ శుభ్‌మన్ గిల్‌ను బెంచ్‌కు పరిమితం చేస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా చేరికతో జట్టు సమతూకంగా మారింది.

సిరాజ్‌కు చాన్స్!

అవకాశాలను సరిగ్గా అందిపుచ్చుకోలేకపోతున్న ఖలీల్ అహ్మద్ స్థానంలో హైదరాబాదీ మహ్మద్ సిరాజ్‌కు చాన్స్ ఇచ్చే అవకాశం కనిపిస్తున్నది. ఇదే జరిగితే..అడిలైడ్‌లో ఆస్ట్రేలియాతో వన్డే తర్వాత సిరాజ్ మళ్లీ తుది జట్టులోకి రావచ్చు. బెంచ్ బలాన్ని పరీక్షించేందుకు మేనేజ్‌మెంట్ మొగ్గుచూపేలా కనిపిస్తున్నది. అడిలైడ్‌లో భారీగా పరుగులు సమర్పించుకున్న సిరాజ్..వెల్లింగ్టన్‌లో రాణించేందుకు తహతహలాడుతున్నాడు. శనివారం బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్‌తో కలిసి సిరాజ్ ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నాడు. భువనేశ్వర్ కుమార్‌కు విశ్రాంతినివ్వదల్చుకుంటే..మహ్మద్ షమీని తుది జట్టులోకి తీసుకోవచ్చు, అంతకుమించి మార్పులేమి కనిపించడం లేదు.

గప్టిల్ ఔట్

నాలుగో వన్డేలో విజయంతో గెలుపు బాట పట్టిన న్యూజిలాండ్ జట్టుకు ఓపెనర్ మార్టిన్ గప్టిల్ రూపంలో ఎదురుదెబ్బ తగిలింది. ప్రాక్టీస్‌లో వెన్నునొప్పికి గురికావడంతో ఐదో వన్డేకు గప్టిల్ దూరమయ్యాడు. దీంతో అతని స్థానాన్ని కొలిన్ మన్రోతో భర్తీ చేయనున్నారు. ఇక మన్రోకు బదులుగా నాలుగో వన్డేకు జట్టులోకొచ్చిన నికోలస్ ఆకట్టుకున్నాడు. ఆదిలో ఆకట్టుకున్న కెప్టెన్ విలియమ్సన్..అనవసరషాట్లకు పోయి ఔట్‌గా వెనుదిరుగుతుండగా..సీనియర్ బ్యాట్స్‌మన్ రాస్ టేలర్ సూపర్ ఫామ్ మీదున్నాడు. సహచరులు విఫలమవుతున్న చోట టేలర్ సాధికారిక ఇన్నింగ్స్‌తో రాణిస్తున్నాడు. టాప్, మిడిలార్డర్‌ను సమన్వయం చేస్తూ బ్యాటింగ్ భారాన్ని మోస్తున్నాడు. బౌలింగ్ విషయానికొస్తే హామిల్టన్ మ్యాచ్ ద్వారా బౌల్ట్ తన సత్తాఏంటో చాటిచెప్పాడు. పిచ్ సహకరిస్తే..ప్రత్యర్థి ఎవరైనా పడుగొడుతానని చేతల్లో చూపాడు. ఆల్‌రౌండర్ గ్రాండ్‌హోమ్ కూడా ఫామ్‌లోకి రావడం కివీస్‌కు కలిసిరానుంది. ఆఖరి రెండు వన్డేలకు జట్టుకు ఎంపికైన జేమ్స్ నీశమ్, టాడ్ ఆస్టల్ అవకాశాలను అందిపుచ్చుకున్నారు. నాలుగో వన్డే ప్రదర్శన పునరావృతమైతే..కివీస్ ఖాతాలో మరో విజయం చేరినట్లే.



ధోనీ

ఉదయం: 7.30 నుంచి

చందన సెంచరీ

తెలంగాణ మహిళల జట్టు శుభారంభం



ఖమ్మం: యువ క్రికెటర్ చందన అద్భుత బ్యాటింగ్ ప్రదర్శనతో తెలంగాణ జట్టు ఘన విజయం సాధించింది. ఖమ్మం జిల్లాకేంద్రంలో జరుగుతున్న 5వ జాతీయస్థాయి మహిళల టీ20 క్రికెట్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి.ఈ టోర్నీలో 8 రాష్ట్రాల జట్లు పాల్గొంటున్నాయి. తొలిసారిగా ఖమ్మంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి పోటీలను జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ ప్రారంభించారు. టోర్నీలో భాగంగా మధ్యప్రదేశ్‌తో మన రాష్ట్ర జట్టు తలపడింది. తెలంగాణ క్రికెటర్ చందన 73 బంతుల్లో 106 పరుగులు చేయడంతో నిర్ణీత ఓవర్లలో మన జట్టు 6 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. అనంతరం మధ్యప్రదేశ్ అమ్మాయిలు 75 పరుగులకే ఆలౌట్ కావడంతో 78 పరుగుల తేడాతో రాష్ట్ర అమ్మాయిల జట్టు ఘన విజయంతో టోర్నీలో శుభారంభం చేసింది. హర్యానాతో జరిగిన మరో మ్యాచ్‌లో రాజస్థాన్ కెప్టెన్ సోనిక 161 పరుగులతో భారీ సెంచరీ నమోదు చేసింది. శనివారం చందన, సోనిక సెంచరీలు చేయడం విశేషం. మిగిలిన మ్యాచ్‌ల్లో యూపీ జట్టు కర్ణాటకపై, ఢిల్లీ జట్టు మహారాష్ట్రపై విజయాలు సాధించాయి.

ప్యాటర్సన్ సెంచరీ

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 534/5 డిక్లేర్డ్ • శ్రీలంక 123/3

కాన్‌బెర్రా: శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్ట్‌లో ఆస్ట్రేలియా భారీ స్కోరు చేసింది. బర్న్స్ (260 బంతుల్లో 180; 27 ఫోర్లు), హెడ్ (161)కు తోడుగా లోయర్ ఆర్డర్‌లో ప్యాటర్సన్ (192 బంతుల్లో 114 నాటౌట్; 14 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీతో చెలరేగడంతో.. శనివారం రెండో రోజు ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌ను 132 ఓవర్లలో 5 వికెట్లకు 534 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. 384/4 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు ఆట కొనసాగించిన బర్న్స్ డబుల్ సెంచరీ చేస్తాడనుకున్నా.. ఆ కోరిక నెరవేరలేదు. ఇన్నింగ్స్ 93వ ఓవర్‌లో రజిత దెబ్బకు క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. దీంతో ఐదో వికెట్‌కు 68 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే ప్యాటర్సన్ ఓ ఎండ్‌లో స్థిరంగా ఆడగా, కెప్టెన్ పైనీ (45 నాటౌట్) కూడా చక్కని సహకారం అందించాడు. లంక పేలవ బౌలింగ్‌ను ఈ ఇద్దరు అలవోకగా ఎదుర్కొంటూ ఆరో వికెట్‌కు అజేయంగా 130 పరుగులు జోడించారు. ఫెర్నాండో 3, రజిత, కరుణరత్నే చెరో వికెట్ తీశారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన లంక ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 43 ఓవర్లలో 3 వికెట్లకు 123 పరుగులు చేసింది. పెరీరా (11 బ్యాటింగ్), డి సిల్వా (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. కరుణరత్నే (46 రిటైర్డ్‌హర్ట్), తిరిమన్నే (41) రాణించినా.. చండిమల్ (15), మెండిస్ (6) విఫలమయ్యారు. ప్రస్తుతం లంక ఇంకా 411 పరుగులు వెనుకబడి ఉంది.

కరుణరత్నేకు బౌన్సర్ దెబ్బ

లంక ఓపెనర్ కరుణరత్నే తృటిలో పెద్ద ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఆసీస్ పేసర్ ప్యాట్ కమిన్స్ వేసిన రైజింగ్ బౌన్సర్ కరుణరత్నే మెడకు బలంగా తాకింది. ఇన్నింగ్స్ 31వ ఓవర్‌లో ఈ సంఘటన చోటుచేసుకున్నది. భుజం, హెల్మెట్ మధ్య నుంచి దూసుకొచ్చిన బంతి బలంగా తాకడంతో కరుణరత్నే బ్యాట్‌ను వదిలేసి కిందపడిపోయాడు. ఆసీస్ పేసర్లు సహాయక చర్యలు చేపట్టారు. డాక్టర్, ఫిజియో మైదానంలో 10 నిమిషాలు చికిత్స చేశారు. అయినా పరిస్థితి మెరుగుపడకపోవడంతో వెంటనే స్ట్రెచర్‌పై మైదానం బయటకు తీసుకెళ్లి దవఖానాకు తరలించారు.



ప్రస్తుతం అతనికి ఎలాంటి ప్రమాదం లేదని లంక కోచ్ చండికా హతురసింఘే వెల్లడించారు. 'బ్యాట్స్‌మన్ తక్కున పడిపోవడంతో భయమేసింది. మెడ వెనుక భాగంలో బంతి బలంగా తాకింది. ఇప్పటికైతే ఇబ్బందిలేదు. అంపైర్లు, ఫిజియోతో మాట్లాడుతున్నాడు. కానీ ముందుజాగ్రత్త చర్యగా అతని పరిస్థితిని అంచనా వేస్తున్నారు. అందుకు తగినట్లుగా చికిత్సను అందిస్తున్నారు' అని చండికా వెల్లడించారు.

విశాఖలో తొలి టీ20

న్యూఢిల్లీ: భారత్, ఆస్ట్రేలియా టీ20 సిరీస్ తేదీలు మారాయి. బెంగళూరుకు బదులుగా తొలి టీ20 మ్యాచ్‌కు ఈనెల 24న విశాఖపట్నం ఆతిథ్యమివ్వనుంది. షెడ్యూల్ ప్రకారం ఈనెల 24న బెంగళూరులో మొదటి మ్యాచ్ జరుగాల్సి ఉంది. కానీ అదే రోజు బెంగళూరులో ఏరో ఇండియా షోకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకానున్నారు. ప్రధాని భద్రతా ఏర్పాట్ల నేపథ్యంలో మ్యాచ్‌కు బందోబస్తు కల్పించలేమని కర్ణాటక క్రికెట్ అసోసియేషన్(కేఎస్‌సీఏ)కు పోలీసులు స్పష్టం చేశారు. సీవోఏ చీఫ్ వినోద్ రాయ్‌తో పాటు డయానా ఎడుల్జీ అనుమతిని బీసీసీఐ తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌదరీ కోరారు. దీనికి సీవోఏకు పచ్చజెండా ఊపడంతో ఈనెల 24న వైజాగ్‌లో, 27న బెంగళూరులో ఆసీస్‌తో రెండు టీ20 మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా మొదటి మ్యాచ్‌కు హైదరాబాద్ వేదిక కానుంది.

విదర్భ X సౌరాష్ట్ర

నేటి నుంచి రంజీ ట్రోఫీ ఫైనల్ • పుజారా, ఉమేశ్ మధ్య పోటీ





ఉదయం 9.30 నుంచి స్టార్‌లో

నాగ్‌పూర్: ఓవైపు రెండోసారి టైటిల్ కోసం బరిలోకి దిగుతున్న డిఫెండింగ్ చాంపియన్ విదర్భ.. మరోవైపు రెండుసార్లు ఫైనల్ చేరినా ట్రోఫీని సాధించలేకపోయిన సౌరాష్ట్ర.. ఈ రెండు జట్ల మధ్య ఆదివారం నుంచి జరిగే రంజీ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌కు సర్వం సిద్ధమైంది. అయితే ఇది కేవలం రెండు జట్ల పోరాటమే కాదు.. టీమ్‌ఇండియా స్టార్లు చతేశ్వర్ పుజార, ఉమేశ్ యాదవ్‌తో పాటు వసీమ్ జాఫర్, జైదేవ్ ఉనాద్కట్ మధ్య పోటీ కూడా రసవత్తరంగా సాగే అవకాశం ఉంది. 40 ఏండ్ల వయసులో కూడా కుర్రాడిలా పరుగులు సాధిస్తున్న జాఫర్ విదర్భ బ్యాటింగ్ లైనప్‌లో కీలకం కానున్నాడు. ఈ సీజన్‌లో 1003 పరుగులతో రెండోస్థానంలో ఉన్న అతను ఇప్పటికే 4 శతకాలతో దుమ్మురేపాడు. ఇందులో ఓ డబుల్ సెంచరీ కూడా ఉంది. సౌరాష్ట్రకు పెట్టని గోడగా మారిన పుజార ఫామ్‌ను చూపెడితే విదర్భ బౌలర్లకు కష్టాలు తప్పవు. రెండు జట్ల బ్యాటింగ్ లోతుకు ఈ మ్యాచ్ ఓ పరీక్షగా నిలువనుంది. తొమ్మిదో నంబర్ వరకు బ్యాటింగ్ చేసే సామర్థ్యం ఉండటంతో విజయం ఎవరిదో అంచనా వేయడం కష్టంగా మారింది. షెల్డన్ జాక్సన్ (838), అండర్-19 ప్లేయర్ దేశాయ్ (763) చెలరేగితే సౌరాష్ట్ర బ్యాటింగ్ కష్టాలు తీరినట్లే. పుజార జాతీయ జట్టుకు ఆడినప్పుడు ఈ ఇద్దరే సౌరాష్ట్ర విజయాల్లో కీలక పాత్ర పోషించారు. మరోవైపు విదర్భ బ్యాటింగ్ కూడా అద్భుతంగా ఉంది. జాఫర్‌ను పక్కనబెడితే.. జట్టులో దాదాపు 8 మంది 10 మ్యాచ్‌లు ఆడినవారే. సగటు 30కి పైగానే ఉంది. ఫైజ్ ఫజల్ (786), అక్షయ్ వాడేకర్ (680) చెరో మూడు సెంచరీలతో సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. సౌరాష్ట్ర బౌలింగ్‌తో పోలిస్తే విదర్భదే పైచేయిగా కనిపిస్తున్నది. గత రెండు మ్యాచ్‌ల్లో ఉమేశ్ యాదవ్ 21 వికెట్లు పడగొట్టాడు. ఆస్ట్రేలియా నుంచి తిరిగొచ్చిన వెంటనే ఉత్తరాఖండ్, కేరళతో జరిగిన మ్యాచ్‌ల్లో స్వింగ్‌తో హడలెత్తించాడు. ఉమేశ్‌తో పాటు రజనీష్ గుర్బానీ, యష్ ఠాకూర్, సునికేత్ బింగేవర్, ఆదిత్య థాకరే బంతితో పుజార బృందానికి సవాలు విసురుతున్నారు. ఎందుకంటే సౌరాష్ట్ర బౌలింగ్‌లో ఎక్కువ ప్రత్యామ్నాయాలు కనిపించడం లేదు. ఉనాద్కట్, ధర్మేంద్రసిన్హ్ జడేజాపైనే ఈ జట్టు ఎక్కువగా ఆశలు పెట్టుకుంది. జడేజా 10 మ్యాచ్‌ల్లో 52 వికెట్లు పడగొట్టారు. చేతన్ సకారియా, కమ్లిష్ మక్వానా గాడిలో పడాల్సిన అవసరం ఉంది. సెమీస్‌లో కేరళను విదర్భ చిత్తు చేయగా, సౌరాష్ట్ర.. కర్ణాటకను ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించాయి.



ఎల్ వెంకట్రాంరెడ్డి స్మారక వాలీబాల్ టోర్నీ బాలురు, బాలికల విభాగంలో విజేతలుగా నిలిచిన హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు. హైదరాబాద్, లాల్‌బహదూర్ స్టేడియంలో శనివారం విజేతలకు ట్రోఫీలను ప్రదానం చేసిన సాట్స్ ఎండీ దినకర్‌బాబు తదితరులు.



జైపూర్‌లో జరుగుతున్న సీనియర్ సిటిజన్ అథ్లెటిక్స్ మీట్‌లో 90-97 వయసు జాగింగ్ విభాగంలో బీహెచ్ఈఎల్‌కు చెందిన 97 ఏండ్ల రాజగోపాల్ రెడ్డి మొదటి స్థానంలో నిలిచారు. ఆయనకు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలి




సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పెద్దచెరువు కట్టపై తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అధ్వర్యంలో నిర్వహించిన చిత్తడి నేలల దినోత్సవంలో విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న టీఎస్‌ఎస్పీఎఫ్ డీజీ తేజ్‌దీప్‌కౌర్

రంగారెడ్డి జిల్లా నెక్నాంపూర్ చెరువుకట్టపై నిర్వహించిన ప్రపంచ చిత్తడినేల దినోత్సవంలో పాల్గొన్న బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ఆండ్రూఫ్లెమింగ్, రాష్ట్ర జలవనరులఅభివృద్ధి సంస్థ చైర్మన్ వీ ప్రకాశ్‌రావు

బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ఆండ్రూఫ్లెమింగ్

మణికొండ, నమస్తే తెలంగాణ/అమీన్‌పూర్: జీవ వైవిధ్యంపై ప్రజల్లో అవగాహన పెంచాలని బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ఆండ్రూఫ్లెమింగ్ అన్నారు. అడవులు అంతరించడం, చెరువులు కుంచించుకుపోవడం వల్ల వాతావరణంలో సమతుల్యత దెబ్బతిని భవిష్యత్‌లో అనేక ఇబ్బందులు ఎదురవుతాయని ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం గండిపేట మండలం నెక్నాంపూర్ గ్రామ చెరువుకట్టపై ధృవాన్ష స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ చిత్తడినేల దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర జలవనరులసంరక్షణశాఖ చైర్మన్ వీ ప్రకాశ్‌రావు తెలంగాణలో ఉన్న 8 వేల చెరువులు కాలక్రమేణ కనుమరుగుకావడంతో వాతావరణంలో సమతుల్యతలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వేలాది చెరువులకు పూర్వకళ తీసుకొచ్చేందుకు కృషిచేసిందన్నారు. ధృవాన్ష తరహాలో ఇతర స్వచ్ఛంద సంస్థలు ముందుకొస్తే ప్రభుత్వంతో మాట్లాడి చెరువుల దత్తత కోసం కృషిచేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సెంట్రల్‌జోన్ కమిషనర్ ముషారఫ్‌అలీ పారూఖ్, ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ కళ్యాణచక్రవర్తి, అటవీశాఖ డైరెక్టర్ రఘువీర్ తదితరులు పాల్గొన్నారు. అమీన్‌పూర్ పెద్దచెరువు కట్టపై తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అధ్వర్యంలో చిత్తడి నేలల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, చిత్రలేఖనం, సాంస్కృతిక పోటీల్లో విజేతలకు టీఎస్‌ఎస్పీఎఫ్ డీజీ తేజ్‌దీప్‌కౌర్ బహుమతులు అందజేశారు.

గాంధీభవన్‌లో రచ్చ రచ్చ





గాంధీభవన్ గొడవలో మాజీ ఎంపీ వీహెచ్‌ను నిలువరిస్తున్న సీఎల్పీనేత మల్లు భట్టి విక్రమార్క, గొడవపడుతున్న వీహెచ్, ఓబీసీ సెల్ అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్ వర్గీయులు

- రసాభాసగా 'భట్టి' సన్మాన కార్యక్రమం
- వీహెచ్‌పై విరుచుకుపడ్డ ఓబీసీ సెల్ నేత
- బూతులు తిట్టిన వీహెచ్
- బేగంబజార్ ఠాణాలో కేసు నమోదు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : కాంగ్రెస్ నేతల ఆధిపత్య పోరుకు గాంధీ భవన్ వేదికగా మారింది. శనివారం గాంధీభవన్‌లో ఓబీసీ సెల్ అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. శ్రీకాంత్‌గౌడ్ అనుచరులు వేదికపైనున్న వీహెచ్‌పై గుంపులుగా పడిపోయారు. దీంతో ఆగ్రహించిన వీహెచ్ శ్రీకాంత్ అనుచరులను బూతులు తిట్టారు. దీంతో ఆవేశానికి గురైన శ్రీకాంత్ అనుచరులు వీహెచ్‌పై దాడికి విఫలయత్నం చేశారు. దీంతో హనుమంతరావు వర్గీయులు, శ్రీకాంత్ అనుచరుల మధ్య పిడిగుద్దులు, తోపులాటలు, ముష్టిఘాతాలు చోటు చేసుకోవటంతో సన్మాన కార్యక్రమం రసాభాసగా మారింది. శ్రీకాంత్ అనుచరులు హనుమంతరావుపై కుర్చీలు ఎక్కి దాడి చేయడంతో ఆ వేదికపై ఉన్న మల్లు భట్టి విక్రమార్కతో పాటు పలువురు సీనియర్ నేతలు అడ్డుకున్నారు. శ్రీకాంత్ అనుచరులు నినాదాలు చేస్తూ.. నానా హంగామా సృష్టించారు. దీంతో శ్రీకాంత్, ఆయన అనుచరులపై పార్టీ క్రమశిక్షణ సంఘానికి వీ హనుమంతరావు ఫిర్యాదు చేశారు. అధిష్ఠానం స్పందించి ఓబీసీ సెల్ అధ్యక్ష పదవి నుంచి శ్రీకాంత్‌ను తొలిగించింది. ఈ మేరకు ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు చిత్తరంజన్‌దాసు ప్రకటన కూడా విడుదల చేశారు.

వీహెచ్‌పై బేగంబజార్ ఠాణాలో ఫిర్యాదు

గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో మాజీ ఎంపీ వీ హన్మంత్‌రావు అనుచరులు దాడిచేసి గాయపరిచారని శ్రీకాంత్‌గౌడ్ తన అనుచరులతో కలిసి బేగంబజారు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులుల విచారణ ప్రారంభించారు.

గల్లంతైన యువతుల కోసం గాలింపు

- నల్లగొండ రైల్వేస్టేషన్లో సంచరించినట్టు ఆధారాలు!

రామగిరి : రెండురోజుల క్రితం నల్లగొండలో పానగల్ రిజర్వాయర్ వద్ద సూసైడ్ నోట్ రాసి అదృశ్యమైన ఏంఏ హబీబ్ ఉన్నీసా అలియాస్ రేష్మా(18), తీగుళ్ల శ్రావణిల జాడ శనివారం కూడా లభించలేదు. సూసైడ్ నోట్ ఆధారంగా రిజర్వాయర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నారన్న అనుమానంతో ఉదయ సముద్రాన్ని ప్రత్యేక బృందాలు జల్లెడపట్టినా ఫలితం లభించలేదు. మృతి చెందితే ఇప్పటికే మృతదేహాలు లభించే అవకాశం ఉందని భావించిన పోలీసులు శనివారం గాలింపు చర్యలు నిలిపివేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఇద్దరు యువతులు గురువారం మధ్యాహ్నం నల్లగొండ రైల్వేస్టేషన్‌లో సంచరించినట్టు పోలీసులకు ఆధారాలు లభించినట్టు సమాచారం. దీంతో మిర్యాలగూడ, నడికుడ, సత్తేనపల్లి, పిడుగురాళ్లకు ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నట్టు తెలుస్తున్నది.

మరుగుదొడ్డిలో పసికందు మృతదేహం

మంచిర్యాల జిల్లా ప్రభుత్వ దవాఖానలో ఘటన

మంచిర్యాల స్పోర్ట్స్ : మంచిర్యాల జిల్లా ప్రభుత్వ దవాఖానలోని మరుగుదొడ్డిలో శనివారం ఉదయం ఓ మగ శిశువు మృతదేహం పడి ఉండటం కలకలం రేపింది. శుక్రవారం రాత్రి జన్మించినట్టు భావిస్తున్న ఈ పసికందును బతికి ఉండగా ఎవరైనా మరుగుదొడ్డిలో పడేశారా లేదా చనిపోయాక పడేశారా అనేది తెలియడం లేదు. శనివారం ఉదయం పారిశుద్ధ్య సిబ్బంది మరుగుదొడ్డిని శుభ్రపరిచేందుకు వెళ్లగా అక్కడ పసికందు మృతదేహం కనిపించడంతో డ్యూటీ డాక్టర్ నిఖిల్‌కు తెలియజేశారు. పోలీసులు పసికందు మృతదేహాన్ని బయటకు తీశారు. సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వంత్‌రావు ఫిర్యాదుమేరకు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మారుతి తెలిపారు. ప్రసవం చేయించుకున్నవారంతా శిశువులతో సహా దవాఖానలోనే ఉన్నారని సూపరింటెండెంట్ తెలిపారు.



శనివారం సచివాలయంలో టీఎస్‌డీపీఎస్ ఎల్ ఈడీ స్క్రీన్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి

సచివాలయంలో వాతావరణ సమాచారం

- టీఎస్‌డీపీఎస్ ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ప్రారంభించిన సీఎస్ ఎస్కే జోషి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో టీఎస్‌డీపీఎస్ (తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ) ఏర్పాటుచేసిన ఎల్‌ఈడీ స్క్రీన్ డిస్‌ప్లేబోర్డును సీఎస్ శైలేంద్రకుమార్ జోషి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎల్‌ఈడీ స్క్రీన్ డిస్‌ప్లే బోర్డుల ఆధారంగా ప్రతికూల పరిస్థితుల్లో అధికారులు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులు హెచ్చరికలు జారీ చేస్తారని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 924 టీఎస్‌డీపీఎస్ ఆటోమెటిక్ వెదర్‌స్టేషన్లు ఉన్నాయని.. వీటి ద్వారా ప్రతిరోజూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు రికార్డు చేస్తున్నదని చెప్పారు. టీఎస్‌డీపీఎస్ ఆధారిత వెబ్‌సైట్, మొబైల్‌యాప్‌తో వర్షపాతం, కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు, గాలిలో తేమ తదితర వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్థిక, ప్రణాళికశాఖ ముఖ్య కార్యదర్శి కే రామకృష్ణారావు, టీఎస్‌డీపీఎస్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి షేక్‌మీరా, ప్రణాళికా శాఖ సిబ్బందిని సీఎస్ అభినందించారు.

మిస్ సౌత్ ఇండియా పోటీలకు సిర్ప భావన



నిజామాబాద్ స్పోర్ట్స్ : మిస్‌సౌత్ ఇండియా 2019 పోటీలకు నిజామాబాద్‌కు చెందిన సిర్ప భావన ఎంపికయ్యారు. నిజామాబాద్ నగరంలోని కోటగల్లీకి చెందిన ప్రముఖ వ్యాపారి సిర్ప రాజు కూతురైన భావన నిజామాబాద్ నగరంలోని సుభాష్‌నగర్‌లోని నిర్మల హృదయ పాఠశాలలో ఎస్సెస్సీ, హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్ పూర్తిచేశారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌ల ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చేస్తున్నారు. 2016లో జరిగిన అందాల పోటీల్లో భావన మిస్ హైదరాబాద్‌గా ఎంపికయ్యారు. ఆదివారం కేరళ రాష్ట్రంలోని కొచ్చిన్‌లో జరగనున్న 2019 మిస్ సౌత్ ఇండియా పోటీల తుదిపోరులో తలపడనున్నారు. ఈ పోటీల్లో దక్షిణాది రాష్ట్రాలకు చెందిన సుమారు 24 మంది పాల్గొననున్నారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి

అర్చకుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఉపేంద్రశర్మ వెల్లడి

సిరిసిల్ల రూరల్ : బ్రాహ్మణులు, అర్చకుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ విశేషమైన కృషి చేశారని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని అర్చకుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఉపేంద్ర శర్మ కొనియాడారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలకేంద్రంలోని మార్కండేయ ఆలయంలో నిర్వహించిన సదస్సులో ఉపేంద్ర శర్మ 2019 డైరీని ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జల్లా నవీన్, మహేందర్ శర్మ, ఆంజనేయ శర్మ, రుద్రమణి, చెరుకు విఠల్ శర్మతో పాటు అన్ని మండలాల్లోని అర్చక సంఘ సభ్యులు, నాయకులు ఉన్నారు.


ఎన్‌హెచ్‌లకు వక్ఫ్ భూములు సేకరించొద్దు

- ఎన్‌హెచ్‌ఏ అధికారులకు వక్ఫ్‌బోర్డు చైర్మన్ సలీం వినతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రోడ్ల నిర్మాణానికి వక్ఫ్ భూములను సేకరించొద్దని వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం జాతీయ రహదారుల అథారిటీ (ఎన్‌హెచ్‌ఏ) అధికారులకు విజ్ఞప్తి చేశారు. శనివారం వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో వారితో సమావేశమైన సలీం.. భూముల సేకరణ అంశంపై చర్చించారు. వక్ఫ్ భూముల మీదుగా రోడ్ల నిర్మాణం చేపడితే మసీదులు, షాదీఖానాలు, ఖబరస్థాన్లు ధ్వంసమయ్యే అవకాశం ఉందని అన్నారు. శంషాబాద్‌లోని వక్ఫ్ భూమిలో నుంచి కాకుండా ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకుని రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ నెల ఏడున తనిఖీచేసి తగిన నిర్ణయం తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. సమావేశంలో వక్ఫ్‌బోర్డు సీఈవో షానవాజ్ ఖాసీం, పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

యాసంగి పంటలకు నీటి విడుదల

మెండోరా: నిజామాబాద్ జిల్లా శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కాల్వల ద్వారా యాసంగి పంటలకు నీటి విడుదల కొనసాగుతున్నదని ఏఈఈ మహేందర్ తెలిపారు. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా తగ్గుతున్నదన్నారు. మొత్తం ప్రాజెక్టు నుంచి 5,830 క్యూసెక్కుల నీరు బయటకు పోతున్నదన్నారు. ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు కాగా, శనివారం సాయంత్రానికి 1070,30 అడుగులు నీరు నిల్వ ఉన్నది. విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది.



చాక్‌పీస్‌పై టీఆర్‌ఎస్ విజయోత్సవ స్తూపం

నర్సంపేట, నమస్తే తెలంగాణ: వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేటకు చెందిన సూక్ష్మకళాకారుడు రామోజు జయకుమార్ టీఆర్‌ఎస్ ఇటీవల విజయం సాధించినందుకు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి విజయోత్సవ కానుకగా చాక్‌పీస్‌పై విజయోత్సవ స్తూపం చెక్కి అందించారు. శనివారం నర్సంపేటలో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి కానుకగా అందించారు.

వ్యవసాయ వర్సిటీలో నిరుద్యోగులకు శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ పరిధిలోని ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్.. నిరుద్యోగ యువతీ యువకులకు అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ ప్రొవైడర్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఈనెల 20 నుంచి మార్చి 13 వరకు శిక్షణ ఉంటుందని విస్తరణ విద్యాసంస్థ డైరెక్టర్ డాక్టర్ మధుబాబు తెలిపారు. ఇంటర్ లేదా అగ్రికల్చర్ పాలిటెక్నిక్ డిప్లొమా పాసైన విద్యార్థులు అర్హులని, శిక్షణకు ఎంపికైనవారికి ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఫిబ్రవరి 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ 5న

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 5న నాంపల్లిలోని టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్టు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 6న నెహ్రూ జూలాజికల్ పార్కు వద్ద ఉదయం 6 గంటల నుంచి దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభమవుతాయ న్నారు. వెరిఫికేషన్ కోసం కావాల్సిన పత్రాలన్నింటిని అభ్యర్థులందరూ tspsc.gov.in నుంచి తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

రేపు టీఎంయూ సమావేశం..

ఆర్టీసీ అంశాలపై చర్చ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ మజ్దూర్ యూనియన్ కేంద్ర కమిటీ సమావేశం సోమవారం ఉదయం వీఎస్టీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నామని యూనియన్ నేతలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఎంయూ గౌరవ అధ్యక్షుడు హరీశ్‌రావు చేసిన రాజీనామాపై, ఆర్టీసీ యూనియర్ ఎన్నికలపై, ఆర్టీసీ స్థితిగతులపై చర్చించి తగు నిర్ణయం తీసుకోవడానికి అత్యవసరంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా యూనియర్ ప్రధాన కార్యదర్శి ఆశ్వత్థామరెడ్డి హాజరుకానున్నట్టు యూనియర్ స్టేట్ సెక్రటరీ కే రాజలింగం తెలిపారు.

73,000 రైఫిళ్ల కొనుగోళ్లకు రక్షణ శాఖ ఆమోదం



న్యూఢిల్లీ: పదాతిదళాల ఆధునికీకరణలో భాగంగా రక్షణ శాఖ మరో ముందడుగు వేసింది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న 73,000 రైఫిళ్ల కొనుగోలు ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఈ రైఫిళ్లను అమెరికా నుంచి ఫాస్ట్ ట్రాక్ మోడ్‌లో భారత్ కొనుగోలు చేయనుంది. అధికార వర్గాలు మాట్లాడుతూ సిగ్ సావర్ రైఫిళ్ల కొనుగోళ్లకు రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆమోదం తెలిపారని పేర్కొన్నాయి. దాదాపు 3,600 కి.మీ. పొడవున్న చైనా సరిహద్దు వెంట విధులు నిర్వర్తించే బలగాలకు ఈ రైఫిళ్లను అందజేయనున్నామని తెలిపాయి. ఈ రైఫిళ్లను ఇప్పటికే అమెరికా, ఇతర యురోపియన్ దేశాలు ఉపయోగిస్తున్నాయని వివరించాయి. 'రైఫిళ్ల కొనుగోలు ఒప్పందం ప్రక్రియను వారంలో పూర్తి చేస్తాం. ఒప్పందం కుదిరిన నాటి నుంచి ఏడాదిలోగా ఈ రైఫిళ్లు మనకు అందుతాయి' అని అధికార వర్గాలు చెప్పాయి.


మతాన్ని అనుసరిస్తే వేటే!

పార్టీ, పదవుల నుంచి అధికారులను తొలిగించిన చైనా

బీజింగ్, ఫిబ్రవరి 2: ఆధ్యాత్మిక అంశాలను, మతాన్ని విశ్వసించడంతోపాటు టిబెట్ నేత దలైలామాతో రహస్య సంబంధాలు కొనసాగిస్తున్నారన్న ఆరోపణలపై పార్టీకి చెందిన అధికారులపై చైనా అధికార కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) కొరడా ఝుళిపించింది. ఈ మేరకు ముగ్గురు పార్టీ అధికారులను పార్టీ నుంచి, పదవుల నుంచి తొలిగించింది. పది మంది పార్టీ అధికారులకు హెచ్చరికలను జారీ చేసింది.


నేషనల్ ఎమర్జెన్సీ విధిస్తాం: ట్రంప్

మెక్సికో సరిహద్దు గోడపై అమెరికా అధ్యక్షుడి మంకుపట్టు



వాషింగ్టన్: దేశంలో ఎమర్జెన్సీ విధించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. విపక్ష డెమోక్రాట్లు దేశభద్రతను కోరుకోవడం లేదని శనివారం మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. దక్షిణ దిశన గల మెక్సికో నుంచి దేశంలోకి అక్రమ వలసల నివారణకు సరిహద్దు పొడవునా గోడ నిర్మించాలని ట్రంప్ వాదిస్తున్న సంగతి తెలిసిందే. దేశంలో ఎమర్జెన్సీ విధించడం వల్ల అమెరికా కాంగ్రెస్ (ప్రజాప్రతినిధుల సభ) ఆమోదం లేకుండా మెక్సికో సరిహద్దు పొడవునా గోడ నిర్మాణానికి విపత్తు నివారణ నిధులను పునః కేటాయించేందుకు ట్రంప్‌కు అధికారం లభిస్తుంది. తర్వాత సీబీఎస్ న్యూస్ నిర్వహించిన 'ఫేస్ ది నేషన్' కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ సరిహద్దు భద్రత కోసం విపక్ష డెమోక్రాట్లతో జరుగుతున్న చర్చల వల్ల సమయం వృథా అని చెప్పారు. ప్రజా ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసీ మొండి వైఖరి ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు.

సిరియాలో దెబ్బతిన్న భవనం కూలి 11 మంది దుర్మరణం



డమాస్కస్: సిరియాలో జరుగుతున్న అంతర్యుద్ధం వల్ల దెబ్బతిన్న ఓ భవనం కుప్పకూలి 11 మంది మరణించారు. ఈ దుర్ఘటన అలెప్పోలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వీరంతా భవనం లోపల ఉన్నప్పుడు కుప్పకూలడంతో ప్రాణాలు కోల్పోయారు. ఒక్కరు మాత్రం ప్రాణాలతో బయటపడ్డారు. సిరియాలో ఐఎస్ఐఎస్ ఉగ్రవాదులకు, ప్రభుత్వానికి మధ్య గత కొన్నేండ్ల నుంచి అంతర్యుద్ధం నడుస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అలెప్పో నగరం 2012 నుంచి 2014 వరకు రెండు భాగాలుగా విడిపోయింది. ఒక భాగం ప్రభుత్వం ఆధీనంలో ఉండగా.. మరో భాగం ఐఎస్ఐఎస్ ఆధీనంలో ఉన్నది. తర్వాత సైన్యం 2016లో మొత్తం నగరాన్ని తన గుప్పిట్లోకి తెచ్చుకుంది.

ఉత్తమ ఎంపీ కవితకు శుభాకాంక్షల వెల్లువ



ఎంపీ కవితకు అభినందనలు తెలుపుతున్న డాక్టర్ గంద్రప్రమోద్‌కుమార్ తదితరులు



ఎంపీ కవితకు అభినందనలు తెలుపుతున్న తెలంగాణ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు అందుకొన్న ఎంపీ కవితకు వివిధవర్గాల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం తెలంగాణ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్నాథుని ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి నల్లతీగల మధు హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిశారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను ఎత్తివేసి ఉద్యోగ భద్రత కల్పిస్తున్నందుకు సీఎం కేసీఆర్, ఎంపీ కవితకు ధన్యవాదాలు తెలిపారు. త్వరలో ఐకేపీ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై ఆదేశాలు వస్తాయని ఎంపీ కవిత ఈ సందర్భంగా వారికి చెప్పారు. డెంటల్‌కౌన్సిల్‌ఆఫ్‌ఇండియా సభ్యుడు డాక్టర్ గంద్ర ప్రమోద్‌కుమార్ కూడా కవితను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రదర్శనల్లో అగ్నిప్రమాదాలకు చెక్!

- ఫైర్ హైడ్రంట్స్, ఆటో ఫైర్ ఆఫ్ బాల్స్ తప్పనిసరి
- మంటలు వ్యాపించకుండా పకడ్బందీ ఏర్పాట్లు
- అనుమతులూ కఠినతరం
- వివిధశాఖల సమన్వయ సమావేశంలో నిర్ణయం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లో వివిధ ఉత్పత్తుల ప్రదర్శనలకు అనుమతుల మంజూరులో నిబంధనలను కఠినతరం చేయడంతోపాటు అగ్నిప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే ప్రమాదాలు జరిగినప్పుడు మంటలను అదుపుచేసేందుకు ఆధునిక పద్ధతులు అవలంబించాలని అధికారులు నిర్ణయించారు. నగరంలో ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌తోపాటు ఎన్టీఆర్ స్టేడియం, పరేడ్ గ్రౌండ్స్ తదితర ప్రాంతాల్లో ప్రదర్శనలు ఎక్కువగా జరుగుతుంటాయి. తరచూ బుక్స్ ఎగ్జిబిషన్, కైట్స్ ఫెస్టివల్, స్వీట్స్ ఫెస్టివల్, ఫుడ్ ఫెస్టివల్, వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు వంటివి నిర్వహిస్తుంటారు. వేలమంది హాజరయ్యే ఈ ప్రదేశాల్లో వీటివద్ద ఎటువంటి భద్రతా చర్యలు పాటించడంలేదు. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లోని పారిశ్రామిక ప్రదర్శనలో జరిగిన అగ్నిప్రమాదం నేపథ్యంలో అధికారులు ఇటువంటివి పునరావృతం కాకుండా పకడ్బందీగా వ్యవహరించాలని నిర్ణయించారు. శనివారం వాటర్‌బోర్డు కార్యాలయంలో జరిగిన వివిధ శాఖల సమన్వయ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా వివిధ శాఖలు నిరభ్యంతర ధృవపత్రం ఇచ్చిన తర్వాతే పోలీసుశాఖ, జీహెచ్‌ఎంసీలు అనుమతులు మంజూరుచేయాలని నిర్ణయించారు. ఆయా ప్రదర్శనలు జరిగే ప్రదేశాల్లో వాటర్‌బోర్డు ద్వారా భూగర్భంనుంచి నీటిపైప్‌లైన్ ఏర్పాటు చేసి నిరంతరం నీరు అందులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఆ పైప్‌లైన్ నుంచి నీరు బయటకు వచ్చేలా అక్కడక్కడ ఫైర్ హైడ్రంట్స్ ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ప్రతి దుకాణంలో ఆటోఫైర్ ఆఫ్ బాల్స్‌ను సిద్ధంగా ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలని, ఎవరికి వారు విడివిడిగా చిన్నచిన్న సిలిండర్ల ద్వారా వంటలు చేసుకునే అవసరం లేకుండా నిర్ధారిత ప్రదేశంలో ఫుడ్‌కోర్టులు ఏర్పాటుచేసుకోవాలని నిర్ణయించారు. ప్రదర్శన జరిగినంత కాలం జీహెచ్‌ఎంసీకి చెందిన జోనల్, డిప్యూటీ కమిషనర్లు నిత్యం పర్యవేక్షించాలని, త్వరలోనే కొత్త నిబంధనలను అమలుచేయాలని సమావేశంలో తేల్చారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ చీఫ్ సిటీప్లానర్ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగాక సహాయక చర్యలు ఎంత ముఖ్యమో అవి జరుగకుండా తగిన జాగ్రత్తలు పాటించడం, సందర్శకులను త్వరగా ఎలా ఖాళీ చేయించాలనేది అంతే ముఖ్యమన్నారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన ప్రమాదంలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్టు తెలిపారు.

అగ్నిప్రమాదాల నివారణకు చర్యలు ఇలా..

- ప్రదర్శనల నిర్వహణకు పోలీసుశాఖ, జీహెచ్‌ఎంసీల అనుమతి తప్పనిసరి.
- ఇతర శాఖలు నిరభ్యంతర ధృవపత్రం (ఎన్వోసీ) జారీచేసిన తర్వాతే పోలీసుశాఖ అనుమతివ్వాలి.
- ప్రతి పది దుకాణాల మధ్య దారి తప్పనిసరిగా ఉండేలా చర్యలు. ప్రదర్శన లేఔట్ ప్లాన్‌జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ చూడాలి.
- అగ్నిప్రమాదం సంభవిస్తే ఇతర దుకాణాలకు అంటుకోకుండా చివరి దుకాణాలకు ఇనుప షీట్ల ఏర్పాటు తప్పనిసరి.
- భూగర్భంనుంచి పైప్‌లైన్‌ను ఏర్పాటుచేసి 24గంటలు నీరు సరఫరా చేయాలి. అక్కడక్కడ నీరు వచ్చేలా ఫైర్ హైడ్రంట్స్ ఏర్పాటుచేయాలి.
- వాటర్‌బోర్డు ఆధ్వర్యంలో ఫైర్ హైడ్రంట్స్ ఏర్పాటుచేయాలి.
- ప్రతి దుకాణంలో తప్పనిసరిగా 'ఆటో ఫైర్ ఆఫ్ బాల్స్' ఉండేలా చర్యలు. ఒక్కో బాల్ ధర సుమారు రూ.వెయ్యి ఉన్నది.
- ప్రమాదం జరిగిన వెంటనే ఈ బాల్స్‌ను వేయడంవల్ల మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా అదుపులోకొస్తాయి.
- ప్రదర్శనలో దుకాణాదారుల కోసం ఓ పక్క నిర్ణీత ప్రదేశంలో ఫుడ్‌కోర్టులు ఏర్పాటుచేయాలి.
- జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు ప్రదర్శనను తరచూ తనిఖీచేయాలి.
- ప్రదర్శనలు జరిగేచోట జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో 10నుంచి 15 నీటి ట్యాంకర్లు సిద్ధంగా ఉంచాలి.
- వాటర్‌బోర్డుకు చెందిన 10 నుంచి 15 మంది ట్యాంకర్ల డ్రైవర్లకు రాత్రి విధులు అప్పగించాలి

విదేశీ విద్యకు సరైన ప్రణాళిక అవసరం

ఎక్సెల్లా ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో మండలి చైర్మన్ స్వామిగౌడ్



ఎక్సెల్లా ఎడ్యుకేషన్‌గ్రూప్ సదస్సును ప్రారంభిస్తున్న మండలి చైర్మన్ స్వామిగౌడ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థులకు సరైన ప్రణాళిక అవసరమని మండలి చైర్మన్ స్వామిగౌడ్ పేర్కొన్నారు. నిర్దేశిత అనుమతులు, ఆయాదేశాల్లో నిబంధనలను గౌరవిస్తూ విద్యాభ్యాసంచేస్తే ఎలాంటి సమస్యలూ తలెత్తవని ఆయన వివరించారు. శనివారం హైదరాబాద్‌లోని తాజ్‌దక్కన్ హోటల్‌లో 'విదేశాల్లో విద్యను అభ్యసించడం ఎలా?' అనే అంశంపై ఎక్సెల్లా ఎడ్యుకేషన్ గ్రూప్ నిర్వహించిన సదస్సును స్వామిగౌడ్ ప్రారంభించారు. ఎక్సెల్లా గ్రూప్ చైర్మన్ అరసవల్లి అరవింద్ మాట్లాడుతూ అమెరికాలో విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యల వెనుక కారణాలు ఉద్దేశపూర్వకం కాదని, నిబంధనలపై అవగాహన లేకపోవడమేనని అన్నారు. పలు యూనివర్సిటీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు.

ముమ్మాటికీ ఎన్నికల బడ్జెట్

- జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్రం ప్రవేశపెట్టింది ఎన్నికల బడ్జెట్ అని జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ అన్నారు. సీఎం కేసీఆర్ రైతుబంధు పథకాన్ని కేంద్రం కాపీ కొట్టిందని పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ ఓట్ల కోసమే ప్రజాకర్షక పథకాలను ప్రవేశపెట్టిందని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం ఐదు ఎకరాలున్న రైతులకు రూ.25వేలచొప్పున ఏటా రెండుసార్లు ఇస్తుంటే.. కేంద్ర కేవలం రూ.6వేలే ఇస్తున్నదని తెలిపారు. రైతుబంధు తరహా పథకాన్ని తాము అమలు చేస్తామని ఇదివరకే ఒడిశా, పశ్చిమబెంగాల్ ప్రభుత్వాలు ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎన్ని హామీలు ఇచ్చినా, ప్రజలు విశ్వసించలేదని.. టీఆర్‌ఎస్‌కే పట్టం కట్టారని చెప్పారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లోనూ అవే ఫలితాలు పునరావృతం అవుతాయని, టీఆర్‌ఎస్ మరో మారు గెలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు.

తెలంగాణ వ్యతిరేక బడ్జెట్: గట్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : కేంద్ర బడ్జెట్‌ను తెలంగాణ వ్యతిరేక బడ్జెట్‌గా టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టు రాంచందర్‌రావు అభివర్ణించారు. తెలంగాణభవన్‌లో శనివారం మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం దేశవ్యాప్తంగా అమలుచేయడం ఆహ్వానించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. ఈ పథకం ప్రకటించడానికి ముందు సీఎం కేసీఆర్ సలహా తీసుకొని ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. గతంలో బీజేపీ నాయకులు 'పంట పెట్టుబడికి 30వేలు అవుతుంది.. కేసీఆర్ ఇచ్చే రూ.10వేలు ఏం సరిపోతాయి' అన్నారని, ఇప్పుడు ఏం సమాధానం చెప్తారని గట్టు రాంచందర్‌రావు ప్రశ్నించారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయలను విస్మరించారని, గిరిజన విశ్వవిద్యాలయాని అరకొర కేటాయింపులు చేశారని చెప్పారు. ఓట్ల కోసం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లా ఉందని ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. విద్యకు తక్కువ నిధులు కేటాయించారని టీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ విమర్శించారు.



తెలంగాణ ఎక్సైజ్, ప్రొహిబిషన్ ఎన్జీవోల సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్. చిత్రంలో టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సోమేశ్‌కుమార్, టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, కోశాధికారి రామినేని శ్రీనివాస్‌రావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్, నగర శాఖ అధ్యక్షుడు ప్రతాప్, అధికారులు అజయ్‌రావు, వివేకానందరెడ్డి, హరికిషన్, రమాదేవి, దత్తురాజ్‌గౌడ్, శ్రీనివాస్‌రావు కూడా ఉన్నారు.

బేవరేజెస్ కార్పొరేషన్‌లో పదవీ విరమణలు



పదవీ విరమణ చేసిన అధికారులను సత్కరిస్తున్న బేవరేజెస్ కార్పొరేషన్ దేవీప్రసాద్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్‌లో పదవీ విరమణ చేసిన సీనియర్ జనరల్ మేనేజర్ సురేష్‌ఒత్కర్, మేనేజర్ బ్రహ్మశ్రీని ఆ సంస్థ చైర్మన్ దేవీప్రసాద్ ఘనంగా సత్కరించారు. సుదీర్ఘకాలం సంస్థకు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎక్సైజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సోమేశ్‌కుమార్, కులకర్ణి, వెంకటేశ్వర్లు, సంతోష్‌రెడ్డి, సలీముద్దీన్ పాల్గొన్నారు.

కమర్షియల్ కోర్టు జడ్జీలకు 8 నుంచి శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వాణిజ్య కోర్టుల న్యాయమూర్తులకు మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని నేషనల్ జ్యుడిషియల్ అకాడమీలో మూడురోజులపాటు శిక్షణ సదస్సు నిర్వహించనున్నారు. ఈ నెల 8 నుంచి 10 వరకు జరిగే ఈ శిక్షణకు రాష్ట్రంనుంచి నల్లగొండ జిల్లా, సెషన్స్ జడ్జి ఎస్ శశిధర్‌రెడ్డి, సంగారెడ్డి జిల్లా, సెషన్స్ జడ్జి కే సాయి రమాదేవి ఎంపికచేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు.

దారితప్పిన బాల్యానికి కొత్త జీవితం

- సత్ఫలితాలిస్తున్న ఆపరేషన్ స్మైల్
- 25,116 మంది చిన్నారులను కాపాడిన పోలీసులు
- తల్లిదండ్రులవద్దకు చేరిన 12,283 మంది
- పోలీసుల ప్రత్యేక డ్రైవ్‌లతో చిన్నారులకు కొత్త జీవితం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇండ్లనుంచి పారిపోయి వచ్చిన చిన్నారులు కొందరు.. కిడ్నాపర్ల చెరలో చిక్కినవారు మరికొందరు.. రోజు కూలీ కోసం చిట్టిచేతులు కాయలు కాచేలా కష్టిస్తూ కార్ఖానాలు, హోటళ్లు ఇతర ప్రదేశాల్లో పనిచేస్తున్నవారు మరికొందరు.. ఇలా బంగారు భవిష్యత్ ఉన్న ఎంతోమంది అమాయక చిన్నారులు బాల్యానుభూతులను కోల్పోయి అష్టకష్టాలు పడుతున్నారు. ఇలాంటి వారిని గుర్తించి, తిరిగి వారి తల్లిదండ్రులకు, బంధువులకు అప్పగించడంతోపాటు అనాథలను హోంలకు చేర్చే ఉద్దేశంతో తెలంగాణ పోలీసులు ఏటా ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ పేరిట కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. 2015 నుంచి ఇప్పటివరకు చేపట్టిన ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ కార్యక్రమాలు సత్ఫలితాలనిచ్చాయి. చిన్నారుల మోముల్లో చిరునవ్వులు చిందింపజేశాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 25,116 మంది చిన్నారులను పోలీసులు రక్షించారు. వీరిలో 12,283 మంది చిన్నారుల ను తిరిగి వారి తల్లిదండ్రులు, సంరక్షకుల వద్దకు చేర్చారు. అండ కోల్పోతున్న చిన్నారులు తెలంగాణ పోలీసులు చేపడుతున్న ఈ ప్రత్యేక డ్రైవ్‌లతో కొత్త జీవితం పొందుతున్నారు.

ఏటా రెండుసార్లు ప్రత్యేక డ్రైవ్

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏటా జనవరి ఒకటి నుంచి 31వ తేదీవరకు ఆపరేషన్ స్మైల్, జూలై ఒకటి నుంచి 31వ తేదీవరకు ఆపరేషన్ ముస్కాన్ పేరిట డ్రైవ్ నిర్వహిస్తున్నారు. పోలీస్‌శాఖతోపాటు మహిళా అభివృద్ధి, శిశుసంక్షేమ, కార్మిక, ఆరోగ్యశాఖలు, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీలు(సీడబ్ల్యూసీ), జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, ఎన్జీవోల భాగస్వామ్యంతో ఈ డ్రైవ్‌లను నిర్వహిస్తున్నారు. ప్రతి సబ్‌డివిజన్ పరిధిలో ఒక ఎస్సై, నలుగురు కానిస్టేబుళ్లను ఒక బృందంగా ఏర్పాటు చేసి రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ఆలయాలు, కార్ఖానాలు, ఇటుకబట్టీలు, చౌరస్తాలు వంటి ప్రదేశాల్లో ఎవరి అండాలేకుండా భిక్షాటన చేస్తున్న చిన్నారులను గుర్తించి అదుపులోకి తీసుకుంటున్నారు. తర్వాత వారి నుంచి వివరాలు సేకరించి, సంబంధీకులకు అప్పగిస్తున్నారు. అనాథలు, అడ్రస్ తెలియని చిన్నారులను ఆయా జిల్లాల్లో చైల్డ్‌హోంలకు తరలించి ఆశ్రయం కల్పిస్తున్నారు. చిన్నారుల జాడ కనిపెట్టేందుకు పోలీసులు దర్పన్, టీఎస్‌కాప్ టెక్నాలజీను వినియోగిస్తున్నారు. వీటి ద్వారా ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని మిస్సింగ్‌కేసుల్లో చిన్నారుల పోలికలు, వివరాలతో పోల్చి సమాచారం ఇస్తున్నారు.

ఆపరేషన్ స్మైల్-5లో 2,119 మంది చిన్నారులు

ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి గురువారం వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఆపరేషన్ స్మైల్-5లో 2,119 మంది చిన్నారులను పోలీసులు కాపాడారు. వీరిలో 1,653 మంది బాలురు, 466 మంది బాలికలు ఉన్నట్టు ఐజీ, ఉమెన్‌సేఫ్టీ వింగ్ ఇంచార్జి స్వాతిలక్రా తెలిపారు. వీరిలో 1,303 మంది చిన్నారులను వారి తల్లిదండ్రులు, సంరక్షకుల వద్దకు చేర్చినట్టు వివరించారు. మిగిలిన 816 మందిని రెస్క్యూహోంలలో చేర్చినట్టు చెప్పారు.

ఆపరేషన్ స్మైల్, ముస్కాన్లలో కాపాడిన చిన్నారుల సంఖ్య

ఏడాది	చిన్నారుల సంఖ్య	తల్లిదండ్రుల వద్దకు చేరిన వారు	రెస్క్యూ హోంలలో ఉన్నవారు
2015	5,281	2,727	2,554
2016	8,159	4,176	3,983
2017	6,946	2,501	4,445
2018	2,611	1,576	1,035
2019	2,119	1,303	816

డ్రైవర్ల కృషితోనే టీఎస్‌ఆర్టీసీ అభివృద్ధి

- ఇంధనపొదుపులో మెరుగైన స్థానం
- వైస్‌చైర్మన్ అండ్ ఎండీ సునీల్‌శర్మ
- ఇంధనసంరక్షణ క్షమతా మహోత్సవంలో అవార్డుల ప్రదానం



ఇంధన పొదుపు వారోత్సవాలను ప్రారంభిస్తున్న ఆర్టీసీ వీసీ సునీల్ శర్మ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆర్టీసీ డ్రైవర్ల కృషితోనే సంస్థ అభివృద్ధి చెందుతున్నదని, ఇంధన పొదుపులోనూ మెరుగైనస్థానంలో ఉన్నదని టీఎస్‌ఆర్టీసీ వైస్‌చైర్మన్ అండ్ ఎండీ, రోడ్లు, రవాణాశాఖ ముఖ్యకార్యదర్శి సునీల్ శర్మ అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో శనివారం ఇంధన సంరక్షణ క్షమతా మహోత్సవంలో ఉత్తమడ్రైవర్లకు అవార్డులను ప్రదానంచేసి అభినందించారు. రాష్ట్ర, రీజియన్‌స్థాయిల్లో అత్యుత్తమ కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లకు, ఉత్తమ మెయింటెనెన్స్‌ద్వారా పొదుపునకు దోహదంచేసిన మెకానిక్‌లకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 10వేలకు పైగా బస్సులు నడుపుతున్న టీఎస్‌ఆర్టీసీ సాలీనా 22.66 కోట్ల లీటర్ల డీజిల్ వినియోగిస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం రవీందర్, సీఎంఈ వెంకటేశ్వర్లు, హెచ్‌పీఎల్ సీజీఎం శ్రీనివాస్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

షర్మిలపై దుష్ప్రచారం కేసులో తెనాలి విద్యార్థి అరెస్టు

- పోలీసుల అదుపులో మరొకరు!

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ : వైసీపీ నాయకురాలు షర్మిలపై ఇంటర్నెట్ వేదికగా అసభ్యకరమైన పదజాలంతో కామెంట్లు చేస్తున్న ఒక విద్యార్థిని సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసినట్టు తెలిసింది. సినీ హీరో ప్రభాస్‌తో సంబంధముందంటూ తప్పుడు ఆరోపణలు చేస్తూ తన ప్రతిష్ఠకు భంగం కల్గిస్తున్నారంటు షర్మిల హైదరాబాద్ పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఆ దిశగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు గుంటూరు జిల్లా తెనాలిలో ఎంసీఏ చదువుతున్న వెంకటేశ్వర్ అనే విద్యార్థిని శనివారం అరెస్టు చేసినట్టు తెలిసింది. ప్రకాశం జిల్లాకు చెందిన ఈయన టీడీపీ సానుభూతిపరుడని సమాచారం. ఇదిలా ఉండగా మంచిర్యాలకు చెందిన మరొకరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.



సుస్థిరాభివృద్ధిలో అమలు- పర్యవేక్షణ లక్ష్యాలు సదస్సుకు హాజరైన ప్రతినిధులు

సమస్యకు పరిష్కారం కనుగొనాలి

- ముస్సోరీ జాతీయఅకాడమి డైరెక్టర్ సంజీవ్ చోప్రా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సమస్యలను గుర్తించడం ముఖ్యంకాదని.. పేదరికం, ఆకలి, పౌష్టికాహారలోపం వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కనుగొనడమే కీలకమని ముస్సోరీ లాల్‌బహదూర్‌శాస్త్రి పరిపాలన జాతీయ అకాడమి (ఎల్‌బీఎస్‌ఎన్‌ఏఏ) డైరెక్టర్ సంజీవ్ చోప్రా అన్నారు. మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో సీనియర్ ఐఏఎస్, ఏఐఎస్ అధికారులకు 'సుస్థిరాభివృద్ధిలో అమలు- పర్యవేక్షణ లక్ష్యాలు' అనే అంశంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి చోప్రా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. కేవలం ఒక్క రంగంపైనే దృష్టిసారించి అభివృద్ధి చేయడమనేది సరైన వ్యూహం కాదని.. అన్ని రంగాల అభివృద్ధితోనే సుస్థిరత సాధ్యమని చెప్పారు. చైనా తన బడ్జెట్‌లో సంప్రదాయ వైద్యం అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తుందని పేర్కొన్నారు. మనదేశంలోనూ ఆయుర్వేద, హోమియోపతి, యునాని వంటి సంప్రదాయ వైద్య రంగాలను అభివృద్ధి చేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం డైరెక్టర్ జనరల్ బీపీ ఆచార్య, ఐఈఎస్ కోర్సు కో-ఆర్డినేటర్ దివ్య పర్మార్, పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

ఉన్నతవిద్యతోనే ఉత్తమ సమాజం



ముదుగంటి సుధాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మానవ విలువల పరివ్యాప్తిలో ఉన్నతవిద్యే ఉత్తమ సమాజ స్థాపనకు నూతన దశ, దిశను నిర్దేశించే సాధనం అని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. తెలంగాణ గ్రంథాలయ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు ముదుగంటి సుధాకర్‌రెడ్డికి బెంగళూరులోని నేషనల్ వర్చువల్ యూనివర్సిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ గౌరవ డాక్టరేట్ బహూకరించిన సందర్భంగా శనివారం సచివాలయంలో కేవీ రమణాచారి సత్కరించారు. గ్రంథాలయ విస్తరణ సేవల పరివ్యాప్తి, అవినీతి నిర్మూలన, పర్యావరణ రక్షణ, తెలంగాణ తొలి, మలి ఉద్యమాల్లో సుధాకర్‌రెడ్డి క్రియాశీల పాత్ర పోషించారని చెప్పారు. కార్యక్రమంలో స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కొండూరు జగన్మోహన్‌రావు, తెలంగాణ ఎకనామిక్ ఫోరం అధ్యక్షుడు నేదుకూరి కనకయ్య, యునెస్కో అవార్డు గ్రహీత సత్య తిరునగరి తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు రవాణా మరింత పెంచాలి

- సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్



సింగరేణి కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న సీఎండీ శ్రీధర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : నిర్దేశిత లక్ష్యాలను సాధించాలంటే బొగ్గు ఉత్పత్తి, రవాణా మరింత పెంచాలని, ఓబీ (ఓవర్ బర్డెన్) తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ సూచించారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో డైరెక్టర్లు, జీఎంలతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనవరిలో సగటున 40 రైల్వే ర్యాకుల ద్వారా బొగ్గు రవాణా చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇంకా ఎక్కువ ర్యాకుల ద్వారా రవాణా చేసే అవకాశం ఉందని, ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఉత్పత్తితోపాటు రవాణా పెంచేందుకు కృషి చేయాలని ఆదేశించారు. కాంట్రాక్టర్లు లక్ష్యాలను సాధించడంలో ఆలసత్వం చూపితే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి గనుల వారీగా కావాల్సిన యంత్రాల కొనుగోలు ప్రక్రియను ఈ మార్చి నాటికి పూర్తి చేయాలని, దీనికి సంబంధించిన ప్రతిపాదనలు, టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా ఏరియా జీఎంలతో వేర్వేరుగా సమీక్ష నిర్వహించారు. సమీక్షలో డైరెక్టర్లు శంకర్, చంద్రశేఖర్, భాస్కర్‌రావు, బలరాంతో పాటు ఉన్నతాధికారులు అల్విన్, డీఎన్ ప్రసాద్, ఆంథోని రాజా, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

మిషన్ భగీరథతోనే సురక్షిత మంచినీరు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : సాధారణంగా ప్రజలు వాడే ఆర్వో, క్యాన్ నీటితో ఆరోగ్యంపై దుష్పరిణామాలు ఉంటాయని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మిషన్‌భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ సురక్షిత మంచినీటిని అందిస్తున్నామని ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి అన్నారు. మిషన్ భగీరథ నిర్వహణ విధి విధానాలపై ఇస్కీలో జరుగుతున్న వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇంటివరకు శుద్ధిచేసిన మంచినీటిని అందించే బాధ్యత ఇంజినీర్లదేనన్నారు. మిషన్ భగీరథ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, నిర్వహణ కూడా దేశం మెచ్చేలా ఉంటుందని చెప్పారు. ఇదే లక్ష్యంతో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో రిటైర్డ్ ఇంజినీర్లు, ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి విలువైన సలహాలు, సూచనలు వచ్చాయని తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రభుత్వ సలహాదారుడు జ్ఞానేశ్వర్, చీఫ్ ఇంజినీర్లు జగన్మోహన్‌రెడ్డి, విజయప్రకాశ్, వినోభాదేవి, చిన్నారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, శ్రీనివాస్, కన్సల్టెంట్లు నర్సింగరావు, జగన్, మనోహర్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ నైపుణ్యంపై శిక్షణ

- 4వ తేదీ నుంచి ప్రారంభం

మాదాపూర్ : న్యాక్‌లో నిరుద్యోగులకు నిర్మాణరంగంలో నైపుణ్యంకల్పించేందుకు మూడు నెలలపాటు ఉచిత శిక్షణను అందించనుంది. శిక్షణ అనంతరం ప్రైవేట్‌రంగంలో ఉపాధి అవకాశాలను కల్పించనున్నట్టు న్యాక్ నిర్వాహకులు పేర్కొన్నారు. దీనికి 18 నుం 35 ఏండ్ల వయస్సు కలిగి, డిగ్రీ పూర్తయిన వారు తెల్లరేషన్‌కార్డు, డిగ్రీ మెమో, కుల ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9346180011, 9550052181 మొబైల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ నెల 4 నుంచి శిక్షణ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఏపీ హైకోర్టు తాత్కాలిక భవనం ప్రారంభం

అమరావతి: అమరావతిలోని నేలపాడులో నిర్మించిన తాత్కాలిక హైకోర్టు భవనాలను ఆదివారం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్‌గొగోయ్‌తోపాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ ఎల్ నాగేశ్వరరావు, జస్టిస్ ఆర్ సుభాష్‌రెడ్డి హాజరవుతారు.

'కవ్వాల్' రిజర్వులో పులులకు భద్రత లేదు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అదిలాబాద్ జిల్లా కవ్వాల్ అభయారణ్యంలో పెద్దపులుల వరుస మరణాలపై శనివారం హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. టైగర్ కన్జర్వేషన్ ప్లాన్‌ను అమలుచేయడంలో అధికారులు విఫలం చెందారని పిటిషనర్లు ఆరోపించారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21కి పూర్తి విరుద్ధమని పేర్కొన్నారు. టైగర్ రిజర్వు నిర్వహణ, ప్రస్తు తం చేపడుతున్న చర్యలపై విచారణ నిర్వహించేందుకు స్వతంత్ర కమిటీని నియమించాలని కోరారు. అక్రమంగా వన్యప్రాణులను వేటాడటం, అటవీ ఆక్రమణలు, కలప అక్రమరవాణా, మైనింగ్ కార్యక్రమాలను అడ్డుకొనేందుకు తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తిచేశారు. పిటిషన్ మంగళవారం విచారణకు రానున్నది.

నమస్తే తెలంగాణ
జిందగీ
ఆదివారం 3 ఫిబ్రవరి 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

పెండ్లికి పుస్తకాలే చదివింపులు..



'సుభాష్, శార్వరి అనే మేమూ ఒకరినొకరం అర్థం చేసుకుంటామనీ భారత రాజ్యాంగం సాక్షిగా ప్రమాణం చేస్తున్నాం. ఎలాంటి సనాతన సంప్రదాయాలకు తావు ఇవ్వకుండా, హేతుబద్ధంగా ఒకరికొకరం మనస్ఫూర్తిగా ఇష్టపడి చేసుకుంటున్న వివాహం ఇది'.. అంటూ ఓ దంపతులు పెండ్లినాడు ప్రమాణాలు చేశారు.

మహారాష్ట్రలోని పుణెలో సామాజిక సేవకులు సచిన్ ఆశ సుభాష్, శార్వరి సురేఖ అరుణ్ కుల కట్టుబాట్లను తోసిపుచ్చి ఇలా వినూత్నంగా వివాహం చేసుకున్నారు. ఆహ్వాన పత్రిక కూడా ఎవ్వరికీ పంపకుండా సోషల్ మీడియా ద్వారా అందరినీ ఆహ్వానించారు. బహుమతులకు బదులుగా పుస్తకాలు ఇవ్వాలని కోరారు. దేశమంతా గణతంత్ర దినోత్సవ వేడుకల్లో మునిగి ఉన్నప్పుడు సత్యశోధక్ మార్గంలో ఈ జంట ఏకమయ్యారు. పూజారులు, ఆచారాలు లేకుండా వివాహం చేసుకున్నారు. వీరిద్దరు సామాజిక కార్యకర్తలు. రెండేండ్ల క్రితం ఓ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు ఇరువురికి పరిచయం ఏర్పడింది. అనంతరం ఇద్దరి అభిప్రాయాలు కలవడంతో వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆడంబరాల జోలికి పోకుండా తమ వివాహానికి వచ్చే వారు బహుమతులకు బదులు పుస్తకాలు ఇస్తే చాలు అని ఆహ్వానంలోనే చెప్పారు. అలా 1000 మందిని వివాహానికి ఆహ్వానించారు. 1200 పుస్తకాలు బహుమతులుగా వచ్చాయి. వాటన్నింటినీ గ్రామాల్లోని గ్రంథాలయాల్లో ఇవ్వనున్నట్లు ఈ నవదంపతులు చెబుతున్నారు. అంతే కాకుండా వివాహం తర్వాత ఇంటి పేర్లను సైతం మార్చుకోకుండా అలాగే ఉంచుకుంటామనీ, హేతుబద్ధగా లేని ఏ సంప్రదాయాలను మేం పట్టించుకోలేమని వారు స్పష్టం చేశారు.

చక్కని శిరోజాల కోసం..



జుట్టున్నమ్మ ఏ కొప్పు వేసినా బాగుంటుందంటారు. కానీ ఆ జుట్టు చిక్కులు లేకుండా, చుండ్రు బాధించకుండా ఉన్నప్పడే జరుగుతుంది. జుట్టు ఒత్తుగా, చుండ్రు లేకుండా ఉండాలంటే ఈ చిట్కాలు పాటించండి..

- కప్పు మెంతులను రాత్రంతా పుల్లటి పెరుగులో నానబెట్టి ఉదయాన్నే పెరుగుతో కలిపి రుబ్బుకొని తలకు పూసుకొంటే జుట్టు రాలదు.
- ఒక గుప్పెడు తులసి ఆకులను ఒక కప్పు నీటిలో వేసి, కాచిన తర్వాత ఆ నీటిని చల్లార్చి గోరువెచ్చగా అయిన తర్వాత ఆ నీటిని కుదుళ్లలోకి ఇంకేలా రోజూ రాస్తూ ఉంటే జుట్టు నల్లగా మారుతుంది.
- వస కొమ్ములను ఒక రోజు మంచి నీటిలో నానబెట్టి తర్వాత ఎండబెట్టి దంచి పొడి చేసుకోవాలి. ఈ పొడిని ఒక చెంచా మోతాదుగా ఒక కప్పు పెరుగులో వేసి బాగా కలిపి ఆ మిశ్రమాన్ని కుదుళ్లకు తగిలేలా రుద్దాలి. ఒక గంట ఆగిన తర్వాత కుంకుడుకాయతో తలస్నానం చేయాలి. వారానికి రెండు సార్లు ఇలా చేస్తే చుండ్రు పూర్తిగా తగ్గుతుంది.
- వారంలో కనీసం రెండుసార్లు ఆలివ్ ఆయిల్ రాస్తే శిరోజాలు గట్టి పడుతాయి.
- చలికాలంలో హెయిర్ డ్రయర్లను వాడవద్దు. మెత్తని తువాలుతో తుడుచుకొని.. గాలికి ఆరనివ్వడం మంచిది.
- తాజా వెల్లుల్లి గడ్డల నుంచి తీసిన రసాన్ని మాడుకు పట్టించాలి. తద్వారా జుట్టు ఒత్తుగా పెరుగుతుంది.

ఇండియాలో అవి తక్కువే!



సామాజిక వ్యవస్థలో కుటుంబ వ్యవస్థ అనేది ముఖ్యం. అందులో వివాహం అత్యంత కీలకమైంది. అయితే ఈ వివాహం తర్వాత వివాదాలు ఏర్పడితే చట్టపరమైన అంగీకారంతో తీసుకునేవి విడాకులు. ప్రపంచ వ్యాప్తంగా చేసిన ఓ సర్వేలో తేలింది ఏంటంటే.. విడాకులు తీసుకునే దేశాలన్నిటితో పోల్చితే మన దేశంలోనే విడాకుల ఘటనలు తక్కువ ఉన్నాయని తేలింది..

సామాజిక, చట్టబద్ధమైన ఆమోదంతో ఇద్దరు కలిసి జీవించడానికి ఇష్టపడడమే పెండ్లి. ఇరువురి మధ్య సంబంధ బాంధవ్యాలను, ఉమ్మడి నివాసాన్ని సమాజం ఆమోదిస్తుంది. ఇలా ఏర్పడ్డ జీవితంలో గొడవలు ఏర్పడితే పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకునేందుకు అవకాశం ఉంది. ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్నప్పటికీ ఇండియాలో మాత్రం విడాకుల అవసరం తక్కువ మందికి వస్తుంది. సుమారు వెయ్యి పెండ్లిళ్లల్లో 13 మంది మాత్రమే విడాకులు కోరుతున్నారని తాజా సర్వే తెలిపింది. అంటే ఇతర దేశాలతో పోల్చితే ఒక్కశాతం దంపతులే విడాకులు తీసుకుంటున్నారట. దీనికి కారణం ఇతర దేశాల సంస్కృతికి, మన దేశ సంస్కృతికి మధ్య తేడా అనే అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. వివాహ ప్రాముఖ్యాన్ని ఇక్కడున్న దంపతులు గుర్తిస్తున్నారట. ఒకవేళ విడిపోవాలనుకున్నా కుటుంబం, పిల్లలు, సమాజాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకుంటున్నారని ఈ సర్వే నిర్వాహకులు చెబుతున్నారు. కౌన్సెలింగ్‌ల వల్ల కూడా మళ్లీ దాంపత్య జీవితాన్ని సుఖంగా గడుపుతున్నారని సర్వే వెల్లడించింది. సమస్యలు వచ్చినా బంధాలకు విలువనిచ్చి కలిసుంటారని ఆ సర్వే పేర్కొంది. దేశంలో ఉత్తరప్రదేశ్, బిహార్, హర్యానా, రాజస్థాన్‌లో విడాకుల శాతం తక్కువగా ఉందట. ముఖ్యంగా ఆయా దేశాల్లో విడాకులకు కారణం అర్థం చేసుకోకపోవటం, అవిశ్వాసం, డ్రగ్స్, అల్కహాల్‌కు బానిస అవడం, మానసికంగా,శారీరకంగా వేధించడం విడాకులకు కారణం అని పేర్కొంది.



పాటంటే కేవలం పదాల కూర్పు కాదు. అక్షరాలకు ఆత్మను ఆవహింపజేసి, భావసుగంధాల్ని రంగరించి దానికి అందమైన వర్ణాలను అద్ది మనోప్రపంచంలో రససిద్ధిని కలిగించడమే సిసలైన పాట లక్షణం. సిరివెన్నెల సీతారామశాస్త్రి గీతాలన్నీ శ్రోతల్లో ఇదే రకమైన రసానుభూతిని కలిగిస్తాయి. లలిత గీతాలు, ప్రణయసంవేదనలు, అభ్యుదయ భావగీతికలు..ఇలా సమస్త భావోద్వేగాలు ఆయన పాటల్లో లక్షణంగా ఒదిగిపోతాయి. ఆయన పాట నిశీధిలో కాంతిధారల్ని ప్రసరింపజేసి చైతన్యగీతమై జ్వలిస్తుంది. వలపుగేయమై ప్రేమామృతాన్ని పంచుతుంది. విఫల హృదయాల్ని అనునయిస్తుంది. మొత్తంగా విరించి విపంచి గానమై ఈ జగత్తును పులకింపజేస్తుంది. 30ఏళ్లుగా తెలుగు పాటకు అందమైన సొబగుల్ని అద్దుతున్న సిరివెన్నెల పాండిత్యప్రకర్షకు సముచిత గౌరవంగా ఇటీవలే కేంద్రప్రభుత్వం పద్మ పురస్కారాన్ని ప్రకటించింది. ఈ సందర్భంగా సిరివెన్నెల సీతారామశాస్త్రి పాత్రికేయులతో తన మనోభావాల్ని పంచుకున్నారు.

అష్టైశ్వర్యాలకంటే ఎక్కువగా వ్యక్తిత్వానికే విలువిస్తాను

అప్పుడే పాటకు సార్థకత

సందర్భాన్ని బట్టే పాట తన భాషను ఎంచుకుంటుంది. తెలుగు భాష చాలా పరిపుష్ఠమైంది. అత్యంత క్లిష్టమైన భావాల్ని కూడా సరళంగా చెప్పడానికి అవకాశమున్న ఏకైక భాష అని కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు ఎప్పుడో చెప్పారు. ఉద్ధృతమైన, లోతైన భావాల్ని చెప్పాల్సివచ్చినప్పుడు కొంచెం పాండిత్యప్రకర్ష ఉన్న భాషను వాడతాను. పాట ఆలోచింపజేస్తూ అలరించాలి. అప్పుడే దానికి సార్థకత. పాట మనల్ని కేవలం అలరింపజేస్తే మత్తులోకి వెళ్లిపోతాం. ఆలోచనరే కెత్తితే మెలకువలోకి వస్తాం.



తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు

పద్మశ్రీ అవార్డు కోసం నా పేరును సూచించిన తెలంగాణ ప్రభుత్వానికి, నాకు పురస్కారాన్ని ఇవ్వాలని స్వచ్ఛందంగా తమ అభ్యర్థనలను పంపి ఆకాంక్షను వెలిబుచ్చిన లక్షలాది తెలుగు ప్రజలకు వినమ్రంగా శిరస్సువంచి నమస్కరిస్తున్నాను. ఇది తెలుగు గీతానికి వచ్చిన గౌరవంగా భావిస్తున్నాను. ఆత్రేయ, వేటూరి వారసుడిగా వారి దివ్యాశీస్సుల ఫలితంగా ఈ పురస్కారం దక్కిందని విశ్వసిస్తున్నాను. ముప్పై వసంతాలుగా నేను సాగిస్తున్న సాహితీ వ్యవసాయానికి ఫలసాయంగా తెలుగు ప్రజలే కాకుండా భారతప్రజలందరూ కలిసి అందించిన ఆశీర్వాదంలా ఈ పురస్కారాన్ని స్వీకరిస్తున్నాను. ఈ శుభ తరుణాన నాకు సినీ జన్మనిచ్చిన విశ్వనాథ్‌గారి చరణాలకు నమస్కరిస్తున్నాను.

అంతరంగ అన్వేషణే జీవితం

పాట అనేది కేవలం వినోదానికో, కాలక్షేపానికో కాదు. మాటల్లో వ్యక్తపరచలేని అవ్యక్తానుభూతుల వ్యక్తీకరణ సంవిధానమని నా ప్రగాఢ విశ్వాసం. మాటలు చాలక, భాష మూగబోయే స్థితిలో అనేకానేక నైరూప్య భావనల్ని హృదయరంజితంగా తెలియజేసేదే పాట అని నేను నమ్ముతాను. ఎవరైనా గీత రచన కోసం నన్ను సంప్రదిస్తే...సంఘటనలు, వ్యక్తులు, స్థలాలు..ఈ అంశాల మీద పాట అడగొద్దని చెబుతుండేవాడిని. ఎందుకంటే నా దృష్టిలో అవన్నీ తత్కాలీయమైన ప్రయోజనాలనే నెరవేరుస్తాయి. శోకం, హాసం, క్రోధం, ప్రణయం, శృంగారం...ఈ ఉద్వేగాలన్నీ దేశకాలాతీతమైన సార్వజనీన భావాలు. వీటి ఆలంబనగానే నా ప్రస్థానాన్ని సాగించాను. ప్రకృతి, భగవంతుడు ప్రసాదించిన బుద్ధి విచక్షణతో హృదయపు అంతరాంతరాల్ని అన్వేషిస్తూ మనిషి సాగించే ప్రయాణమే స్థూలంగా అతడి జీవితమని నా భావన. ప్రేమ, అభిమానాలు, కోరికలు, ఆవేశకావేశాలు, పశ్చాత్తాపాలు, ఆకాంక్షలు, తీరని దాహాలు, చేరని గమ్యాలు..సమస్త భావోద్వేగాల పట్ల ఆరాటం, మమకారం కనబరుస్తూ ఆ భావాల్ని పాట రూపంలో అక్షరీకరించడమే ప్రతి గీత రచయిత కర్తవ్యమని నేను భావిస్తాను.

రసానుభూతికి స్థాయిభేదాలు ఉండవు

బాధ్యత అనేది ప్రతి కవికీ ఉండాల్సిన సహజ లక్షణం. నేను మనుషుల్ని వర్గాలుగా విభజించి చూడను. రసానుభూతిని పొందడానికి ప్రత్యేక అర్హతలు, స్థాయిభేదాలు వుంటాయని అనుకోను. హృదయస్పర్శ కలిగేలా రాయగలిగినప్పుడు ప్రతి ఒక్కరి మనసు, ఆత్మ స్పందిస్తుంది. అనుభూతికి స్థాయిభేదాలు వుండవు. ఒక పాట రాసే ముందు అది ఎంత కీర్తి తెచ్చిపెడుతుందో, ఎంత ధనాన్ని తెచ్చిపెడుతుందో అని ఆలోచించే బదులు పాటను వినే శ్రోతలకు ఏ మేరకు రసస్ఫూర్తి కలిగిస్తుందో ఆలోచించుకోవాలి. కవిత్వాన్ని ఆస్వాదించే హృదయ ఔన్నత్యం లేనివాడికి కవిత్వం రాసే అర్హత వుండదు.



నేటి సూర్యోదయం రేపు మరోలా కనిపిస్తుంది

మీలో నిక్షిప్తమై ఉన్న భావాలను మీ సంస్కారానికి అనుగుణంగా నేను నా పాటల్లో పలికిస్తున్నాను కాబట్టే మీరు నన్ను ఇష్టపడుతున్నారు. అప్రియమైన మాటల్ని ఎవరూ మెచ్చుకోరు. మీ అందరి భావాల్ని ఆవాహన చేసుకొని నేను నా గీతాల్లో వ్యక్తీకరిస్తున్నాను. మీ గుండెల్లోని నిశ్శబ్దానికి నేను ప్రతిధ్వనిని. చదువుతున్న అక్షరాల మధ్యలో ఏం ఉంది? మనం చూస్తున్న జీవితానికి ఆవలివైపు ఎలాంటి ఉద్వేగాలు దాగివున్నాయి? అనే అంశాల్ని నిశితంగా పరిశీలిస్తాను. నేటి సూర్యోదయం రేపు మరొలా కనిపిస్తుంది. మనలో కలిగే భావ సంచలనాల్ని బట్టి దృష్టికోణం మారుతూ వుంటుంది. ఆ జీవన వైచిత్రిని నా పాటల్లో చిత్రించడానికి నేను ఇష్టపడతాను.

రాజ్యం కన్నా హృదయం ముఖ్యం

పాటకు అలరించడం, ఆలోచింపజేయడం అనే రెండు లక్షణాలుంటాయి. సాధారణంగా కళలకు ప్రయోజనం అలరింపజేయటమని భావిస్తారు. కానీ ఇంకా పైస్థాయిలో కళ మనల్ని ఆలోచింపజేస్తుంది. ప్రతి పాటలో రసస్ఫోరకంగా నా భావాల్ని చెప్పాలని ప్రయత్నిస్తాను. అన్ని ప్రతిభలు, గొప్పతనాలు, ఘనతలు. అష్టైశ్వర్యాలకంటే నేను మనిషి వ్యక్తిత్వానికే ఎక్కువ విలువ ఇస్తాను. ఈ ప్రస్థానంలో నువ్వు ఏం సాధించావని ఎవరైనా అడిగితే మానవ వ్యవసాయం చేసే హృదయాల్లో స్థానం సాధించానని చెబుతా. ఒక రాజ్యం సంపాదించడం కన్నా ఒకరి హృదయంలో విలువైన స్థానం సంపాదించడం చాలా ముఖ్యం.

చావు శత్రువు కాదు..

'ఎప్పుడూ ఒప్పుకోవద్దురా ఓటమి..' అనే పాటలో 'ఆయువంటు ఉన్నవరకు చావు కూడా నెగ్గలేక శవంపైన గెలుపు చాటురా' అని రాశాను. ప్రాణం ఉన్నంతవరకు మనం చనిపోయినట్లు కాదు. బ్రతుకు, చావు రెండు వేరుగా ఉంటాయనే భావనతో ఆలోచిస్తే చావు గురించిన అమంగళకరమైన ఆలోచనలు తగ్గుతాయి. అలాగే భయాలకు మనం ఎప్పుడూ భయపడొద్దు.

నృత్యాలు చేస్తున్నామా? శివతాండవం చేస్తున్నామా? లేకపోతే అందమైన గౌరీలాస్యం చూస్తున్నామా? అన్నది మన తాలూకు ఆలోచనల్లోనూ, చేతల్లో ఉంటుంది. వేదిక మాత్రం ఎప్పుడూ పవిత్రంగానే ఉంటుంది. సినిమా వల్ల సమాజం బాగుపడుతుందే కానీ పాడైపోవడం అంటూ ఉండదు.

లక్షల మందికి ఆరాధ్యగీతం

కష్టపడకుండా ఏదీ రాదు. అందుకే ప్రసవ వేదన అంటే పుట్టుకకు పూర్వరంగం. నా పాటల్ని పల్లవి నుంచి చివరి పంక్తి వరకు అన్వయించుకుంటూ తమ జీవితాల్ని బాగుచేసుకున్న వాళ్లు ఎందరో ఉన్నారు. అలాంటి వారికి ఎలా విలువ కడతాం. ఒక్కో పాట విలువ జీవితపు విలువకు సమానం. 'ఎప్పుడో ఒప్పుకోవద్దురా ' అనే పాటను కొన్ని లక్షలమంది ఆరాధ్య గీతంగా భావిస్తారు. ఆశయంతో, ఆర్తితో పాట రాయమని అడిగిన వారికి లాభాపేక్ష లేకుండా పాట రాసిచ్చిన సందర్భాలు చాలా వున్నాయి. నా భుక్తికి సరిపోయేలా 30ఏళ్లుగా పరిశ్రమ అందిస్తూనే ఉంది. నా పాట సినిమా విలువను హెచ్చిస్తే నిజంగా దానికి వెల కట్టలేను.

అది సహజ ప్రక్రియ

ట్యూన్‌కు తగినట్లుగా పాట రాయడమనేది అనాదిగా సినిమా రంగంలో ఉన్నదే. తెలుగులో రకరకాల ఛందస్సు వున్నాయి. అవన్నీ ట్యూన్సే కదా. నువ్వు చెప్పదలచుకున్న భావానికి ఎటువంటి నడకైతే బాగుంటుందో ఎంచుకొని అందులోంచి ఛందస్సు ఎంచుకొని రాయమని ఒకప్పుడు చెప్పేవారు. ట్యూన్‌కు రాయడమనేది చాలా సహజమైన ప్రక్రియ. నా దృష్టిలో సినిమా కవి గొప్ప కవి. మిగతా కవులు వారి వారి భావోద్వేగాలను బట్టి రాసుకుంటారు. కానీ సినిమా కవి విషయంలో అలా వుండదు. భావానికి అనుగుణంగా మూడ్‌ను తెచ్చుకోవాల్సి ఉంటుంది.

కాలం చక్రభ్రమణం లాంటిది..

కాలం ఎప్పుడూ మారదు. కాలం మారిపోతే మనం బ్రతకలేం. భౌగోళికంగా ఈ ప్రపంచంలో ఊహాతీతమైన మార్పులు ఏమీ చోటుచేసుకోలేదు. సముద్రం చెలియలి కట్టను ఏర్పాటు చేసుకొని తన ఆధీనంలోనే ఉంది. పంచభూతాలు అలాగే ఉన్నాయి. కానీ మన అభిరుచులు మారాయి. వస్త్రధారణ, ఆహార్యంలో మార్పులు వచ్చాయి. మనం మనుషులమై ఉండి ట్వీటింగ్ ఎందుకు చేయాలి? మాట్లాడొచ్చు కదా?. చాట్ అంటూ చీటింగ్‌లు చేసుకుంటున్నాం. తెలుగువాడు తన తాలూకు ఉనికిని కోల్పోవడానికి ఎక్కువ ముచ్చటపడుతున్నాడు. కాలం చక్రభ్రమణం లాంటిది. తలక్రిందులు కావడం కూడా మళ్లీ మామూలుగా కావడానికే.

సానుకూల దృక్పథంతో ఉంటే కష్టాల నుంచి గట్టెక్కవచ్చు. ఈ తత్వాన్ని చెప్పడానికి నాకు సినిమా అనే విస్తృతమైన వేదిక దొరికింది. నేను సినిమాను దేవాలయం కంటే ఎక్కువగా ప్రేమిస్తాను. నాట్య శాస్త్రానికి శివుడి సంకల్పం కారణం. సినిమా అనేది నాటకానికి యాంత్రిక స్వరూపం. సినిమా అనే నాటకాన్ని వేల చోట్ల ఒకేసారి ప్రదర్శిస్తాం. కళలన్నింటిలోకి సాహిత్యం ఉత్తమమైంది. ఈ సాహిత్యంలో అత్యుత్తమ పీఠం నాటకానికి ఉంది. వేదిక ఎప్పుడూ పవిత్రంగా ఉంటుంది. దాని మీద మనం పిచ్చి

స్త్రీని ఎప్పుడూ కించపరచను

నా పాటల్లో స్త్రీని ఏ పరిస్థితుల్లోనూ కించపరచను. సినిమాలో ఆ స్త్రీ పాత్ర ఎలాంటిదైనా కావొచ్చు. స్త్రీని అవమానిస్తూ రాయాలని కోరుకోను. శృంగార రచన చేస్తాను కానీ అంగాంగ వర్ణనలు చేయను. ఎంత ఘాటు , మోటు శృంగారమైనా రాస్తాను. అది కూడా నా కుటుంబ సభ్యులతో కూర్చుని వినగలిగేలా ఉంటుంది. అలాగే కుర్రకారుని రెచ్చగొట్టే పాటల్ని రాయను. యువతను చెడువైపుకు దారితీసే విధంగా సినిమా వుండకూడదని నా అభిప్రాయం. చదువు, పుస్తకపఠనం గొప్పవే. అయితే వంద పుస్తకాలు చదివే బదులు ఓ మంచి గురువుతో సంభాషించడం ద్వారా అంతే జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చు.

నా పాటల్లో నేను కనిపించొద్దు

సినిమా జీవితానికి ప్రతిబింబం. రెండింటికీ తేడా ఏమిటంటే సినిమాలో కొంత నాటకీయత దాగి ఉంటుంది. ఎక్కడైతే మాట మూగబోతుందో అక్కడే పాట మొదలవుతుంది. నా పాటల్లో నేను కనిపించొద్దని ఎప్పుడూ కోరుకుంటుంటాను. ఆ పాటను ఆస్వాదించే వారి భావాలే కనిపించాలన్నది నా ఆకాంక్ష. సమాజం, ప్రజలు అనే సామూహిక భావనల పట్ల నాకు కొన్ని నిశ్చిత అభిప్రాయాలున్నాయి. అవి మనలోని చాలామందిలో ఉన్నాయని భావిస్తాను. 'సింధూరం' చిత్రంలోని 'అర్ధశతాబ్దపు అజ్ఞానాన్ని..' పాటలో కొన్ని పంక్తులను సినిమాలో వినిపించలేదు. 'సురాజ్యమవలేని సురాజ్యమెందుకని..సుఖాన మనలేని వికాస మెందుకని. సుమాల బలికోరే సమాజమెందుకని. అడుగుతోంది అదిగో ఎగిరే భరతపతాకం. తెలుసుకోండి ఆ తల్లి తపనలో నేటి కన్నీటి కథనం. విషాదవర్షంలో వివర్ణ చిత్రమని..త్రిశంకు స్వర్గంలో త్రివర్ణ స్వప్నమని తెలుపుతోంది అదిగో ఎగిరే భరతపతాకం. ఆకసానికి తనను ఎగరేసి ఏకాకిగా తననొదిలేసి పాతాళంలో నిలిచిన పౌరుల కరతాళ ధ్వని చూసి విలవిలలాడుతూ వెలవెలబోయెను మువ్వన్నెల జెండా.జలజల కురిసెను తెగిపడిపోయిన ఆశల పువ్వుల దండ'...ఈ లైన్స్ సినిమాలో వినిపించవు. వాటిలో ఎంతో ఆర్తి దాగివుందని నా నమ్మకం. భారతసోదరులు నిజంగా సంతోషంగా ఉన్నారా? స్వాతంత్ర్య ఫలాలు నిజంగా నెరవేరాయా? అనే ఆవేదనతో రాసిన పాట ఇది.

... కళాధర్‌రావు సిఎం. ప్రవీణ్

నమస్తే తెలంగాణ
సింగిడి
[కరీంనగర్]
ఆదివారం 3 ఫిబ్రవరి 2019

పాదాలు..

మహబూబ్ నగర్ జడ్చర్ల మండలానికి చెందిన అల్వాన్‌పల్లి గ్రామంలోని గొల్లత్త గుడి సమీపంలో ఈ అతిపెద్ద పాదాలున్నాయి. ఇవి జైన మహావీరునికి సంబధించిన పాదాలుగా భావిస్తున్నారు. ఆరడుగుల పొడవున్న ఈ పాదాలు 8–10 వ శతాబ్దం కాలానికి చెందినవి.



తెలంగాణకు ఎంతో చరిత్ర ఉంది. ఆదిమానవుల కాలం నుంచి ఇప్పటి వరకు శోధిస్తూ పోతే.. సాధించలేనంత తరగని చరిత్ర ఈ గడ్డ మీద దొరుకుతుంది. ఒక చరిత్రను వెలికి తీయడానికి ఎవరో ఒకరూ పూనుకుంటారు. ఒకరు పుస్తక రూపంలో చరిత్రను అక్షరీకరిస్తారు. మరొకరు వీడియోల రూపంలో చిత్రీకరిస్తారు. మరొకరు ఫొటోలలో బంధించి భావి తరాలకు 'ఇదీ.. మన ఘన చరిత్ర' అని పరిచయం చేస్తారు. క్షణక్షణం చరిత్రను కాపాడుకుంటూ, కొత్త చరిత్రను వెతుక్కుంటూ చరిత్రకే అంకితమైపోతారు. మనకు తెలియని మన గడ్డ ఘనమైన చారిత్రిక సంపద రవీంద్రభారతిలోని ఐసీసీఆర్ ఆర్ట్ గ్యాలరీలో ఫొటో ఎగ్జిబిషన్ రూపంలో కొలువుదీరింది. 'ద అన్‌టోల్డ్ తెలంగాణ (టేల్స్ ఆఫ్ ద ఫర్‌గెటాన్ పాస్ట్)' అంటూ తెలంగాణ యువ చరిత్రకారుడు అరవింద్ ఆర్య పకిడె మరుగున పడిన మాణిక్యంలాంటి మన చరిత్రను ఫొటోల రూపంలో బంధించి ప్రదర్శిస్తున్నాడు. చరిత్ర గర్భంలో కలిసిపోయిన ఎన్నో పురాతన ఆనవాళ్లను తెలంగాణ అంతటా తిరిగి సంపాదించి ప్రదర్శన రూపంలో పట్నానికి తీసుకొచ్చాడు. ఆ వివరాలతో ఈ వారం సింగిడి..

ఎవరూ చూపని తెలంగాణ




ద అన్‌టోల్డ్ తెలంగాణ ఫొటో ఎగ్జిబిషన్‌లో ఫొటోలు తిలకిస్తున్న ప్రముఖులు

ఐదడుగుల గణపతి విగ్రహం

కాకతీయుల కాలంలో కొండపర్తిలోని త్రికుటాలయం ముందు ఈ ఐదడుగుల విగ్రహం ఉండేది. విగ్రహానికి నాగబంధం ఉండడంతో విగ్రహంలో వజ్రాలున్నాయేమో అని విగ్రహం పగులగొట్టారు. ఇది పగులగొట్టక ముందు అరవింద్ తీసిన చివరి ఛాయాచిత్రం. కాకతీయుల చేత నిత్యం పూజలందుకున్న ఈ విగ్రహం ప్రస్తుతం ముక్కలుగా మిగిలింది.





రెడ్లవాడ

వరంగల్ రూరల్ జిల్లాలోని రెడ్లవాడ గ్రామ సరిహద్దులోని గుట్ట బండరాయికి ఈ విగ్రహం చెక్కి ఉంది. 12 చేతులతో భయం కలిగించేలా జ్వాలామాలిని విగ్రహం చెక్కారు. ఈ విగ్రహాన్ని జైనమతంలో ఆరాధిస్తారు.



వీరశైవ బలిపీఠం

వరంగల్ సమీపంలోని వీర శైవ బలిపీఠం ఇది . వీర శైవం ప్రబలంగా ఉన్న కాలంలో శివైక్యం చెందాలని కోరుకునే వారు స్వచ్ఛందంగా తమ తలని ఈ పీఠం వద్ద నరుక్కునేవారట. ఈ బలిపీఠం ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉంది.



వజ్రభైరవుడు

9 తలలు, 18 చేతులతో ఉన్న అరుదైన భైరవుడి విగ్రహం ఇది. బౌద్ధమతంలోని వజ్ర భైరవుడిని పోలి ఉన్న ఈ విగ్రహం ఘట్‌కేసర్ సమీపంలోని ఏదులాబాద్ అనే గ్రామంలో ఉంది. తాంత్రికులు వజ్ర భైరవుడిని ఆరాధ్య దైవంగా కొలుస్తారు.



గొల్లత్త గుడి

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల అల్వాన్‌పల్లిలోని ఈ చారిత్రక కట్టడాన్ని 8వ శతాబ్దంలో నిర్మించారు. ఆ ప్రాంతాన్ని పాలించిన రాష్ట్రకూటులు 65 అడుగుల ఎత్తులో కేవలం ఇటుక మీద ఇటుక పేర్చి, మధ్యలో ఎలాంటి మిశ్రమం వాడకుండా ఈ అరుదైన ఆలయం నిర్మించారు. జైన తీర్థంకరుడైన వర్ధమాన మహావీరుడి కోసం దీన్ని నిర్మించారు.

నిడిగొండ హీరోస్టోన్

జనగామ జిల్లాలోని నిడిగొండలో పంటభూముల్లో ఈ విగ్రహం ఉంది. రామప్ప దేవాలయంలో మదనిక శిల్పానికి కనిపించే హైహీల్స్ ఈ శిల్పానికి కూడా ఉంటాయి. ఈ విగ్రహాన్ని విరగల్లు విగ్రహం అంటారు. హైహీల్స్ వేసుకొని, ఆయుధం ఎక్కుపెట్టిన చక్రవర్తి మాదిరిగా ఈ విగ్రహం ఉంటుంది. కొన్నిప్రాంతాల్లో భైరవుడి విగ్రహానికి కూడా హైహీల్స్ ఉంటాయి. కాకపోతే ఈ విగ్రహం చేతిలో ఆయుధం ఉంది.





శాంతినాథ విగ్రహం

హన్మకొండలో బస్టాప్‌లో దిగగానే కనిపించే 30 అడుగుల అతిపెద్ద విగ్రహం ఇది. హన్మకొండలో ప్రసిద్ధి చెందిన పద్మాక్షి అమ్మవారి ఆలయ సమీపంలో అగ్గలయ్య గుట్ట మీద ఈ విగ్రహం ఉంది. 16వ జైన తీర్థంకరుడైన శాంతినాథుని 30 అడుగుల విగ్రహం ఇది. కర్ణాటకలోని శ్రావణ బెళగులలో ఉన్న బాహుబలి విగ్రహం తర్వాత అంత ఎత్తైన విగ్రహం దేశంలో ఇది రెండవది.

ఇచ్చంపల్లి ప్రాజెక్టు

ఐదో నిజాం కాలంలో ఫ్రెంచ్‌వారు నిర్మించ తలపెట్టిన ఇచ్చంపల్లి ప్రాజెక్టు తాలూకు గుర్తులివి. క్రీ.శ 1867లో ప్రారంభమైన ఈ నిర్మాణం సగంలోనే ఆగిపోయింది. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ప్లేగు వ్యాధి ప్రబలి ఒకేరోజు దాదాపు రెండువేల మంది కార్మికులు, ఇంజినీర్లు చనిపోయారు. దీంతో ఆ ప్రాజెక్టును కట్టడానికి ఇంకెవరూ ముందుకు రాలేదు. కానీ ఫ్రెంచి ఇంజినీర్ల నిర్మాణ నైపుణ్యానికి ఇది సాక్షీభూతంగా నిలిచింది. అక్కడ నిర్మించిన ఫ్రెంచ్ ఇంజినీర్ల సమాధులు ఇప్పటికీ ఉన్నాయి.



హైలెట్

ఈ ఛాయాచిత్ర ప్రదర్శనను మాజీ డీజీపీ పేర్వారం రాములు ప్రారంభించారు. వరంగల్ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, నమస్తే తెలంగాణ ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి, తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, తెలంగాణ డిజిటల్ మీడియా డైరెక్టర్ కొణతం దిలీప్, నమస్తే తెలంగాణ సీజీఎం సీహెచ్ శ్రీనివాస్, ప్రముఖ చరిత్రకారులు శ్రీరామోజు హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఫిబ్రవరి 2న ప్రారంభమైన ఈ ప్రదర్శన 6వ తేదీ వరకు కొనసాగుతుంది.



వరంగల్ కోటలోని పురాతన ఆలయం..

మొగలిచర్ల రాతిగుహలు

వరంగల్ రూరల్ జిల్లాలోని మొగలిచర్ల గ్రామంలో ప్రసిద్ధి చెందిన ఏకవీరా దేవి ఆలయం ఉంది. ఆ గుడి ఎదురుగా ఉన్న పెద్ద రాతిగుండు మూడు గుహలుగా చెక్కబడి ఉంది. ఈ గుహల్లో జైన మతానికి చెందిన సల్లేఖన గుహలు లేదా జైన మునులు తపస్సు చేసుకునేందుకు ఉపయోగించి ఉంటారని పురాతత్వవేత్తల అభిప్రాయం.



ప్రతాపగిరి కోట

కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సరిహద్దులో కాళేశ్వరం సమీపంలోని మహదేవపూర్ అడవుల్లో ప్రతాపగిరికోట వుంది. శత్రుదుర్భేద్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో రాజులు కోటలను గిరి, వన, జల దుర్గాలతో కట్టారు. ప్రతాపగిరి కోట దట్టమైన అడవిలో కట్టారు. అందుకే ఈ కోటను గిరిదుర్గం అని కూడా అంటారు.





ఇంకా ఎన్నో..

పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల సరిహద్దులోని ఉండవల్లి గుహాలయాలు, మానేరు నది సమీపంలోని సోమనపల్లి గుహాలయాలు, ఆత్మకూరులో 300 గదులతో నిర్మించిన ఆత్మకూరు గడి, కొండపర్తి, వెంకటాపురం గ్రామ సరిహద్దులోని భైరవుడి విగ్రహం, దేవరకొండ సమీపంలో చందంపేట మండలానికి చెందిన కాచరాజుపల్లి రంగుల గుహలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని తాడ్వాయి సమీపంలో దామరవాయి బృహత్ శిలాయుగం నాటి మానవ సమాధులు, భూపాలపల్లి జిల్లాలోని పాండవుల గుట్టపై గొంతెమ్మ గుహ 7,8వ శతాబ్దాల కాలం నాటివి, జఫర్‌ఘడ్ ప్రాంతంలో దొరికిన అసంపూర్తిగా ఉన్న బుద్ధుని విగ్రహం, గోదావరి నది పరీవాహక ప్రాంతంలోని ప్రాచీన మానవుని సమాధులు, జనగామ జిల్లాలో ఇప్పగూడెం సమీపంలోని నాగుల చెరువు దగ్గర ఉన్న బౌద్ధమత వజ్రాయానంలో ధ్యానముద్రలో ఉన్న దేవతా తార విగ్రహం ఇలా ఎన్నో చారిత్రక శిలలు, విగ్రహాలు, చారిత్రిక సంపద ఫొటోల రూపంలో ప్రదర్శనలో ఉంచాడు అరవింద్. ఈ నెల 6వ తారీఖు వరకు కొనసాగే ఈ ప్రదర్శనను చూస్తే మీకు తెలియని మన చరిత్రలోకి ప్రయాణించవచ్చు.



నైనగూళ్లు

దట్టమైన అడవిలో పచ్చని చెట్ల నడుమ పెద్దకొండను తొలిచి గుహగా మలిచారు. ఈ గుహలో ఏకశిల శివలింగం, పక్కనే మరో మూడు గుహలు ఉన్నాయి. విష్ణుకుండినుల కాలానికి చెందిన ఈ గుహల్లో అజంతా చిత్రాలు కన్నార్పనీయవు. అడవి సోమనపల్లి గుహాలయాలు అని పిలిచే ఈ గుహలు పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల సరిహద్దులో ఈ గుహాలయాలు ఉన్నాయి.



దేవుడిగుట్ట

భారతదేశ శిల్పచరిత్రలోనే విశిష్టమైన శిల్పకళ దేవుడి గుట్ట సొంతం. భూపాలపల్లి జిల్లాలోని ములుగు మండలం కొత్తూరు గ్రామ అడవుల్లో ఈ దేవుడిగుట్ట ఉంది. వివిధ శిలలను కలిపి ఒకే శిలగా నిర్మించిన అంగ్‌కోర్ వాట్ దేవాలయం కంటే ముందే ఈ దేవుడి గుట్ట నిర్మాణం జరిగింది. దీన్ని బట్టి తెలంగాణ శిల్పకళలో ప్రపంచ దేశాల కంటే ముందున్నదన్న విషయం తెలుస్తుంది.

ఇంకా వెలుగులోకి రావాలి..

"తెలంగాణలో అనేక చారిత్రక కట్టడాలు మరుగున పడి ఉన్నాయి. అవన్నీ వెలుగులోకి రావాల్సిన అవసరం ఉంది. వాటి చారిత్రక నేపథ్యాన్ని, గొప్పదనాన్ని ప్రపంచానికి తెలియజేయాలన్న సంకల్పంతో తెలంగాణ చారిత్రక ప్రాంతాలు తిరుగుతున్నాను. నాకు తెలిసిన మార్గాల ద్వారా ప్రపంచానికి పరిచయం చేస్తున్నాను. ఇందుకు శ్రీరామోజు హరగోపాల్ సార్ ఇచ్చే సహకారం మరులేనిది. తెలంగాణ వైభవాన్ని చాటే ఈ ఎగ్జిబిషన్‌కి అవకాశమిచ్చి, ప్రోత్సహించిన మామిడి హరికృష్ణ సార్‌కి ధన్యవాదాలు."




– అరవింద్ ఆర్య పకిడె,
యువ చరిత్రకారుడు

... ప్రవీణ్‌కుమార్ సుంకరి

III.

నమస్తే తెలంగాణ
అల్లరి
[కరీంనగర్]
ఆదివారం 3 ఫిబ్రవరి 2019

చుక్కలు కలుపండి!



జత పరుచండి

1. మీలో ఎవరు కోటీశ్వరుడు సీజన్ 1
3. బిగ్‌బాస్ 1
5. సిక్త్ సెన్స్
2. మీలో ఎవరు కోటీశ్వరుడు సీజన్ 4
4. బిగ్‌బాస్ 2

A. ఓంకార్
B. నాని
C. ఎన్‌టీఆర్
D. చిరంజీవి
E. నాగార్జున




ప్రోగ్రాములకి హోస్ట్‌గా వ్యవహరించిందెవరో కనుక్కోండి

కలాం శాట్ వీరులు!

పిల్లలూ మీకు రాకెట్ తయారీ గురించి తెలుసా? పెద్ద పెద్ద రాకెట్‌లు నింగిలోకి రయ్‌మంటూ దూసుకెళ్తుంటాయి. ఆకాశంలో వాటి నుంచి వచ్చే పొగ మాత్రమే మనకు కనిపిస్తుంది. అయితే, ఆ రాకెట్లలో శాటిలైట్ వ్యవస్థను అమర్చుతారు. అది వేరే గ్రహాలకు వెళ్లి అక్కడి సమాచారాన్ని మనకు చేరవేస్తుంది. అయితే.. ప్రపంచంలోనే అతిచిన్న శాటిలైట్‌ను తయారు చేశారు ఈ విద్యార్థులు. అది ఇటీవలే గగనతలంలోకి వెళ్లింది కూడా..!





తమిళనాడులోని పల్లపట్టికి చెందిన ఈ విద్యార్థులు ప్రపంచంలోనే అతిచిన్న శాటిలైట్ తయారు చేశారు. వీరంతా స్థానిక ఇండియన్ హైస్కూల్లో చదువుతున్నారు. వీరు తయారు చేసిన ఉపగ్రహానికి 'కలాం శాట్' అని పేరు పెట్టారు. జనవరి 24 రాత్రి 11.40 నిమిషాలకు శ్రీహరికోటలోని సతీశ్ దావన్ స్పేస్ సెంటర్ నుంచి పీఎస్‌ఎల్‌వీ సీ-44 ద్వారా గగనతలంలోకి వెళ్లింది కూడా. దీనికి ఇస్రో యాజమాన్యం ఒక నయా పైసా కూడా తీసుకోకపోవడం గమనార్హం. ఈ విద్యార్థులు చెన్నైలోని 'స్పేస్ కిడ్స్ ఇండియా' సంస్థతో కలిసి పనిచేస్తున్నారు. ఈ అతి చిన్న శాటిలైట్ ధర రూ.12 లక్షలు. బరువు కేవలం 1.26 కిలోలు. దీనిపై ఆరేండ్ల నుంచి పరిశోధనలు చేస్తున్న విద్యార్థులు.. అంతా సవ్యంగా జరగడంతో కేవలం ఆరు రోజుల్లోనే తయారు చేశారు. ఈ విద్యార్థులందరికీ శ్రీమతి కేసన్ సలహాదారుగా వ్యవహరించారు.

9 యేండ్ల విద్యార్థులతో వర్క్‌షాపులు..

నాసా స్పేస్ క్యాంప్ అంబాసిడర్‌గా కేసన్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈమె 15 మంది విద్యార్థులకు గురువు. వారిలో కొంతమంది కాలేజీ విద్యార్థులు కూడా ఉన్నారు. తొమ్మిదేండ్ల వయసు నుంచే విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు వర్క్‌షాపులు నిర్వహిస్తుంటారు కేసన్. వారితో చిన్న పరికరాలు తయారు చేయిస్తుండేది. ఈ క్రమంలో విద్యార్థులకు వచ్చే అన్ని సందేహాలను నివృత్తి చేసేవారు కేసన్. 2012లో జరిగిన 'యంగ్ సైంటిస్ట్' పోటీల్లో రిఫత్ షారూఖ్‌ని ఎంపిక చేసి, అతడితో పలు ప్రయోగాలు చేయించారు. అలా తయారైన రిఫత్ షారూఖ్ 'కలాం శాట్' తయారీలో కీలకంగా వ్యవహరించాడు. గతంలో 'పేపర్ మాఖె శాటిలైట్' తయారు చేశాడు.

రిఫత్ నేతృత్వంలో కలాం శాట్..

స్పేస్ కిడ్స్ టీమ్‌లో మొత్తం ఎనిమిది మంది ఉన్నారు. వీరిలో 18 యేండ్ల రిఫత్ షారూఖ్ లీడర్‌గా ఉండేవాడు. ఈ విద్యార్థులంతా ఆరేండ్ల కిందట శాటిలైట్‌ను తయారు చేయాలని నిర్ణయించుకున్నారు. చివరి ఆరు రోజుల్లో.. ప్రతిరోజూ 20 గంటలు పని చేసి.. విజయవంతంగా శాటిలైట్‌ను రూపొందించారు. ఈ శాటిలైట్ రెండు నెలల వరకు భూమి చుట్టూ తిరుగుతుంది. త్రీడీ ప్రింట్ కార్బన్ ఫైబర్ పనితీరును తెలుసుకునేందుకు దీనిని ప్రయోగించారు. దీనిని పిల్లలే వారి ఆసక్తి కొద్దీ రూపొందించారు.

మా పరిశోధన వృథా కాలేదు..

"దీని తయారీకి మేము కొంచెం ఎక్కువగానే ఖర్చు పెట్టాం. అయితే ఈ శాటిలైట్ లాంచింగ్‌కు ఇస్రో మమ్మల్ని బాగా ప్రోత్సహించింది. మా దగ్గర రూపాయి కూడా తీసుకోలేదు. ఇందుకు చాలా సంతోషంగా ఉన్నాం. అందరికీ ఆదర్శమైన అబ్దుల్ కలాం పేరుతో ఉపగ్రహానికి 'కలాం శాట్' అని నామకరణం చేశాం. దీని తయారీకి సాయపడిన వారందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు. మా అంచనాలకు తగ్గట్లుగానే ఉపగ్రహం కక్ష్యలోకి దూసుకుపోయింది."

– రిఫాత్ షారూఖ్



వనజ వనిపెంట

సముద్రాన్ని శుభ్ర పరుస్తుంది!





సముద్రాలు కాలుష్యంతో నిండి పోతున్నాయి. దీంతో సముద్రపు చేపలు తినడం వల్ల చాలామంది అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా 12 యేండ్ల బాలుడు ఓ నౌకను రూపొందించాడు. అది మామూలు నౌక కాదు.. సముద్రాన్ని శుద్ధి చేసేది.



మహారాష్ట్రలోని పుణెకు చెందిన 12 యేండ్ల హాజీక్ ఖాజీ కొత్త ఆవిష్కరణతో ఔరా అనిపించాడు. సముద్రంలో కాలుష్యాన్ని తగ్గించడమే పనిగా పెట్టుకున్నాడు. సముద్ర జీవజాలాన్ని కాపాడేందుకు, కాలుష్యాన్ని తగ్గించేందుకు ఓ నౌకను రూపొందించాడు. ఇది సముద్రాన్ని శుద్ధి చేస్తుంది. ఖాజీ డాక్యుమెంటరీలు ఎక్కువగా చూస్తుండేవాడు. వాటి ప్రభావమే నౌకను తయారు చేసేలా చేసింది. ఖాజీ తయారు చేసిన ఈ నౌక సముద్ర జలాల్లో వ్యర్థాలను వేరు చేసి శుద్ధ జలంగా మార్చుతుంది. ఈ నౌక సముద్రపు వ్యర్థ పదార్థాలను ఐదు భాగాలుగా విడగొడుతుంది. టెడ్‌ఎక్స్, టెడ్ 8 వంటి పలు అంతర్జాతీయ వేదికలపై ఈ నౌక డిజైన్‌ను ఖాజీ ప్రపంచం ముందు ఉంచాడు. దానిని పరిశీలించిన పలువురు మేధావులు, సంస్థలు అతడి ప్రతిభకు అబ్బురపడ్డాయి. దాని పేరు 'ఎర్విస్ నౌక'. దీని కింది భాగంలో ఉండే మెషీన్ సముద్రంలోని ప్లాస్టిక్‌ను సంగ్రహించి విడగొడుతుంది. ఇలా ఈ నౌక సముద్రం అంతా గాలించి వ్యర్థాలను వేరు చేస్తుంది. సముద్రంలో ప్లాస్టిక్ కాలుష్యం వల్ల జరిగే అనర్థాలు, ముప్పుపై ఖాజీ ప్రస్తుతం పలు రంగాలకు చెందిన వ్యక్తులు, సంస్థలతో కలిసి పనిచేస్తున్నాడు.

పది తేడాలు గుర్తించండి





పాండాని గుర్తించండి



చిక్కు ప్రశ్న

ఒక ఆసామికి 9 గేదెలున్నాయి. ఒకటో గేదె1 లీటరు, రెండోది 2 లీటర్లు, మూడోది 3 లీటర్లు.. ఇలా తొమ్మిదో గేదె 9 లీటర్లు పాలిచ్చేవి. ఆ ఆసామి తన ముగ్గురు కొడుకులకు మూడేసి గేదెల చొప్పున పంచి ఇచ్చాడు. అంతే కాదు, ఒక్కొక్కరికి వచ్చిన మూడు గేదెలు ఇచ్చే పాలు కూడా సమానమే. అతడు ఆ గేదెలను ఎలా పంచాడు?

పజిల్




బ్లడ్ రిలేషన్స్



1. అమ్మ వదిన నాన్నకేమవుతుంది?
2. నాన్న మరదలు మీ అమ్మకేమవుతుంది?
3. అన్న వదిన అమ్మ నీకేమవుతుంది?
4. అక్క అత్త మనవరాలు నీకేమవుతుంది?
5. తమ్ముడి బావమరిది మీ నాన్నకేమవుతాడు?

పదాలు కలుపండి!



1. రాజశేఖర్ సినిమా పేరు?
2. ప్రతి ఒక్కరి జీవితంలో మొదటి హీరో ఎవరు?
3. ఈ పిండితో రొట్టెలు చేస్తారు.
4. దీర్ఘం లేకుండా తెలుగులో 'జీరో'?
5. కృష్ణయ్యను ఇలా కూడా పిలుస్తారు?
6. సంక్రాంతి సినిమాలో శివబాలాజీ పేరేంటి?

జవాబులు

జత పరుచండి	: 1.E, 2.C, 3.A, 4.B, 5.D
పదాలు కలుపండి	: 1. చిన్న 2. నాన్న 3. జొన్న 4. సున్నా 5. కన్న 6. చిన్న
బ్లడ్ రిలేషన్స్	: 1. అక్క/ చెల్లి 2.అక్క, చెల్లి 3. అత్త 4. కూతురు 5. అల్లుడు
చిక్కు ప్రశ్న	: 8,1,6 /3,5,7/4,9,2
పజిల్	: 114

నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం —

పీఎన్‌బీలో 325 ఆఫీసర్ పోస్టులు

పంజాబ్ నేషనల్ బ్యాంక్ వివిధ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ ఆఫీసర్ (సీనియర్ మేనేజర్, మేనేజర్) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



- **మొత్తం ఖాళీలు:** 325 (జనరల్-165, ఓబీసీ-84, ఎస్సీ-51, ఎస్టీ-25)
- **విభాగాలవారీగా ఖాళీలు:** సీనియర్ మేనేజర్ (క్రెడిట్)-51, మేనేజర్ (క్రెడిట్)-26, సీనియర్ మేనేజర్ (లా)-55, మేనేజర్ (లా)-55, మేనేజర్ (హెచ్‌ఆర్‌డీ)-18, ఆఫీసర్ (ఐటీ)-120 ఖాళీలు ఉన్నాయి.
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి పర్సనల్ మేనేజ్‌మెంట్, ఇండస్ట్రియల్ రిలేషన్స్, హెచ్‌ఆర్, హెచ్‌ఆర్‌డీ/హెచ్‌ఆర్‌ఎం, లేబర్ లా విభాగాల్లో పీజీ డిగ్రీ లేదా డిప్లొమా, సీఏ/ఐసీడబ్ల్యూఏ, ఎంబీఏ, పీజీడీఎం (ఫైనాన్స్), బ్యాచిలర్ డిగ్రీ (లా), బీఈ/బీటెక్ (ఈసీఈ, సీఎస్‌ఈ/ఐటీ), ఎంసీఏతో పాటు సంబంధిత విభాగంలో అనుభవం ఉండాలి.
- **వయస్సు:** ఆఫీసర్ (ఐటీ) పోస్టులకు 21 నుంచి 28 ఏండ్లు, మేనేజర్ (లా) పోస్టులకు 25 నుంచి 32 ఏండ్లు, మిగతా పోస్టులకు 25 నుంచి 35 ఏండ్ల మధ్య ఉండాలి.
- **పేస్కేల్:** సీనియర్ మేనేజర్ (క్రెడిట్/లా) పోస్టులకు రూ.42,020-51,490/- ఆఫీసర్ (ఐటీ) పోస్టులకు రూ. 23,700-42,020 మిగతా పోస్టులకు రూ. 31,705-45,950/-
- **ఎంపిక:** ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ
- ఆన్‌లైన్ రాతపరీక్షలో రీజనింగ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ప్రొఫెషనల్ నాలెడ్జ్ (సంబంధిత పోస్టును బట్టి). ప్రతి సబ్జెక్టు నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు. 120 నిమిషాల్లో పూర్తిచేయాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఫిబ్రవరి 15
- **ఆన్‌లైన్ పరీక్ష:** మార్చి 17
- **వెబ్‌సైట్:** www.pnbindia.in

ఎన్‌ఐఏలో ప్రొఫెసర్లు

జైపూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద (ఎన్‌ఐఏ) ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం పోస్టులు- 12 (ప్రొఫెసర్-1, అసోసియేట్ ప్రొఫెసర్-11)
- **అర్హత:** సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణత.
- **పేస్కేల్:** ప్రొఫెసర్‌కు రూ. 1,23,100-2,15,900/-, అసోసియేట్ ప్రొఫెసర్లకు రూ. 78,800-2,09,200/-
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 21
- **వెబ్‌సైట్:** www.nia.nic.in

కోచ్ ఫ్యాక్టరీలో అప్రెంటిస్‌లు

చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న అప్రెంటిస్ (ఏడాదిపాటు) కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



- అప్రెంటిస్‌లు
- **మొత్తం ఖాళీల సంఖ్య:** 220
- గ్రాడ్యుయేట్ అప్రెంటిస్-100 ఖాళీలు (ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్-30, మెకానికల్ ఇంజినీరింగ్-70)
- డిప్లొమా అప్రెంటిస్-120 ఖాళీలు (ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్-40, మెకానికల్ ఇంజినీరింగ్-80)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి సంబంధిత ఇంజినీరింగ్ బ్రాంచీల్లో బీఈ/బీటెక్ లేదా మూడేండ్ల డిప్లొమా లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత.
- **స్టయిఫండ్:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ. 4984/-, డిప్లొమా అప్రెంటిస్‌లకు రూ. 3542/-
- **వయస్సు:** 2017 సెప్టెంబర్ 21 నాటికి 15 ఏండ్ల నుంచి 24 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** అకడమిక్ మార్కులు/ఇంటర్వ్యూ ద్వారా.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో. మొదట నేషనల్ వెబ్ పోర్టల్ (www.mhrdnats.gov.in)లో ఎన్‌రోల్ చేసుకోవాలి. ఆ తర్వాత ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **నేషనల్ వెబ్ పోర్టల్‌కు చివరితేదీ:** ఫిబ్రవరి 4
- **ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీకి చివరితేదీ:** ఫిబ్రవరి 6
- **షార్ట్‌లిస్ట్ పొందిన అభ్యర్థుల ఫలితాలు:** ఫిబ్రవరి 13
- **వెబ్‌సైట్:** www.rcf.indianrailways.gov.in

టూరిజం మేనేజ్‌మెంట్‌లో

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ (ఐఐటీటీఎం)లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **పోస్టు పేరు:** అసిస్టెంట్ ప్రొఫెసర్
- **విభాగాలు:** టూరిజం అండ్ ట్రావెల్, ఇంటర్నేషనల్ బిజినెస్, టూరిజం అండ్ కార్గో, ఈవెంట్ మేనేజ్‌మెంట్.
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణత.



- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్ సైట్:** www.iittm.ac.in

జోధ్‌పూర్ ఎయిమ్స్‌లో క్లర్కులు

జోధ్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) లో ఖాళీగా ఉన్న స్టోర్ కీపర్ కమ్ క్లర్క్ తదితర పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.



- **మొత్తం ఖాళీలు:** 119
- **విభాగాలవారీగా ఖాళీలు:** చీఫ్ క్యాషియర్-1, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్-1, స్టోర్ కీపర్-21, క్యాషియర్-11, స్టోర్ కీపర్ కమ్ క్లర్క్-85
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్ డిగ్రీ, పీజీ/పీజీ డిప్లొమా ఉత్తీర్ణత.
- **వయస్సు:** 30 ఏండ్లకు మించరాదు.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 1000/-, ఎస్సీ/ఎస్టీ, పీహెచ్‌సీ, మహిళా అభ్యర్థులకు రూ. 200/-
- **పే స్కేల్:** రూ.19,900/- పోస్టులను బట్టి వేర్వేరుగా పే స్కేల్స్ ఉన్నాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 4
- **వెబ్‌సైట్:** www.aiimsjodhpur.edu.in

నమస్తే తెలంగాణ
చిత్రం
[కరీంనగర్]
ఆదివారం 3 ఫిబ్రవరి 2019

హాలీవుడ్ సినిమాలో హీరోగా..!



రాహుల్ రామకృష్ణ

తరుణ్‌భాస్కర్ రూపొందించిన లఘు చిత్రం 'సైన్మా'తో మంచి పేరుతెచ్చుకున్న రాహుల్ రామకృష్ణ ఆ తరువాత 'అర్జున్‌రెడ్డి' సినిమాలో హీరో విజయ్ దేవర కొండ స్నేహితుడిగా నటించి మరింత గుర్తింపును సొంతం చేసుకున్నారు. తెలుగులో గత ఏడాది విడుదలైన భరత్ అనే నేను, గీత గోవిందం, సమ్మోహనం వంటి హిట్ చిత్రాల్లో కనిపించిన రాహుల్ రామకృష్ణ ఓ హాలీవుడ్ చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ప్రదీప్ కాటసాని స్వీయ దర్శకత్వం వహిస్తున్నారు. కాగా ఈ చిత్రానికి 'స్కిల్ రోడ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ విషయాన్ని ట్విట్టర్ వేదికగా రాహుల్ రామకృష్ణ అభిమానులతో పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. 'ఇన్నాళ్లు నేను ఎదురుచూసిన నా డ్రీమ్ ప్రాజెక్ట్ ఇది. ఈ సినిమాతో హాలీవుడ్‌లోకి ఎంట రవుతున్నాను' అని పోస్ట్ చేశారు. అమెరికాలో జీవించే ఓ తెలుగు విద్యార్థి జీవితం నేపథ్యంలో ఈ సినిమా తీయబోతున్నట్లు తెలిసింది. లాస్ వెగాస్ సైబర్ క్రైమ్, డ్రగ్స్ చుట్టూ కథ సాగుతుందని చెబుతున్నారు. ఇందులో రాహుల్ సీరియస్ పాత్రలో కనిపించనున్నారని తెలిసింది.


నన్ను కూడా ప్రేమిస్తే చాలు!



మహి వి రాఘవ్, మమ్ముట్టి, విజయ్

వై.ఎస్. రాజశేఖరరెడ్డి పాదయాత్రలోని కీలక ఘట్టాల ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'యాత్ర'. మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటించారు. మహి. వి.రాఘవ్ దర్శకుడు. విజయ్ చిల్లా, శశిదేవిరెడ్డి సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో ఈ చిత్ర ప్రీరిలీజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మమ్ముట్టి మాట్లాడుతూ ఈ సినిమా కోసం తెలుగు నేర్చుకున్నాను. నాకు తెలుగు భాష అంటే చాలా ఇష్టం. ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అని తెలుగు భాషను పిలుస్తారు. నాతో సినిమా తీసిన శ్యామ్‌దత్ ఈ చిత్ర కథ గురించి చెప్పారు. 21 ఏళ్ల తరువాత తెలుగులో సినిమా చేస్తున్నందుకు చాలా సంతోషంగా వుంది. రాజశేఖరరెడ్డి జీవితంలో చేసిన పాదయాత్రకు సంబంధించిన కథ ఇది. సినిమా ప్రారంభానికి ముందే డైలాగ్‌లు నేర్చుకున్నాను. తప్పులున్నా సరిచేసుకుని నటించాను. తెలుగులో నేను నటించిన మూడవ సినిమా ఇది. ఎంతో మంది వైఎస్‌ను తమ గుండెల్లో పెట్టుకున్నారు. అలాంటి వారి గుండెల్లో నాకు కూడా కొంత చోటు లభిస్తుందని భావిస్తున్నాను. అయనను ప్రేమించిన దానిలో నన్ను ఒక శాతం అయినా ప్రేమిస్తే చాలు. మా ప్రయత్నం ఫలించినట్టే' అన్నారు. 'శ్యామ్‌దత్ వల్లే ఈ సినిమా చేశాం. ఆయన వల్లే ఈ చిత్ర కథని మమ్ముట్టి వద్దకు తీసుకెళ్లగలిగాం. ఆయన మా కథను నమ్మడమే కాకుండా గొప్ప సహకారం అందించారు. అందుకు ఆయనకు కృతజ్ఞతలు. ఈ నెల 8న సినిమా విడుదల కానుంది' అని విజయ్ చిల్లా అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'మమ్ముట్టిగారికి నేను ఎప్పటికీ రుణపడి వుంటాను. ఈ సినిమాలో చూసిన యాక్టింగ్ ఆయన గొప్పదనమే. ఓ మెంటర్‌లా నన్ను నడిపించారు. సినిమా అనేది టీమ్ అందరికి సంబంధించిన వర్క్. కథ మాత్రమే నాది. అక్కడి నుంచి అది సినిమాగా రూపొందే క్రమంలో నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎందరో తమ సహకారాన్ని అందించారు. అందుకని ఈ సినిమా నాది అని చెప్పుకోను' అన్నారు. ఈ కార్యక్రమంలో సుధీర్‌బాబు, అశ్రిత, శ్రీరామ్ ఆదిత్య, యలమంచిలి రవి, కె.ఎల్.దామోదర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సుకుమార్ రైటింగ్స్ కొత్త చిత్రం



నాగశౌర్య



సుకుమార్

ప్రముఖ దర్శకుడు సుకుమార్ స్వీయ నిర్మాణ సంస్థ సుకుమార్ రైటింగ్స్ పతాకంపై సినిమాల్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. తన వద్ద దర్శకత్వ శాఖలో పనిచేస్తున్న ప్రతిభావంతులకు అవకాశాల్ని అందిస్తూ ఇతర నిర్మాణ సంస్థలతో కలిసి ఆయన సినిమాల్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా నాగశౌర్య కథానాయకుడిగా సుకుమార్ ఓ చిత్రానికి రూపకల్పన చేస్తున్నారు. సుకుమార్ రైటింగ్స్, నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్స్ శరత్‌మరార్ కలయికలో ఈ సినిమా తెరకెక్కనుంది. సుకుమార్ శిష్యుడు కాశీ విశాల్ ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయం కాబోతున్నాడు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాల్ని త్వరలో వెల్లడించనున్నారు.

నిజం నిరూపించండి



కంగనారనౌత్

కంగన రనౌత్ ప్రధాన పాత్రలో నటించిన చారిత్రాత్మక చిత్రం 'మణికర్ణిక'. ఈ సినిమాపై గత కొన్ని రోజులుగా దుమారం మొదలైన విషయం తెలిసింది. అయితే ఈ చిత్రానికి తానే దర్శకత్వం వహించానని శనివారం కంగన రనౌత్ ప్రకటించింది. ఈ సినిమాను 70 శాతం తానే రూపొందించానని కంగన క్రెడిట్ తీసుకోవడంతో దర్శకుడు క్రిష్ ఇటీవల అసంతృప్తిని వ్యక్తం చేస్తూ కంగనపై సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనిపై తాజాగా కంగన స్పందించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇటీవలే స్విట్జర్లాండ్ ట్రిప్‌ని ముగించుకుని ఇండియా వచ్చిన ఆమె మాట్లాడుతూ 'మణికర్ణిక'కు నేనే దర్శకత్వం వహించాను. ఆ విషయంలో ఎలాంటి మార్పులేదు. క్రిష్ నాపై ఎదురుదాడికి దిగడం సరికాదు. ఒకవేళ ఆయన చెప్పేదే నిజమైతే నిరూపించుకోమని చెప్పండి. మీడియాతో మాట్లాడితే ఆయనకు ఎలాంటి లాభం చేకూరదు. నా పాత్రను తీసేశారు. కట్ చేసేశారు అని ఆరోపణలు చేసిన వారికి నేను ఒక్కటి చెప్పాలనుకుంటున్నాను. నేను ఇప్పటి వరకు ఓ నటిగా, మూడు అవార్డులు గెలుచుకున్నా. వాటిని నేను స్వతహాగా సాధించాను. మా నాన్న నాకు ఇవ్వలేదు. మీరూ ఇలాంటి స్థాయికి రండి.అంతే కానీ మరొకరిని చూసి ఏడిస్తే .. ఎలాంటి ఫలితం వుండదు' అన్నారు.

సెన్సార్ చిక్కుల్లో 'దండుపాళ్యం 4'



కె.టి.నాయక్, వెంకట్

బెనర్జీ, వెంకట్, ముమైత్‌ఖాన్, సంజీవ్‌కుమార్, సుమన్‌రంగనాథన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న కన్నడ చిత్రం 'దండుపాళ్యం 4' అదే పేరుతో తెలుగులో విడుదలకానుంది. వెంకట్ నిర్మాత. కె.టి.నాయక్ దర్శకుడు. చిత్రీకరణ పూర్తయింది. మార్చిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఇటీవలే కన్నడంలో సెన్సార్‌కు దరఖాస్తు చేసుకున్నాం. సినిమా చూసిన సెన్సార్ బోర్డ్ అధికారి ..కొన్ని సీన్లు తీసివేయాలి లేదంటే సినిమాను తిరస్కరిస్తామని తెలిపారు. ఆ తర్వాత సినిమాను సెన్సార్ చేయం..రివైజ్ కమిటీకి వెళ్లండని అన్నారు. ప్రస్తుతం అదే పనిలో ఉన్నాం. రివైజ్ కమిటీకే కాదు అవసరమైతే ట్రిబ్యునల్‌కు వెళ్తాం. అదీ కాకపోతే కోర్టుకు వెళ్లడానికి కూడా సిద్ధంగా ఉన్నాం. ఎట్టి పరిస్థితుల్లోనైనా సినిమాను మార్చిలో విడుదల చేస్తాం. ఇంతకన్నా ఎక్కువ క్రైమ్ ఉన్న సినిమాలు థియేటర్స్‌లో ప్రదర్శితమయ్యాయి. మా సినిమాతో సెన్సార్ బోర్డ్‌కు వచ్చిన ఇబ్బంది ఏమిటో అర్థం కావడం లేదు' అన్నారు. ''దండుపాళ్యం' ట్రయాలజీకి ఈ సినిమాకు ఎలాంటి సంబంధం లేదు. ఈ చిత్రంలో జైలులో ఉన్న తమ సహచరులను తప్పించడానికి ఓ దండు ఎలాంటి వ్యూహాలు రచించింది? వారి ప్లాన్స్ ఫలించాయా? పోలీసు ఎత్తుగడల్ని వారు ఎలా చిత్తు చేశారన్నది ఆసక్తికరంగా ఉంటుంది. ఇందులో గ్యాంగ్ నాయకురాలిగా సుమారంగనాథన్ నటించారు' అని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: గిరి బెనకరాజు, సంభాషణలు: ఎం.రాజశేఖర్‌రెడ్డి, సంగీతం: ఆనంద్ రాజా విక్రమ, నిర్మాత: వెంకట్, దర్శకత్వం: కె.టి.నాయక్.



'చీకటి గదిలో చితక్కొట్టుడు' ట్రైలర్ ఆవిష్కరణ దృశ్యం

యువతరం లక్ష్యంగా..

అరుణ్ ఆదిత్, నిక్కి తంబోలి జంటగా నటిస్తున్న చిత్రం 'చీకటి గదిలో చితక్కొట్టుడు'. బ్లూఘోస్ట్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్నది. సంతోష్ పి జయకుమార్ దర్శకుడు. ఈ చిత్ర ట్రైలర్‌ను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో అరుణ్‌ఆదిత్ మాట్లాడుతూ 'అడల్ట్ హారర్ కామెడీ చిత్రమిది. యువతను లక్ష్యంగా చేసుకొని తీశాం. వినోదానికి పెద్దపీట వేశాం. నా గత చిత్రాలు అంతగా గుర్తింపు తీసుకురాలేదు. ఈ సినిమా విజయాన్ని అందిస్తుందని నమ్ముతున్నాను. నాకు హీరోగా ఇమేజ్ లేదు. అందుకే ప్రయోగాలు చేస్తున్నా' అన్నారు. 'తమిళంలో ఈ సినిమా మంచి విజయం సాధించింది. తెలుగులో 20రోజుల్లో చిత్రీకరణ జరిపాం. 18ఏళ్లు దాటిన వారు మాత్రమే ఈ సినిమా చూడాలి. అత్యాచారాలను అరికట్టాలంటే ఏం చేయాలో ఈ సినిమాలో తెలియజెప్పాం' అని దర్శకుడు తెలిపారు. తాగుబోతు రమేష్ మాట్లాడుతూ 'బూతు సినిమా కాదిది. భావోద్వేగాలతో ఆకట్టుకుంటుంది. 'ఆనందోబ్రహ్మ' నాకు మంచి గుర్తింపునిచ్చింది. అదే స్థాయిలో ఈ సినిమా పేరు తీసుకొస్తుంది' అన్నారు.